

మార్చి, 2011

# స్థానిక పాలన

గ్రామీణ వికాస మాసపత్రిక

సంపుటి: 3 సంచిక: 2 పేజీలు: 64 వెల: రూ. 20/-

# భారీ స్థాయిలో రాష్ట్ర బడ్జెట్



రాష్ట్ర శాసనసభలో తన తొలి బడ్జెట్ ప్రవేశపెట్టిన ఆర్థిక మంత్రి

## శ్రీ ఆనం రామనారాయణ రెడ్డి

# చీదేడు చైతన్యవంతం

రంగారెడ్డి జిల్లా మంచాల మండలంలోని చీదేడు
గ్రామ ప్రజలతో చర్చిస్తున్న 'అపార్డ్' కమీషనర్
**శ్రీ కె. చంద్రమౌళి,** ఐ.ఎ.ఎస్.



(వార్త 27వ పేజీలో)

## అపార్డ్ - గ్రామ వికాసం
## దూరదర్శన్ ద్వారా ప్రసారమయ్యే కార్యక్రమాల వివరాలు

| తేది | కార్యక్రమం |
|---|---|
| 23-02-2011 | ఉత్తమ గ్రామ పంచాయితీ గంగదేవి పల్లి - డాక్యుమెంటరీ ఫిల్మ్ మరియు చర్చ |
| 09-03-2011 | ఉత్తమ గ్రామ పంచాయితీ హాజీపల్లి - డాక్యుమెంటరీ ఫిల్మ్ మరియు చర్చ |
| 23-03-2011 | ఉత్తమ గ్రామ పంచాయితీ రామచంద్రాపూర్ - డాక్యుమెంటరీ ఫిల్మ్ మరియు చర్చ |
| 06-04-2011 | ఉత్తమ గ్రామ పంచాయితీ పాందురంగాపురం - డాక్యుమెంటరీ ఫిల్మ్ మరియు చర్చ |
| 20-04-2011 | ఘన వ్యర్థ పదార్థాల నిర్వహణ (ప్రగతినగర్ పంచాయితీ) - డాక్యుమెంటరీ ఫిల్మ్ మరియు చర్చ |
| 04-05-2011 | సమాచార హక్కు - డాక్యుమెంటరీ ఫిల్మ్ మరియు చర్చ |
| 18-05-2011 | జనన, మరణ ధృవీకరణ పత్రాలు పొందటం ఎలా - డాక్యుమెంటరీ ఫిల్మ్ మరియు చర్చ |
| 01-06-2011 | పిల్లలో వైకల్య నివారణ - డాక్యుమెంటరీ ఫిల్మ్ మరియు చర్చ |

**సమయం:** ఉ.9.30 నుండి 10.00 గం.ల వరకు డాక్యుమెంటరీ ఫిల్మ్ ప్రదర్శన
ఉ.10.00 గం. నుండి ఉ10.30.ని.ల వరకు ప్రత్యక్ష ఫోన్ ఇన్ ప్రోగ్రాం.

సంప్రదించవలసిన ఫోన్ నెం.: **040-27031431, 27031432, 27031433**

# స్థానిక పాలన

గ్రామీణ వికాస మాసపత్రిక

సంపుటి: 3 సంచిక: 2

మార్చి, 2011



ఛీఫ్ ఎడిటర్

**కె. చంద్రమౌళి** ఐ.ఏ.ఎస్.

ఎడిటర్

**డా॥ వి. శివశంకర ప్రసాద్**

ఎడిటోరియల్ బోర్డు

**కె. అంబరీష్,** ఐ.ఏ.ఎస్. (రిటైర్డ్)

**సెబాస్టియన్ రాజు** ఎ.పి.ఎ.ఎస్. (రిటైర్డ్)

**జి. గంగాధరం**

**డాక్టర్ సి. కృష్ణ మోహనరావు**

**ఎమ్.ఎ. కుమార రాజా**

**బ్రిగేడియర్ డి.వి. రావు**

**ప్రొ. ఆర్. సూర్యనారాయణ రెడ్డి**

**ప్రొ. పి. రఘునాధరెడ్డి**

**డాక్టర్ లీలా ప్రసాద్**

**సి. వెంకటేశ్వర రావు**

**హెచ్. కూర్మారావు**

**డాక్టర్ కె. లక్ష్మీపతి**

**ఎమ్. విజయలక్ష్మి**

కాన్సెప్ట్, ప్లానింగ్,
ఎడిటింగ్, డిజైనింగ్

**కాక్స్‌టన్ ఆఫ్‌సెట్ ప్రైవేట్ లిమిటెడ్**
హైదరాబాద్



ప్రచురణ

ఎ.ఎం.ఆర్. అపార్డ్



రాజేంద్రనగర్
హైదరాబాద్-500 030
ఆంధ్రప్రదేశ్, ఇండియా
ఫోన్ : 040-24018656
ఫ్యాక్స్ : 040-24017005
E-mail : krishna.chandramouli90@gmail.com
editorsthanikapalana@gmail.com


# విషయ సూచిక


సంపాదకీయం ....... 2

"రాజకీయాల ద్వారానే సమాజాన్ని మార్చగలం"
– రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖామంత్రి శ్రీ డొక్కా మాణిక్యవరప్రసాద్ ....... 3

కేబినెట్ నిర్ణయాలు ....... 4

20 సూత్రాల కార్యక్రమం – ఇందిరాగాంధీ మానస పథకం ....... 6

బి.ఆర్.జి.ఎఫ్. వార్షిక ప్రణాళికకు ఆమోద ముద్ర ....... 8

ఆనాటి మొలక ....... 9

శ్రీ కృష్ణ కమీషన్ నివేదికలో పంచాయితీరాజ్ సంస్థల ప్రస్తావన ....... 11

ప్రణాళికల రూపకల్పనలో ప్రజల భాగస్వామ్య ప్రాధాన్యత ....... 12

సర్పంచ్‌లు, వార్డు సభ్యులు, ఎం.పి.టి.సి. లకు 'శిక్షణా మహోత్సవ్' ....... 15

రాష్ట్రంలో ఐదేళ్ళు పూర్తి చేసుకున్న
జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ....... 16

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో 'అప్నా' ....... 17

రింగాట ఆడుకుందాం! ....... 19

ప్రజల జీవనోపాధికి కొరతలేని కుతుంబాకం గ్రామం ....... 23

ఆంధ్రప్రదేశ్ బడ్జెట్ 2011-12 ....... 25

'బ్రహ్మమురారి సురార్చిత లింగం...' ....... 26

సాధికారత పొందిన ప్రజలతోనే రాష్ట్ర అభివృద్ధి ....... 27

పారిశుద్ధ్యంపై ప్రచారవ్యూహం ....... 30

సహస్రాబ్ది లక్ష్యాల సాధనలో పంచాయితీ రాజ్ సంస్థల పాత్ర కీలకం ....... 31

అడవే ఆధారం... అడవే ఆలంబన... ....... 32

పంచాయితీరాజ్ సంస్థల కంప్యూటరీకరణ ....... 36

సుస్థిర వ్యవసాయానికి గుండె కాయ 'పొలంబడి' ....... 38

కోరికలు మితం జీవితం వర్ణశోభితం ....... 40

గొర్లేకొప్ప బసవన్నగుడే కోర్టు – ప్రజలే న్యాయమూర్తులు ....... 41

అపరిణిత శిశువులను ఎట్లా కాపాడాలి ? ....... 42

మహనీయుల చతురోక్తులు ....... 43

ప్రజానిర్వహణలో పర్యావరణ పారిశుద్ధ్యం –
ప్రతిబంధకాలు – పరిష్కారాలు ....... 44

ధృతరాష్ట్ర లోకంలో శ్రీలేఖ పోరాటం ....... 47

ప్రజల వల్ల, ప్రజలచేత, ప్రజల కోసం ....... 49

విద్యాహక్కు చట్టం 2009 – పంచాయితీరాజ్ సంస్థల పాత్ర ....... 51

ఆదర్శ గ్రామ పంచాయితీకి ఈ లక్షణాలుండాలి ....... 52

గట్టివాడు అనిపించుకున్న లాల్‌బహదూర్ శాస్త్రి ....... 54

లోకాః సమస్తాః సుఖినోభవంతు (వెంటాడే వాక్యం) ....... 56

పంచాయితీరాజ్ ఉద్యోగుల కరదీపిక విడుదల ....... 57

జలధారలే జీవజాలానికి ప్రాణధారలు ....... 58

మహిళల రాజకీయ సాధికారతలో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్ ....... 62

సంపాదకీయం..

మార్చి, 2011

# ఓ మహిళా! వందనం!

మార్చి 8న మనం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని జరుపుకుంటున్నాం. మనకే కాదు, ప్రపంచవ్యాప్తంగా, అన్ని దేశాల్లోని మహిళలకు; మహిళాభ్యున్నతిని, మహిళా సంక్షేమాన్ని, మహిళా సాధికారతను ఆకాంక్షించే పురుషులందరికీ కూడా ఇది ఉత్సవమే. ఈ రోజు సందర్భంగా మహిళలు ఎదుర్కొంటున్న అనేకానేక సమస్యలతో పాటు, ఇప్పటివరకు వారు సాధించిన విజయాలనూ, సాధించవలసిన లక్ష్యాలను, ముందున్న సవాళ్లనూ మహిళా దినోత్సవ నిర్వాహకులు ఒకసారి సమీక్షించుకోవటం, కార్యాచరణ రూపొందించుకోవటం అవసరం.

ఒక శతాబ్దకాలం క్రితం నాటి మహిళతో పోలిస్తే, నేటి మహిళ ఎంతో పురోగతి సాధించింది. మహిళల సామాజిక స్థాయి, విద్యాప్రమాణాలు గణనీయంగా పెరిగాయి. స్వావలంబన సాధ్యమైంది. అయితే, వివిధ రూపాల్లో కొత్త సమస్యలు, సవాళ్లు కూడా పెరిగాయి. ఈనాడు మనం చూస్తున్న వరకట్న హత్యలు, యాసిడ్ దాడులు వందేళ్ల క్రితం లేవు. ఆనాడు బాల్యవివాహాలు, నిరక్షరాస్యత, అవిద్య, వితంతు జీవితాలు, ఆర్థిక స్వావలంబన లేకపోవటం, సతీసహగమనం వంటివి ప్రధాన సమస్యలైతే, నేడు వరకట్నం, గృహహింస, లైంగిక వేధింపులు, యాసిడ్ దాడులు మొదలైనవి మహిళలను పీడిస్తున్నాయి. మహిళలపై హింస, అత్యాచారాలు కొత్త రూపాలు తొడుక్కుంటున్నాయి.

అయినప్పటికీ, మహిళా సాధికారతపై ఆశాకిరణాలు తళుక్కున మెరుస్తూ, మనసుకి ఊరట కల్గిస్తున్నాయి. మహిళా సాధికారత అంటే బహుముఖాలతో కూడిన ఒక సామాజిక ప్రక్రియ. వారి జీవితాలపై వారికే నియంత్రణ అందించే శక్తి. వారి జీవితాలకు సంబంధించిన నిర్ణయాలు వారే తీసుకునే అవకాశం. పురుషులతో సమానమైన వేతనాలను, గుర్తింపును కలిగి ఉండటం. సామాజిక, రాజకీయ, ఆర్థిక ప్రక్రియల్లో పురుషులతో కలసి నడిచే భాగస్వామిగా హోదా పొందటం.

వివిధ కారణాల వల్ల మహిళలు మన పురుషాధిక్య సమాజంలో సామాజిక, ఆర్థిక, రాజకీయ భాగస్వామ్యాన్ని పొందలేకపోయారు. ఈ మూడూ పరస్పరాధారితాలు. విద్యావకాశాలు పెరగటం వల్ల మహిళలు విద్యావంతులు కావటం, తద్వారా ఆర్థికశక్తి పెరగటానికి, సామాజిక హోదాకు కొంతవరకు దోహదపడగా, 1992లో జరిగిన 73వ రాజ్యాంగ సవరణ అట్టడుగు స్థాయిలో పెనుమార్పులను తీసుకుని వచ్చింది.

అధికారాన్ని వికేంద్రీకరించడానికి, లైంగిక అసమానతలను, వివక్షను తొలగించడానికి అప్పటి ప్రధాని రాజీవ్‌గాంధీ చొరవతో వచ్చిన ఈ సవరణ అట్టడుగు స్థాయిలోని గ్రామీణ మహిళలకు పంచాయితీల్లో నాయకత్వాన్ని అందించింది. మూడంచెల పంచాయితీరాజ్ వ్యవస్థలో గ్రామం నుంచి జిల్లా వరకు అధ్యక్ష స్థానాలతో సహా అన్ని పదవులలో మహిళలకు తప్పనిసరిగా మూడో వంతు స్థానాలను ఈ సవరణ కేటాయించింది. నేడు సుమారు 10 లక్షల మంది మహిళా ప్రజాప్రతినిధులు దేశ సేవలో నిమగ్నమయ్యారంటే అది సాధారణ విషయంకాదు.

ఈ సవరణ ఎన్ని సానుకూల మార్పులు తెచ్చిందో చెప్పలేము. అప్పటివరకు అభివృద్ధి క్రమంలో కేవలం లబ్ధిదారులుగానే ఉన్న మహిళలు, అందులో భాగస్వాములుగా మారారు. నిర్మాణాత్మక నిర్ణయాలు తీసుకోవటంలో, నిర్వహణా సామర్థ్యంలో తాము ఎవరికీ తక్కువకామని నిరూపించుకున్నారు. తొలి సంవత్సరాల్లో కొంత తడబడినా, తప్పటడుగులు వేసినా, తదుపరి తమ సత్తాను చాటుకున్నారు.

పంచాయితీల్లో జరిగే ఎన్నికల ప్రక్రియలో ఓటర్లుగా, రాజకీయ పక్షాల సభ్యులుగా, అభ్యర్థులుగా, పంచాయితీ సంస్థలకు ఎన్నికైన ప్రతినిధులుగా ప్రణాళికల తయారీ, నిర్ణయీకరణ, అమలు ప్రక్రియల్లో భాగస్వాములుగా మహిళలు జేజేలు అందుకుంటున్నారు. దీనివల్ల వారికి ఆత్మవిశ్వాసం, రాజకీయ అవగాహన, విషయ పరిజ్ఞానం బాగా అలవడ్డాయి. పంచాయితీరాజ్ సంస్థలకు ఎన్నికైన పురుషులతో పోలిస్తే, మహిళల పనితీరే సమర్థవంతంగా ఉన్నట్లు అనేక అధ్యయనాలు నిరూపించాయి. పంచాయితీరాజ్ సంస్థల సమావేశాలకు 80 నుంచి 90 శాతం హాజరుతో క్రమబద్ధంగా హాజరయ్యేది మహిళలే. వారి అంకితభావం, క్రమశిక్షణ, సంయమన ధోరణి, సమన్వయ శక్తి పంచాయితీరాజ్ సంస్థల పని సంస్కృతినే మార్చివేశాయనటం అతిశయోక్తి కాదు.

ఇవన్నీ గమనించిన కేంద్ర ప్రభుత్వం పంచాయితీరాజ్ సంస్థల్లో మహిళలకు 50 శాతం స్థానాలు కేటాయిస్తూ నిర్ణయం తీసుకుంది. అనేక రాష్ట్రాలు ఈ మార్పును అమలు చేస్తున్నాయి కూడా. భారతదేశ వ్యాప్తంగా ఇది అమల్లోకి వచ్చి, మహిళా శక్తి జేజేలు అందుకుంటుందని, ఆ జయ జయ నినాదాల మధ్య రాష్ట్ర శాసనసభల్లోకి, పార్లమెంటులోకి మహిళామణులు రంగప్రవేశం చేసి సంపూర్ణ సాధికారత వైపు అడుగులు వేస్తారని ఈ అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఆశిద్దాం.

( కె. చంద్రమౌళి )

# “రాజకీయాల ద్వారానే సమాజాన్ని మార్చగలం”

రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖామంత్రి **శ్రీ డొక్కా మాణిక్యవరప్రసాద్**



**రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖకు, మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణఉపాధిహామీ పథకానికి మంత్రిగా ఉన్న శ్రీ డొక్కా మాణిక్యవరప్రసాద్‌కి వ్యక్తిపట్ల, సమాజం పట్ల, తన శాఖ పట్ల నిర్దిష్టమైన, ఖచ్చితమైన అభిప్రాయాలు ఉన్నాయి. క్లుప్తంగా చెప్పాలంటే ఆయనను బహుముఖ ప్రజ్ఞాశాలి అని అనవచ్చు. ఒకప్పుడు జర్నలిస్టుగా పనిచేశారాయన. న్యాయవాదిగా ప్రాక్టీసు చేశారు. కేంద్ర ప్రభుత్వంలో అధికారిగా ఉన్నారు. తరువాత రాజకీయాల్లోకి వచ్చారు.**

రాజకీయాల్లోకి ఎందుకొచ్చారని అడిగితే, రాజకీయాల ద్వారానే ఈ సమాజాన్ని మార్చవచ్చనే దృఢమైన విశ్వాసాన్ని శ్రీ మాణిక్యవరప్రసాద్ వ్యక్తం చేశారు. సమాజంలో కోరుకున్న మార్పు సాధించాలంటే రాజకీయాలు మంచి సాధనమని, ఆ నమ్మకంతోనే తాను రాజకీయ రంగ ప్రవేశం చేశానని చెప్పారు. వివిధ రాజకీయ, సామాజిక సిద్ధాంతాలను, భారత రాజ్యాంగాన్ని ఆయన అధ్యయనం చేశారు. అస్తిత్వవాదం, వ్యక్తివాదం మొదలైన వాటిపై మంచి అవగాహన ఉంది. చరిత్ర, రాజకీయాలు, ఫిలాసఫీ పుస్తకాలే కాక సాహిత్య పుస్తకాలు కూడా బాగా చదువుతారు. సంగీతం వింటారు. చారిత్రక ప్రదేశాలు సందర్శిస్తారు. వ్యాసాలు రాయటం అంటే కూడా ఆయనకు ఇష్టమే.

గుంటూరు జిల్లాలోని గురజాలలో 1962, మార్చి 5వ తేదీన శ్రీ మాణిక్యవరప్రసాద్ జన్మించారు. ప్రాథమిక, సెకండరీ, ఉన్నత పాఠశాల విద్యను, ఇంటర్మీడియట్‌ను గురజాలలోనే పూర్తిచేశారు. మాచెర్లలో బయోలాజికల్ సైన్సెస్‌లో బిఎస్‌సి చదివారు. గుంటూరు ఎ.సి. కళాశాలలో లా చదివారు. నాగార్జున విశ్వవిద్యాయంలో ఎల్‌ఎల్‌ఎం చేశారు. ఇన్ని చదివినా, రాజకీయాల్లోకి వచ్చి గత రెండు సార్ల నుంచి శాసనసభ్యునిగా, 2009 నుంచి మంత్రిగా పనుల ఒత్తిడితో ఉన్నప్పటికీ, శ్రీ మాణిక్య వరప్రసాద్‌కి చదువు పట్ల మమకారం పోలేదు. ప్రస్తుతం ఆయన ఉస్మానియా విశ్వవిద్యాలయంలో పార్ట్‌టైమ్ పిహెచ్‌డి చేస్తున్నారు. ఆయన పిహెచ్‌డికి ఎంపిక చేసుకున్న అంశం “లౌకిక వాదం - భారత రాజ్యాంగం”.

విద్యార్థి దశనుంచే శ్రీ మాణిక్య వరప్రసాద్‌కి రాజకీయాలంటే ఆసక్తి. విద్యార్థి సంఘ నాయకుడిగా రాజకీయ జీవితం ప్రారంభించి, 20,25 ఏళ్లపాటు విద్యార్థి, యువజన రాజకీయాల్లో చురుగ్గా పనిచేశారు. 2004లో మొదటిసారి గుంటూరు జిల్లాలోని తాడికొండ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. తిరిగి 2009 ఎన్నికల్లో అదే నియోజకవర్గం నుంచి మళ్లీ గెలిచారు.

2009 ఎన్నికల్లో గెలిచిన తరువాత, అప్పటి ముఖ్యమంత్రి డాక్టర్ వై.యస్.రాజశేఖర రెడ్డి మంత్రి వర్గంలోనూ, ఆ తరువాత శ్రీ రోశయ్య మంత్రివర్గంలోనూ కేబినేట్ మంత్రిగా శ్రీ మాణిక్య వరప్రసాద్ నియమితులయ్యారు. సెకండరీ, ఇంటర్మీడియట్ విద్యాశాఖలకు మంత్రిగా పనిచేస్తూ, పాఠశాల విద్యాశాఖ ఇంటర్మీడియట్ విద్యాశాఖల పనితీరును మెరుగుపరిచారు.

ఎప్పటినుంచో ఖాళీగా ఉన్న 20,000 స్కూలు అసిస్టెంట్ పోస్టులను, 22,000 సెకండరీ గ్రేడ్ టీచర్ పోస్టులను, భర్తీ చేయించారు. 30,000 మంది టీచర్లను హెడ్‌మాస్టర్ పోస్టుల్లోకి, స్కూల్ అసిస్టెంట్ పోస్టుల్లోకి ప్రమోట్ చేయించారు.

రాష్ట్రంలోని మహిళలందరూ గౌరవంతో తలచుకునే ఒక గొప్ప పనిని శ్రీ మాణిక్య వరప్రసాద్ పాఠశాల విద్యాశాఖలో చేయించారు. ఎస్‌ఎస్‌సి సర్టిఫికెట్లలో తల్లిపేరు తప్పనిసరిగా ఉండేలా ఆయన చర్యలు తీసుకున్నారు. అంతేకాక, ఎస్‌ఎస్‌సి విద్యార్థులకు, పాఠశాల ఉపాధ్యాయులకు అకడమిక్ కేలండర్‌ను ఆయన ప్రవేశ పెట్టించారు.

శ్రీ మాణిక్య వరప్రసాద్ సతీమణి శ్రీమతి ఎమిలి. ఆమె గృహిణి. వీరిద్దరికి ముగ్గురు పిల్లలు. ఒక కుమార్తె. ఇద్దరు కుమారులు, కుమార్తె దివ్య బిటెక్ చదువుతోంది. కుమారులు లోహిత్, జోయల్ సిద్ధార్థ పాఠశాలలో చదువుకుంటున్నారు.

గుంటూరు బార్ అసోసియేషన్‌లో న్యాయవాదిగా ప్రాక్టీసు ప్రారంభించి, హైదరాబాదులోని హైకోర్టులో కూడా ప్రాక్టీసు చేసిన శ్రీ మాణిక్యవరప్రసాద్ దక్షిణమధ్యరైల్వేలో సికింద్రాబాద్ లీగల్ ఆఫీసర్‌గా కూడా పనిచేశారు. ఒకప్పుడు జర్నలిస్టు (ఉదయం దినపత్రిక)గా కూడా పనిచేసిన ఆయనకి సామాజిక స్పృహ ఎక్కువ. ప్రజలకు, ప్రత్యేకించి సమాజంలోని అట్టడుగు వర్గాల ప్రజానికానికి ఇతోధికంగా సేవ చేయాలని ఆయన ఆక్షాంక్ష. ఆయన రాజకీయాల్లోకి వచ్చిందీ అందుకే.

ఆయన అభిలాషలు, ఆకాంక్షలు నెరవేరాలని కోరుకుందాం. తాను ప్రస్తుతం నిర్వహిస్తున్న గ్రామీణాభివృద్ధి, మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం శాఖలపై ఆయన అభిప్రాయాలు వచ్చే సంచికలో తెలుసుకుందాం.

**- గొట్టిపాటి సుజాత**

# కేబినెట్ నిర్ణయాలు

(14-2-2011న జరిగిన రాష్ట్రమంత్రివర్గ సమావేశపు నిర్ణయాలు)

**వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ :** ఈ - ట్రేడింగ్ జరుపుకోవడానికి లైసెన్సులు మంజూరు చేస్తూ, 1966 నాటి ఆంధ్రప్రదేశ్ (వ్యవసాయ ఉత్పాదన, పశుసంపద) మార్కెట్ల చట్టంలోని సెక్షన్ 2&7 లకు సవరణ ప్రతిపాదనలకు ఆమోదం.

**ఉద్యానవన శాఖ :** ఆంధ్రప్రదేశ్ ఉద్యానవన విశ్వవిద్యాలయం పేరును డాక్టర్ వై.యస్.ఆర్ ఉద్యానవన విశ్వవిద్యాలయంగా మారుస్తూ 2007 నాటి విశ్వవిద్యాలయ చట్టానికి సవరణ ఆమోదం.

### కోనేరు రంగారావు కమిటీ సిఫార్సులు ఆమోదం

రాష్ట్రంలో భూ సంస్కరణలకు సంబంధించి కోనేరు రంగారావు కమిటీ చేసిన సిఫార్సులకు అనుగుణంగా 1971 నాటి ఆంధ్రప్రదేశ్ భూమి హక్కులు, పట్టాదారు పాసు పుస్తకాల చట్టంలోని సెక్షన్ 5 బికి సవరణ ఆమోదం. దీని ప్రకారం రెవెన్యూ డివిజనల్ అధికారుల స్థాయిలోనే సుమోటోగా ఫిర్యాదులు సేకరించి, పాసు పుస్తకాల తనిఖీ అధికారాన్ని అప్పగించటం జరుగుతుంది.



### కొత్త వెటరినరీ కళాశాలలు

- కరీంనగర్ జిల్లా కోరుట్లలో ఏర్పాటు చేయనున్న పశువైద్య కళాశాలలో అవసరమైన పదవుల మంజూరుకు ఆమోదం.
- వీటిలో 111 బోధనా పదవులు (టీచింగ్), 29 బోధనేతర పదవులు ఉంటాయి. వీటికి సంబంధించి అయ్యే వ్యయానికి ఒక కోటి రూపాయలు విడుదల చేయటం జరిగింది.
- ప్రస్తుతం రాష్ట్రంలోని హైదరాబాద్, తిరుపతి, గన్నవరం వద్ద మూడు పశువైద్య శాలలు ప్రభుత్వ ఆధ్వర్యంలో పనిచేస్తున్నాయి. వై.యస్.ఆర్ జిల్లా పొద్దుటూరులో మరో కళాశాల ఏర్పాటుకు ఇప్పటికే ఉత్తర్వులు జారీ చేయటం జరిగింది.

### ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో ఉద్యోగ నియామకాలు

- 2008-09, 2009-10 విద్యా సంవత్సరాల్లో రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటు చేసిన 65 డిగ్రీ కళాశాలల్లో ప్రిన్సిపాల్ పోస్టులతో సహా మిగతా బోధన, బోధనేతర సిబ్బంది నియామకాలు ఆమోదం.
- 65 ప్రిన్సిపాల్ పోస్టులతో సహా, ఒక్కొక్క కళాశాలలో 14 లెక్చరర్ పోస్టులు, 9 బోధనేతర సిబ్బంది పోస్టులను భర్తీ చేసుకునేందుకు ఆమోదం ఇవ్వటమైంది.
- దీనికి సంబంధించి అంచనా వ్యయం రూ. 4 కోట్ల 3 లక్షలుగా నిర్ణయించడమైంది.

### సహకార చక్కెర కర్మాగారాలకు మూలధనం

- రాష్ట్రంలో సహకార రంగంలో ఉన్న 6 చక్కెర కర్మాగారాలకు 150 కోట్ల రూపాయల మూలధనం సమకూర్చే ప్రతిపాదనలకు ఆమోదం.
- రేణిగుంటలో శ్రీ వెంకటేశ్వర సహకార చక్కెర కర్మాగారానికి రూ. 35 కోట్లు, చిత్తూరు సహకార చక్కెర కర్మాగారానికి రూ. 25 కోట్లు, నెల్లూరు జిల్లాలోని కోవూరు సహకార చక్కెర కర్మాగారానికి రూ. 25 కోట్లు, విజయనగరం జిల్లా భీమసింగిలోని శ్రీ విజయరామ గజపతి సహకార చక్కెర కర్మాగారానికి రూ. 25 కోట్లు, విశాఖపట్నంలోని పాయకరావు పేటలో ఉన్న తాండవ సహకార చక్కెర కర్మాగారానికి రూ. 30 కోట్లు, అదే జిల్లాలోని తుమ్మపాలలో ఉన్న అనకాపల్లిలో వివి రమణ సహకార చక్కెర కర్మాగారానికి రూ. 15 కోట్ల చొప్పున మూలధనం సమకూర్చాలనే నిర్ణయం.
- ఈ మొత్తాలను ఆంధ్రప్రదేశ్ సహకార సంస్థ (ఆప్కాబ్) సమకూరుస్తుంది. దీనికి రాష్ట్ర ప్రభుత్వం ఎటువంటి షరతులు లేని, ఉపసంహరణకు వీలుకాని పూచీకత్తును ఇస్తుంది.

### భూమి కేటాయింపులు

- టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చ్ కోసం (TIFR) రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం, గోపన్నపల్లిలో సర్వే నెం. 34లో 2 ఎకరాల 35 కుంటలు, సర్వేనెం. 35లో 4 ఎకరాల 35 కుంటలు, సర్వేనెం. 36లో ఒక ఎకరం 22 కుంటలు చొప్పున మొత్తం 9 ఎకరాల 35 కుంటల ప్రభుత్వ భూమిని కేటాయిస్తూ గతంలో జారీ చేసిన ఉత్తర్వులకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది.
- చిత్తూరు జిల్లా తిరుపతి అర్బన్ మండలంలోని సర్వే నెం. 951/26లో ఉన్న 217.8 చదరపు గజాల స్థలాన్ని జిల్లా రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డు ఉద్యోగుల సంఘానికి చదరపు గజం రూ. 6,100 చొప్పున కేటాయింపు..
- ఇందులో పెన్షనర్ల భవనంతో పాటు వృద్ధుల ఆశ్రమం కూడా నిర్మించేందుకు ప్రతిపాదనలు చేశారు.
- నిజామాబాద్ జిల్లా బిక్నూర్ మండలం రాజం పేట గ్రామంలో సర్వే నెం. 181లో ఒక ఎకరం 11 కుంటల స్థలాన్ని 33/11 కె.వి సబ్‌స్టేషన్ నిర్మాణానికి కేటాయిస్తూ నిర్ణయం.
- ఎకరం రూ. 57,220ల మార్కెట్ ధరకి ఈ కేటాయింపు చేయటం జరిగింది.
- మెదక్ జిల్లా సిద్ధిపేట డివిజన్ తూప్రాన్ మండలంలోని ఇమాంపూర్ గ్రామంలో సర్వేనెం. 160,161లలో ఉన్న ఒక ఎకరం 12 గుంటల స్థలాన్ని ఎకరం రూ. 5 లక్షల మార్కెట్ ధరకు కేటాయింపు.
- ఈ స్థలం మానసిక వికలాంగులు కేంద్రం కోసం శ్రీ విద్యా సంస్థకు

కేటాయింపు.

- కర్నూలు జిల్లా ఓర్వకల్లు మండలం కాల్వ గ్రామంలోని సర్వే నెం. 1032లోఉన్న 9 ఎకరాల 42 స్థలాన్ని మాతా సంతోషి ట్రస్టుకు వృద్ధుల శరణాలయ నిర్మాణం కోసం, ఎకరం రూ. 2.50 లక్షల మార్కెట్ ధరకు కేటాయింపు.

### వెనుకబడిన తరగతుల సంక్షేమం

- వెనుకబడిన తరగతుల్లోని తమ్మలి కులస్థులపై ఉన్న జిల్లా ఆంక్షలను ఎత్తివేసి, ఇతర వెనుకబడిన కులాల మాదిరిగానే రాష్ట్రవ్యాప్తంగా వీరికి ప్రభుత్వ ప్రయోజనాలు అందించాలనే ప్రతిపాదనలకు మంత్రివర్గ ఆమోదం.
- ఈ తమ్మలి కులస్థులు దేవాలయాల్లో సంగీత వాయిద్యాలను వాయించడం, పూలు విక్రయించడం వంటి దేవాలయ సేవల్లో నిమగ్నమై ఉంటారు.

### రాయలసీమ విద్యాలయంలో పోస్టుల భర్తీ

- కర్నూలులోని రాయలసీమ విశ్వవిద్యాలయంలో మొత్తం 35 పోస్టుల భర్తీ కోసం చేసిన ప్రతిపాదనలకు మంత్రివర్గం ఆమోదం.
- వీటిలో ప్రొఫెసర్లు 5, అసోసియేట్ ప్రొఫెసర్లు 10, అసిస్టెంట్ ప్రొఫెసర్లు 20 చొప్పున మొత్తం 35 పోస్టులు ఉన్నాయి.
- దీని కోసం రూ. 2 కోట్ల 8 లక్షల 56 వేల వ్యయమవుతుందని అంచనా.

## పోస్టుల భర్తీ

### రాష్ట్రీయ మాధ్యమిక శిక్షా అభియాన్

- కేంద్ర ప్రభుత్వ సహకారంతో మాధ్యమిక స్థాయిలో విద్యా ప్రమాణాలు పెంచడానికి రాష్ట్రీయ మాధ్యమిక శిక్షా అభియాన్ పేరిట ఒక కొత్త పథకాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే.
- ఈ పథకం కింద అన్ని జిల్లాలలో అవసరమైన 300 పోస్టులను పాఠశాల విద్యాశాఖ డైరెక్టరేట్ నుంచి డిప్యూటేషన్ ప్రాతిపదికన భర్తీ చేస్తారు.

### ఆంధ్రప్రదేశ్ గిడ్డంగుల సంస్థ

- రాష్ట్ర గిడ్డంగుల సంస్థలోని పని భారాన్ని దృష్టిలో పెట్టుకుని కొత్తగా 162 రెగ్యులర్ పోస్టులను భర్తీ చేయడంతో పాటు, కాంట్రాక్టు / ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన మరో 517 పోస్టులను భర్తీ చేసే ప్రతిపాదనకు ఆమోదం. ఈ నియామకాలను మూడు విడతలుగా చేపడతారు.
- వీటికి గాను ప్రభుత్వం పై రూ. 6 కోట్ల 51 లక్షల 86 వేల అదనపు భారం పడుతుంది.

### రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ

- రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థలో నిఘా వ్యవస్థను మరింత పటిష్ఠ పరిచేందుకు అదనపు పోస్టుల భర్తీకి ఆమోదం. 7 అసిస్టెంట్ జియాలజిస్టులు, 6 ఫారెస్టు అధికారులు, ఒక సబ్ రిజిస్ట్రారు, ఒక అసిస్టెంట్ ఇంజనీరు పోస్టుల చొప్పున మొత్తం 15 పోస్టులను భర్తీ చేస్తారు.
- వీటివల్ల రూ. 55 లక్షల 78 వేల అదనపు భారం పడుతున్నది.

### పాండు రంగారావు కమీషన్ నివేదిక

- మత్స్య పరిశ్రమ శాఖ ఇంజనీరింగ్ విభాగంలో జరిగిన భారీ అవకతవకలపై ఏర్పాటు చేసిన జస్టిస్ పాండురంగారావు కమీషన్ నివేదికకు ఆమోదం.
- ఈ శాఖలోని ఉద్యోగి అయిన ఎలుగుబంటి సూర్యనారాయణ చేసిన కోట్ల రూపాయల అక్రమాలపై విచారణకు 2008, డిసెంబర్ 29వ తేదీన ఈ కమీషన్ ఏర్పాటు చేయటమైంది.
- అక్రమ నిర్మాణాలు జరిగిన వివిధ ప్రభుత్వ శాఖల పనులపై కమీషన్ విచారణ జరిపింది.

### రాష్ట్ర ఆర్థిక సంస్థ నుంచి బాండ్ల జారీ

- రాష్ట్ర ఆర్థిక సంస్థ ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి గాను గ్యారంటీ కమీషన్ కోసం ఒత్తిడి చేయకుండా 10 సంవత్సరాల కాలపరిమితితో రూ. 200 కోట్ల మేర ఆదాయాన్ని సమకూర్చుకునేందుకు బాండ్ల జారీకి ప్రభుత్వ ఆమోదం.
- దీనికి అవసరమైన గ్యారెంటీని రాష్ట్ర ప్రభుత్వం సమకూరుస్తుంది.
- ఆర్థిక పురోగతిలో ఉన్న రాష్ట్ర ఆర్థిక సంస్థ తన ఖాతాదారుల నుంచి వస్తున్న స్పందనను బట్టి, ఈ బాండ్లను జారీ చేయాలని నిర్ణయించింది.
- 2006-07లో రూ. 22.21 కోట్లు ఉన్న సంస్థ నికర లాభాలు 2009-10 సంవత్సరానికి రూ. 67.68 కోట్లకు చేరుకున్నాయి.

### జీవిత ఖైదీల విముక్తి

- జనవరి 26న రిపబ్లిక్ దినోత్సవాన్ని పురస్కరించుకుని యావజ్జీవ కారాగార శిక్ష అనుభవిస్తున్న ఖైదీలను వారి సత్ప్రవర్తన ఆధారంగా విడుదల చేస్తూ, జారీ చేసిన ఉత్తర్వులకు మంత్రివర్గ ఆమోదం.
- గతంలో జారీ చేసిన మార్గదర్శకాలకు అనుగుణంగా 317 మంది జీవిత ఖైదీల కేసులను సమీక్షించి వారిలో 305 మందిని విడుదల చేయటం జరిగింది.
- 2011 జనవరి 20వ తేదీన జారీ చేసిన ఉత్తర్వులకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది.

### సహకార సంఘాలపై ఆర్డినెన్స్

- రాష్ట్ర వ్యాప్తంగా సహకార సంఘాల నిర్వహణ కమిటీల కాలపరిమితి ఏడాదికి మించకుండా ఆరు నెలలకోసారి పొడిగిస్తూ రూపొందించిన ఆర్డినెన్స్‌కు మంత్రివర్గ ఆమోదం.
- 'నాబార్డ్' మార్గదర్శకాలకు అనుగుణంగా రాష్ట్ర వ్యాప్తంగా సహకార వ్యవస్థలో మార్పులు చేర్పులపై అధ్యయనం జరుగుతున్నందువల్ల నిర్వహణ కమిటీల కాలపరిమితి పొడిగింపు అనివార్యమైంది.

### నిర్బంధ విద్యపై నియమావళి

- కేంద్ర ప్రభుత్వం ఇటీవల అమల్లోకి తెచ్చిన నిర్బంధ విద్య చట్టానికి సంబంధించి రూపొందించిన నియమావళికి ఆమోదం.
- 6-14 సంవత్సరాల మధ్యలో ఉన్న బాల బాలికలకు నిర్బంధ విద్యను అమల్లోకి తెస్తూ, 2010 ఏప్రిల్ 1వ తేదీన కేంద్ర ప్రభుత్వం ఒక చట్టాన్ని అమల్లోకి తీసుకొచ్చిన విషయం తెలిసిందే. దీనికి అనుగుణంగా నియమావళికి ప్రభుత్వం రూపకల్పన చేసింది.

**- జి. సుజాత**

# 20 సూత్రాల కార్యక్రమం - ఇందిరాగాంధీ మానస పథకం

**ఇరవై సూత్రాల కార్యక్రమం - భారత మాజీ ప్రధాని స్వర్గీయ శ్రీమతి ఇందిరాగాంధీ మానస పుత్రిక అని చెప్పవచ్చు. సామాన్య మానవుని జీవన ప్రమాణాలు పెంచి, దారిద్ర్యాన్ని నిర్మూలించాలన్న ఉన్నత లక్ష్యంతో 1975 సంవత్సరంలో అప్పటి భారత ప్రధాని శ్రీమతి ఇందిరాగాంధీ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు.**

ఎప్పటికప్పుడు వస్తున్న సామాజిక మార్పులకు అనుగుణంగా 1982లో, 1986లో, 2006లో ఈ కార్యక్రమానికి కొన్ని మార్పులు చేర్పులు, కూర్పులు చేయటం జరిగింది. 2006లో ఈ కార్యక్రమానికి రూపకల్పన చేసేటప్పుడు యు.పి.ఏ ప్రభుత్వ కనీస ఉమ్మడి కార్యక్రమ లక్ష్యాలను, ఐక్యరాజ్య సమితి (మిలీనియం డెవలప్‌మెంట్ గోల్సు) సహస్రాబ్ది అభివృద్ధి లక్ష్యాలను, సార్క్ దేశాల చార్టర్‌ను దృష్టిలో పెట్టుకోవటం జరిగింది. ఎన్ని పథకాలు అమలు అయినప్పటికీ సరైన పర్యవేక్షణ, సమీక్షలు లేకపోతే అనుకున్న లక్ష్యాలను చేరలేమన్న భావనతో 20 సూత్రాల కార్యక్రమాన్ని పటిష్టంగా అమలు చేయటం జరుగుతోంది.

సమాజంలో అన్ని రంగాలను, అన్ని వర్గాలను దృష్టిలో పెట్టుకుని ఈ కార్యక్రమాన్ని రూపొందించారు. ఇందులో 20 సూత్రాలు, 65 అంశాలు, 160 సూచికలు ఉంటాయి. 65 అంశాలలో 20 అంశాలపై నెలవారీ సమీక్ష, 45 అంశాలపై వార్షిక సమీక్ష ఉంటుంది.

గతంలో ఈ కార్యక్రమానికి ఎంతో ప్రాధాన్యత ఉండేది. రాష్ట్రస్థాయి, జిల్లాస్థాయి సమీక్షా సమావేశాలలో ప్రప్రమథంగా ఇరవై సూత్రాల కార్యక్రమాన్ని సమీక్షించే వారు. ఎంతో మంది విద్యార్థులు ఈ కార్యక్రమంపై పరిశోధన చేసి పి.హెచ్.డి. పొందారు. పాఠశాల, కళాశాల స్థాయి పరీక్షా ప్రశ్నా ప్రతాలలో ప్రశ్నల రూపంలో ఈ కార్యక్రమం గురించి ప్రశ్నలు అడిగేవారు.

గత కొన్నేళ్ళుగా ఈ కార్యక్రమానికి కొంత ప్రాధాన్యత తగ్గిన మాట వాస్తవమే. కీ.శే. నందమూరి తారక రామారావు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఈ కార్యక్రమానికి ఒక మంత్రి ప్రత్యేకంగా ఉండేవారు. 1991 - 94 మధ్య శ్రీ రాయపాటి సాంబశివరావు ఇరవై సూత్రాల కార్యక్రమం ఛైర్మన్‌గా ఉండేవారు. 16 సంవత్సరాల అనంతరం డా. సరెడ్డి తులసి రెడ్డిని ఇరవై సూత్రాల కార్యక్రమం ఛైర్మన్‌గా రాష్ట్ర ప్రభుత్వం, 2010 అక్టోబర్ 1న నియమించింది.

ఈ కార్యక్రమానికి గత వైభవ ప్రాభవాలను పునరుద్ధరించాలన్న ధృఢ సంకల్పంతో 20 సూత్రాల కార్యక్రమం ఛైర్మన్ శ్రీ తులసి రెడ్డి కృషి చేస్తున్నారు. 2009 - 10లో జాతీయ స్థాయిలో ఈ కార్యక్రమం అమలులో హిమాచల్ ప్రదేశ్ మొదటి స్థానం, రాజస్థాన్ రెండవ స్థానం తమిళనాడు మూడవ స్థానం పొందగా, ఆంధ్రప్రదేశ్ 9వ స్థానం పొందింది. రాష్ట్ర స్థాయిలో గత సంవత్సరంలో ప్రకాశం జిల్లా మొదటి స్థానం, తూర్పుగోదావరి జిల్లా రెండవ స్థానం, చిత్తూరు జిల్లా మూడవ స్థానం పొందాయి.


శ్రీ ఎన్. తులసీరెడ్డి

## ఇరవై అంశాలు

**1. పేదరిక నిర్మూలన :** గ్రామీణ ప్రాంతంలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం క్రింద ఉపాధి కల్పన, స్వర్ణజయంతి గ్రామస్వరోజ్ గార్ యోజన, పట్టణ ప్రాంతాలలో స్వర్ణజయంతి షెహరి రోజ్‌గార్ యోజన ద్వారా ఉపాధి కల్పన.

**2. ప్రజలకు సాధికారత :** స్థానిక స్వపరిపాలన (పంచాయితీరాజ్, పట్టణ స్థానిక సంస్థలు) విధులు, నిధులు, సిబ్బంది కేటాయింపు, తక్కువ ఖర్చుతో సత్వర న్యాయం.

**3. రైతులకు సహాయం :** వాటర్‌షెడ్ అభివృద్ధి, బంజరు భూములను సాగుచేయడం, రైతులకు మార్కెటింగ్, మౌలిక సదుపాయాల కల్పన, వ్యవసాయానికి సాగునీటి సౌకర్యాలు, రైతులకు పరపతి సౌకర్యం.

**4. కార్మిక సంక్షేమం :** వ్యవసాయ అసంఘటిత కార్మికులకు సామాజిక భద్రత కల్పించడం, కనీస వేతనాలు అమలు చేయడం.

**5. ఆహార భద్రత :** దీర్ఘకాలికంగా ఆహార కొరత ఉండే ప్రాంతాలలో ధాన్యాగారాలను ఏర్పాటు చేయడం.

**6. అందరికీ గృహ వసతి :** గ్రామీణ గృహ నిర్మాణం - ఇందిర ఆవాస్ యోజన, పట్టణ ప్రాంతాలలో ఇ. డబ్ల్యు ఎస్/ఎల్.ఐ.జి. గృహాలు.

**7. శుభ్రమైన త్రాగునీరు :** గ్రామీణ ప్రాంతాలలో స్వజల ధార, సత్వర గ్రామీణ నీటి సరఫరా కార్యక్రమం, పట్టణ ప్రాంతాలలో సత్వర పట్టణ నీటి సరఫరా కార్యక్రమం.



**8. అందరికీ ఆరోగ్యం :** ప్రధాన రోగాలను నియంత్రించడం, నివారించడం, జాతీయ గ్రామీణ ఆరోగ్య మిషన్, పిల్లలకు వ్యాధినిరోధక టీకాలు, ఆడపిల్లల భ్రూణ హత్యలను నివారించటానికి, మాతా శిశువులకు పౌష్టిక ఆహారం అందచేయడం, కుటుంబ నియంత్రణ.

**9. అందరికీ విద్య :** రాజీవ్ విద్యామిషన్ (సర్వ శిక్షా అభియాన్) మధ్యాహ్న భోజన పథకం, నిర్బంధ ప్రాథమిక విద్య.

**10. షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డు తెగలు, అల్ప సంఖ్యాక వర్గాలు, ఓబిసిల సంక్షేమం :** ఎస్.సి. కుటుంబాలకు సహాయం అందించడం, పారిశుద్ధ్య కార్మికులకు పునరావాసం కల్పించడం, ఎస్.టి. కుటుంబాలకు సహాయం అందించడం, అడవులలో నివసించేవారికి, చిన్న తరహా అటవీ ఉత్పత్తుల యాజమాన్య హక్కులు, ఆదివాసీ గిరిజన గ్రూపులకు, గిరిజన భూములను కేటాయించకపోవటం, పంచాయితీ చట్టం అమలు, అల్ప సంఖ్యాక వర్గాల సంక్షేమం, అల్ప సంఖ్యాక వర్గాల వారందరికీ వృత్తి విద్య, ఓబిసీలకు రిజర్వేషన్లు (విద్య, ఉపాధి కల్పనతో)

**11. మహిళా సంక్షేమం :** మహిళా సంక్షేమానికి ఆర్థిక సహాయం, పంచాయితీలు, మునిసిపాలిటీలు, రాష్ట్ర శాసన సభలు, పార్లమెంటులో మహిళలు పాల్గొనడాన్ని మెరుగుపర్చడం.

**12. శిశు సంక్షేమం :** ఐసిడిఎస్ పథకాన్ని సార్వత్రికరించడం, నిర్వాహక అంగన్‌వాడీలు.

**13. యువజనాభ్యుదయం :** గ్రామీణ, పట్టణ ప్రాంతాలలోని వారందరికీ క్రీడలు, రాష్ట్రీయ సద్భావన యోజన, జాతీయ సేవా పథకం (ఎస్.ఎస్.ఎస్.).

**14. పట్టణ మురికి వాడలను అభివృద్ధి పర్చడం :** గృహ నిర్మాణం, నీరు పారిశుద్ధ్యం, ఆరోగ్యం, విద్య, సాంఘిక భద్రత క్రింద పట్టణ పేద కుటుంబాలకు సహాయం అందించడం.

**15. పర్యావరణ పరిరక్షణ, అటవీ పెంపకం :** అటవీ పెంపకం, నదులు, జలాశయాల కాలుష్యాన్ని నివారించడం, గ్రామీణ ప్రాంతాలు, పట్టణ ప్రాంతాలలోని ఘన, ద్రవ, వ్యర్థ పదార్థాల నిర్వహణ.

**16. సామాజిక భద్రత :** వికలాంగులు, అనాధలకు పునరావాసం, వృద్ధుల సంక్షేమం.

**17. గ్రామీణ రహదారులు :** గ్రామీణ రహదారులు - ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన.

**18. గ్రామీణ ప్రాంతాలను విద్యుదీకరించడం :** బయోడీజిల్‌ను ఉత్పత్తి చేయడం, రాజీవ్ గాంధీ గ్రామీణ్ విద్యుదీకరణ యోజన, నవీకరించగిన విద్యుత్తు, పంపు సెట్లకు విద్యుత్ సరఫరా, కిరోసిన్, ఎల్.పి.జి.ల సరఫరా.



**19. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి :** వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి నిధి. కార్యక్రమం అమలు ద్వారా ప్రాంతీయ అసమానతలు తగ్గించటం.

**20. ఐటి ఆధారిత ఈ - గవర్నెన్స్ :** కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు, పంచాయితీలు, మునిసిపాలిటీలు. ఈ కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో మరింత మెరుగ్గా అమలుపరిచి 2010 - 11 సంవత్సరానికి జాతీయ స్థాయిలో మన రాష్ట్రం మొదటి స్థానాన్ని పొందుతుందని ఆశిద్దాం.

# బి.ఆర్.జి.ఎఫ్. వార్షిక ప్రణాళికకు ఆమోద ముద్ర

ప్రణాళికా సంఘం ద్వారా రాష్ట్రంలో అభివృద్ధిలో వెనుకబడిన జిల్లాలుగా గుర్తించబడిన ఆదిలాబాదు, కరీంనగర్, ఖమ్మం, మెదక్, వరంగల్, నిజామాబాదు, నల్గొండ, మహబూబ్‌నగర్, రంగారెడ్డి, అనంతపూర్, చిత్తూరు, కడప, విజయనగరం జిల్లాలలో అమలు చేస్తున్న వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి నిధి కార్యక్రమం యొక్క 2011-12 వార్షిక ప్రణాళికకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శ్రీ ఎస్.వి. ప్రసాద్, ఐ.ఏ.ఎస్ అధ్యక్షతన ఫిబ్రవరి 9న జరిగిన రాష్ట్ర బి.ఆర్.జి.ఎఫ్. ఉన్నత స్థాయి కమిటీ సమావేశం ఆమోదముద్ర వేసింది. మొత్తం రూ. 481.12 కోట్లతో చేపట్టే 39975 పనుల ప్రతిపాదనలు ఈ వార్షిక ప్రణాళికలో పొందుపర్చారు.

ఈ కార్యక్రమం అమలులో భాగంగా ప్రతి జిల్లాలోని అన్ని గ్రామపంచాయతీలు, మండల పరిషత్తులు, జిల్లా పరిషత్తులు, మునిసిపాలిటీలు రూపొందించిన ప్రణాళికలను జిల్లా ప్రణాళికా కమిటీలు క్రోడీకరించి, ఆయా ప్రణాళికలను జిల్లా స్థాయిలో ఆమోదించిన తరువాత రాష్ట్ర స్థాయి ఉన్నత కమిటీ పరిశీలనకు పంపుతారు. రాష్ట్ర స్థాయిలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, పంచాయతీరాజ్ శాఖ, ఆర్థికశాఖ, మునిసిపల్ వ్యవహారాల శాఖ, గిరిజన సంక్షేమ శాఖ, సాంఘిక సంక్షేమ శాఖల ముఖ్య కార్యదర్శులు, కమీషనరు పంచాయతీరాజ్, అపార్డు కమీషనరు మొదలైనవారు సభ్యులుగా కల్గిన ఉన్నత స్థాయి కమిటీ జిల్లా ప్రణాళికా కమిటీలు సమర్పించిన ప్రణాళికలను పరిశీలించి నిధుల విడుదల కోసం కేంద్ర ప్రభుత్వ పంచాయతీరాజ్ మంత్రిత్వ శాఖకు పంపుతుంది.

ఈ సమావేశంలో పాల్గొన్న పంచాయతీరాజ్ శాఖ ముఖ్య కార్యదర్శి శ్రీ రాజీవ్‌శర్మ బి.ఆర్.జి.ఎఫ్. కార్యక్రమ ఉద్దేశ్యాలను, ఉన్నతస్థాయి కమిటీ బాధ్యతలను గూర్చి వివరించారు. 13 జిల్లాల నుండి అందిన ప్రణాళికలపై పంచాయతీరాజ్ కమీషనరు శ్రీమతి పూనం మాలకొండయ్య సవివరంగా సభ్యులకు పవర్ పాయింట్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా శ్రీమతి పూనం మాలకొండయ్య మాట్లాడుతూ, 207-08, 2008-09, 2009-10 సంవత్సరాలలో విడుదలైన బి.ఆర్.జి.ఎఫ్. నిధుల వినియోగానికి చెందిన ఆడిట్ ప్రక్రియ పూర్తి అయిందని తెలియచేసారు. 13 జిల్లాలలోని ప్రణాళికలను ప్లాన్‌ప్లస్ సాఫ్ట్‌వేర్ వినియోగించి ఆన్‌లైన్‌లో కంప్యూటరీకరించటం జరిగిందని వివరించారు. పంచాయతీరాజ్ సంస్థలలో ఆర్థిక వ్యవహారాల నిర్వాహణకు ఉపకరించే "ప్రియా సాఫ్ట్" పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకొని రావటానికి అవసరమైన శిక్షణను ఇప్పటికే అపార్డులో అందచేయటం జరుగుతోందన్నారు. ఈ పంచాయతీ అప్లికేషన్సును వినియోగంలోకి తీసుకొని రావటానికి ఇప్పటికే నేషనల్ ఇన్ఫర్మేటిక్సు సెంటరు వారు అన్ని జిల్లాల సిబ్బందికి శిక్షణను పూర్తిచేశారని శ్రీమతి పూనం మాలకొండయ్య వివరించారు.

పంచాయతీ రాజ్ ప్రజాప్రతినిధుల సామర్థ్యాల పెంపుదలకు ముఖాముఖి శిక్షణ ద్వారా, దూరవిద్యా కార్యక్రమాల ప్రసారం, ఉత్తమ పంచాయతీ సందర్శనలు, గ్రామసభ అవగాహనా సదస్సుల ద్వారా అపార్డు చేస్తున్న కృషిని కమీషనరు అపార్డు శ్రీ చంద్రమౌళి సభ్యులకు వివరించారు. 2011-12 సంవత్సరానికిగాను రూ. 62.89 కోట్లతో రూపొందించిన శిక్షణా ప్రణాళికకు ఉన్నతస్థాయి కమిటీ ఆమోదముద్ర





వేసింది. ఈ సమావేశంలో సాంఘిక సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి శ్రీ రేమండ్ పీటర్, గిరిజన సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి శ్రీ ఎ. విద్యాసాగర్, ఆర్థికశాఖ కార్యదర్శి శ్రీ ఎస్.ఇ. శేఖర్‌బాబు, పట్టణ అభివృద్ధి, మున్సిపల్ శాఖ జాయింట్ సెక్రటరీ శ్రీ లోకేష్ జైస్వాల్, ప్రణాళికా శాఖ సంచాలకులు శ్రీ దక్షిణామూర్తి, బి.ఆర్.జి.ఎఫ్. కన్సల్టెంట్ శ్రీ డి. రామకృష్ణ, పంచాయతీరాజ్ ఇంజనీర్ ఛీఫ్ శ్రీ బి. శ్యాంబాబు, పంచాయతీరాజ్ శాఖ జాయింట్ సెక్రటరీ శ్రీ మనోహర్ రెడ్డి పాల్గొన్నారు.

### "ప్లానింగు కమీషను మార్గదర్శకాల ప్రకారమే జిల్లా ప్రణాళికలను రూపొందించాలి"

12వ పంచవర్ష ప్రణాళికా కాలానికి (2012-2017) రూపొందించే దీర్ఘదర్శి (పర్స్పెక్టివ్), వార్షిక ప్రణాళికలను భారత ప్లానింగు కమీషను, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారమే రూపొందించాలని పంచాయతీ రాజ్ కమీషనరు శ్రీమతి పూనం మాలకొండయ్య అన్నారు. ఫిబ్రవరి 10న టెక్నికల్ సపోర్ట్ ఇన్‌స్టిట్యూట్ (టి.ఎస్.ఐ) లతో జరిగిన సమావేశం సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రణాళికీకరణ ప్రక్రియలో టి.ఎస్.ఐ. లు అన్నీ రాష్ట్ర వ్యాప్తంగా ఒకే విధమయిన వ్యూహాన్ని అవలంబిస్తే మంచి ఫలితాలు వస్తాయని, ఒకరితో ఒకరు సమన్వయంగా పనిచేయవలసిన అవసరం ఉన్నదని సూచించారు. 13 బి.ఆర్.జి.ఎఫ్. జిల్లాలలో ప్రణాళికల రూపకల్పనకు స్థానిక ప్రభుత్వేతర/స్వచ్ఛంద సంస్థల సహకారాన్ని తీసుకొంటామని టి.ఎస్.ఐ. ప్రతినిధులు ఈ సందర్భంగా తెలియచేసారు.

ఐతే ఈ కార్యక్రమం పూర్తి చేయటానికి తమకు 6 నెలల సమయం కావాలని, జిల్లాలో ఎంపిక చేసిన కొన్ని గ్రామ పంచాయతీలు, మండల పరిషత్తులలో పూర్తిస్థాయిలో ప్రణాళికలు రూపొందించటానికి తాము సహకరిస్తామని, జిల్లా ప్రణాళిక రూపకల్పనలో జిల్లా ప్రణాళికా కమిటీకి సహకరిస్తామని వారు తెలియచేసారు. ఎన్.జి.ఓ.లను వినియోగించుకొనే ముందు వారి సామర్థ్యాలను బేరీజు వేసుకోవాలని కమీషనరు సూచించారు. ఈ ప్రక్రియపై టి.ఎస్.ఐ.లు పూర్తిస్థాయిలో అవగాహన తెచ్చుకొన్న తరువాతనే క్షేత్ర స్థాయిలో ప్రణాళికీకరణ ప్రక్రియ ప్రారంభించాలని శ్రీమతి పూనం మాలకొండయ్య సూచించారు. పంచాయతీరాజ్ డిప్యూటీ కమీషనరు శ్రీ రామారావు మాట్లాడుతూ, ప్రణాళికలను ఎప్పటికప్పుడు ప్లాన్‌ప్లస్ సాఫ్ట్‌వేర్ ఉపయోగించి కంప్యూటరైజ్ చేయాలని సూచించారు. ఈ సమావేశంలో పాల్గొన్న అపార్డులోని సి.డి.పి.ఏ. సెంటర్ హెడ్ ప్రొఫెసర్ ఆర్. సూర్యనారాయణ రెడ్డి జిల్లా ప్రణాళికా కమిటీల శిక్షణలో తనకు ఎదురైన అనుభవాలను తెలిపారు. శిక్షణకు ఎలా సమాయుత్తం కావాలన్న దానిపై టి.ఎస్.ఐ.లకు సలహాలు అందచేసారు.

# ఆనాటి మొలక

**- యం. యస్. శాయిబాబు**

బస్సులో కూర్చున్నాడన్న మాటే గానీ - ఎప్పుడెప్పుడు 'కుబేరపురం' చేరదామా అని ఆతృత పడసాగాడు... ప్రకాశం. పదిహేడేళ్ళ తర్వాత మళ్ళీ ఆ వూరు వెళుతున్నాడు.. అందుకే ఆతృత.

తనకు నలభై సంవత్సరాల వయస్సులో గ్రామపంచాయితీ కార్యనిర్వహణాధికారిగా... ఆ వూరికి బదిలీపై వచ్చాడు మొదట. గ్రామంలోకి అడుగుపెడుతూనే - దుర్గంధం, ఇంటి ముందు చెత్తకుప్పలు, ఊరంతా వున్న మట్టిరోడ్లు, వాటిపై పారుతున్న మురుగునీరు... దర్శనమిచ్చాయి.

ఊళ్ళో విచారించిన మీదట ప్రతి ఇంటా రోగాలు, అంటువ్యాధులు.. శుచీ, శుభ్రత లేని పరిసరాలు..

శెలవు పడేసి - వేరే వూరు బదిలీ చేయించుకోవటానికి కావలసిన అర్థబలం, అంగబలం లేని వ్యక్తి ప్రకాశం.

గ్రామసర్పంచ్ గారికి దగ్గరలోనే వున్న పట్నంలో ఒక రైస్‌మిల్, ఒక పొగాకు కంపెనీ వున్నాయట. ఆయన ఎక్కువగా ఆ వ్యాపారాలు



చూసుకుంటూ, ఎప్పుడో ఒకసారి గ్రామంలోకి వచ్చి వెళతాడుట. తనకు ముందు వచ్చిన అధికారులందరూ కొద్దిరోజులే ఇక్కడ పనిచేయటం, శెలవుల మీద వెళ్ళటం... ఇత్యాదికారణాల వల్ల గ్రామం ఇలా తయారయ్యింది - ఇవన్నీ అటెండర్ 'రాజయ్య' చెప్పిన విషయాలు.

గ్రామంలో నిరక్షరాస్యత, శుభ్రత మీద అవగాహన లేకపోవటం, రాజకీయాలు.. ఇవన్నీ నరసింహంగారు చెప్పిన సంగతులు.

ఆవూరిలో కాస్తో, కూస్తో ఆస్థిపాస్థులున్న వారిలో నరసింహం గారొకరు. దాదాపు యాభై సంవత్సరాల వయస్సుండవచ్చు. ఆయన ఒకరోజు ఆఫీసుకు వచ్చి - సూటిగా - "మీరు - అందరిలాంటి ఆఫీసరేనా...!? లేక వూరు బాగు చేయటానికి ఏమైనా కృషి చేస్తారా?!" అని అడిగారు.

ప్రకాశం ఆశ్చర్యపోయాడు. అలా సూటిగా అడిగినందుకు కాదు. తాను ఇక్కడకు వచ్చి రెండు రోజులైనా - ఆఫీసు వంక చూడని సర్పంచ్‌గారు గానీ - అసలు గ్రామంలో ఏ ఒక్కరూ... అడగని ప్రశ్నను... నరసింహంగారు అడిగినందుకు.

"మీ పేరు తెలుసుకోవచ్చా!?" అడిగాడు ప్రకాశం.

"నరసింహం...!" చెప్పారు నరసింహంగారు.

"చూడండి సార్! పంచాయితీకి ఎటువంటి ఆదాయమూ లేదు. ఎవరో నలుగురైదుగురు తప్ప ఇంటి పన్నులు కూడా ఎవ్వరూ కట్టటం లేదు. నేను వూరంతా తిరిగి చూసాను. ఏం చేయాలో నాకూ తోచటం లేదు. ఒక్కటిమాత్రం చెప్పగలను. గ్రామస్థుల సహకారం, సర్పంచ్ గారి... వార్డు మెంబర్ల సహకారం లేకుండా ఏ ఉద్యోగీ ఏమీ చేయలేడు" చెప్పాడు ప్రకాశం.

నరసింహంగారు పెద్దగా నవ్వారు. "సర్పంచ్... నాకంటే చిన్నవాడు. వాడు నాకు బంధువే. వాడు గెలిచినప్పుడు.. వాడిని అడిగాను.. ఏరా! గ్రామం కోసం ఏం చేద్దామని! అప్పుడు వాడేమన్నాడంటే.. ఏంటి నరసింహం - ఈసారి నువు నిలబడదామనా...! అని - నాకు నవ్వాలో, ఏడ్వాలో అర్థం కాలేదు. ఇక్కడకు వచ్చే ప్రతి ఆఫీసర్నీ అడిగాను. వాళ్ళూ మీలాగే చెప్పారు. అంటే మీరూ... ఏం చేయలేరన్నమాట!" అన్నారు.

"మీరు సహాయంగా వుంటానంటే చెప్పండి నరసింహంగారు.. నేను ఈ గ్రామాభివృద్ధికి నడుం బిగిస్తాను" అన్నాడు ప్రకాశం.

"కనీసం.. ఈ మాటను మీ ముందు అధికారులు అనలేదు. తప్పకుండా ముందుగా శుచీ, శుభ్రతల గురించి ఈ గ్రామ ప్రజలకు తెలియజేయాలి" అన్నారు నరసింహంగారు.

అప్పటికప్పుడే ఏం చేయాలా.. అని ఆలోచన చేసి, అందుకు తగిన విధంగా చర్యలు కూడా తీసుకున్నారు.

మర్నాడే రాజయ్య సహాయంతో వూళ్ళోని కుటుంబాలకు సరిపడా చెత్త ఎత్తివేసే ప్లాస్టిక్ బక్కెట్లు, చెత్త తీసుకువెళ్ళే బండి వూళ్ళోకి చేరాయి.

ఆమర్నాడు సర్పంచ్ గారికి కబురు చేస్తే.. ఆయనవచ్చి - విషయం తెలుసుకుని - "అప్పుడే నరసింహం... రంగంలోకి దిగాడన్నమాట. ఎన్నికలకు ఇంకా చాలా సమయం వుంది కదా!" అన్నారు.

ప్రకాశం నవ్వుతూ - "నరసింహంగారు రంగంలోకి దిగిన మాట వాస్తవమే కానీ.. ఈసారి కూడా మీరే ఎన్నికల్లో గెలవాలని..." అన్నాడు. సర్పంచ్‌గారికి అర్థం కాలేదు.

"వీటన్నింటిని... ఒకవారం తర్వాత మనవూరిలో ఒక సభలాగా ఏర్పాటు చేసి - మండల పరిషత్ అధ్యక్షుల వారిని, మండల పరిషత్ అభివృద్ధి అధికారిగారిని పిలిచి.. వారి సమక్షంలో.. ఇవన్నీ మీ సొంత డబ్బుతో మీరేకొని, గ్రామ ప్రజలకు ఇస్తున్నారని చెప్పాలని... నరసింహంగారి ఆలోచన" అన్నాడు ప్రకాశం.

సర్పంచ్‌గారు ఆలోచనలో పడ్డారు. "దాని వలన నరసింహంగారికి

లాభం ఏముంది?" అడిగారు సర్పంచ్‌గారు.

"లాభం గురించి కాదండీ... వూరికి ఏదైనా చేయాలి.. అంతే... ఇదీ ఆయన ఆలోచన" చెప్పాడు ప్రకాశం.

"అరె! నేను నరసింహాన్ని తప్పుగా అర్థం చేసుకున్నానే... సరే.. ప్రకాశంగారు. వీటి తాలూకు డబ్బు ఎంతయిందో చెప్పండి.. నరసింహానికి ఇచ్చేస్తాను" అని సర్పంచ్‌గారు అంటూ వుండగానే... నరసింహంగారు ఆఫీసు గదిలోకి వచ్చారు.

"ఒరే... సుందరం! నీ ఆలోచనా విధానం ఇక మారదా! మన గ్రామం కోసం ఇచ్చిన దానికి డబ్బులు తీసుకుంటానా..! నాకు ఇవ్వదలుచుకున్న డబ్బుల్తో.. నీళ్ళు రోడ్ల మీదకు రాకుండా.. ఆ కాలువల్ని వూరి చివరకు తీయించి... చెత్తంతా పోసే కందకాల్లోకి పెట్టించు" అన్నారు నరసింహంగారు - సర్పంచ్‌గారితో.

వారం తర్వాత సభకోసం వచ్చిన మండల పరిషత్ అధ్యక్షులు, మండల పరిషత్ అభివృద్ధి అధికారిగారు.. గ్రామంలో కనిపించిన మార్పుని గమనించి, సర్పంచ్‌గారిని పొగిడితే - అందుకు సర్పంచ్‌గారు - "దీనికి మూలకారణం... నా సోదర సమానుడు - నరసింహం.. మా ఆఫీసర్‌గారైన ప్రకాశం గార్ల ఆలోచనలే!" అని మనస్ఫూర్తిగా చెప్పారు.

అదే సమయంలో ప్రకాశం - సర్పంచ్‌గారిని పిలిచి - మండల పరిషత్ నిధులతో మనవూరికి రోడ్డు వేయించమని అడగమని చెప్పాడు.

సర్పంచ్‌గారు, ఆ విషయం అడగటం - వారు అందుకు ఒప్పుకోవటం జరిగింది. నెలరోజుల్లోనే తారురోడ్ శాంక్షన్ కావటం కూడా జరిగింది.

ఈలోపే మరుగుదొడ్ల ఆవశ్యకత గురించి సర్పంచ్‌గారు, నరసింహంగారు ప్రకాశం... వూరిలో పదే, పదే చెప్పటంతో చాలావరకు దొడ్లు కూడా కట్టుకున్నారు.

గ్రామంలో జరుగుతున్న ఈ కార్యక్రమాల గురించి ఆసక్తిగా పరిశీలిస్తున్న కొందరు యువకులు.. తాము కూడా గ్రామానికి ఏదన్నా చేస్తామని ముందుకు వచ్చారు. వారిలో చదువుకున్న వారిని.. చదువురాని వారికి రాత్రిపూట చదువు చెప్పటానికి ఏర్పాటు చేసారు.

సర్పంచ్‌గారు పై అధికారులతో మాట్లాడి గ్రామంలో ఒక ఎలిమెంటరీ స్కూల్ ఏర్పాటు చేయించారు. దాంతో పట్నంలో కాన్వెంట్ చదువులు చదువుతున్న పిల్లలు - గ్రామంలోని బడిలోనే చదవసాగారు.

ఇలాంటి చిన్న, చిన్న కార్యక్రమాలతో ఒక సంవత్సరం గడిచింది.

వీళ్ల ముగ్గురూ చేసే కార్యక్రమాలని చూసి.. గ్రామప్రజలు 'త్రిమూర్తులు' అనసాగారు - వీళ్ళని.

ఒకరోజు త్రిమూర్తులు కూర్చొని మాట్లాడుకుంటూ వుండగా.. ప్రకాశం - "నరసింహంగారూ.. వైరల్ ఫీవర్లు రాకుండా, వాతావరణ కాలుష్యం కాకుండా వుండటానికి.. ప్రతి ఇంట్లోను - రోడ్ల ప్రక్కనా వేపచెట్లు నాటిద్దాం" అన్నాడు.

ఒక వారంలో అదీ అమలయ్యింది. 'ఇంటికొక వేపచెట్టు - ఆరోగ్యాన్ని చక్కబెట్టు' అనే నినాదం గోడల మీద వెలిసింది.

పంచాయితీ నిర్వహణకు, పంచాయితీ ద్వారా పనులు చేయటానికి - కావలసిన ధనం ఇంటిపన్నుల ద్వారానే వస్తుందనే విషయాన్ని గ్రామసభలో త్రిమూర్తులు వివరంగా చెప్పటంతో... అర్థం చేసుకున్న గ్రామస్థులు క్రమంగా పన్నులు కట్టసాగారు. దాంతో వీధిదీపాలు... ఇతరత్రా గ్రామానికి అవసరమైన పనులు చేయసాగారు.

మరొక సంవత్సర కాలం గడిచింది.

ఒకరోజు సాయంత్రం నరసింహంగారు, సర్పంచ్‌గారు కలిసి వస్తుండగా ప్రకాశం ఎదురుపడి.. "మన గ్రామంలో మహిళలు స్వయం సహాయక సంఘాలు నిర్వహిస్తున్నట్లు లేదు. ఏర్పాటు చేయిద్దామా..!?" అని అడిగారు.

వెంటనే కాస్తో కూస్తో చదువుకున్న మహిళలందరకూ కబురు వెళ్ళింది. అందరూ సమావేశమయ్యారు. పొదుపు - ఆవశ్యకత - సంఘాల నిర్వహణ - అప్పులు తీర్చుకోవటం లాంటి విషయాల గురించి విపులంగా వివరించడం జరిగింది. మర్నాడే అందరూ మండల పరిషత్ కార్యాలయానికి వెళ్ళి, మిగిలిన వివరాలు సేకరించి సంఘాలుగా ఏర్పడ్డారు.

కాలం మరింత ముందుకు సాగింది. సంఘాల వారు పొదుపునకు అలవాటుపడ్డారు. అప్పులు తీసుకుని తిరిగి చెల్లిస్తున్నారు.

అటువంటి సమయంలో ప్రకాశానికి మరొక వూరికి బదిలీ అయింది. ఊరు, ఊరంతా ఘనంగా వీడ్కోలు పలికింది.

ఆలోచనల నుండి తేరుకున్నాడు ప్రకాశం. తనకిప్పుడు అరవై వసంతాలు. రిటైర్ అయ్యి రెండేళ్ళు అయింది. ఉన్నట్లుండి ఈరోజు ఉదయమే కుబేరపురం గుర్తుకువచ్చి - ఒక్కసారి చూసి వద్దామని బయల్దేరాడు.

కుబేరపురం హద్దుల నుండే ప్రారంభమయ్యాయి పెద్ద పెద్ద వేపచెట్లు... తాను వుండగా నాటిన మొక్కలు.. సంతోషంగా చూసాడు వాటి వంక. ఊరిలోకి రాగానే... చిన్న, చిన్న ఇళ్ళ స్థానంలో డాబాలు లేచాయి. దాదాపు ప్రతి ఇంటిలోనూ వేపచెట్టు కనబడుతూనే వుంది.

గ్రామంలో లోపల సిమెంటు రోడ్లు - పక్కా సైడ్ కాల్వలు వచ్చాయి. బస్సు ఆఫీసు ముందు ఆగింది. పాత బిల్డింగ్ పడేసి అధునాతనంగా కొత్త ఆఫీసు నిర్మించబడి వుంది.

బస్సు దిగాడు ప్రకాశం. ఆఫీసు వైపు నడిచాడు.

బిల్డింగ్ మొదట్లోనే ఒక సిమెంట్ విగ్రహం ఉంది. పరీక్షగా చూసాడు ప్రకాశం... అవును.. అది నరసింహంగారిదే.. అయ్యో పాపం.. చనిపోయారా.. అనుకున్నాడు.

ఆఫీసు లోపలికి నడిచాడు.. ఎదురుగా వస్తున్నాడు... సుందరం.. సర్పంచ్‌గారు.

ప్రకాశాన్ని చూస్తూనే పట్టరాని ఆనందంతో గబగబా వచ్చి కౌగిలించుకుని లోపలికి తీసుకువెళ్ళారు. ఆఫీసు స్టాఫ్ అంతటికీ పరిచయం చేసారు.

నరసింహం గారికి గుండెపోటు వచ్చి చనిపోయారని చెప్పారు.

"మీరు... నరసింహం... వేసి వెళ్ళిన బీజాలు.. మొలకలెత్తి.. మహావృక్షాలై ఊడలు దిగినాయి.. రండి వూరు చూద్దాం..." అంటూ గ్రామంలోకి తీసుకువెళ్ళారు. "ఈరోజు బుధవారం కదా! సంత జరుగుతోంది.. అక్కడకు వెళ్దాం" అని అటువైపు దారితీసారు సర్పంచ్‌గారు.



## శ్రీకృష్ణ కమీషన్ నివేదికలో పంచాయితీరాజ్ సంస్థల ప్రస్తావన

గ్రామ స్థాయిలో గ్రామపంచాయితీలు ఆస్థిపన్ను, వాహనపన్ను, లైసెన్సుఫీజు, భవననిర్మాణ పన్ను, లే - అవుట్ పన్ను, స్థానిక వేలం పాటలు తదితర మార్గాల ద్వారా ఆదాయం సమకూర్చుకుంటున్నాయి. ఇది నిధుల బదలాయింపునకు ఒక చక్కటి సూచిక.

* 2007 - 08, 2008 - 09 సంవత్సరాలకు గాను అందుబాటులో ఉన్న గణాంకాలను పరిశీలిస్తే, గ్రామపంచాయితీ స్థాయిలో రాయలసీమలో తలసరి వ్యయం రూ. 268లు, కోస్తా ఆంధ్రలో రూ. 115లు, తెలంగాణ ప్రాంతంలో రూ. 66లు మాత్రమే.
* మండల పరిషత్తు స్థాయిలో రాయలసీమలో తలసరి వ్యయం రూ. 450లు, కోస్తా ఆంధ్రలో రూ. 248లు, తెలంగాణలో రూ. 292లు ఉన్నది.
* జిల్లా పరిషత్తు స్థాయిలో తలసరి వ్యయం రాయలసీమలో రూ.606, కోస్తా ఆంధ్రలో రూ. 230లు, తెలంగాణలో రూ 377లు ఉన్నది.
* తెలంగాణ ప్రాంతంలో గ్రామపంచాయితీలు అన్ని వ్యయాలకు సంబంధించి స్థానికంగానే 58 శాతం ఆదాయాన్ని సమకూర్చుకోవటం విశేషం. కోస్తాంధ్రలో ఇది 56 శాతం ఉండగా, రాయలసీమలో 33 శాతానికి పరిమితం అయ్యింది.
* 2008 - 09 సం॥ గణాంకాలను పరిశీలిస్తే, జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం అమలు కోస్తాంధ్ర ప్రాంతంలో పోలిస్తే, తెలంగాణ ప్రాంతంలో కొంచెం మెరుగ్గా ఉంది. జారీ అయిన జాబ్‌కార్డుల సంఖ్య, లభించిన కూలి ఉపాధి, వ్యయం ఇవన్నీ కూడా తెలంగాణ, రాయలసీమ ప్రాంతాలలో జనాభా వాటా కంటే ఎక్కువగా ఉన్నాయి. కోస్తాంధ్ర ప్రాంతంలో స్థానిక కమ్యూనిటీల ద్వారా గ్రామీణ ఉపాధిహామీ పథకానికి డిమాండ్ తక్కువగా ఉన్నది. ఎక్కువ పంటల కారణంగా పేదలకు కోస్తాంధ్ర ప్రాంతంలో ఎక్కువ రోజులు ఉపాధి దొరకడం ఒక కారణం కావచ్చు.
* కొన్ని గ్రామపంచాయితీలతో కూడిన మండల వ్యవస్థతో జిల్లా అధికార యంత్రాంగం ప్రజానీకానికి అందుబాటులో ఉండటం సుపరిపాలనకు దోహదం చేస్తుంది.
* మూడవ అంచె ప్రభుత్వ వ్యవస్థలకు అంటే పంచాయితీరాజ్ సంస్థలకు నిధులు, విధులను తగు రీతిలో బదలాయించిన అతి తక్కువ రాష్ట్రాలలో ఆంధ్రప్రదేశ్ ఒకటి.

**- వి.ఎస్.ఎన్.పి.**

"మీరు చేసిన ఘనకార్యాల వల్లనే ప్రతిసారీ నేను ఏకగ్రీవంగా సర్పంచ్‌గా గెలుస్తున్నాను" మధ్యలో చెప్పారు సుందరంగారు.

సంతలో దుకాణాల్లో అంతా ఆడవాళ్ళే నిర్వహిస్తూ కనబడ్డారు. వారిలో ఒక వయసు్సు మళ్ళిన మహిళ వీరి దగ్గరకు వచ్చి - "నమస్కారమయ్యా!" అంది. ప్రకాశం.. ఆమెను గుర్తుపట్టాడు. స్వయం సంఘ మహిళ.

"నువ్వు... ఈ సంతలో.." అనుమానంతో ఏదో అడగబోతూంటే - "అయ్యా! మీరు ఇక్కడి నుండి వెళ్ళిన తర్వాత, నరసింహంగారు మా చేత వస్తువులు తయారు చేయించారయ్యా. ఒక సంఘం వారితో పళ్ళపొడి, ఒక సంఘం వారితో గుడ్డలు ఉతికేపొడి, ఇంకొక సంఘం వారితో నీలిమందు... ఇలా చేయించి... ఊరు మొత్తం ఇవే కొనాలని చెప్పేసరికి, అందరూ... అలాగే అలవాటుపడిపోయారు. మాకూ దాంతో కాస్త డబ్బులు మిగిలాయి. మా సరుకులు మన గ్రామంలోనే కాక... ప్రక్క గ్రామాల్లో కూడా అమ్మకానికి తీసుకువెళ్దాం అనుకుంటే.. మీ తర్వాత వచ్చిన ఆఫీసర్ గారు - ఎందుకమ్మా.. ఇక్కడే సంతలాగా పెడితే.. వాళ్ళే వచ్చి కొనుక్కుని వెళతారని చెబితే... ప్రతి బుధవారం ఇక్కడ సంత నిర్వహిస్తున్నాం" చెప్పింది ఆమె.

"మంచిపని చేస్తున్నారమ్మా!" అని ముందుకు కదిలాడు ప్రకాశం.

కొద్దిదూరం పోగానే - విశాలమైన ఖాళీ స్థలంలో ఒకప్రక్క ఆటస్థలం - మరొక ప్రక్క పార్కు ఏర్పాటు చేసారు... ఆ స్థలం, పరిసరాలు చూసి ముగ్ధుడయ్యాడు ప్రకాశం.

గ్రామంలో తాను పనిచేసినప్పుడు వున్న కొందరు ప్రకాశాన్ని చూస్తూనే.. నమస్కరించి వెళ్ళారు.

అంతా తిరిగి ఆఫీసుకు వచ్చిన తర్వాత ప్రస్తుతం కార్యనిర్వహణాధికారిగా పనిచేస్తున్న వ్యక్తి వచ్చి -

"సార్! మీ గురించి సర్పంచ్‌గారు ఎప్పుడూ చెబుతూ వుంటారు. మీరూ.. నరసింహంగారూ, చూపిన బాటలోనే ఆయనా నడుస్తున్నారు. మీ తర్వాత వచ్చిన అధికారులందరూ... మీ పనుల వల్ల స్ఫూర్తిని పొంది గ్రామాన్ని క్రమక్రమంగా అభివృద్ధి పథంలోకి తెచ్చినవారే... నేనూ అదే పద్ధతిలో నడుస్తున్నాను. గ్రామస్థులు, సర్పంచ్‌గారి అండదండలు బాగానే వున్నాయి. నిజంగా - ఈ కుబేరపురం గ్రామంలో ఉద్యోగం చేయటం గర్వించతగిన విషయమే" అన్నాడు.

కొంతసేపటి తర్వాత ప్రకాశం అందరి దగ్గర శెలవు తీసుకుని, తిరిగి ఇంటికి బయల్దేరాడు. రాజయ్య వచ్చి బస్ ఎక్కించాడు.

"అభివృద్ధి అంటే ఉన్నదే కొద్దిగా పెరగటం అనుకుండే వాడిని.. ఇన్నాళ్ళూ?. అభివృద్ధి అంటే... అది కాదని అర్థం అయింది ఈరోజు. వృద్ధి వుండాల్సిందే.. అయితే అది మార్పుతో కూడుకుని వుండాలి. కుబేరపురంలో జరిగింది కూడా అదే...!"

గుండెల నిండా ఆనందం నింపుకుని ఇంటికి చేరాడు ప్రకాశం.

■

# ప్రణాళికల రూపకల్పనలో ప్రజల భాగస్వామ్య ప్రాధాన్యత

మన భారతదేశంలో స్వాతంత్ర్యానంతరం, పార్లమెంటరీ ప్రభుత్వవిధానం, మిశ్రమ ఆర్థిక వ్యవస్థలో పంచవర్ష ప్రణాళికల ద్వారా అభివృద్ధి సాధించాలని, మన పెద్దలు ఆనాడు భావించడం జరిగింది. దానిలో భాగంగా బలమైన కేంద్ర ప్రభుత్వం, భిన్నత్వంలో ఏకత్వాన్ని దృష్టిలో పెట్టుకొని, దేశ సమగ్రత దృష్ట్యా కేంద్రీకృత ప్రణాళికా విధానం అమలు చేయడం జరిగింది.

అప్పటి ప్రజలలో నిరక్షరాస్యత, పేదరికం, స్వేచ్ఛగా హేతుబద్ధమైన నిర్ణయాలు తీసుకొనలేని పరిస్థితులలో ఈ ప్రణాళికా విధానం తప్పనిసరి అయింది. 2వ పంచవర్ష ప్రణాళికా కాలం నుండే, విభిన్న సంస్కృతులు, కులాలు, మతాలుగా నివసిస్తున్న ప్రజల అవసరాలలో కూడా వైవిధ్యం ఉంటుంది, వాటిని తీర్చడానికి ఒకే ప్రామాణికం గల ప్రణాళికలు అందరికీ సమాన ప్రయోజనాలు ఇవ్వలేవు అనే విషయాన్ని, ఆనాటి ప్రణాళికా సంఘాలు గమనించినప్పటికీ, వికేంద్రీకరణ ప్రణాళిక ఆచరణ సాధ్యం కాలేదు.

కాని క్రమేపీ. రాష్ట్ర ప్రభుత్వాలకు కేంద్రం నుండి అధికారాల బదిలీ జరుగుతూ వచ్చింది. దానికనుగుణంగా, ప్రజలలో అక్షరాస్యత పెరిగి, కొంతవరకు పేదరికం తగ్గింది. దీనిని దృష్టిలో పెట్టుకొని కేంద్రప్రభుత్వం, కేంద్ర, రాష్ట్ర స్థాయిలలో ప్రణాళికలతో పాటు, జిల్లా స్థాయిలో ప్రణాళికలు చేసే విధంగా, ప్రాంతీయ ప్రణాళికలు తయారు చేసే విధంగా అవకాశం కల్పించింది. 9వ పంచవర్ష ప్రణాళిక కాలానికి వికేంద్రీకరణ ప్రణాళిక అమలు ఆచరణ సాధ్యం అయింది.

అయితే, కేవలం జిల్లా స్థాయి ప్రభుత్వ సిబ్బంది, జిల్లా ప్రాదేశిక స్థాయి ప్రజా ప్రతినిధులు మాత్రమే జిల్లా ప్రణాళికలో జిల్లా ప్రణాళికా సంఘం ద్వారా భాగస్వాములవగలిగారు. కాని మండల స్థాయి, గ్రామ స్థాయి ప్రజా ప్రతినిధులకు, అధికారులకు అంతగా అవగాహన లేకపోయింది. మండల, గ్రామస్థాయి సామాన్య ప్రజలకు అసలు జిల్లా స్థాయిలో, మండల స్థాయిలో ప్రణాళికలు చేయవచ్చు అనే విషయం కూడా తెలియదు.



అంతేకాకుండా, వికేంద్రీకరణ ప్రణాళికల ద్వారా ఎంతవరకు మనం అభివృద్ధిని సాధించాం అనే విషయం పరిశీలించినట్లయితే, కేంద్రప్రభుత్వం, ముఖ్యంగా గ్రామీణాభివృద్ధి కోసం పంచవర్ష ప్రణాళికల ద్వారా వ్యయాన్ని పెంచుతూ వచ్చింది. కాని ఆ వ్యయం గ్రామీణ ప్రాంతాల ప్రజలలో ఆశించినంత అభివృద్ధిని తీసుకురాలేక పోయిందని చెప్పవచ్చు.

గ్రామీణాభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వ పెట్టుబడిని ప్రణాళికల వారీగా గమనించినట్లయితే, 6వ పంచవర్ష ప్రణాళికలో గ్రామీణాభివృద్ధిపై పెట్టుబడి, మొత్తం ప్రణాళికా వ్యయంలో 2.85 శాతం ఉండగా, 7వ పంచవర్ష ప్రణాళికలో 5.01 శాతానికి, 8వ పంచవర్ష ప్రణాళికలో 7.27 శాతానికి, 11వ. పంచవర్ష ప్రణాళిలో 7.18 శాతానికి పెరుగుతూ వచ్చినప్పటికీ, ఆశించిన మేరకు గ్రామీణాభివృద్ధి జరగలేదనే చెప్పాలి.

మానవాభివృద్ధిలో కూడా మన దేశం పొరుగు దేశాలైన చైనా, శ్రీలంకలకన్నా వెనుకబడి ఉన్నది. 2009లోని మానవాభివృద్ధి నివేదికలో, ప్రపంచదేశాలలో చైనా 92వ స్థానంలో ఉండగా, శ్రీలంక 102వ స్థానంలో ఉండగా భారతదేశం 132వ స్థానంలో ఉంది. దేశాల తలసరి ఆదాయాలను గమనించి నట్లయితే, చైనా తలసరి ఆదాయం 5,383 అమెరికన్ డాలర్లు ఉండగా, శ్రీలంకలో 4,243 డాలర్లు ఉండగా, మన దేశ తలసరి ఆదాయం కేవలం 2,753 డాలర్లు మాత్రమే ఉంది. దీనిని బట్టి మన దేశం ఆశించిన మేరకు ఆర్థికాభివృద్ధిని, మానవాభివృద్ధిని, గ్రామీణాభివృద్ధిని సాధించలేదని చెప్పవచ్చు.

మన దేశంలో 1980 నుండి 2007 వరకు జాతీయాదాయంలో పెరుగుదల రేటును గమనిస్తే, సంవత్సర ఆదాయం సగటు పెరుగుదల రేటు 1.36 శాతంగా ఉండగా, చైనాలో ఇది 0.57 శాతం (HDR, 2009) మాత్రమే నమోదు అయింది. అంటే మన దేశంలో గత 30 సంవత్సరాలుగా సగటు జాతీయాదాయ పెరుగుదల రేటు ఎక్కువగా ఉన్నప్పటికీ, మానవాభివృద్ధిలో చైనా, శ్రీలంక దేశాల కన్నా వెనుక బడి ఉంది.

అంటే, మనదేశం ఆదాయాన్ని మానవాభివృద్ధి వనరుగా మార్చడంలో పొరుగు దేశాలకన్న వెనుకబడి ఉంది అనేది మనం గమనించాల్సిన విషయం. ఇలా జరగడానికి గల కారణాలను మనం పరిశీలించినట్లయితే, ఆర్థిక వ్యవస్థలో ఉన్న వ్యత్యాసాలేనని చెప్పవచ్చు. కొద్ది మంది పెట్టుబడి దారుల వలన కలిగిన ఆర్థిక వృద్ధిని,

ఎక్కువ మందిగా ఉన్న సామాన్య ప్రజానీకానికి పంపిణీ చేయటంలో ప్రభుత్వం కొంత విఫలం చెందుతుంటే, పంపిణీ జరిగిన ఆ కొద్ది వనరులను, మానవాభివృద్ధికి ఉపయోగించడంలో ప్రజలు విఫలమవుతున్నారు.

ప్రభుత్వ పంపిణీ వ్యవస్థ సత్ఫలితాలనివ్వలేక పోవడానికి కారణం, ప్రజల అవసరాలను గుర్తించడంలోను, ప్రాధాన్యత నివ్వడం లోను ప్రభుత్వ సిబ్బందికి హేతుబద్దత లేక పోవడం ఒక కారణమైతే, ప్రజలలో అవగాహన లోపం మరొక ముఖ్య కారణం. దీని వలన గ్రామీణ ప్రజలకు కేటాయించిన నిధులు, ప్రాధాన్యత గల రంగాలకు, ప్రజల అవసరాలకు అంతగా ఉపయోగపడటం లేదని చెప్పవచ్చు.

ప్రజల ఆరోగ్యంపై భారత ప్రభుత్వం పెడుతున్న ఖర్చు, మొత్తం ప్రభుత్వ ఖర్చులో 3.4 శాతంగా ఉంటే, చైనాలో 9.9 శాతం, శ్రీలంకలో 8.3 శాతంగా ఉంది. విద్యారంగంపై కూడా మన ప్రభుత్వ రంగం ఖర్చు వాటా, ఈ రెండు దేశాలతో పోల్చినపుడు తక్కువగా ఉంది. దీనివలన మన దేశ మానవాభివృద్ధి సూచిక తక్కువగా ఉన్నది అని చెప్పవచ్చు. ఈ క్రమంలో మనం కేవలం ప్రభుత్వాన్ని మాత్రమే నిందించలేము. ఎందుకంటే మనది ప్రజల చేత నిర్మించబడిన సంక్షేమ ప్రభుత్వం. కాబట్టి, దీనిలో ప్రజల పాత్ర కూడా ఉంది.

ప్రజల సంక్షేమం కోసం కేంద్రప్రభుత్వం దాదాపు 220 పైన అభివృద్ధి కార్యక్రమాలు, పథకాలు అమలు చేస్తుంది. ఈ పథకాలకు కావలసిన నిధులు ఆర్థికవృద్ధి లేదా ఆదాయ పెరుగుదల నుండి మాత్రమే వస్తాయి. మన దేశంతో ఉన్న కొద్ది మంది పెట్టుబడి దారీ వర్గం ఒక స్పష్టమైన అవగాహనతో, జాతీయదాయ వృద్ధి రేటును పెంచే హామీతో, ప్రభుత్వ సహాయం (వనరులు) కోసం, ప్రణాళికల రూపకల్పనలో భాగస్వాములవడం వల్ల, అదే సమయంలో ఆర్థిక వృద్ధి రేటును ఆకాంక్షించే ప్రభుత్వం వారి అవసరాలకు ప్రాధాన్యత నివ్వవలసిన అవసరం ఏర్పడింది.

ఈ క్రమంలో ప్రభుత్వరంగం నుండి నిధులు, వనరులు పెద్ద ఎత్తున పెట్టుబడి దారీ వర్గానికి బదిలీ అవుతున్నాయి. కొద్దిమంది ప్రజాప్రతినిధులు కూడా ఈ వర్గంలో ఉండటం వల్ల బదిలీ ఇంకా సులువు అయింది. అటువంటి పరిస్థితులలో ప్రభుత్వం అంతకన్న భిన్నంగా ఆలోచించ లేకపోవచ్చు. మరి ఈ సమస్య ఎలా పరిష్కారమవుతుంది.

ఇప్పుడున్న ప్రధాన సమస్య ఆర్థికవృద్ధి మాత్రమే కాదు, ఆర్థికవృద్ధి ద్వారా సమకూరిన వనరుల ద్వారా మానవాభివృద్ధిని సాధించడం, అని అనుకుంటే ఆర్థిక కార్యకలాపాల అంతిమ లక్ష్యం ఆదాయం మాత్రమే కాదు. ఆ ఆదాయాన్ని ఉపయోగించి, ప్రజల శక్తి సామర్థ్యాలను, నిర్ణయాత్మకతను, శ్రేయస్సును పెంపొందించటమే ఆర్థిక కార్యకలాపాల అంతిమ లక్ష్యంగా మన కార్యకలాపాల దిశ మార్చాల్సి ఉంది.

దీనిని పూర్తిగా అర్థం చేసుకోవాలంటే, ప్రొ. అమర్త్యసేన్ (ప్రముఖ ఆర్థికవేత్త, నోబుల్ పురస్కార విజేత) చెప్పినటువంటి "శక్తి, సామర్థ్యాల పెంపు పద్ధతి"(Capabilities Approach) ని మనం అర్థం చేసుకుంటే, మన దేశమే కాకుండా, మిగతా అభివృద్ధి చెందుతున్న దేశాలు కూడా




ఈ సమస్య నుండి కొంతవరకు బయటపడవచ్చు.

ప్రొ.సేన్ సిద్ధాంతం ద్వారా ఈ సమస్యకు సంబంధించి రెండు అంశాలు అధ్యయనం చేయవచ్చు,1. ఆర్థిక వృద్ధి అనేది ఆర్థిక కార్యకలాపాల మాధ్యమికం లేదా సాధనమే కాని అంతిమ లక్ష్యం మాత్రం కాదు. 2. స్థానిక ప్రజలలోని శక్తి సామర్థ్యాలు గుర్తించి, కుల,మత, భాష, లింగ, జాతి పరంగా ప్రత్యేక లక్షణాలు, సామర్థ్యాలను గుర్తించి, వారి వారి అవసరాలను గ్రూపులుగా నెరవేర్చుకొంటూ స్వేచ్ఛగా జీవించే విధానం ద్వారా, వారి సామర్థ్యాలు పెంపొందించడం ద్వారా ప్రజాశ్రేయస్సు, మానవాభివృద్ధి జరుగుతాయి. ఇది ప్రణాళికల ద్వారా ఎలా సాధ్యమవుతుందో చూడాలి.

ప్రణాళికల ద్వారా ఎక్కువ శాతంగా ఉన్న ప్రజల అవసరాలు, ఆకాంక్షలు గుర్తించలేక పోవటం వల్ల మన దేశంలో మానవాభివృద్ధి అంతగా జరగలేదని చెప్పవచ్చు. దీనికి కారణం ప్రణాళికల రూపకల్పనలో ప్రజలు భాగస్వాములుగా కాకపోవడం. విభిన్న జాతులు, కులాలు, మతాలు, వర్గాల ప్రజల అవసరాలు వేరుగా ఉండవచ్చు. కాబట్టి ప్రజలందరూ, వారి వారి వ్యక్తిగత, సమూహాల అవసరాలు గుర్తించి, ప్రణాళికా నిర్మాణంలో భాగస్వాములవ్వాలి.

గ్రామ స్థాయిలో, ఆవాస స్థాయిలో గ్రామసభల ద్వారా ఆవాస/వార్డు సభల ద్వారా వివిధ రకాలైన ఉప- ప్రణాళికలను, గ్రామ పంచాయితీ స్థాయిలో, మండల స్థాయిలో, అనేక రంగాల ఉప - ప్రణాళికలను రూపొందించి, వాటన్నిటిని సమీకృతం చేయటం ద్వారా, సమాజంలో ఎక్కువ శాతంగా ఉన్న సామాన్య ప్రజల అవసరాలు, ఆకాంక్షలు ప్రణాళికలలో చోటు చేసుకుంటాయి. వనరుల కేటాయింపు, వినియోగం హేతుబద్ధంగా జరిగి, వాటి ఫలితాలు న్యాయబద్ధంగా పంపిణీ చేయటం వలన ప్రజల అవసరాలు తీరుతాయి. వారి సామర్థ్యాలు పెంపొంది, మానవశ్రేయస్సు, మానవాభివృద్ధి చోటు చేసుకుంటాయి. ఈ ప్రక్రియ మొత్తాన్ని మనం "ప్రజల భాగస్వామ్య, సమీకృత ప్రణాళికల" ద్వారా గ్రామీణాభివృద్ధి లేదా మానవాభివృద్ధి అనవచ్చు.

దీని సారాంశం ఏమంటే, ప్రజలు ప్రణాళికల రూపకల్పనలో భాగస్వాములైనప్పుడు మాత్రమే, వారి అవసరాలు గుర్తించబడి, నెరవేర్చబడి మానవాభివృద్ధి జరుగుతుందని అర్థం చేసుకోవచ్చు.

అయితే, మరొక ప్రధానమైన సమస్య ఏమంటే, ఇప్పుడున్న ప్రైవేటీకరణ, సరళీరణ, ప్రపంచీకరణ వంటి సిద్ధాంతాలతో వ్యక్తిగత ప్రయోజనాలు లేక ఆదాయాలే లక్ష్యంగా బ్రతడానికి ప్రజలు అలవాటు పడ్డ ప్రస్తుత పరిస్థితులలో, సమిష్టి ప్రయోజనం కోసం భాగస్వాములుగా వ్యవహరించడం కొంచెం కష్టసాధ్యమైన విషయమే. దీనికి సంస్థాగతమైన, చట్టపరమైన మార్పు లేదా వెసులుబాటును ప్రజలకు కల్పించడం ద్వారా ఈ విధానాన్ని అమలు పర్చుకొనే విధంగా ప్రజలలో ఒక సానుకూల వాతావరణం ఏర్పడుతుంది.

ఈ క్రమంలోనే భారతకేంద్ర ప్రభుత్వం 73 మరియు 74వ రాజ్యాంగ సవరణల ద్వారా పంచాయితీరాజ్ వ్యవస్థలోని గ్రామపంచాయితీ, దానికి పునాది అయిన గ్రామ - సభ వ్యవస్థలను పటిష్టపరిచి, కొన్ని అధికారాలు, విధులు గ్రామ - పంచాయితీలకు బదిలీ చేయడం జరిగింది.

గ్రామ ప్రజలే, గ్రామస్థాయిలో వారి అవసరాలు, వనరులను గుర్తించి, వారే ప్రణాళికలు రూపొందించుకొనే అవకాశం, కొన్ని ప్రధానమైన రంగాలలో అనగా విద్య, వైద్యం, శిశు - మహిళా సంక్షేమం, షెడ్యూల్డు కులాలు, తెగలు, వెనుకబడిన వర్గాల అవసరాలను స్థానికంగా గుర్తించి, ప్రాధాన్యత ఇవ్వటం ద్వారా, వారి భాగస్వామ్యం ద్వారా త్వరితగతిన అభివృద్ధి సాధించవచ్చు అనేది ప్రధానమైన అంశం.

దీనిలో భాగంగా 11వ కేంద్ర పంచవర్ష ప్రణాళికా సంఘం 'సమ్మిళితవృద్ధి' (Incluslive Growth) అనే అంశానికి ప్రాధాన్యత నిచ్చింది. అనగా, దేశంలోని అన్ని జాతుల, కులాల, మతాలు, వర్గాలు లేదా సమూహాల ప్రజలందరూ సమిష్టిగా వారి వారి అవసరాల నిమిత్తం, కృషి చేయుటం ద్వారా త్వరితగతిన ప్రజాశ్రేయస్సు, మానవాభివృద్ధి, సమానత్వం కూడిన ఆర్థికాభివృద్ధి సాధించగలమనే భావనగా మనం అర్థం చేసుకొనవచ్చు.

ఇక ప్రజల భాగస్వామ్యం ఎలా? ఏ విధంగా ఉండాలి అనే విషయాన్ని పరిశీలిస్తే, ఇది ముఖ్యంగా మూడు అంశాలపై ఆధారపడి ఉంది. 1. భాగస్వామ్య తీరు లేదా రీతి, 2. ప్రజలు భాగస్వాములు కాగల పద్ధతి 3. స్థానిక సామాజిక, పరిపాలనా విధానం. ఈ మూడు అంశాలు ప్రజల భాగస్వామ్య పరిధిని, స్వభావాన్ని నిర్ణయిస్తాయి.

ప్రజల భాగస్వామ్యం ఎంతో సమర్థవంతంగా, నిష్పక్షపాతంగా, బాధ్యతగా ఉంటే, ఫలితాలు అంత ఎక్కువగా మంచిగా వస్తాయి. దీని కోసం కొన్ని సూత్రాలను భాగస్వాములు లేదా కార్యకర్తలు లేదా సభ్యులు పాటించవచ్చు. ఎగ్గర్ మరియు మేజర్స్ (1998) గుర్తించిన కొన్ని మౌలిక సూత్రాలు:




**సమ్మిళితం :** జరగబోయే కార్యక్రమం ద్వారా ప్రభావితులు కాబోయే సభ్యులు అందరూ వ్యక్తులుగా లేదా గ్రూపులుగా వారి నిర్ణయాకరణ అందర్నీ కలుపుకుని చేయవలసి ఉంటుంది.

**సమాన భాగస్వామ్యం :** ప్రతి ఒక్కరికి వ్యక్తిగత సామర్థ్యం, చొరవ గుర్తించినప్పటికీ, అందరికి సమానమైన గుర్తింపును లేదా ప్రాధాన్యతను ఇవ్వవలసి ఉంటుంది.

**పారదర్శకత :** సభ్యులందరూ ఎటువంటి దాపరికం లేకుండా, స్వచ్ఛందంగా, స్వేచ్ఛగా వారి అభిప్రాయాలు, క్రియలు పంచుకోవాలి.

**అధికారం పంచుకోవడం :** అందరి సభ్యుల మధ్య సమంగా అధికారం పంచాలి.

**బాధ్యతని పంచుకోవడం :** అదే విధంగా నిర్ణయాకరణలో సభ్యులందరూ సమానమైన బాధ్యత కలిగి ఉండాలి.

**సామర్థ్యాన్ని పెంచడం :** ప్రత్యేక కళలు, సామర్థ్యం ఉన్న వారిని ప్రోత్సహిస్తూనే, మిగిలిన వారిలో కూడా అవి పెంపొందించడానికి, సమాన అవకాశాలిస్తూ నిర్ణయాకరణలో భాగస్వాములు చేయాలి.

**సహాయ - సహకారాలు :** సభ్యులందరూ, ప్రతిఒక్కరు, ఒకరికి మరొకరు సహాయ, సహకారాలు అందించుకోవాలి. ఉన్న బలాన్ని పెంపొందించుకుంటూ, బలహీనతలను తగ్గించుకోవాలి.

భాగస్వామ్య విధానాన్ని రెండు తరగతులుగా విభజింపవచ్చు.

**1. కార్యరూప దార్శనిక భాగస్వామ్యం :** భాగస్వామ్య సభ్యులందరూ, నిర్ణయించిన కార్యక్రమాన్ని సమర్థవంతంగా వారి అవసరాల నిమిత్తం పూర్తి చేయగలగడం.

**2. హక్కు పూరిత దార్శనిక భాగస్వామ్యం :** బలహీన లేదా వెనుకబడినన వర్గాల, కులాలు లేదా సమూహాలకు, ప్రజాస్వామ్య బద్ధంగా సమాన అవకాశాలను అందించే నిమిత్తం భాగస్వామ్య సభ్యులు కార్యక్రమాలను వారి వారి అవసరాల నిమిత్తం నిర్వహించడం.

ఈ విధమైన ప్రజా భాగస్వామ్య పద్ధతి ద్వారా సమీకృత గ్రామ, మండల స్థాయి ప్రణాళికలు ప్రజలు రూపొందించుకొని, అమలు చేసుకోవటం ద్వారా, వారి ముఖ్యమైన లేదా ప్రధానమైన అవసరాలు తీరి, ప్రజాశ్రేయస్సును, మానవాభివృద్ధిని సాధించవచ్చు. మానవాభివృద్ధి, గ్రామీణాభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం ప్రధాన భూమిక పోషించవచ్చు.

*- డా॥ బి.నాగేశ్వరరావు*, సి.డి.పి.ఎ,
రీసెర్చి అసోసియేట్, అపార్డ్

# సర్పంచ్‌లు, వార్డు సభ్యులు, ఎం.పి.టి.సి లకు

# 'శిక్షణా మహోత్సవ్'



**ఏ పని చేయాలన్నా ఆ పని గూర్చి అవగాహన, ఆ పనిపై విజయం సాధించాలనే సంకల్పం, అందుకు అవసరమైన శిక్షణ, ప్రణాళికా బద్ధత ఉంటే ఆ కార్యక్రమాన్ని విజయవంతంగా చేయగలం. ప్రభుత్వ ఉద్యోగులు కాని, వృత్తి కళాకారులు గాని, ప్రతి ఒక్కరు తమ వృత్తికి అవసరమైన అర్హతలు శిక్షణ కలిగి ఉండటం అవసరం.**

ప్రజాస్వామ్యంలో ప్రజాప్రతినిధులకు కూడా తమ తమ బాధ్యతలపై సరైన అవగాహన, శిక్షణ కల్పించవలసిన అవసరం ఎంతైనా ఉన్నది.

పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులకు ఏ.ఎం.ఆర్. అపార్డ్ ద్వారా శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తోంది. రాష్ట్రంలోని స్థానిక సంస్థలకు ఎన్నికయిన దాదాపు 2.6 లక్షలకు పైబడిన ప్రజా ప్రతినిధులకు శిక్షణ ఇచ్చే ఈ బృహత్కార్యాన్ని విజయవంతంగా నిర్వహించిన 'అపార్డ్' సంస్థ అభినందంచదగినది. అనేక వర్గాల ప్రజా ప్రతినిధుల మన్ననలు పొందుతున్నది.

స్థానిక సంస్థలకు ఎన్నికైన ప్రజాప్రతినిధులు నాలుగు సంవత్సరాల ఆరు నెలల పదవీ కాలం పూర్తి చేసి ఎంతో పాలనానుభవం పొందారు. కొందరు తాము విజయవంతమైన పాలనతో గ్రామాభివృద్ధికి తోడ్పడ్డామని, మరికొందరు తాము తమ గ్రామానికి ఆశించినంత అభివృద్ధి సాధించలేక పోయామని తలచు కోవడం సహజం. ఇలాంటి సమయంలో అపార్డ్ సంస్థ గ్రామస్థాయి ప్రజాప్రతినిధులకు ఓ శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేయబోతున్నది. 21,807 గ్రామ పంచాయితీలున్న మన రాష్ట్రంలో గంగదేవిపల్లి, జేగురుపాడు, అంకాపూర్, ప్రగతినగర్, పాండురంగాపురం, దామలమడుగు లాంటి కొద్ది 'ఆదర్శగ్రామాలు' మాత్రవే చెప్పుకోదగినంత అభివృద్ధి సాధించాయని ఇటీవల అపార్డ్‌లో నిర్వహించిన జిల్లా ట్రైనింగ్ మేనేజర్ల సమావేశంలో అపార్డ్ కమీషనర్ శ్రీ కె. చంద్రమౌళి పేర్కొన్నారు.

గ్రామ ప్రజలలో ఐకమత్యం, గ్రామ అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం, ప్రజాప్రతినిధులలో నిబద్ధత, నిస్వార్ధత, గ్రామ సభల నిర్వహణ, వనరుల సమీకరణ, ప్రణాళికా బద్ధమైన చర్యలు, అక్షరాస్యత ఆయా గ్రామాల అభివృద్ధికి ముఖ్య కారణాలని, అన్ని గ్రామాలలో అలాంటి పరిస్థితులు కల్పించడం ద్వారా అభివృద్ధి సాధించవచ్చని అభిప్రాయ పడ్డారు. అందుకు ముఖ్యంగా ప్రజాప్రతినిధులలో చక్కని నాయకత్వ లక్షణాలు పెంపొందించ వలసిన అవసరాన్ని గుర్తించారు. ఇందుకై మార్చి 12 -13 తేదీలలో రెండు రోజుల పాటు గ్రామ స్థాయి ప్రజాప్రతినిధులకు, అంటే ఎం.పి.టి.సి, సర్పంచ్, వార్డు సభ్యులకు శిక్షణ నిర్వహించడానికి కార్యాచరణ రూపు దాల్చనున్నది.

రాష్ట్ర వ్యాప్తంగా ఒకేసారి దాదాపు 2 లక్షల 60 వేలకు పైబడిన స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వడం మరే దేశంలో ఇతర రాష్ట్రంలోను జరగలేదు. ప్రభుత్వ అధికారుల అండదండలతో, సంపూర్తిగా ప్రజాప్రతినిధులు, సర్పంచ్‌ల ఆధ్వర్యంలోనే రాబోయే కాలంలో శిక్షణలు జరుగనున్నాయి.

ప్రతి మండలంలోను 4 లేక 5 గ్రామాలతో ఒక గ్రూపు (క్లష్టరు) ను ఏర్పాటు చేసి, ఆ గ్రూపునకు అనువైన చోట శిక్షణా కేంద్రం ఏర్పరచి, ఆ గ్రామాల ఎం.పి.టి.సి, సర్పంచ్, వార్డు మెంబర్లు 2 రోజుల పాటు శిక్షణతో బాటు తమ అనుభవాలను పంచుకుంటూ, ఆటపాటల ద్వారా పారిశుద్ధ్యం ప్రాధాన్యత, నాయకత్వం మెళకువలు, త్రాగునీటి లభ్యత, ప్రాథమిక ఆరోగ్యం, ఎయిడ్స్ వ్యాధి, ఇతర అంటు రోగాలపై అవగాహన పెంపొందించుకొంటారు.

తద్వారా తమ గ్రామాల అభివృద్ధిపై దృష్టి నిల్పి ఆదర్శ గ్రామాలుగా రూపొందిస్తారని ఆశించవచ్చు. అంతేగాక, త్వరలో అపార్డ్ ఆధ్వర్యంలో 'కీ క్యాప్' కార్యక్రమం పేరిట ప్రయోగ శాల నుండి క్షేత్ర స్థాయికి (ల్యాబ్ టు ల్యాండ్ ఇన్‌షియేటివ్) పరిశోధన ఫలితాలను తీసుకువెళ్ళి గ్రామాలలో త్వరితగతిన సామాజికాభివృద్ధి సాధించడానికి చర్యలు ప్రారంభం కానున్నాయి.

అపార్డ్ చేపడుతున్న రెండురోజుల 'శిక్షణా మహోత్సవ్' లో రాష్ట్రంలోని ఎం.పి.టి.సిలు, సర్పంచ్‌లు, వార్డు సభ్యులు వందశాతం పాల్గొని విజయం చేకూర్చడంతో బాటు శిక్షణానుభవాలను చిరస్మరణీయం చేసుకోవాలని ఆశిస్తున్నాం.

**- పి. సిద్ధయ్యనాయుడు**

సీనియర్ డిస్ట్రిక్ట్ ట్రైనింగ్ మేనేజర్, జిల్లా పరిషత్ ట్రైనింగ్ సెల్, కృష్ణాజిల్లా.

# రాష్ట్రంలో ఐదేళ్ళు పూర్తి చేసుకున్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం

గ్రామీణ కుటుంబాలకు ఏడాదిలో కనీసం 100 రోజుల వేతనంతో కూడిన ఉపాధిని మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం ఒక హక్కుగా కల్పించింది. ఈ చట్టం స్ఫూర్తితో మన రాష్ట్రంలో 2006 ఫిబ్రవరి 2న అనంతపురం బండ్లపల్లిలో భారత ప్రధాని డా. మన్మోహన్‌సింగ్, యు.పి.ఏ ఛైర్‌పర్సన్ శ్రీమతి సోనియాగాంధీ ప్రారంభించిన మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం రాష్ట్రంలో విజయవంతంగా 5 సంవత్సరాలను పూర్తి చేసుకొంది. గత ఐదు సంవత్సరాలలో సాధించిన ప్రగతిని ఒకసారి సమీక్షించుకుంటే, గ్రామీణ ప్రాంతాల ప్రజల జీవన ముఖ చిత్రంలో ఈ కార్యక్రమం ఒక గొప్ప మార్పుని తీసుకొని వచ్చిందని నిస్సందేహంగా చెప్పవచ్చు. గత 5 సంవత్సరాలలో ఈ కార్యక్రమం క్రింద జరిగిన ప్రగతిని ఆవిష్కరించటానికే ఈ సమాచారం.

### గత 5 సంవత్సరాలలో సాధించిన ప్రగతి

| | | |
|---|---|---|
| ఉపాధి పొందిన కుటుంబాల సంఖ్య | - | 88.2 లక్షలు |
| ఉపాధి పొందిన వ్యక్తుల సంఖ్య | - | 172.1 లక్షలు |
| ఉపాధి కల్పించబడిన దినాలు | - | 120.4 కోట్లు |
| శ్రామికుని సగటు వేతనం | - | 89.3 రూపాయలు |
| 100 రోజులు పని పూర్తిచేసిన కుటుంబాల సంఖ్య | - | 32.1 లక్షలు |

### కల్పించిన ఆస్తులు

- రూ. 3082.2 కోట్లతో 18,131 చిన్న తరహా నీటి చెరువుల పునరుద్ధరణ.
- గ్రామీణ రహదారుల అనుసంధానం కోసం రూ. 1129.3 కోట్లు వెచ్చించి 13,449 కి.మీ. రహదారుల నిర్మాణం.
- రూ. 1360.1 కోట్లతో షెడ్యూల్డు కులాలు, తెగల ప్రజల భూముల అభివృద్ధి.
- రూ.416.4 కోట్ల వ్యయంతో 5.2 లక్షల ఎకరాలలో ఉద్యానవన పంటల అభివృద్ధి.
- రూ.589.7 కోట్ల వ్యయంతో 2.49 లక్షల నీటి సంరక్షణ కట్టడాల నిర్మాణం.

## కొత్త సదుపాయాలు

### షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డు తెగలకు చెందిన ప్రజల భూముల అభివృద్ధి

ఈ వర్గాలకు చెందిన 10.7 లక్షల మంది రైతులకు 26.4 లక్షల ఎకరాల భూమిని అభివృద్ధి పరచటానికి రూ. 7136 కోట్లతో సమగ్ర ప్రణాళిక అమలు.

### మహాత్మా గాంధీ వన పెంపకం

రూ.274 కోట్ల వ్యయంతో రాబోయే మూడు సంవత్సరాల కాలంలో 100 కోట్ల మొక్కల పెంపకం.

### శ్రమశక్తి సంఘాలు

పథక నిర్వహణలో, పారదర్శకత పెంపొందించటానికి చట్ట ప్రకారం సంక్రమించిన హక్కులను వినియోగించుకోవటానికి శ్రామికులను శ్రమశక్తి సంఘాలుగా ఏర్పాటు చేయటం. ఇప్పటివరకూ 4.75 లక్షల శ్రమశక్తి సంఘాలలో 83.8 లక్షల శ్రామికులను సమీకరించటం జరిగింది.

### మహాత్మా గాంధీ భూగర్భజలాల పెంపుదల ప్రాజెక్టు

భూగర్భజలాల తరుగుదలను నివారించటానికి, భూగర్భ జలాలను సుస్థిర ప్రాతిపదికన వినియోగించుకోవటానికి, భూగర్భజలాలు అడుగంటిన 396 ఓవర్ ఎక్స్‌ప్లాయిటెడ్, క్రిటికల్ బేసిన్‌లలో రూ 210 కోట్లతో ప్రత్యేక పథకాల అమలు. దీని వల్ల 18 జిల్లాలలోని 3449 గ్రామాలు లబ్ధిపొందనున్నాయి.

### రాగాస్ సాఫ్ట్ వేర్

క్షేత్ర స్థాయిలో 1098 మండలాల్లో పథకం సక్రమంగా అమలు చేయటానికి, జిల్లా, రాష్ట్ర స్థాయి నుండి నిరంతర పర్యవేక్షణ చేయటానికి ఉభయ తారకంగా ఉండే ఒక ప్రత్యేకమైన రాగాస్ సాఫ్ట్‌వేర్‌ను టి.సి.ఎస్ సంస్థతో కలిసి రూపొందించటం జరిగింది. ఈ రాగాస్ వల్ల

- మండలంలో జరిగే అన్ని లావాదేవీలు కంప్యూటర్ సిస్టమ్ ద్వారానే జరుగుతాయి.
- పనులకు సంబంధించిన ప్రతిపాదనలు, అంచనాల రూపకల్పన కంప్యూటర్ సహాయంతోనే జరుగుతాయి.
- సిబ్బంది పనిభారం తగ్గించటానికి, నివేదికల రూపకల్పన కూడా కంప్యూటర్ల ద్వారానే లభించే విధంగా సాఫ్ట్‌వేర్ రూపకల్పన.
- మస్టరు నిర్వహణకు ఎలక్ట్రానిక్ మస్టరు మెజర్‌మెంట్ సిస్టమ్.
- ఒక క్రమపద్ధతిలో నిర్ణీత సమయానికి వేతన చెల్లింపుల కాలచక్రం.
- ఎలక్ట్రానిక్ ఫండ్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ ద్వారా శ్రామికుల వ్యక్తిగత ఖాతాలలోకే నేరుగా చెల్లింపులు.

- బయోమెట్రిక్ పద్ధతిలో, స్మార్ట్‌కార్డ్‌ల ద్వారా చెల్లింపులు.
- పూర్తి వివరాలతో కూడిన పే - స్లిప్‌లు స్థానిక భాషలోనే అందించటం. (ఎంత వేతనం అందుతుంది, ఎన్ని దినాలు పనిచేసారు).
- ఉపాధి హామీ కమిటీల సమస్యలు తీర్చటానికి 24 x 7 కాల్ సెంటర్.
- ఉపాధి హామీ పనుల ఆడిట్‌ను చేయటానికి ప్రత్యేకంగా సోషల్ ఆడిట్ సొసైటీ (సాత్)
- పనుల నాణ్యతను పరిశీలించటానికి నాణ్యతా ప్రమాణాల తనిఖీ బృందాలు. ఫ్లైయింగ్ స్క్వాడ్‌లు.

**ఎం.జి.ఎన్.ఆర్.ఇ.జి.ఎస్. వెబ్‌సైట్‌కు అవార్డులెన్నో ...**

పథక నిర్వహణలో, పర్యవేక్షణలో అధికార యంత్రాంగానికి వెసులుబాటు కల్పించటానికి, నిర్ణయాకరణకు సహకరించటానికి, ప్రజలకు సమాచారాన్ని పారదర్శకంగా అందచేయటానికిగాను టి.సి.ఎస్. సహకారంతో రూపొందించిన రాష్ట్ర ఎన్.ఆర్.ఇ.జి.ఎస్. వైబ్‌సైట్‌కు ప్రపంచ వ్యాప్తంగా మంచి గుర్తింపు వచ్చింది.

2006 సంవత్సరంలో ఈ - పరిపాలన ఎక్స్‌లెన్సు పురస్కారం, ఉత్తమమైన సమాచారం లభ్యపర్చినందుకు 2007 సంవత్సరంలో మంథన్ అవార్డు, 2007-08లో జాతీయ స్థాయిలో ఉత్తమ ఈ - గవర్నెన్సు అవార్డు, 2008లో స్టాక్‌హోమ్ ఛాలెంజ్ అవార్డు ప్రదానం సందర్భంగా ప్రత్యేక ప్రస్తావన, 2007లో జి.కె.పి. స్టాక్ హోమ్ అవార్డుల పోటీలలో జాబితాలో చోటు, 2007లో థాయ్‌లాండ్ ఇ-ప్రభుత్వ అవార్డుల పోటీలో రన్నర్‌గా విజయం, 2011లో నాస్‌కామ్ ద్వారా సామాజిక నవకల్పనా అవార్డులు దక్కాయి. పారదర్శకమైన, జవాబుదారీ తనంతో కూడిన సేవలు ఈ వెబ్‌సైట్ ద్వారా అందించటానికి గ్రామీణాభివృద్ధి శాఖ చేస్తున్న కృషి అభినందనీయం. ■

# జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో 'అప్నా'

**సం**ఘటిత రంగంలో పనిచేసే శ్రామికులు, ఉద్యోగస్తులు, ఉపాధ్యాయులు, వ్యాపారస్తులు సంఘాలుగా ఏర్పడి ప్రభుత్వంపై ఒత్తిడి తేవటం ద్వారా తమ హక్కుల సాధనకు చక్కటి వేదికలు ఏర్పర్చుకొని తమ జీవితాలను మెరుగుపర్చుకుంటున్న విషయం మనందరికీ తెల్సినదే. ఐతే, మరొక ప్రక్క అసంఘటిత రంగంలో పనిచేసే శ్రామికులు కనీస వేతనాలు కూడా లేకుండా స్వార్థ పరుల చేతుల్లో చిక్కి దుర్భరమైన జీవితాలు గడుపుతుండటం కడు శోచనీయం.

గ్రామీణ ప్రజలకు సంవత్సరంలో కనీసం 100 రోజుల వేతనంతో కూడిన ఉపాధిని నైపుణ్యం లేని పని కల్పించటం ద్వారా వారి జీవనోపాధులకు భద్రత కల్పించటమే ప్రధాన లక్ష్యంగా అమలు జరుగుతున్న మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అసంఘటిత రంగంలో ఉన్న శ్రామికులకు ఒక గొప్ప వరం అని చెప్పవచ్చు.

2006 సంవత్సరంలో ప్రవేశపెట్టిన ఈ పథకం వల్ల గ్రామీణ ప్రాంతాలలో ఉన్న శ్రామికులకు ఉన్న ఊరిలోనే ఉపాధి లభించటంతో పట్టణ ప్రాంతాలకు వలసలు తగ్గి, గ్రామీణుల జీవనాలు ఇప్పుడిప్పుడే మెరుగుపడుతున్నాయి.

పనిని ఒక హక్కుగా పొందటంతో నేడు ఎన్నో గ్రామీణ కుటుంబాలతో జీవన ప్రమాణాలు మెరుగు అవుతున్నాయి. కనీస వేతనాలలో పెరుగుదల, ఆడ - మగ తారతమ్యం లేకుండా సమాన వేతనాలు లభించటం వంటివి ప్రస్ఫుటంగా కన్పిస్తున్నాయి.

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలుకు అవసరమైన నిధుల విడుదలకు ఎటువంటి ఇబ్బంది లేక పోయినప్పటికీ, పథక



నిర్వహణలోని కొద్ది పాటి లోపాల వల్ల ఆశించిన ఫలితాలు అందటం లేదు. చట్టంలోని నిబంధనల పట్ల శ్రామికులకు అవగాహన లేకపోవటం వల్ల, వారు తమ హక్కులను వినియోగించుకోలేక పోతున్నారు. అందుకే రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాలలో ఉపాధి హామీ పథకం క్రింద నమోదైన శ్రామికులను సంఘటితపర్చటం ద్వారా వారి హక్కులను వారు తెలుసుకొనేలా చేయటానికి నడుంబిగించింది. శ్రామికులను చిన్న చిన్న శ్రమ శక్తి సంఘాలుగా ఏర్పరచి వారిని బలోపేతం చేయటానికి ప్రభుత్వం సంకల్పించింది.

శ్రామికులను శ్రమశక్తి సంఘాలుగా ఏర్పరచే బాధ్యతను నిర్వర్తించటానికి ప్రభుత్వేతర సంస్థల సేవలను వినియోగించుకోవటానికి కూడా ప్రభుత్వం చర్యలు తీసుకొని 2010 సంవత్సరం చివరినాటికి సుమారు 330 సంస్థలను గుర్తించి 22 జిల్లాల్లోని 703 మండలాలలో 4.73 లక్షల సంఘాలను ఏర్పర్చటం

## 'అప్నా' సహకారంతో శ్రమశక్తి సంఘాలు సాధించవలసిన లక్ష్యాలు

**మొదటి దశ** : అవినీతి రహిత పథకంగా ఉపాధి హామీ పథకం అమలు అయ్యేటట్లు చూసుకోవటం.

**రెండవ దశ** : చట్టం కల్పించిన హక్కులు సాధించుకోవటం.

**మూడవ దశ** : నాణ్యత కలిగిన పనులు చేయటం, తద్వారా సుస్థిర ఆస్థులు ఏర్పాటు చేసుకోవటం.

**నాల్గవ దశ** : చట్టం కల్పించిన హక్కులు, సౌకర్యాలపై సభ్యులు అందరూ అవగాహన కలిగి ఉండటం.

**ఐదవ దశ** : సమావేశాలు ఏర్పాటు చేసుకుంటూ, సంఘటిత నిధిని ఏర్పాటు చేసుకోవటం.

జరిగింది. ఈ ఎన్.జి.ఓ.ల సమాఖ్యను 'అప్నా' సమాఖ్యగా వ్యవహరిస్తున్నారు.

ఈ 'అప్నా' సభ్య ఎన్.జి.ఓలు ప్రధానంగా క్షేత్ర స్థాయిలో శ్రామికులను శ్రమశక్తి సంఘాలుగా ఏర్పరిచే కార్యక్రమంలో భాగస్వామ్యులు కావటంతో పాటు, పథక సక్రమ నిర్వహణకు ప్రభుత్వానికి చేదోడు వాదోడుగా ఉంటాయి. శ్రమశక్తి సంఘాలను చైతన్య పర్చి, వారి హక్కుల సాధనకు స్థానిక అధికారులు పనులను అమలు పరిచే ఇతర ఏజెన్సీలను డిమాండ్ చేసి పనిని హక్కుగా పొందేలా వీరిని సంఘటిత పర్చటంలో గ్రామీణాభివృద్ధి శాఖ యంత్రాంగానికి తోడ్పడుతాయి.

### 'అప్నా' ద్వారా జరిగిన కార్యక్రమాలు

శ్రమ శక్తి సంఘాల ఏర్పాటు పద్ధతులు పనుల ప్రణాళికకు సంబంధించి 'అప్నా' సంస్థ సభ్యులకు దాదాపు 400 మందికి శిక్షణలు నిర్వహించటం జరిగింది.

సెర్ప్, ల్యాండ్ సెల్ విభాగం వారి ద్వారా 300 మందికి, మండలానికి ఇద్దరు కో - ఆర్డినేటర్లకు మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల సంస్థలో యస్.సి, యస్.టి. నిరుపేదల భూములలో ల్యాండ్ ఇన్వెంటరీ సర్వే చేసే విధానంపై 5 రోజుల శిక్షణ ఇవ్వటం జరిగింది.

ఎన్.ఆర్.ఇ.జి.ఎ. అంశానికి సంబంధించి ఎప్పటికప్పుడు వస్తున్న ప్రభుత్వ ఉత్తర్వులను, సర్క్యులర్లను, ఎన్.జి.ఓలకు, సభ్యులకు అందించి వారిని ఎప్పటికప్పుడు జాగృత పర్చటం జరుగుతోంది.

ఎప్పటికప్పుడు క్షేత్ర స్థాయిలో వస్తున్న సమస్యలను వివిధ మాధ్యమాల ద్వారా, అధికారులకు, అప్నా సంస్థల సభ్యులకు తెలియపర్చి సమన్వయం సాధించటం.

### అప్నా ఇంకా చేయవలసిన కృషి

మొగ్గ దశలో ఉన్న శ్రమ శక్తి సంఘాలను పూర్తి స్థాయిలో వికసించేలా సుస్థిరంగా నిలబడేలా నిర్మాణాత్మకం చేయాలి. వాటిని చైతన్యంతో తీర్చిదిద్దాలి. దీనికి అనుగుణంగా ఉపాధి కోరే శ్రామికులతో వారి హక్కులు, రాజీలేని సూత్రాల అమలు తీరుపై, ఐకమత్యంతో ఉమ్మడి కార్యక్రమాలు రూపొందించుకొని ఆచరణలో పెట్టేలా నిరంతర సమావేశాలు నిర్వహించాలి.

శ్రామికుల చైతన్యానికి, సంఘటితానికి, లబ్ది పొందటానికి సహకరించేలా అనుకూల దృష్టితో అన్ని పౌరసంస్థల సహకారం తీసుకోవాలి.

ప్రతినెలా మండల స్థాయిలో మూడవ బుధవారం, జిల్లా స్థాయిలో మూడవ శుక్రవారం అప్నా సమావేశాలు తప్పని సరిగా నిర్వహించేలా చూడాలి.

### చివరగా

ఎన్.ఆర్.ఇ.జి.ఎ. గ్రామీణ ప్రాంత అసంఘటిత శ్రామిక, కర్షకులకు ఒక గొప్ప వరం. పేదల జీవితాలలో అపార భద్రతతో ఆనందాన్ని, పల్లె సీమలను సుందర దృశ్యాలతో చూడటానికి, ప్రకృతి వనాలుగా మార్చటానికి, పూర్వ వైభవాన్ని పునరుజ్జీవింప చేయటానికి, సహకరించే విధంగా 17 ప్రాజెక్టుల ద్వారా వివిధ రకాల పనులను 2011 ప్రణాళికలో పొందుపరచటం జరిగింది. వీటిని సద్వినియోగం చేసుకొనేలా శ్రామికులకు, ప్రభుత్వ యంత్రాంగానికి మధ్య వారధిగా 'అప్నా' సంస్థలు కృత నిశ్చయంతో పనిచేయటం ద్వారా సుసాధ్యం చేయవచ్చు.

**భాగ్య బీడుపల్లి**
'అప్నా' కో - ఆర్డినేటర్



# రింగాట ఆడుకుందాం!

**టెన్నికాయిట్ క్రీడకు పెరుగుతున్న ప్రజాదరణ**

**మనదేశంలో క్రీడలకు సంబంధించి అత్యంత విషాదకరమైన విషయం ఏమిటంటే, హాకీ, ఫుట్‌బాల్, టెన్నిస్, బ్యాడ్మింటన్ వంటి క్రీడలనే కాక, కబడ్డీ, ఖోఖో వంటి సాంప్రదాయక గ్రామీణ క్రీడలను కూడా క్రికెట్ చావుదెబ్బ తీసింది.**

క్రికెట్ క్రీడపై మనవాళ్లకు ఏర్పడిన మితిమీరిన పిచ్చివల్ల జరిగిన మరో అనర్థం ఏమిటంటే, టెన్నికాయిట్ లేదా రింగ్ టెన్నిస్ కూడా దెబ్బతిన్నది. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజాదరణ పొందుతున్న టెన్నికాయిట్ గురించి మీడియా ఏమాత్రం పట్టించుకోదు. క్రికెట్, టెన్నిస్ వంటి గ్లామర్ క్రీడలకే మీడియా ఎనలేని ప్రాధాన్యత ఇస్తుంటుంది.

జోనల్ స్థాయిలో, జాతీయ స్థాయిలో జరిగిన అనేక పోటీల్లో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన పురుష, మహిళా క్రీడాకారులు చాలా సంవత్సరాలపాటు ఏకపక్షంగా టైటిల్స్ గెలుచుకుంటూ వచ్చినట్లు చాలామందికి, ఆఖరికి మనరాష్ట్రంలో కూడా తెలియదు. వారి పేరు ప్రతిష్టలు దేశ సరిహద్దులు దాటి వ్యాపించినా, మనకు తెలియకపోవటానికి కారణం మన మీడియా కనబరచిన అశ్రద్ధ మాత్రమే. ఆంధ్రప్రదేశ్ నుంచి పోటీల్లో పాల్గొనే టెన్నికాయిట్ బృందాలు అద్భుతమైన ఆటతీరుకు పేరు పొందాయి.

“రింగాట ఆడుకుందామా?” అనే మాట రాష్ట్రంలోని అనేక చిన్న పట్టణాల్లో, గ్రామాల్లో తరచూ విన్పిసత్తాంటుంది. పేదలకు అందుబాటులో ఉండే ప్రియమైన క్రీడ రింగాట. దీని పట్ల రాను రాను ప్రజాదరణ బాగా పెరుగుతోంది. ఈ ఆట ఆడుకోవటానికి పెద్దగా సరంజామా అవసరం లేదు. కావలసింది కేవలం ఒక రబ్బరు రింగు, నెట్ మాత్రమే. ఈ ఆట వినోదాన్నేకాక, మంచి వ్యాయామాన్ని కూడా ఇస్తుంది.

ఈ ఆట ఎప్పుడు ప్రారంభమైంది? దాని చరిత్ర ఏమిటి? అనే అంశాలకు సంబంధించి లిఖిత పూర్వమైన ఆధారాలు దొరకనప్పటికీ, పాశ్చాత్య దేశాల్లో దీన్ని ‘డెక్ టెన్నిస్’ గా పిలిచేవారు. నెలల తరబడి సాగే ఓడ ప్రయాణంలో విసుగు కలిగినప్పుడల్లా ప్రయాణికులు ఓడ డెక్ పైకి చేరుకుని ఈ ఆట ఆడేవారు. దాంతో, ‘డెక్ టెన్నిస్’ అనే










పేరుతో దీనిని వ్యవహరించేవారు.

తొలి రోజుల్లో ఈ ఆటను చదునుగా ఉండే ఇనుప రింగుతో ఆడేవారు. తరువాత దాని స్థానంలో రబ్బరు రింగు, నెట్ వచ్చి చేరాయి. ఆ తరువాత దీని పేరు రింగ్ టెన్నిస్‌గా, టెన్నికాయిట్‌గా, టెన్నికాయిట్‌గా స్థిరపడింది. టెన్నిస్ ఆటతో దీనికి పోలిక ఉండటమే ఇందుకు కారణం. టెన్నిస్‌లో కూడా నెట్‌పై నుంచి బాల్‌ను కొట్టటం తెలిసిందే.

జర్మనీ, దక్షిణాఫ్రికాలలో కూడా టెన్నికాయిట్ అనేక దశాబ్దాల పాటు ప్రాచుర్యంలో ఉంది. ఇప్పుడిది అనేక దేశాలకు వ్యాపించింది. అంతర్జాతీయ స్థాయిలో ఈ ఆటను ప్రపంచ టెన్నికాయిట్స్ ఫెడరేషన్ నిర్వహిస్తూంటుంది. మన దేశంలోపల ఈ ఆటను టెన్నికాయిట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా నిర్వహిస్తుంది.

## ఆంధ్రప్రదేశ్ నేపథ్యం

దక్షిణ భారతదేశానికి గ్రామీణ ప్రాంతాల్లో రింగాట చాలా ప్రజాదరణ పొందిన కాలక్షేపం క్రీడ. 1960ల దశకంలో ఇది టెన్నికాయిట్‌గా ఒక నియత క్రీడగా గుర్తింపు పొందింది. ఆ రోజుల్లో హైదరాబాద్‌కి కూడా ఈ క్రీడ వ్యాపించింది. సికింద్రాబాద్‌లోని వెస్లి చర్చిలో, వైఎంసిఎలో టెన్నికాయిట్ ఆడుతుండేవారు. శ్యామ్ దేవాశీర్వాదం చొరవతో సికింద్రాబాద్‌లోని వైఎంసిఎలో ఒక ఓపెన్ టోర్నమెంట్ కూడా జరిగింది. 1946లో హైదరాబాద్ జిల్లా టెన్నికాయిట్ అసోసియేషన్‌ను ఆయన నెలకొల్పారు. ఈ అసోసియేషన్‌కు శ్యామ్ దేవాశీర్వాదం మొదటి కార్యదర్శి.

1946లో టోర్నమెంట్ ప్రారంభమైనప్పటి నుంచి 1952 వరకు బెనెడిక్ట్ సింగిల్స్ టైటిళ్లు గెలుస్తూనే ఉన్నారు. ఆ రోజుల్లో రైల్వేస్, వెస్లీ, వైఎంసిఎ, క్రాస్ లింగ్స్ క్లబ్ మొదలైనవి అత్యుత్తమ జట్లుగా పేరుపొందాయి. జగన్, సంపత్‌కుమార్, రామానుజం, స్వామినాథన్, నరసింహా, మొగిలయ్య (వెంకటస్వామి), ఎన్.శామ్యూల్, నత్వాల్, ఇ.ఆర్. సత్యనారాయణలు ప్రతిభ కలిగిన క్రీడాకారులుగా వెలుగొందారు.

1956లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడినప్పుడు ఆంధ్రప్రదేశ్ టెన్నికాయిట్ అసోసియేషన్‌ను నెలకొల్పారు. అప్పటినుంచి ఈ అసోసియేషన్ రాష్ట్రస్థాయి ఛాంపియన్‌షిప్‌లను నిర్వహిస్తూనే ఉంది.

ఈ క్రీడను అభివృద్ధి చేయటం అంత తేలిక ఏమీకాదు. అనేక ఆటంకాలు ఎదురయ్యాయి. టెన్నికాయిట్‌ను ముందుకు తీసుకుని వెళ్లడానికి టెపిలార్డ్, హెచ్‌డిముల్, రవివర్మ, శ్రీమతి ఫెహిమి అలీ మొదలైన వారు చాలా కష్టపడి, ఆటంకాలను అధిగమించారు.

రాష్ట్ర స్థాయి ఛాంపియన్‌షిప్‌లే కాక, మరో అరు రకాల రాష్ట్ర స్థాయి ఈవెంట్లను అసోసియేషన్ నిర్వహించేది. ఆ ఈవెంట్లలో వైఎంసిఎ, ఆలిండియా ఇండస్ట్రియల్ ఎగ్జిబిషన్, తుంగ సాంబయ్య స్మారక టెన్నికాయిట్ టోర్నమెంట్ మొదలైనవి ముఖ్యమైనవి.

వివిధ క్లబ్‌ల మధ్య, డిపార్ట్‌మెంట్ల మధ్య టోర్నమెంట్‌లు నిర్వహించటం ద్వారా 1970లో రాష్ట్ర టెన్నికాయిట్ ఫెడరేషన్ తన కార్యక్రమాలను విస్తృతం చేసింది. దాంతో, రింగాట ఎంతో మంది ప్రజల మనసులను దోచుకుంది. కేవలం హైదరాబాద్ నగరంలోనే 600 పైగా టెన్నికాయిట్ క్లబ్‌లు ఉండేవంటే, అప్పుడు రింగాట ఎంత ప్రజాదరణ పొందిందో అర్థమవుతుంది. అనేక పాఠశాలలు ఈ టోర్నమెంట్లలో పాల్గొనేవి. పిల్లలకు

శిక్షణా శిబిరాలను కూడా ఆంధ్రప్రదేశ్ టెన్నికాయిట్ ఫెడరేషన్ నిర్వహించింది. వాటిలో అనేకమంది బాలికలు కూడా పాల్గొనే వారు.

ఆ తదుపరి సంవత్సరాల్లో, అప్పటి ఫెడరేషన్ జాయింట్ సెక్రటరీ సత్యనారాయణ రింగాటకు మరింత ప్రజాదరణ పెంపొందించడానికి చాలా కృషి చేశారు. హైదరాబాద్‌లోనే కాక, జిల్లాల్లో కూడా శిక్షణా శిబిరాలు నిర్వహించడం ద్వారా ఆయన అనేక ప్రయత్నాలు చేశారు. రాష్ట్రంలోని ప్రతి విద్యా సంస్థలో రింగాట ఆడటం చూడాలనేది సత్యనారాయణ స్వప్నం.

1965లో హైదరాబాద్ మొదటి జాతీయ టోర్నమెంట్‌ను నిర్వహించింది. ఇందులో కొన్ని రాష్ట్రాలు పాల్గొన్నాయి. టీమ్ టైటిల్‌తో సహా వ్యక్తిగత టైటిళ్లన్నిటినీ సొంతం చేసుకోవటం ద్వారా ఆంధ్రప్రదేశ్ క్రీడాకారులు అద్భుతమైన ప్రతిభ కనబరిచారు. పురుష, మహిళా విభాగాల్లో ఆంధ్రప్రదేశ్ ఆధిపత్యం కొనసాగింది. పి. రామకృష్ణ పురుషుల టైటిల్‌ను, శైలజ మహిళల టైటిల్‌ను గెలుచుకున్నారు. దేశంలోని మొదటి మూడు అత్యుత్తమ జట్లలో ఆంధ్రప్రదేశ్ కూడా ఉండేది.

**ప్రజాదరణ పొందిన టెన్నికాయిట్ పట్ల చిన్న చూపు**

రింగాట ఎంత ప్రజాదరణ పొందినా, ఆ ఆటకు తగిన గుర్తింపు, ఆదరణ లభించలేదు. ప్రభుత్వ సంస్థలు కాని, కార్పోరేట్ సంస్థలు కాని ఈ ఆటను స్పాన్సర్ చేయటానికి ముందుకు రావు. ఇతర క్రీడాపోటీలను స్పాన్సర్ చేయడానికి, క్రీడాకారులను ప్రోత్సహించడానికి

## కె.ఆర్.వి. శ్యామ్ సుందర్... ఒక బహుముఖ ప్రజ్ఞాశాలి

అతను ఒక ఆల్‌రౌండర్. క్రికెట్, జిమ్నాస్టిక్స్, మార్షల్ ఆర్ట్స్, యోగా, లాంగ్‌జంప్, బాస్కెట్‌బాల్ వంటి అనేక క్రీడల్లో తన సత్తా చాటాడు. అయితే, అంతగా ఆకర్షణీయం కాని టెన్నికాయిట్ క్రీడను తన పూర్తిస్థాయి వృత్తిగా భావించి, అందులో స్థిరపడిపోయాడు. టెన్నికాయిట్ క్రీడకు అతను అంకితమైన విధానం అతన్ని ఛాంపియన్ నుంచి కోచ్‌గా తీర్చిద్దింది. టెన్నికాయిట్ కోచ్‌గా ఉంటూ, ఎంతోమంది ఛాంపియన్లను అతను తయారు చేశాడు.

అతనే కొమర్రాజు వెంకటశ్యామ్ సుందర్ (కె.ఆర్.వి. శ్యామ్ సుందర్). వయస్సు 50 సంవత్సరాలు. హైదరాబాద్‌లోని ఒక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఫిజికల్ ఇన్‌స్ట్రక్టర్‌గా ఉన్నారు. ఆయన క్వాలిఫైడ్ యోగా ఇన్‌స్ట్రక్టర్ కూడా. కుటుంబం నుంచి ఆయనకు క్రీడా వారసత్వం వచ్చింది.

శ్యామ్‌సుందర్ తన తండ్రి టెన్నికాయిట్ ఆడుతుండగా చూసేవాడు. టెన్నికాయిట్ ఆటలోని వేగం, చూపాల్సిన ఏకాగ్రత, పెంపొందించుకోవాల్సిన శారీరక దారుఢ్యం శ్యామ్ సుందర్‌ను ఆకట్టుకున్నాయి.

పాఠశాలలో, కళాశాలలో చదువుకుంటున్నప్పుడు బి3 డివిజన్ లీగ్ క్రికెట్ మ్యాచ్‌లు, వాలీబాల్, బాస్కెట్‌బాల్, అథ్లెటిక్స్ మొదలైన క్రీడల్లో పాల్గొన్నారు. 1970ల దశకం చివరి సంవత్సరాల్లో, 1980ల దశకంలోనూ జరిగిన జిమ్నాస్టిక్స్ ఛాంపియన్ షిప్ పోటీల్లో హైదరాబాద్ జిల్లాకు శ్యామ్‌సుందర్ ప్రాతినిధ్యం వహించాడు.

1970ల దశకం చివరి సంవత్సరాల్లో హైదరాబాద్‌లో జరిగిన జాతీయ టోర్నమెంట్ పోటీలను తిలకించిన తరువాత, శ్యామ్‌సుందర్ టెన్నికాయిట్ క్రీడా రంగ ప్రవేశం చేశాడు. కొద్ది కాలంలోనే, స్టేట్ ఛాంపియన్‌గా ఎదిగాడు. ఆ తరువాత జాతీయ ఛాంపియన్ అయ్యాడు. అనేక సంవత్సరాల పాటు టెన్నికాయిట్ క్రీడపై అధిపత్యం నెరపిన ఎన్.సద్గురు ఏకచక్రాధిపత్యానికి శ్యామ్ సుందర్ ముగింపు పలికాడు.

శ్యామ్‌సుందర్ వరసగా 9 సంవత్సరాల పాటు రాష్ట్ర ఛాంపియన్‌గా, 6 సంవత్సరాల పాటు (1991 - 96) జాతీయ ఛాంపియన్‌గా ఒక వెలుగు వెలిగాడు. 1996లో తన ఆఖరి జాతీయ ఛాంపియన్ షిప్‌ను గెలుచుకున్నప్పుడు అతని వయస్సు 35 సంవత్సరాలు.

1990ల దశకం చివరి భాగంలో శ్యామ్‌సుందర్ కోచ్‌గా మారాడు. మట్టినుంచి అనేక మణిక్యాలను తీర్చిదిద్దాడు. సాధారణమైన ప్రాంతాల నుంచి పిల్లలను ఎంపిక చేసుకుని, వారిని మంచి క్రీడాకారులుగా తీర్చిదిద్దాడు. శ్యామ్ సుందర్ శిక్షణలో జాతీయ ఛాంపియన్ అయిన అస్రా అజ్మి, సబ్ జూనియర్ ఛాంపియన్ అయిన అలియా అజ్మీ, భారతదేశపు నెంబర్ టూ జూనియర్ కవిత, భారతదేశపు జూనియర్ నెంబర్ వన్ కవిత, భారతదేశపు నెంబర్ టూ విశ్వనాథం మొదలైన వారు ఆయన శిష్యులే.

2006లో చైన్నైలో మొదటిసారి జరిగిన ప్రపంచ ఛాంపియన్‌షిప్ పోటీలలో, 2004లో జర్మనీలో జరిగిన అంతర్జాతీయ టోర్నమెంట్‌లో శ్యామ్‌సుందర్ భారతదేశం తరపున అధికార ప్రతినిధిగా పాల్గొన్నారు.

ఫిజికల్ ఎడ్యుకేషన్‌లో పోస్టు గ్రాడ్యుయేట్, యోగాలో పిజి డిప్లొమా హోల్డర్ అయిన శ్యామ్ సుందర్ టెన్నికాయిట్ క్రీడకు మంచి భవిష్యత్తు ఉందని అంటున్నారు. ప్రభుత్వం, కార్పోరేట్ సంస్థలు తగినంత సహాయం అందిస్తే, అది సాధ్యమేనని ఆయన భావన. ఆయన ఆశయం సిద్ధించాలని కోరుకుందాం.







పోటీలు పడే ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలకు ఎందుకో మరి రింగాటపై మనసు రాలేదు.

ఎన్.సద్గురు పేరు కాని, కెఆర్‌వి శ్యామ్ సుందర్ పేరు కాని ఎప్పుడైనా విన్నారా? 1970ల దశకంలోనూ, 1980ల దశకంలోనూ ఎదురులేని ఛాంపియన్‌గా సద్గురు నిలవగా, ఆ తరువాత ఆయన వారసత్వాన్ని అందిపుచ్చుకున్న కెఆర్‌వి శ్యామ్ సుందర్ 1990ల దశకంలో భారతదేశపు నెంబర్ వన్ టెన్నికాయిట్ క్రీడాకారునిగా నిలిచాడు.

అయినప్పటికీ, వీరి గురించి ఎవరికీ పెద్దగా తెలియదు. ఈ స్థాయిలో విజయాలు సాధించినప్పటికీ, వారికి పేరు గాని, కీర్తి ప్రతిష్టలు కాని రాలేదు. అయినా రింగాట పట్ల వారి అంకిత భావంలో పట్టుదలలో ఏ మార్పు రాలేదు. దురదృష్టవశాత్తు, మన మీడియాలో వారి విజయాల గురించి చాలా క్లుప్తంగా, నామ మాత్రంగా ప్రస్తావించే వారు.

టెన్నికాయిట్ క్రీడకు తగిన గుర్తింపును, క్రీడాకారులకు తగిన ఉపాధిని ఇవ్వనిదే, టెన్నికాయిట్ క్రీడను రక్షించలేమని, రింగాట భవిష్యత్తు ప్రమాదంలో పడుతుందని క్రీడా నిర్వాహకులు, క్రీడాకారులు, క్రీడాభిమానులు భావిస్తున్నారు.

స్పోర్ట్స్ కోటా కింద టెన్నికాయిట్ క్రీడాకారులకి ఉద్యోగాలు ఇచ్చిన కొద్ది సంస్థల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ కూడా ఒకటి. ఈ సంస్థలో సద్గురు, నర్సింగ్‌రావు, విశ్వనాథం, తదితరులు నియమితులయ్యారు.

2004లోనూ, గత ఏడాది జర్మనీలో జరిగిన అంతర్జాతీయ టోర్నమెంట్‌లో పాల్గొన్న భారత టెన్నికాయిట్ క్రీడాకారుల బృందంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి మంచి ప్రాతినిథ్యమే దక్కింది.

2006లో చెన్నై మొట్టమొదటి సారి ప్రపంచస్థాయి ఛాంపియన్‌షిప్ పోటీలను నిర్వహించింది. ఇందులో జర్మనీ, దక్షిణాఫ్రికా, యుకె, బ్రెజిల్, బంగ్లాదేశ్, పాకిస్థాన్ దేశాల నుంచి టెన్నికాయిట్ జట్లు పాల్గొన్నాయి.

ఇటీవలి సంవత్సరాల్లో టెన్నికాయిట్ క్రీడలో మన రాష్ట్ర అధిపత్యానికి తమిళనాడు, కర్ణాటక, పాండిచ్చేరి రాష్ట్రాల నుంచి సవాలు ఎదురవుతోంది. జాతీయ స్థాయిలో ప్రస్తుతం పాండిచ్చేరి పురుషుల జట్లలో ఛాంపియన్‌గా ఉండగా, మన రాష్ట్రం మహిళా టైటిల్‌ను కొనసాగిస్తోంది. ఇతర రాష్ట్రాల నుంచి ఎదురవుతున్న సవాలుకు ఆయా రాష్ట్రాల్లో టెన్నికాయిట్‌కు లభిస్తున్న ఆదరణ, ప్రోత్సాహం కారణాలని విశ్లేషిస్తున్నారు.

ఇప్పటికైనా, మన ప్రభుత్వం, కార్పొరేట్ సంస్థలు తమ దృష్టిని టెన్నికాయిట్‌పైకి మళ్లించి, ఈ సాంప్రదాయిక గ్రామీణ క్రీడకు తగిన ప్రోత్సాహాన్నివ్వాలని, క్రీడాకారులకు ఉద్యోగాలు, పోటీలకు స్పాన్సర్ షిప్‌లద్వారా ఆదరణ చూపాలని క్రీడాభిమానులు కోరుతున్నారు.

**- దాసుకేశవరావు**

(అనువాదం : వై. సరోజ)

# ప్రజల జీవనోపాధికి కొరతలేని - కుతుంబాకం గ్రామం

**నిరుద్యోగం పెనుసవాలుగా పరిణమించి జీవనోపాధిని కల్పించటం అటు ప్రభుత్వానికి, జీవనోపాధిని పొందటం ఇటు ప్రజలకు కూడా కష్టతరంగా ఉన్న నేటి రోజుల్లో గ్రామ ప్రజలకు వలస వెళ్ళే అవకాశం రాకుండా, గ్రామంలోనే ప్రజలకు జీవనోపాధిని కల్పించటం, తద్వారా వారి జీవన ప్రమాణ స్థాయిని పెంచేందుకు తన ఉన్నత స్థాయిని కూడా వదులుకుని గ్రామాభివృద్ధికి పాటుపడిన మహామనిషి శ్రీ ఇలాంగో.**

ఆదర్శ గ్రామాల సందర్శనలో భాగంగా 18.7.2010 తేదీ ఉదయం తమిళనాడు రాష్ట్రంలోని తిరువళ్ళూరు జిల్లాలోని పూనమల్లె బ్లాకులోని కుతుంబాకం గ్రామ పంచాయతీని సందర్శించటం జరిగింది. ఆయన వివరణ ప్రకారం కుతుంబాకం ఇలా ఉండేది.

శ్రీ ఇలాంగో చిన్నతనంలో కుతుంబాకం గ్రామం కుల వివక్ష, కక్షలు కార్పణ్యాలతో అభివృద్ధికి ఆమడ దూరంలో వుండేదని, ఈ పరిస్థితి ఎప్పటికైనా మారుతుందా అనే ప్రశ్న తనలో ఉదయించేదని ఆయన చెప్పారు. అంతే కాకుండా 1000 కుటుంబాలు కలిగిన ఆ గ్రామంలో ఏ ఒక్కరికీ ఉద్యోగం లేకపోవటంతో పాటు, మద్యం ఏరులై పారేదని, అందువల్ల మహిళలు ఎంతో వ్యధకు గురయ్యేవారనీ, నివాసయోగ్యం కాని పరిసరాలలో వారు అప్పట్లో జీవనం సాగించే వారని తెలియజేసారు. తాను కెమికల్ ఇంజనీరింగ్ చదవటం వల్ల విశాఖ పట్టణం, ముంబయి వంటి ప్రాంతాలలో పని చేసి ఉన్నానని తెలిపారు. అప్పట్లో స్వర్గీయ రాజీవ్ గాంధీ గ్రామాలను బలోపేతం చేయటానికి చేసిన ప్రయత్నాలు తననెంతగానో ఆకట్టుకున్నాయనీ, ఆయనే వుండి వుంటే ఈనాటి ఈ పల్లె ఎంతో అభివృద్ధికి నోచుకొని వుండేదని చెప్పారు.

ప్రతి ఒక్కరికి చేతినిండా పని, నరివడినంత ఆహారం. నివసించడానికి ఇల్లు, పిల్లలకు విద్య, ప్రజల మధ్య సమానత్వం కలిగి ఉండి ఆనంద జీవనం సాగించే విధంగా కుతుంబాకం గ్రామాన్ని తీర్చిదిద్దాలని తాను కలగనే వాడినని చెప్పారు. అలాగే ఆ గ్రామాన్ని పూరి పాకలు లేని గ్రామంగా తీర్చిదిద్దాలనే ఆశయం కూడా తనకుండటం వల్ల, ప్రభుత్వం నుండి సహాయం పొంది ఆ దిశగా పనిచేయడం ప్రారంభించినట్లుగా తెలియచేసారు. 1994 వ సంవత్సరంలో ఉద్యోగానికి రాజీనామా చేసి, తన గ్రామానికి తిరిగి వచ్చి గ్రామాన్ని అభివృద్ధిపథంలో నడిపించే దిశగా పని చేయటం ప్రారంభించారు. 1996వ సంవత్సరంలో జరిగిన పంచాయతీ ఎన్నికలలో ప్రప్రథమంగా పోటీ చేసి సర్పంచ్‌గా ఎన్నిక అయ్యారు. అప్పటి నుండి ప్రజల మనిషిగా పనిచేస్తూ వారిలో అవగాహన పెంపొందించడంతో పాటు, వారిని భాగస్వాములను చేస్తూ ముందుకు సాగినట్లు తెలియ జేశారు. ఆయన కృషి ఫలితంగా తిరిగి 2001 వ సంవత్సరంలో కూడా తిరిగి సర్పంచ్‌గా ఎన్నికయ్యారు.

శ్రీ ఇలాంగో కృషి ఫలితమే నేటి ఈ కుతుంబాకం గ్రామం. ఈ గ్రామంలో ప్రధానంగా మూడు విశేషాలను గమనించటం జరిగింది.

1. సమత్వ పురం.
2. పంచాయతీ అకాడమీ.
3. ఇ- లెర్నింగ్ సెంటర్

### 1. సమత్వ పురం



ఈ కాలనీ ఒక వినూత్న ఒరవడికి శ్రీకారం. ఈ పురంలో నిర్మించబడిన ఇళ్ళన్నీ కవల ఇళ్ళే. ఆ ఇంటిని రెండు భాగాలుగా చేసి ఒక భాగాన్ని హిందూ కుటుంబాలకు (అనగా రెడ్డి, యాదవ, బ్రాహ్మణ, వైశ్య మొ॥వి) రెండో భాగాన్ని ఎస్.సి కుటుంబాలకు కేటాయించారు.

ఈ రకమైన ఏర్పాటు వల్ల ప్రజలందరూ కుల మత బేధాలు లేకుండా కలసి మెలసి జీవించేందుకు ఒక చక్కటి అవకాశం కల్పించారు. ప్రస్తుతం గ్రామంలోని ప్రజలందరూ ఎటువంటి విభేదాలు లేకుండా ఎవరి మతాలను వారు అనుసరిస్తూ స్నేహితుల వలే ప్రశాంతమైన జీవితాలను కొనసాగిస్తున్నారు.

### 2. పంచాయతీ అకాడమీ

ఇప్పటి వరకు దేశంలోని ఏ గ్రామంలోను లేని విధంగా ఈ గ్రామంలో నివసించే ప్రజలందరికీ జీవనోపాధి పొందేందుకు అవసరమైన నైపుణ్యాలను పెంపొందించేందుకు వీలుగా ఒక శిక్షణా కేంద్రాన్ని 2000 సం॥లో స్థాపించారు. ఈ సంస్థ ప్రధాన లక్ష్యం గ్రామంలోని ప్రజలందరికీ ఉపాధిని కల్పించటం. ఈ అకాడమీ నినాదమేమిటంటే "Trust for village self Governance".

ఈ ట్రస్టు నిర్వహణ కోసం అవసరమైన నిధులను బ్యాంకు రుణాల ద్వారా, ప్రజల నుండి విరాళాల రూపంలోను, పరిశ్రమల కవసరమైన ఉపకరణాల రూపంలోను సేకరించారు. ప్రస్తుతం నిర్వహిస్తున్న పరిశ్రమల నుండి లభిస్తున్న ఆదాయం ద్వారా నిర్వహణ ఖర్చులు, ఋణ చెల్లింపులు పోగా, మిగిలిన మొత్తాన్ని కల్పించటానికి కృషి చేస్తున్నారు. ఈ గ్రామంలో నివసిస్తున్న ప్రతి కుటుంబానికి నెలకు రు.6000-00 లు ఆదాయం చేకూరాలనేది కూడా ఈ అకాడమీ లక్ష్యం.

పంచాయతీ అకాడమీ ద్వారా ఈ దిగువ తెల్పిన రకరకాల చిన్న తరహా పరిశ్రమలను స్థాపించి, జీవనోపాధి కోసం గ్రామస్థులు మరెక్కడికీ వలస పోనక్కర లేకుండా గ్రామంలోనే ఉపాధిని కల్పించటం ప్రారంభించారు. ప్రస్తుతం ఈ అకాడమీ ఈ దిగువ తెల్పిన పరిశ్రమల ద్వారా ప్రజలకు ఉపాధిని కల్పిస్తున్నది.

## స్టవ్ బర్నర్స్ తయారీ



కిరోసిన్ పొయ్యిలకు వినియోగించే బర్నర్స్ తయారీ ద్వారా గ్రామంలోని నిరుద్యోగ యువతకు ఉపాధిని కల్పిస్తున్నారు. యిందుకు అవసరమైన షెడ్ల నిర్మాణానికి ఓ.ఎన్.జి.సి సంస్థ వారు సహాయమందించినట్లు తెలియజేసినారు.

## ఫస్ట్ ఎయిడ్ కిట్స్

ప్రమాదాలు సంభవించినపుడు ప్రాథమిక చికిత్స కోసం అవసరమయ్యే ఫస్ట్ ఎయిడ్ కిట్స్‌ను కూడా అత్యంత ఆధునిక పద్ధతులలో, పరిశుభ్రమైన వాతావరణంలో తయారు చేస్తున్నారు. ఇందులో ఉపాధి పొందేవారు అత్యధికంగా మహిళలే.

## గృహ నిర్మాణానికి అవసరమైన సిమెంటు వస్తువుల తయారీ

గృహ నిర్మాణానికి అవసరమైన ఇటుకలు, టైల్సు, పలకలు వగైరాలను తయారు చేస్తున్నారు. ఈ విభాగంలో కూడా మహిళలు తాపీ మేస్త్రీలుగా, ఆపరేటర్లుగా కూలివారుగా పని చేస్తూ ఆదాయాన్ని పొందుతున్నారు.



## హమ్మాక్స్ ప్రొడక్షన్ యూనిట్

తక్కువ శక్తితో వెలిగే వీధి విద్యుత్ దీపాలను ఇక్కడ తయారు చేస్తారు. ఈ వీధిదీపాలనే గ్రామ పంచాయతీ పరిధిలోని విద్యుత్ దీప స్థంభాలకు వినియోగించడం ద్వారా పంచాయతీ చెల్లించవలసిన కరెంటు బిల్లులను ఆదా చేస్తున్నారు. వీధి దీపాలకు ఉపయోగించే డూములను స్టీలుతో చిన్న సైజులో తయారు చేసి వాటిలో సి. యఫ్.ఎల్. బల్బులను వినియోగించడం ద్వారా శక్తితో పాటు వనరుల వినియోగిస్తున్నారు. వీటి తయారీ కొరకు అయ్యే ఖర్చు అతి తక్కువ.

## తక్కువ ఖర్చుతో కూడిన మరుగుదొడ్ల నిర్మాణం

తక్కువ ఖర్చుతో కూడిన మరుగుదొడ్ల నిర్మాణం ఈ గ్రామంలోని మరో ప్రత్యేకత. ఈ మరుగుదొడ్లను సిమెంటు పలకలు, స్టీలు సామాగ్రి, ఇనుప క్లాంపులను ఉపయోగించి తయారు చేస్తున్నారు. సిమెంటు వరలతో నుయ్యి నిర్మాణం పూర్తి చేసిన తరువాత, సదరు వరలపై నాలుగు సిమెంటు పలకలతో (3×3) గది నిర్మాణాన్ని పూర్తి చేస్తున్నారు. పైకప్పుగా ఆస్‌బెస్టాస్ రేకును ఇనుప క్లాంపులతో బిగిస్తున్నారు. మరుగుదొడ్డి లోని పాన్‌గా ఒక స్టీలు బేసిన్‌కు అడుగు భాగాన రంధ్రం చేసి దానికి ఒక పి.వి.సి పైపును నూతి లోనికి వుండే విధంగా అనుసంధానించారు. పై మూతగా ఒక స్టీలు ప్లేటును సదరు బేసిన్‌కు స్క్రూల సహాయంతో బిగించారు. మరుగుదొడ్డి నుయ్యి నిండిపోయిన సందర్భంలో బేసిన్ మాత్రం తొలగించి నూతిలోని వ్యర్థాలను పైపు ద్వారా తోడటం మూలంగా తొలగించవచ్చు. అవసరం లేనప్పుడు ఈ మరుగు దొడ్డినే బేసిన్ పై మూత వేసి దానిపై నీళ్ళ బకెట్ ఉంచి స్నానాల గదిగా ఉపయోగించవచ్చు. ఈ మొత్తం నిర్మాణానికయ్యే ఖర్చు రూ. 4000 లు మాత్రమే.

## టైలరింగ్




ఔత్సాహిక మహిళందరికీ టైలరింగ్ నేర్పించడంతో పాటు వారికి ఉపాధిని కూడా కల్పిస్తున్నారు. పై తెల్పిన ప్రొడక్షన్ యూనిట్లన్నింటినోను మహిళలే అధిక పాత్ర పోషిస్తున్నారు. వీరు మెకానిక్‌లుగాను, మేస్త్రిలుగానే కాకుండా ఒక్కొక్కసారి మార్కెటింగ్‌లో మధ్య వర్తులుగా కూడా వ్యవహరిస్తున్నారు. వీరు ఈ విధంగా నెలకు రు. 2000-00లు ఆర్జిస్తున్నారు. ఇవే కాకుండా జనుము ఉత్పత్తులు, సబ్బుల తయారీ, పాడి పరిశ్రమ తోలు ఉత్పత్తులు మరియు రూఫింగ్ టైల్సు తయారీలో కూడా ప్రధాన పాత్ర పోషిస్తున్నారు. గ్రామంలో ఏర్పాటు చేయబడిన ప్రతి స్వయం సహాయక సంఘం లోని మహిళలను ప్రతి యూనిట్‌కు అనుసంధానించడం జరిగింది. ప్రస్తుతం ఈ గ్రామంలోని ప్రజలు ఆర్థికంగా స్వేచ్ఛను కలిగియున్నారు.

## 3. ఇ- లెర్నింగ్ సెంటర్

ప్రస్తుత ప్రపంచానికి తగినట్లుగా యువతను, విద్యార్థులను తీర్చిదిద్దాలనే ఉద్దేశ్యంతో ఇ- లెర్నింగ్ సెంటర్‌ను ఏర్పరచినట్లు శ్రీ ఇలాంగో తెలియజేసారు. ఈ గ్రామంలో విద్యకు అత్యంత ప్రాధాన్యత నివ్వటం జరిగిందనే విషయం పాఠశాలలో చేరిన 100% విద్యార్థులను చూస్తే తెలుస్తుంది. ఇక్కడి విద్యార్థులు ప్రతి అంశంలోను ఆత్మ విశ్వాసంతో ముందుకు సాగుతున్నారు.

ఆఖరుకు వ్యవసాయంలో కూడా తనదైన శైలిని చూపించిన కుతుంబాకం గ్రామం ప్రతి గ్రామానికి ఆదర్శనీయం. గ్రామ ప్రజల స్వయం సమృద్ధి కొరకు మొట్ట మొదటగా ఈ పంచాయతీ అకాడమీని తమిళనాడు రాష్ట్రంలోని కుతుంబాకం గ్రామంలోనే ఏర్పాటు చేసారు. ఈ గ్రామంలోని ప్రజల అవగాహన, భాగస్వామ్యం, పాలకుల నిబద్ధత మనకు తెలియాలంటే, గ్రామపంచాయతీ కార్యాలయంలో ప్రతినెలా జమా ఖర్చులను తనిఖీ నిమిత్తం ప్రజలకు అందుబాటులో బోర్డులపై రాసిఉంచటమే తార్కాణం. ఒక్క మాటలో చెప్పాలంటే, ప్రతి గ్రామ పంచాయతీ కూడా ఈ రకమైన దిశా నిర్దేశంతో ముందుకు సాగితే భారతదేశంలోని ప్రతి గ్రామ పంచాయతీ ఒక బలవత్తరమైన శక్తిగా ఆవిర్భవించగలదు. గ్రామ స్థాయి నాయకులందరూ ఈ విధంగా తమ గ్రామాలకు అనువైనటువంటి వనరులను సమీకరించు కోవటం ద్వారా ప్రజలకు జీవనోపాధిని కల్పిస్తూ గ్రామపంచాయతీల ఆదాయవనరులను కూడా పెంపొందించవచ్చును.

*- **జి. సత్యవాణి**, ఫ్యాకల్టీ, ఇ.టి.సి, రాజేంద్ర నగర్.*

# ఆంధ్రప్రదేశ్ బడ్జెట్ 2011-12



**ప్రభుత్వాల ఆదాయ, వ్యయాల, వార్షిక ఆర్థిక పట్టిక (Annual Finacial Statement) లేదా బడ్జెట్ అంటారు. రాజ్యాంగంలో బడ్జెట్ అనే పదం కనిపించదు. ఆదాయ వ్యయాల సాంవత్సరిక పట్టిక ప్రస్తావన మాత్రమే ఉంది. బడ్జెట్ సంవత్సరం ఏప్రిల్ నెల ఒకటిన ప్రారంభమై, మార్చి నెల 31న అంతం అవుతుంది. 2011 - 12 సంవత్సరానికి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బడ్జెట్‌ను శ్రీ ఆనం రామనారాయణ రెడ్డి, ఆర్థిక మంత్రిగా తన మొదటి బడ్జెట్‌ను ఫిబ్రవరి23న ప్రవేశ పెట్టారు. విభిన్న రాజకీయ, ఆర్థిక సమస్యల నేపథ్యంలో తయారైన ఈ బడ్జెట్‌లోని ప్రధాన అంశాలను స్థూలంగా పరిశీలిద్దాం.**

ప్రపంచమంతటా ఆర్థిక మాంద్యం బాధిస్తున్నా, భారతదేశం, దాని ప్రభావం నుండి, నెమ్మదిగా కోలుకొంటున్నది. 2008 - 09 సంవత్సరంతో ప్రారంభమయ్యే గత 3 సంవత్సరాలలో దేశంలో స్థూల దేశీయోత్పత్తి రేటు వరుసగా 6.7 శాతం, 8 శాతం, 8.6 శాతం ఉండగలదని అంచనా వేశారు. కాగా, ఈ మూడు సంవత్సరాలలో ఆంధ్రప్రదేశ్ స్థూల రాష్ట్రీయోత్పత్తిరేటు వరుసగా 5.02, 5.79, 8.89 శాతం ఉంటుందని అంచనా. తలసరి ఆదాయం, వర్తమాన ధరలలో 2009 - 10 లో రూ. 51,025 కాగా, 2010 - 11 సంవత్సరంలో రూ. 60,224 గా ఉండవచ్చని అంచనా!

తిండి గింజల మొత్తం 2009 - 10 లో 15 లక్షల టన్నులు కాగా, 2010 - 11 లో 190 లక్షల టన్నులు ఉండవచ్చని అంచనా. ఆర్థిక వ్యవస్థలో వృద్ధి సంతృప్తికరంగానే ఉన్నందున ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌లో విధించి, సేకరించే పన్నుల రాబడి కూడా 2001 - 02 సంవత్సరంలో రూ. 11,551 కోట్లు, 2010 - 11 లో రూ. 47,421 కోట్లు, 2011 - 12 సంవత్సరంలో రూ. 56,438 కోట్లు ఉండవచ్చని అంచనా! అంటే మన రాష్ట్ర ప్రభుత్వం విధించే పన్నుల (SOTR) కు, మనందరం సగటున రోజు సుమారుగా 2001 - 02 లో రూ. 4-13 చెల్లించగా, ఇది 2004 - 05 లో రూ. 5.60, 2010 - 11 లో రూ. 15.40, 2011 - 12 లో రూ. 18.16 చెల్లిస్తున్నట్లు అంచనా!

కాగా 2011 - 12 సంవత్సరంలో రాష్ట్ర ప్రభుత్వ మొత్తం రాబడి రూ. లక్షా 28 వేల 770 కోట్లు. వ్యయం కూడా అంతే మొత్తం. ఇందులో సాధారణ రాబడి. రూ. 1,11,68 వేల కోట్లు, మిగిలిన 17 వేల 602 కోట్లను, అప్పుల ద్వారా చేకూర్చుకోవాలి. బడ్జెట్‌లో వర్తమాన సంవత్సరానికి రెవెన్యూ రూ. 540 కోట్లు, 2011 - 12 లో రూ. 3826 కోట్లని అంచనా! రాష్ట్ర ప్రభుత్వం వయ్యం సగటున రోజున, ఒక్కొక్క వ్యక్తిపై రూ. 41.45 చొప్పున 2011 - 12 లో వెచ్చిస్తారు.

2011 - 12లో రాష్ట్ర ప్రభుత్వ మొత్తం వ్యయంలో రూ. ప్రణాళికేతర వ్యయం రూ. 80 వేల 984 కోట్లు, ప్రణాళికా వ్యయం రూ. 47 వేల, 558 కోట్లు. ఇంకొరకంగా చెప్పుకుంటే, రెవెన్యూ ఖాతాలో వ్యయం 97 వేల కోట్లు, మూల ధన వ్యయం రూ. 17,855 కోట్లు

### రాష్ట్రంలో విభిన్న రంగాలకు, 2011 - 12 (B.E) బడ్జెట్‌లో చేసిన కేటాయింపులు ఇలా ఉన్నాయి.

- **వ్యవసాయశాఖకు రూ. 2606 కోట్లు**
- **గ్రామీణాభివృద్ధికి రూ. 3341 కోట్లు**
- **గ్రామీణ రోడ్లకు రూ. 627 కోట్లు**
- **గ్రామీణ నీటి సరఫరా, పారిశుధ్యానికి రూ. 773 కోట్లు**
- **పురపాలక పట్టణాభివృద్ధికి రూ. 5080 కోట్లు**
- **గ్రామీణ ఉపాధిహామీకి రాష్ట్ర వాటా రూ. 600 కోట్లు**
- **పశుసంవర్ధకం, పాడి, మత్స్య రంగానికి రూ. 931 కోట్లు.**
- **సాగునీటి రంగానికి రూ.15010 కోట్లు**

**- ప్రొఫెసర్ ఎం.ఎల్ కాంతారావు**
కన్సల్టెంట్, అపార్డ్

# 'బ్రహ్మమురారి సురార్చిత లింగం. . .'

**మా**ఘమాసం పరమ పవిత్రమయిన మాసం. ఈ మాసంలోనే రథసప్తమి, భీష్మ ఏకాదశి వంటి పర్వదినాలు వస్తాయి. ఈ రెండింటిలో ఒకటి సూర్యనారాయణమూర్తికి, మరొకటి మహావిష్ణువునకు సంబంధించిన పండుగలు. అయితే ఈ మాసంలోనే వచ్చే మరో పర్వదినం మహాశివరాత్రి. ఈశ్వరుడికి సంబంధించిన పర్వదినం. ఈ రకంగా మాఘమాసం హరిహర అద్వైతాన్ని ప్రకటిస్తూనే, భక్తులందరికీ ఆధ్యాత్మికతను పంచే విశిష్టమయిన మాసంగా భాసిల్లుతోంది. శివరాత్రి పర్వదినం మాఘమాసాంతంలో అమావాస్యకు ముందు వచ్చే త్రయోదశి తిథి నాడు జరుపుకోవటం సంప్రదాయం. ఈ సంప్రదాయం పరంపరానుగతం.



## శివరాత్రి మహోత్సవాలు

ఈ ఉత్సవాలు బ్రహోత్సవ సంప్రదాయాన్ని అనుసరించి జరుగుతాయి. ఏడు రోజులు జరిగే ఈ ఉత్సవాలు అంకురార్పణతో ప్రారంభమవుతాయి. అంకురార్పణలో భాగంగా ధ్వజం ఎగురవేస్తారు. ఈ ధ్వజంపై నందీశ్వరుడు ఉంటాడు. ధ్వజస్తంభ అంకురార్పణలో దేవతలందరినీ స్తోత్రాదులతో మేళతాళాలతో ఆహ్వానిస్తారు. అలా ఆహ్వానించిన వారిని ఆవాహన చేస్తారు. ఉత్సవమూర్తులకు విశేషమయిన పూజలు నిర్వహించి వివిధ వాహనాలపై ఊరేగింపు నిర్వహించడం ఈ పర్వదినంలో మరో ప్రత్యేకత. శేషవాహనం, మయూరవాహనం, నందివాహనం, అశ్వవాహనం ఈ వాహన సేవలో వినియోగించే ముఖ్యమయిన సేవలు.

## మహాశివరాత్రి విశిష్టత

పార్వతీపరమేశ్వరులు కళ్యాణమాడిన పుణ్యదినమే మహాశివరాత్రి.

వాగర్థావివ సంపృక్తౌ వాగర్థ ప్రతిపత్తయే
జగతః పితరౌ వందే పార్వతీపరమేశ్వరౌ

ఇది కాళిదాసు మహాకవి అత్యద్భుతంగా వర్ణించిన ఆది దంపతులయిన పార్వతీపరమేశ్వరుల అద్వైత బంధం. దాంపత్య సంబంధం. జగతికి ఆదర్శం. అందువల్ల లోక కళ్యాణ కారకులయిన ఈ దంపతులకు కళ్యాణం జరుపుతారు.

లింగాకారంలో ఉన్న మల్లికార్జునస్వామికి అభిషేకం చేసి అర్చిస్తారు. శివలింగం జ్ఞానానికి ప్రతీక. అంటే వెలుగుకు ప్రతీకన్నమాట. తమసోమా జ్యోతిర్గమయ అనే శిష్ట సంప్రదాయం మనకు వారసత్వంగా సంక్రమించిన సంపద. అందుకే జ్ఞానం కోసం తప్పనిసరిగా శివుడిని ఆరాధించాలి.

## అభిషేకప్రియుడికి అక్షరసేవ

శివుడికి పంచామృతాలతో అభిషేకం చేస్తారు. ఓం నమశ్శివాయ అనే పంచాక్షరిని జపిస్తూ పూజిస్తారు. అభిషేకప్రియుడైన పరమశివుడికి ఈ మహాశివరాత్రి పర్వదినం నాడు పంచామృతాలతో అభిషేకం చేస్తే, విశేషఫలం కలుగుతుంది. పంచాక్షరి వల్ల ఏకాగ్రత సిద్ధిస్తుంది. కామ, క్రోధ, లోభ, మద మాత్సర్యాది అరిషడ్వర్గాలు అదుపులో ఉంటాయి. ఇంద్రియ నిగ్రహం లభిస్తుంది. నిరంతర ధ్యానం ద్వారా ఎందరో మహర్షులు, భక్తులు శివసాయుజ్యాన్ని పొందారు.

అప్రయత్నంగానైనా సరే శివుణ్ణి ధ్యానించడం, శివనామస్మరణం చేయడం వంటి సత్కార్యాల ద్వారా శివసాయుజ్యం లభిస్తుందనడానికి పురాణాధారాలున్నాయి. పాపపంకిలులయిన వారిని సైతం అక్కున చేర్చుకొని ఆదరించి సమున్నతస్థితిని కలుగచేసే కరుణాంతరంగుడు హరుడు. హరుడంటే హరింపజేసేవాడని అర్థం. లోకకంటకులయిన రాక్షసుల్ని హరించినవాడు, మానవుల్ని పీడించే విషయవాంఛలను తన ధ్యానం ద్వారా హరించేవాడూ శివుడే. అంతేకాదు పరమశివుడే అణిమాది గుణోపేతుడు.. ఆద్యంతరహితుడు. మహాదేవుడి వాత్సల్యగుణం అనితరసాధ్యం. అందుకే ఆ పరమశివునికి మనల్ని ప్రీతిపాత్రులుగా చేసే పంచాక్షరీ మంత్రం పరమ పవిత్రమయింది.

## సర్వజనహితాయ

ప్రాణులన్నింటిలో కెల్లా మానవుడు పరమోత్కృష్టమయినవాడు. ఈ జన్మను సార్థకం చేసుకోవాలంటే నిరంతరం భగవన్నామ సంకీర్తన చేయాలి. కేవలం స్మరణ మాత్రం చేతనే అభయమిచ్చే దేవుడు భోళాశంకరుడు మాత్రమే.

బ్రహ్మమురారి సురార్చిత లింగం - నిర్మల భాసిత శోభిత లింగం
జన్మజ దుఃఖ వినాశక లింగం - తత్ప్రణమామి సదాశివ లింగం

అని స్తోత్రాదుల ద్వారా కీర్తించాలి. శివుడి ఆజ్ఞ లేకుండా చీమయినా కుట్టదని సామెత. అటువంటి సర్వజ్ఞుడయిన శివుని రూపాన్నే మదిలో నిలుపుకోవాలి. మహాశివరాత్రి పర్వదినం నాడు నియమనిష్ఠలతో ఉపవాస దీక్ష, జాగరణ, అర్చన అనే మూడు క్రియలను నిర్వరిస్తే త్రికరణ శుద్ధి లభిస్తుంది. తాపత్రయపీడ నశిస్తుంది. రుద్రుడు మృత్యుంజయుడు. అకాలమరణాలు హరుని ఫలనేత్రం ముందు పటాపంచలు. శివుడి కనుసన్నలలో ఉండే ప్రమథగణాలు సకల అరిష్టాలనూ, భయభ్రాంతులనూ హరించి చిత్తశాంతి కలుగచేస్తాయి. శివుని అధినాయకునిగా నిర్వహించే చండీ, రుద్ర, దీక్ష, శాంతి, పౌష్ఠిక హోమాలు విశ్వశాంతికి హేతువులు.

ఇన్ని విశిష్టతలున్న శివరాత్రి పర్వదినం నాడు శాస్త్రోకంగా జరిపే పూజావిధులలో పాలు పంచుకోవడం పుణ్యప్రదం. అభిషేకప్రియః శివః. కేవలం అభిషేకమాత్రం చేతనే భక్తులను అనుగ్రహించే పరమశివుడిని దర్శించటం, కీర్తించటం శుభకరం, శ్రేయోస్కరం, సంపత్కరం.

*- అద్దంకి శ్రీనివాస్*



Sthanka_Marchcolo.indd 29 28/02/11 6:31 PM

# సాధికారత పొందిన ప్రజలతోనే రాష్ట్ర అభివృద్ధి

**వార్తల్లో 'అపార్డ్'**

గ్రామీణ పేదరిక నిర్మూలనకు, గ్రామాల సర్వతోముఖాభివృద్ధికి జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, జాతీయ గ్రామీణ నీటి సరఫరా పథకం, ఇందిరా ఆవాస యోజన, స్వర్ణ జయంతి గ్రామీణ స్వరోజ్ గార్ యోజన, సమగ్ర బంజరు భూముల అభివృద్ధి పథకం, సమగ్ర శిశు సేవా పథకం, మొదలైన పలు ఫ్లాగ్‌షిప్ కార్యక్రమాలు అమలు చేస్తున్నప్పటికీ, ఈ కార్యక్రమాల ఫలాలు నిర్దేశిత లబ్ధిదారులను చేరటం లేదు. ఇందుకు గల కారణాలలో ప్రధానంగా ఈ పథకాల సమాచారం లబ్ధిదారులకు ఏ మాత్రం తెలియకపోవటం వల్ల, అర్హత ఉండీ వినియోగించుకోలేక పోతున్నారు. పథకాల మార్గదర్శకాలు, నిర్దేశిత లక్ష్యాల గూర్చి ప్రజలకు తెలియపర్చాలంటే, పథకం రూపకల్పన చేసే కేంద్ర కార్యాలయాల నుండి క్షేత్ర స్థాయిలో పనిచేసేవారి వరకు వివిధ భాగస్వాములు కలిసి పనిచేయాల్సిన అవసరాన్ని గుర్తించి కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ 'ల్యాబ్ టు ల్యాండ్' అనే వినూత్న విధానాన్ని అమలు చేయటానికి అన్ని రాష్ట్రాలను సమాయత్తం చేసింది. ఈ 'ల్యాబ్ టు ల్యాండ్' విధానాన్ని ఆంధ్రప్రదేశ్‌లో 'కీ క్యాప్' (Knowledgeable and Empowered Community is the Key to development in Andhra Pradesh) అంటే విజ్ఞానవంతమైన సాధికారత పొందిన సమాజమే ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి మూలాధారం అనే నినాదంతో ఎంపిక చేసిన రెండు మండలాలలో ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్నారు. 'కీ క్యాప్' ప్రయోగం కింద రంగారెడ్డి జిల్లాలోని మంచాల మండలాన్ని వరంగల్ జిల్లాలోని పర్వతగిరి మండలాన్ని, ఎంపిక చేశారు. ఈ రెండు జిల్లాల్లో ల్యాబ్ టు ల్యాండ్ ప్రయోగాన్ని రాష్ట్ర, జిల్లా, మండల స్థాయిలో విజయవంతంగా అమలు అయ్యేలా చూడటానికి ప్రభుత్వం ప్రత్యేక కమిటీలు కూడా ఏర్పర్చింది.

## అపార్డ్ 'కీకాప్' ప్రయోగం

ల్యాబ్ టు ల్యాండ్ - కీ క్యాప్ ప్రయోగాన్ని ఏ విధంగా అమలు చెయ్యాలన్న విషయమై ఇప్పటికే కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ దేశ స్థాయిలో 5 వర్కుషాపులు నిర్వహించి రాష్ట్రాలకు దిశా నిర్దేశం చేసింది. గ్రామీణ ప్రజల జీవన స్థితి గతులలో మెరుగుదల తీసుకొనిరావటానికి అమలు జరుగుతున్న కార్యక్రమాలు సుమారు 250 పైనే ఉన్నట్లు ఒక అంచనా. ఈ కార్యక్రమాల క్రింద ప్రజలకు అందే లబ్ధిని గూర్చి, ప్రజల హక్కుల గూర్చి తెలియపర్చటానికి ఒక బహుముఖ ప్రచార, శిక్షణా కార్యక్రమాన్ని అమలుచేయుటానికి అవసరమైన నిధులను కూడా కేంద్ర ప్రభుత్వం అందచేస్తోంది.

ఈ కార్యక్రమాన్ని ప్రధానంగా ప్రభుత్వ పథకాలకు సంబంధించిన సమాచారాన్ని ప్రజలకు వివిధ సమాచార ప్రచార మధ్యమాల ద్వారా చేరవేయడానికి ఉద్దేశించారు. ఈ కార్యక్రమం క్రింద అభివృద్ధి పనులకు క్రొత్తగా నిధులేమీ విడుదల కావు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న వివిధ



కార్యక్రమాల నిధులను సద్వినియోగం చేసుకుంటూ అన్ని శాఖల ద్వారా అందే సేవలను ఏకోన్ముఖం చేయుటం ద్వారా గ్రామాన్ని సమగ్రంగా అభివృద్ధి చేయటం అన్నది ప్రధానాంశం. ఉదాహరణకు హక్కుల ప్రాతిపదికగా అమలు చేస్తున్న మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం లాంటి పథకాలలో శ్రామికుల హక్కులు వారికి తెలియ చెప్పి చట్టంలో ప్రతిబింబించిన స్ఫూర్తి వాస్తవ రూపం దాల్చేలా కృషి చేయడమన్నది ఈ ప్రయోగంలో అంతర్లీనంగా ఉన్న అంశం. ఇందులో భాగంగా రాష్ట్ర గ్రామీణాభివృద్ధి సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, ప్రభుత్వ శాఖలు ప్రజలలో, ప్రజాప్రతినిధులలో అవగాహన పెంపొందించేందుకు కృషి చేయాలి. శాఖల వారీగా చేపట్టే ప్రచార కార్యక్రమాలను విడివిడిగా కాకుండా ఒక ప్రణాళికా బద్ధంగా, ఒకే వేదిక నుండి చేపడితే మంచిఫలితాలు వస్తాయనే ఉద్దేశ్యంతో ఒక బహుముఖ వ్యూహంతో ముందుకు వెళ్లటం కూడా ఒక ప్రధాన అంశం.

### భారత్ నిర్మాణ్ వాలంటీర్లకు శిక్షణ

'కీ క్యాప్' ప్రయోగాన్ని అమలు చేయటంలో భాగంగా అపార్డ్ ఫ్యాకల్టీ సభ్యులతో ఒక కీలక బృందం ఏర్పాటు అయింది. ఈ బృందం ప్రతీ శుక్రవారం మంచాల మండలంలో పర్యటించి ఈ కార్యక్రమ అమలుకు సలహాలు, సూచనలు అందచేస్తుంది. కీ క్యాప్ కార్యక్రమం అమలుకు సామాజిక కార్యకర్తలుగా ప్రతీ గ్రామంలో స్వచ్ఛందంగా ముందుకు వచ్చే యువతీ, యువకులతో భారత నిర్మాణ వాలంటీర్ల బృందాన్ని ఏర్పాటు చేసి, వీరిని మార్పుకి దోహదం చేసే వ్యక్తులుగా

## వివిధ స్థాయిలలలో ల్యాబ్ టు ల్యాండ్ కమిటీలు
## (ప్రభుత్వ ఉత్తర్వులు - 1288 తేది : 23.8.10)

| స్థాయి | రాష్ట్రస్థాయి కమిటీ | జిల్లా స్థాయి కమిటీ | మండల స్థాయి |
|---|---|---|---|
| అధ్యక్షులు | రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రివర్యులు | జిల్లా కలెక్టరు | మండల పరిషత్తు అధ్యక్షులు |
| ఉప అధ్యక్షులు | గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి | - | - |
| కన్వీనర్ | కమీషనర్ - అపార్డ్ | డి.డబ్ల్యు.ఎం.ఏ. ప్రాజెక్టు డైరెక్టర్ | మండలపరిషత్ అభివృద్ధి అధికారి |
| సభ్యులు | కమీషనర్ - గ్రామీణాభివృద్ధి | డి.ఆర్.డి.ఏ. ప్రాజెక్టు డైరెక్టర్ | తహసీల్దారు |
| సభ్యులు | కమీషనర్ - పంచాయితీరాజ్ | జిల్లా హౌసింగ్ కార్పోరేషన్ మేనేజర్ | పంచాయితీ రాజ్ ఇంజనీర్ |
| సభ్యులు | ముఖ్య కార్యనిర్వహణాధికారి సెర్ప్ | సూపరింటెండెంట్ ఇంజనీర్ (గ్రామీణ నీటి సరఫరా) | గ్రామీణ నీటి సరఫరా ఇంజనీర్ |
| సభ్యులు | రాష్ట్ర ప్రాజెక్ట్ డైరెక్టర్ - నీరు & పారిశుద్ధ్య మిషన్ | సూపరింటెండెంట్ ఇంజనీర్ (పంచాయితీ రాజ్) | వ్యవసాయ శాఖాధికారి |
| సభ్యులు | ఆర్.డబ్ల్యు.ఎస్. ఛీఫ్ ఇంజనీర్ | ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, ఎస్.సి. కార్పోరేషన్ | ఇతర శాఖల అధికారులు |
| సభ్యులు | పంచాయితీరాజ్ ఛీఫ్ ఇంజనీర్ | ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, ఎస్.సి. కార్పోరేషన్ | |
| సభ్యులు | డైరెక్టర్, దూరదర్శన్, మరియు డైరెక్టర్, ఫీల్డ్ పబ్లిసిటీ | వ్యవసాయ, ఉద్యానవన, పశు సంవర్థక శాఖ, పౌర సంబంధాల శాఖ, నెహ్రూ యువ కేంద్ర, తదితర అధికారులు | |

వినియోగించుకోవటానికి అపార్డు వ్యూహం సిద్ధం చేసింది. తొలుతగా చీదేడు గ్రామ పంచాయితీలో గల 8 వార్డుల నుండి 32 మంది భారత నిర్మాణ్ వాలంటీర్లను గుర్తించి, వీరందరినీ ప్రత్యేకంగా అపార్డుకు తీసుకొని వచ్చి ఒక రోజు కీ క్యాప్ కార్యక్రమం ఎందుకు అమలు చేయబోతున్నామనే విషయాన్ని అపార్డు కమీషనరు శ్రీ కె. చంద్రమౌళి ఈ వాలంటీర్లకు విశదీకరించి చెప్పారు. అపార్డును సందర్శించటం జీవితంలో మర్చిపోలేని అనుభూతి అని అందరు బి.ఎన్.వి.లు అన్నారు.

ఈ సందర్భంగా అపార్డు కమీషనరు శ్రీ కె. చంద్రమౌళి, ఐ.ఎ.ఎస్. మాట్లాడుతూ, ఒక గ్రామం ఉత్తమమైన గ్రామంగా పరిగణించబడాలంటే గ్రామస్థులలో సంకల్ప బలం మెండుగా ఉండాలనీ, తమ గ్రామ అభివృద్ధి కోసం చిన్న చిన్న త్యాగాలకు సిద్ధపడాలని ఉద్బోధించారు. భారత నిర్మాణ వాలంటీర్లు గ్రామంలోని ప్రజలను చైతన్య వంతులను చేసి, సమాజంలో వివిధ రూపాలలో ఉన్న చెడుని రూపు మాపటానికి కృషి చెయ్యాలన్నారు. రాష్ట్రంలో 21807 పంచాయితీలు ఉంటే కేవలం గంగదేవి పల్లి, హాజీ పల్లి, మేడే పల్లి, పాండురంగాపురం, రామచంద్రాపురం, జేగురుపాడు లాంటి కొద్ది గ్రామాలే ఎందుకు ఆదర్శ గ్రామాలుగా కొనియాడబడుతున్నాయో విశ్లేషించుకొని, మీ గ్రామంలో కూడా అటువంటి అభివృద్ధిని సాధించి, ప్రపంచ స్థాయిలో చీదేడు గ్రామానికి ప్రత్యేకత సంతరించుకొనేలా కృషి చేయాలన్నారు. ఈ ఒక్కరోజు జరిగిన శిక్షణా కార్యక్రమానికి గంగదేవి పల్లి సర్పంచ్ శ్రీ రాజమౌళి కూడా హాజరయి చీదేడు గ్రామం భారత నిర్మాణ వాలంటీర్లను చైతన్య పర్చారు. తమ గ్రామంలో జరిగిన అభివృద్ధి తీరు తెన్నులను గూర్చి వివరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న గ్రామ పంచాయితీ సభ్యులు, భారత్ నిర్మాణ వాలంటీర్లు ఎంతో స్ఫూర్తిపొంది, తమ గ్రామ సమగ్ర అభివృద్ధికి దోహదం చేస్తామని ప్రతిజ్ఞ పూనారు.

## ప్రతిజ్ఞ

"మంచాల మండలంలో చీదేడు గ్రామ పంచాయితీలో అపార్డు ద్వారా నిర్వహిస్తున్న కీక్యాప్ ల్యాబ్ టు ల్యాండ్ కార్యక్రమంలో స్వచ్ఛందంగా పాల్గొని గ్రామ సమగ్ర అభివృద్ధికి తోడ్పడుతాను. ఈ కార్యక్రమంలో నేను ముందుగా అన్ని ప్రభుత్వ కార్యక్రమాలపై అవగాహన పెంపొందించుకొని, ఆయా ప్రభుత్వ పథకాల ద్వారా ప్రజలకు అందవలసిన సేవలు / లబ్ధి వారికి సక్రమంగా అందేలా కృషిచేస్తాను. సమాజంలో వివిధ రూపాలలో ఉన్న చెడును ఎదుర్కొనేలా ప్రజలలో చైతన్యం నింపి, ఒక విజ్ఞాన సమాజాన్ని నిర్మించేందుకు, జాతి పునర్నిర్మాణానికి కృషి చేస్తానని ప్రతిజ్ఞ చేస్తున్నాను. చీదేడు గ్రామ పంచాయితీకి ప్రపంచ పటంలో విశిష్ట గుర్తింపు వచ్చేలా భాగస్వాముడనౌతానని ప్రతిజ్ఞ చేస్తున్నాను."





## అపార్డు శిక్షణతో చీదేడు గ్రామంలో సామాజిక చైతన్యం

ఫిబ్రవరి అపార్డు శిక్షణలో పాల్గొన్న చీదేడు భారత నిర్మాణ్ వాలంటీర్లు తమ గ్రామానికి చేరిన వెంటనే గ్రామ పెద్దలను సమావేశ పర్చి అందుబాటులో ఉన్న ప్రభుత్వ కార్యక్రమాలను వినియోగించుకొని చీదేడు గ్రామాన్ని పునర్మించుకొనాల్సిన ఆవశ్యకతను గూర్చి వివరించారు. ఈ మార్పుకు చోదకులుగా తాము వ్యవహరిస్తామని గ్రామస్తులకు భారత్ నిర్మాణ్ వాలంటీర్లు హామీ ఇవ్వటంతో, గ్రామస్తులు ముందుకు వచ్చి గ్రామ అభివృద్ధికి రానున్న 3 నెలల కాలంలో కలిసి కట్టుగా ఏం చెయ్యగల్గుతామని ఆలోచించి గ్రామంలో 1) సారాయి / మత్తు పానీయాల అమ్మకాన్ని, వినియోగాన్ని నిర్మూలించటానికి 2) గ్రామంలో సంపూర్ణ పారిశుద్ధ్యం సాధించి నిర్మల్ గ్రామ పురస్కారం పొందే స్థాయికి తీసుకొనిరావటానికి 3) గ్రామ ప్రజలు ఎవరూ పౌష్టికాహార లోపంతో బాధపడకుండా ఉండటానికి చర్యలు తీసుకోవాలని తీర్మానించారు. ఈ క్రమంలో ముందు గ్రామంలో మహిళలలో రక్త హీనత స్థాయిని తెలుసుకోవటానికి గాను స్థానిక ప్రభుత్వ వైద్యాధికారిణి సహాయంతో వైద్య శిబిరం నిర్వహణకు నడుంబిగించారు.

### రక్త పరీక్షా శిబిరం

ఆశయానికి ఆచరణ తోడైతే, అసాధ్యమనుకొన్నది సుసాధ్యమయితే ఆనందం అవధులు దాటుతుంది. సరిగ్గా తేది ఫిబ్రవరి 18న చీదేడు గ్రామ ప్రజల కళ్ళలో ఆనందం ఆవిష్కృతమైంది. చీదేడు పంచాయితీ భారత నిర్మాణ వాలంటీర్ల ఆధ్వర్యంలో మంచాల ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారిణి శ్రీమతి డా. నేతృత్వంలో వైద్య సిబ్బంది చీదేడు గ్రామంలో మొత్తం 189 మందికి రక్త పరీక్ష చేసి రక్తంలో హిమోగ్లోబిన్ శాతాన్ని పరీక్షించారు. ఈ రక్త పరీక్షా శిబిరం నిర్వహణానంతరం ఏర్పాటు చేసిన సమావేశానికి అపార్డు కమీషనరు శ్రీ కె. చంద్రమౌళి ముఖ్య అతిథిగా రావటంతో, గ్రామస్తుల ఆనందం అవధులు దాటింది. గతంలో జిల్లా కలెక్టరు జన్మ భూమి సందర్భంగా వచ్చినప్పటికీ, ఒక రాష్ట్ర స్థాయి అధికారి ఈ గ్రామాన్ని సందర్శించటం ఇదే మొదటి సారి అని గ్రామస్థులు స్ఫురణకు తెచ్చుకొన్నారు. ఈ సందర్భంగా అపార్డు కమీషనరు గ్రామస్థులను ఉత్తేజ పర్చేందుకు తన ప్రసంగంలో పలు ఆసక్తికరమైన అంశాలు, వివిధ దృష్టాంతాలు చెప్పారు. ఆయన మాట్లాడుతూ, చీదేడు ప్రజలలో ముఖ్యంగా భారత నిర్మాణ్ వాలంటీర్లలో ఉన్న పట్టుదల బాహ్య ప్రపంచానికి మార్గదర్శకం కావాలన్నారు. సామాజిక చైతన్యం తీసుకొని రావటం క్లిష్టమైన పని అయినప్పటికీ, ఈ పనిని గ్రామస్తులు స్వచ్ఛందంగా ఇష్టపడి చేపట్టటం వల్ల తేలిగ్గా మార్పు తీసుకొని రావచ్చునని చెప్పారు. సాధారణంగా ఏదైనా కొత్త బాధ్యతను చేపట్టినప్పుడు ఇది సాధ్యమేనా అని సందేహం కల్గటం సామాన్య విషయమనీ, కానీ అనుకున్న లక్ష్యాన్ని చేరటానికి ఒక ప్రణాళికా బద్ధమైన వ్యూహం అవలంబించటం ద్వారా ఇది సాధించవచ్చుని ఎన్నో సందర్భాలలో రుజువు అయ్యిందన్నారు. ప్రజలలో నిబిడీకృతమైన శక్తిని వెలికి తెచ్చి చీదేడు సమగ్రాభివృద్ధిలో ప్రతీ ఒక్కరూ పాలు పంచుకోవాలని ఉద్బోధించారు. క్రొత్త ఆలోచనలతో పయనం సాగించి సాధ్యమైన అభివృద్ధి పనులను గ్రామంలో చేపట్టి ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దాలని సూచించారు.

### ఆకట్టుకొన్న అపార్డ్ డాక్యుమెంటరీలు

చీదేడు గ్రామస్తుల కోరిక మేర అపార్డు బృందం చీదేడు గ్రామంలో ఫిబ్రవరి 18వ తేదీ రాత్రి గంగదేవిపల్లి, హాజీపల్లి గ్రామ పంచాయితీలపై రూపొందించిన డాక్యుమెంటరీ ఫిల్ములను ప్రత్యేకంగా ప్రదర్శించింది. మహిళా స్వయం సహాయక సంఘాలపై యునిసెఫ్ రూపొందించిన 'సంఘం' డాక్యుమెంటరీ ఫిల్మును కూడా ప్రదర్శించగా, ఈ చిత్రాలను సుమారు 500 మంది గ్రామస్థులు తిలకించి ఆనందం వ్యక్తం చేశారు. గంగదేవిపల్లి, హాజీపల్లి గ్రామ పంచాయితీల వలె తమ గ్రామం కూడా ఎప్పటికీ అభివృద్ధి చెందుతుందో అనే భావాలను వ్యక్తపర్చారు. ఈ కార్యక్రమానికి మంచాల మండల పరిషత్ అభివృద్ధి అధికారి శ్రీ యాదయ్య, ఎం.ఆర్.ఓ., ప్రత్యేక అధికారి, ఆర్.డబ్ల్యు.ఎస్. డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, అసిస్టెంట్ ఇంజనీర్లు పాల్గొన్నారు. ఈ ల్యాబ్



టు ల్యాండ్ - కీ క్యాప్ కార్యక్రమాన్ని అపార్డు నుంచి సి.ఎన్. ఆర్. ఎం. సెంటర్ హెడ్ శ్రీ హెచ్. కూర్మారావు సమన్వయ పరుస్తుండగా, ఇతర ఫ్యాకల్టీ సభ్యులు డా. లీలాప్రసాద్, డా. కృష్ణ మోహన్, ప్రొ. సూర్యనారాయణరెడ్డి, డా. శివశంకర్ ప్రసాద్, డా. శ్రీనివాస్, శ్రీమతి విజయలక్ష్మిలతో కూడిన బృందం ప్రతీ శుక్రవారం గ్రామాన్ని సందర్శించి సలహాలు, సూచనలు ఇస్తున్నది.

### చీదేడులో మద్యపానం కనుమరుగు - నాటుసారా, మత్తుపానీయాలు ఇక దొరకవు

కీ క్యాప్ కార్యక్రమ స్ఫూర్తిని అంది పుచ్చుకొన్న చీదేడు గ్రామ పంచాయితీ సభ్యులు, భారత నిర్మాణ్ వాలంటీర్లు తమ గ్రామంలో నాటు సారాకు, ఇతర మత్తుపానీయాల అమ్మకానికి స్వస్తి పలకాలని నిశ్చయించుకొన్నారు.

ఈ ప్రతిపాదన ముందుగా అపార్డులో శిక్షణకు హాజరైన మహిళా సంఘ సభ్యులు, భారత నిర్మాణ్ వాలంటీర్లు నుండి రాగా తరువాత గ్రామ పెద్దలందరూ చర్చించి, అసలు గ్రామంలో సారా, ఇతర మత్తుపానీయాల ద్వారా ఎంత ఆదాయాన్ని కోల్పోతున్నామని లెక్కించగా రోజుకి దాదాపు రూ.10000/-లు చొప్పున నెలకు రూ. మూడు లక్షలు, సంవత్సరానికి సంవత్సరంలో రూ.36 లక్షలు ఈ వ్యసనం వల్ల గ్రామం నుండి తరలి వెళ్తున్నట్లు కనుగొన్నారు. ఈ డబ్బుని కుటుంబ అవసరాల కోసం వినియోగించుకొన్నట్లయితే, మరింత సౌకర్యవంతంగా జీవితాలు గడపవచ్చని గ్రామస్థులు భావించారు. వెంటనే నాటు సారా, బ్రాందీ, విస్కీ, బీర్ వంటి మత్తు పానీయాలను గ్రామంలో అమ్ముతున్న నలుగురు వ్యాపారస్తులను పిలిపించి, గ్రామ ప్రజల నిర్ణయాన్ని విశదీకరించి చెప్పగా, ఈ నలుగురు వ్యాపారస్తులు కూడా గ్రామంతో పాటే కల్సి నడవటానికి నిర్ణయించుకొని తమ అంగీకారం తెల్పారు.



**సిద్ది గోని కళమ్మ & యాదయ్య**

గ్రామస్తుల నుండి డిమాండ్ ఉన్నది కాబట్టే మద్యం అమ్ముతున్నాను. ఈ అమ్మకాల వల్ల వచ్చే లాభం కన్న పోలీసులు, కోర్టుల చుట్టూ తిరగాలనే భయమే ఎక్కువ. కల్లు గీత నా కులవృత్తి. దానిలోనే ఆనందం ఉంది.

**దేవరకొండ నరసింహ**



మద్యం అమ్మకం ఒకటే నా ప్రధాన వృత్తి కాదు. కిరాణా షాపు ఉంది. నా భార్య మిషన్ కుడుతుంది. నేను ఉపాధి హామీ పనికి పోతాను. గ్రామ అభివృద్ధికి సహకరిస్తాను.



**పందుగుల యాదయ్య**

మద్యం అమ్మటం ద్వారా వచ్చే లాభం ఒకరిద్దరు పెట్టే అప్పుతోనే సరి. గత రెండు సంవత్సరాలలో సుమారు 3 సార్లు ఎక్సైజ్ వారు కేసులు పెట్టటం వల్ల రూ. 30,000/- నష్టపోయాను. గ్రామస్తులు తీసుకొన్న నిర్ణయానికి కట్టుబడతాను.

**పల్లె వెంకటేశు**



నెలకు రెండు వేల రూపాయలు నాకు నష్టం వచ్చినా, గ్రామస్తుల ఆరోగ్యం బాగు పడుతుందంటే సంతోషం. కిరాణా షాపుపై వచ్చే ఆదాయం చాలు. ఇక ఊళ్ళో ఎటువంటి గొడవలు ఉండవు.

వీరు తొలుత తటపటాయించినప్పటికీ, భారత్ నిర్మాణ్ వాలంటీర్లు, ఇతర గ్రామ పెద్దలు ఈ వ్యసనాల వల్ల తమ గ్రామం ప్రతీ ఏటా ఆర్థికంగా ఎంత నష్టపోతుందో విడమర్చి చెప్పటంతో స్వంత లాభం కొంత మానుకొని గ్రామ అభివృద్ధి కోసం సహకరించటానికి అంగీకరించారు.

తాము కూడా గ్రామంలో ఒక భాగమేనని భావించి గ్రామ సంక్షేమానికి చేయి చేయి కలపటానికి తాము చేస్తున్న అక్రమ వ్యాపారాలను మానివేసిన వీరు నిజంగా ఆదర్శనీయులు.

## పారిశుద్ధ్యంపై ప్రచారవ్యూహం

పారిశుద్ధ్య నిర్వహణ, రక్షిత నీటి వినియోగం వల్ల కలిగే ఆర్థిక లాభాల గుర్చి ప్రజలలో చైతన్యం కలగచేయటానికి అనుసరించాల్సిన వ్యూహాలను చర్చించటానికి యూనిసెఫ్ ఆధ్వర్యంలో అపార్డులో ఫిబ్రవరి 2న మాస్టర్ ఫెసిలిటేటర్లు, స్వచ్ఛంద సంస్థల కార్యకర్తలు, స్టేట్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చి & ట్రైనింగ్ ప్రతినిధులు, జిల్లా రిసోర్సు పర్సన్‌లతో ఒక వర్క్‌షాపును నిర్వహించారు. ఈ వర్క్ షాపులో పాల్గొన్న అపార్డు కమీషనరు శ్రీ కె. చంద్రమౌళి, ఐ.ఏ.ఎస్. మాట్లాడుతూ, స్వాతంత్ర్యం వచ్చి 6 దశాబ్దాలు గడిచినప్పటికీ, గ్రామీణ ప్రజల కనీస అవసరాలైన పారిశుద్ధ్యం, సంరక్షితమైన త్రాగునీరు నేటికీ అందుబాటులో లేక ప్రజలు మృత్యువాత పడుతున్నారని అన్నారు. అందుకే ప్రజలలో విస్తృత స్థాయిలో అవగాహన కలుగచేయటానికి బహుముఖ వ్యూహాన్ని అవలంభించాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమాన్ని సెంటర్ ఫర్ వాటర్ అండ్ సానిటేషన్ సెంటర్ హెడ్ డా. లీలా ప్రసాద్ సమన్వయపరిచారు.

# సహస్రాబ్ది లక్ష్యాల సాధనలో పంచాయితీ రాజ్ సంస్థల పాత్ర కీలకం




సహస్రాబ్ది అభివృద్ధి లక్ష్యాల సాధనకు భారత దేశంలో జరుగుతున్న కృషి, ఈ లక్ష్యాల సాధనకు పంచాయితీరాజ్ సంస్థలు చేస్తున్న కృషిని గూర్చి తెలుసుకొనేందుకు 10 దేశాల నుండి అధికారులు, 2.2011న అపార్డును సందర్శించారు. సహస్రాబ్ది అభివృద్ధి లక్ష్యాలను ప్రపంచ స్థాయిలో ఏర్పర్చుకొన్నప్పటికీ, వాటి సాధన గ్రామ స్థాయిలోనే మొదలు అవుతుందని అపార్డు కమీషనరు శ్రీ కె. చంద్రమౌళి అన్నారు. మానవ అభివృద్ధి రంగంలో పురోగతి సాధించేందుకు ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపర్చేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పలు అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నాయని, వీటిలో ముఖ్యంగా సర్వ శిక్షా అభియాన్, మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, సమగ్ర శిశు అభివృద్ధి సేవల పథకం, మధ్యాహ్న భోజన పథకం, జాతీయ గ్రామీణ ఆరోగ్య మిషన్, జాతీయ గ్రామీణ నీటి సరఫరా పథకం, సంపూర్ణ పారిశుద్ధ్య ఉద్యమం వంటి ఎన్నో ఫ్లాగ్‌షిప్ పథకాలకు పరిమితి లేకుండా నిధుల అందచేయటం జరుగుతోందని చెప్పారు. భారత దేశంలో ప్రణాళికీకరణ 1951లో ప్రారంభమైనప్పటికీ, పథక రచనలో ఉన్న స్ఫూర్తి క్షేత్ర స్థాయిలోని అమలు యంత్రాంగంలో కొరవడటంతో, నేటికీ మానవ అభివృద్ధి రంగంలో కింది స్థానంతో సరిపుచ్చుకోవాల్సి వచ్చిందని ఆయన అన్నారు. ఇదే సమయంలో ప్రణాళికల అమలులో మంచి ప్రతిభ కనబర్చి శ్రీలంక, సింగపూర్, థాయ్‌ల్యాండ్ వంటి దేశాలు ప్రగతి పథంలో ముందుకు పోయాయన్నారు. 1960ల దశకంలో 3.5% శాతం ఉన్న ఆర్థిక వృద్ధి రేటు నేడు 9% శాతం చేరినప్పటికీ, ధనిక - పేద తారతమ్యం దేశంలో రాను రానూ పెరుగుతోందని, ఈ ఆర్థిక వృద్ధి ఫలాలు ఇంకా పేదలకు చేరాల్సి ఉందని అన్నారు.




భారత దేశంలో జనాభా వృద్ధి రేటు అధికంగా ఉందనీ, ప్రతీ సంవత్సరం ఇంచు మించు ఆస్ట్రేలియా దేశ జనాభా అంత జనాభా భారతదేశంలో జన్మిస్తున్నారని, పెరుగుతున్న జనాభాకు అవసరమైన వసతుల కల్పనకు ప్రభుత్వం శ్రమించాల్సి వస్తోందని అన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇందిరమ్మ పథకం ద్వారా ప్రజలకు సేవల కల్పనలో దేశంలోని మిగతా రాష్ట్రాల కన్నా ముందుకు దూసుకుపోతోందని అన్నారు. ఈ సందర్భంగా వివిధ దేశాల నుండి వచ్చిన అధికారులు మన రాష్ట్రంలో 108 సేవలను ఏవిధంగా అమలు చేస్తున్నారు, సౌర విద్యుత్తు వినియోగం ఎలా ఉన్నది, అందరికీ త్రాగు నీరు, విద్య, గృహ వసతి కల్పించటానికి ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారన్న విషయాలపై ఆసక్తి కనబర్చారు. ఈ సందర్భంగా కమీషనరు గ్రామీణ ప్రాంతాలలో నీటి పారుదల, విద్యుదీకరణ, టెలిఫోన్ కనెక్షన్ల ద్వారా గ్రామాలను అనుసంధానించటం, అందరికీ గృహ వసతి, అందరికీ సురక్షిత త్రాగు నీరు అందించటానికి ఉద్దేశించిన భారత్ నిర్మాణ్ కార్యక్రమం గూర్చి వివరించారు. అపార్డు చేపట్టిన కీ క్యాప్ కార్యక్రమం గూర్చి కూడా వివరించారు.

ఈ కార్యక్రమంలో అపార్డు ఫ్యాకల్టీ సభ్యులు డా. కృష్ణ మోహన్, డా. లీలా ప్రసాద్, ప్రొ. సూర్యనారాయణరెడ్డి శ్రీ హెచ్.కె. రావు, డా. శివశంకర్ ప్రసాద్, డా. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. ఎన్.ఐ.ఆర్.డి. ప్రొఫెసర్లు శ్రీమతి సారుమతి, శ్రీ భాస్కర రావు ఈ పర్యటనను సమన్వయపర్చారు.



# అడవే ఆధారం... అడవే ఆలంబన....

అడవంటే కేవలం చెట్లే కాదు. జీవిస్తున్న ఒక సంక్లిష్టమైన సమూహం. అడవిని ఆధారంగా చేసుకుని పరస్పరాధారితాలైన అనేక చెట్లు, జంతువులు జీవిస్తుంటాయి. అడవిలో ఉండే నేల అనేక రకాల ప్రాణులకు, బ్యాక్టీరియాకు, ఫంగైకి నిలయంగా ఉంటుంది. నేలలోనూ, అడవిలోనూ పోషక పదార్థాలను అటూ ఇటూ సరఫరా చేయటంలో ఈ ప్రాణులు, బ్యాక్టీరియా, ఫంగై కీలక పాత్ర పోషిస్తుంటాయి...

అనాదిగా మానవజాతికి అడవి అత్యంత ప్రాముఖ్యం కలిగినది. పర్యావరణానికి, ప్రజలకు, జంతువులకు అడవి బహుళ ప్రయోజనాలను సమకూరుస్తుంది. ఫర్నిచర్ తయారికీ, గృహ నిర్మాణానికి, ఓడల తయారీకి, రైల్వే బెర్తులకు, ప్లైవుడ్ తయారీకి అడవి కలపను అందిస్తుంది. అంతేకాక వంట చెరకుగా ఉపయోగపడుతుంది. బొగ్గుగానూ ఉపయోగపడుతుంది. పేపర్ తయారీకి కూడా అడవులే అవసరం. సెల్లోఫేన్, ప్లాస్టిక్స్, రేయాన్, నైలాన్ వంటి సింథటిక్ ఫైబరీల తయారీకి, రబ్బరు తయారీకి అడవులే కావాలి.

అడవుల నుంచి పండ్లు, గింజలు, సుగంధద్రవ్యాలు లభిస్తాయి. కర్పూరం వంటి అనేక ఔషధాలకు కూడా అడవుల్లోని ఔషధ మొక్కలే ఆధారం.

చెట్లకున్న వేర్లు నేలను గట్టిగా పట్టి ఉంచుతాయి. భారీ వర్షాలకు నేల, భూసారం కొట్టుకుని పోకుండా ఈ ప్రక్రియ కాపాడుతుంది. వరదల ఉధృతిని చెట్లు తగ్గిస్తాయి.

అడవులు మానవాళికి చేసే మరో మహోపకారం ఉంది. చెట్లు వాతావరణంలోని కార్బన్‌డయాక్సైడ్‌ను పీల్చుకుని, ఆక్సిజన్‌ను వదులుతాయి. మానవాళి ఊపిరికి ఈ ఆక్సిజనే ప్రాణవాయువు.





అంతేకాక, అడవులు స్థానిక, ప్రపంచ వాతావరణాన్ని ప్రభావితం చేస్తాయి. భూమికి ఒక సురక్షితమైన కవచంగా అడవులు ఉపయోగ పడతాయి. అనేక అడవి జంతువులకు ఆశ్రమిస్తాయి. సకల ప్రాణుల ను సూర్యుని వేడి నుంచి, వాతావరణంలోని వేడి నుంచి అడవులు రక్షిస్తాయి. అడవులు వాతావరణంలోని వేడిని గ్రహించడం వల్ల, భూమి ఉష్ణోగ్రత క్రమబద్ధీకరణ చెంది, తద్వారా ఆహ్లాదకరమైన తద్వారా తగ్గుతోంది. అదేవిధంగా అడవులకు సహజసిద్ధమైన అటవీ ప్రాణులు కూడా అవసరమే. ఇవి పరస్పరాధారితాలు. ఇవన్నీ జీవన వలయంలో ముఖ్యమైన భాగాలు.

అంతేకాక, అడవులు కాంతి పరావర్తనాన్ని కూడా తగ్గిస్తాయి. శబ్దాలకు అడ్డుకట్ట వేస్తాయి. గాలి దిశ తీసుకోవడానికి సహకరిస్తాయి. గాలి వేగాన్ని కూడా తగ్గిస్తాయి.

క్లుప్తంగా చెప్పాలంటే, అడవుల విలువ అపారం. అనేక రకాల ముడిపదార్థాలకు ఆధారమవటమే కాక, స్థానికులకు ఉపాధిని కూడా అడవులు కల్పిస్తాయి. దేశ సంపదకు దోహదపడతాయి. అడవులు నీటిని సంగ్రహించి, మళ్లీ విడుదల చేస్తాయి. అడవులే లేకపోతే అనేక జంతువులు, ప్రాణులు అంతరించిపోయేవి.

భూమి మీద ప్రాణులకు అడవులు అత్యవసరం. మానవాళితో సహా వాటికి నీడ, గూడు అందించేది అడవులే. ఆశ్రయాన్నిచ్చేదీ అడవులే. సేద తీర్చేదీ అడవులే. శుభ్రమైన గాలిని, నీటిని అందించేదీ అడవులే.

నేడు ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న జనాభాతో అటవీ ఉత్పత్తులకు ఎనలేని డిమాండ్ ఏర్పడింది. అందుకోసం అడవులను నరకటం బాగా ఎక్కువైంది. నాణ్యత క్షీణించటం కూడా అధికమైంది.

ఒకప్పుడు అడవులు భూమి నేలలో 60 శాతం ఉండేవి. ఇప్పుడవి 30 శాతానికి తగ్గిపోయాయి. అభివృద్ధి పేరిట మనం అడవులను పోగొట్టుకుంటున్నాం. అడవుల స్థానంలో గనులు, పట్టణాలు, నగరాలు, రోడ్లు వస్తున్నాయి.

అటవీశాఖ నిబంధనల ప్రకారం, ఒకచెట్టు కొడితే దాని స్థానంలో 10 మొక్కలు నాటాలి. అయితే, ఆచరణలో అదేమీ అమలు కాదు. గత రెండు దశాబ్దాల్లో కేవలం ఒక శాతం మొక్కలనే నాటడం జరిగింది.

అడవులను విచ్చలవిడిగా నాశనం చేయటం వల్ల దేశంలోని వాతావరణానికి, ప్రాణులకు, సమతుల్యతకు ఎనలేని హాని











Stha_MarchSpread.indd 23 28/02/11 6:29 PM











కలుగుతోంది. నేల కూడా వదులయి కొట్టుకొనిపోతోంది. నేలలోని సారవంతమైన పై భాగం కొట్టుకుని పోవటం, భూసారం దెబ్బతినటం వల్ల వ్యవసాయ ఉత్పత్తులపై దుష్ప్రభావం పడుతోంది.

అడవుల ప్రాధాన్యతను చాటి చెప్పడానికి, వాటినుంచి మనం పొందుతున్న ప్రయోజనాలకు మరింత ప్రాచుర్యం కల్పించడానికి ప్రపంచవ్యాప్తంగా మార్చి 21న అంతర్జాతీయ అటవీ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. 1971లో జరిగిన యూరోపియన్ కాన్ఫెడరేషన్ ఆఫ్ అగ్రికల్చర్ సంస్థ 23వ సాధారణ సమావేశం సందర్భంగా ప్రపంచ అటవీ దినోత్సవాన్ని జరుపుకోవాలనే భావన వచ్చింది.

ఆ తరువాత సంవత్సరంలో ఐక్యరాజ్యసమితిలోని ఆహార, వ్యవసాయ సంస్థ ఈ భావనకు మద్దతు ఇచ్చింది. అడవుల ప్రాధాన్యతపై ప్రజలకు అవగాహన కల్గించడానికి ఇది ఉపకరిస్తుందని సంస్థ భావించింది. ప్రతి సంవత్సరం మార్చి 21న ప్రపంచవ్యాప్తంగా అటవీ దినోత్సవంగా జరుపుకోవాలని తదుపరి నిర్ణయించారు. గత 30 సంవత్సరాలుగా ప్రపంచ అటవీ దినోత్సవాన్ని అన్ని దేశాల్లో నిర్వహిస్తున్నారు.

అటవీ పెంపకంలోని ముఖ్యమైన మూడు అంశాలను ప్రపంచ అటవీ దినం మన ముందుకు తెస్తుంది. రక్షణ, ఉత్పత్తి, పునఃసృష్టి అనేవే ఆ మూడు అంశాలు.

"Ode to Trees" అనే కవితలో ఖలీల్ జిబ్రాన్ ఇలా అంటారు.

*"చెట్లు అనేవి భూమి ఆకాశం పై రాసే కవితల వంటివి. వాటిని మనం కూల్చివేసి, కాగితంగా మారుస్తాం - మన భావశూన్యతను ఆ కాగితం పై రికార్డు చేయటానికి" అని.*

ఎంత గొప్ప భావం!

సర్ ఫ్రాంక్ ఫ్రాసర్ డార్లింగ్ ఇలా అంటారు. *"అడవి నుంచి మనిషి దూరమయ్యాడు. అయినప్పటికీ, మనలో అడవి అంతర్భాగం"* అడవులను, ఇతర సహజసిద్ధమైన పర్యావరణాన్ని కాపాడుకోవాలనే ఆరాటానికి ఈ వ్యాఖ్యలు ప్రతీకలుగా నిలుస్తాయి.

అడవులు పర్యావరణ పరంగా, ఆర్థికంగా, సామాజికంగా ఎంతో మేలు చేస్తాయని, వాటిని సుస్థిరంగా అభివృద్ధి చేయటం అవసరమని రియోలో జరిగిన భూమి శిఖరాగ్ర సమావేశం గుర్తించింది. భూమిపై చెట్లను 2012 నాటికి 33 శాతానికి పెంచాలని కూడా ఈ సమావేశం

Stha_MarchSpread.indd 24 28/02/11 6:29 PM





తీర్మానించింది.  అలా క్రమంగా పెంచుకుంటూ పోవటం ద్వారా మాత్రమే భూగోళపు ఉష్ణోగ్రతను తగ్గించగలమని రియో సమావేశం ఉద్ఘాటించింది.

అడవులు క్రమంగా అంతరించి పోవటం వల్ల అటవీ జంతువులు నశిస్తున్నాయి. వాటర్ షెడ్లు క్షీణిస్తున్నాయి. చేపలకు నిలయమైన నీటి మడుగులు కుదించుకుని పోతున్నాయి. ఎంతో శక్తివంతమైన ఔషధాలు తుడిచిపెట్టుకుని పోతున్నాయి. నిజానికి అనేక ఔషధాలను అడవుల నుంచి ఇంకా కనిపెట్టవలసి ఉంది. అవి ఆవిష్కరణకు నోచుకోక ముందే అంతమైపోతున్నాయి.

గత అనేక సంవత్సరాలుగా అటవీ విస్తీర్ణం గణనీయంగా తగ్గిపోయింది. వ్యవసాయానికి, పరిశ్రమలకు, గృహనిర్మాణానికి, రోడ్లు, రైల్వేలు, హైడ్రో ఎలక్ట్రిక్ ప్లాంటుల నిర్మాణానికి అడవులను నిర్మూలిస్తూ వస్తున్నాం.

ఇవేకాక, అడవుల్లో పుట్టే కార్చిచ్చులు కూడా వాటికి ప్రాణాంతకంగా పరిణమించాయి. ఒకసారి కనుక అడవిలో ఒక భాగం అంటుకుంటే, ఆ కార్చిచ్చు అత్యంత వేగంగా అడవి మొత్తం పాకిపోతుంది. సాధారణంగా వేసవి కాలంలో ఇలా జరుగుతుంది. అప్పుడు అడవిలోని సమస్త జీవజాలం నశించిపోతుంది.

కొన్ని కార్చిచ్చులు ప్రమాదవశాత్తు ఏర్పడగా, కొన్ని ఉద్దేశ పూర్వకంగా చేస్తారు. అడవిలోని భూమిని స్వాధీన పరచుకోవడానికి, ప్రతీకారంగా, రకరకాల ఉద్దేశాలతో ఇది జరుగుతుంటుంది.

పశువులు మేయటం కూడా అడవుల రక్షణకు ప్రమాదంగా పరిణమిస్తోంది. పశువులు నిరంతరం మేస్తుండటం వల్ల, అడవిలోని నేలపై గడ్డి పలచబడి పోతుంది. దాంతో అది పొడిగా మారుతుంది. గడ్డి స్థానంలో కలుపుమొక్కలు, పొదలు వేళ్లూనుకుంటాయి. దాంతో కిందపడిన ఆకులు, రెమ్మలు కుళ్లి, నేలకు తిరిగి పోషకాలు అందించకుండా కలుపు పొదలు అడ్డుపడుతుంటాయి. నేల నిస్సారమైపోతుంటుంది.

కొన్ని అటవీ ప్రాంతాల్లో చమురు, సహజవాయువు, కొన్ని మినరల్స్ సమృద్ధిగా ఉంటాయి. కాని, ఇవి స్వల్పకాలిక ప్రయోజనాలను మాత్రమే అందిస్తాయి. ఇవి మళ్లీ మళ్లీ తయారు కావు. కొంతకాలానికి అయిపోతాయి. విషాదకరమైన విషయం ఏమిటంటే, ఈ స్వల్పకాలిక ప్రయోజనాలకు దీర్ఘకాలిక ప్రయోజనాలను అందించే అడవులను బలిపెట్టడం సాధారణమై పోయింది. అడవులపై దుష్ప్రభావం పడకుండా వనరులను వాడుకోవటం అసాధ్యమే.

అనేక చెట్లను, జంతువులను మనుషులు విపరీతంగా వాడి, వాటి అంతానికి దోహదపడ్డారు. అనేక అటవీ జంతువులను వాటి చర్మాల కోసం, దంతాల కోసం చంపుతున్నారు. వాటితో వ్యాపారాలు చేసి డబ్బు గడిస్తున్నారు. తద్వారా, అమూల్యమైన అడవులను, ప్రాణులను మనం పోగొట్టుకుంటున్నాం.

నేలలో, నీటిలో, గాలిలో ఉండే కాలుష్యం మన పర్యావరణ, జీవ వ్యవస్థలను దెబ్బతీస్తోంది. సున్నితమైన జీవ జాతులను అంతం చేస్తోంది. వ్యవసాయంలో విపరీతమైన పురుగుమందుల వాడకం వల్ల, అనేక జాతుల మొక్కలు, జంతువులపై దుష్ప్రభావం పడుతున్నట్లు మన దేశంలో జరిగిన అధ్యయనాలు నిరూపించాయి.

అడవుల పట్ల మన ప్రవర్తన, ఆదరణలు ఎట్లా ఉన్నాయో ఆలోచించి, తక్షణం కళ్లు తెరవవలసిన అవసరం ఉంది. మన వాతావరణం ఇటీవలి కాలంలో విపరీతంగా వేడెక్కిపోవటానికి చెట్లు నశించటమే కారణం. అడవులు కాలుష్యాన్ని గ్రహించి, స్వచ్ఛమైన గాలిని ఇస్తాయి.

మానవాళితో సహా సకలప్రాణులకూ పోషక పదార్థాలను, ఆశ్రయాన్ని ఇస్తున్న అడవులను రక్షించుకోవాల్సిన అవసరం ఉంది. ఇప్పుడున్న ప్రతి నగరం స్థానంలో ఒకప్పుడు అడవి ఉండేది. ఆ అడవిని నరికి, మనం నగరాలను, పట్టణాలను నిర్మించుకున్నాం.

అడవుల నిర్మూలనకు స్వస్తి చెప్పడానికి, కొత్త అడవులను సృష్టించుకోవటానికి ప్రతి ఒక్కరూ కదలాలి.

*– టి.నర్మద*



# పంచాయత్‌రాజ్ సంస్థల కంప్యూటరీకరణ

**కంప్యూటరీకరణ ప్రపంచవ్యాప్తంగా పెద్ద ఎత్తున జరుగుతోంది. నిత్యజీవితంలో అనేక సంస్థలు అనేక విధాలుగా కంప్యూటర్‌ల ను వినియోగిస్తున్నాయి. స్థానిక స్వపరిపాలనా సంస్థలైన గ్రామ పంచాయితీలు, మండల ప్రజా పరిషత్‌లు, జిల్లా ప్రజా పరిషత్‌లు తమ పరిపాలనలో భాగంగా వివిధ అంశాలకు సంబంధించి పారదర్శకత, జవాబుదారీతనాన్ని విశ్వసనీయతను పాటించవలసి ఉంటుంది. ఈ విధానం ఆయా సంస్థల పనితీరుకు అద్దం పడుతుంది.**

గ్రామ పంచాయతీల కంప్యూటరీకరణకు 'ఇ-పంచాయత్' అనే ఫ్లాగ్‌షిప్ ప్రాజెక్టును మన రాష్ట్రంలో 475 గ్రామ పంచాయితీలలో రాష్ట్ర పంచాయత్‌రాజ్ శాఖ 2005 సంవత్సరంలో ఆరంభించారు. ఇందులో జనన, మరణాల రిజిస్ట్రేషన్, ఇంటి పన్ను నిర్ధారణ, వసూలు, ట్రేడ్ లైసెన్సులు వంటి  అప్లికేషన్లు పొందుపరిచారు.



నేషనల్ ఇన్ఫర్మేటిక్స్ సెంటర్  ఈ సాఫ్ట్‌వేర్‌ను అభివృద్ధి చేసింది. పంచాయితీరాజ్ ఉద్యోగులకు రాష్ట్ర, జిల్లా స్థాయిలలో అనేక వర్క్‌షాపులు, ట్రైనింగు ప్రోగ్రాంలు నిర్వహించి ఈ అప్లికేషన్లు ఉపయోగించే విధానంపై అవగాహన కల్పించారు. ఈ ప్రాజెక్టు విజయవంతంగా అమలవుతుండటంతో గ్రామ, మండల, జిల్లా పంచాయతీ స్థాయిలకు కామన్‌గా వర్తించ 12 అంశాలపై నేషనల్ ఇన్ఫర్మేటిక్స్ సెంటర్ వారి సహకారంతో కొత్త అప్లికేషన్ రూపొందించటం జరిగింది. తద్వారా అన్ని స్థాయిల్లో పంచాయతీ రాజ్ సంస్థల పనితీరును ఎప్పటికప్పుడు పర్యవేక్షించి సమీక్షించటానికి, తగు  సూచనలివ్వటానికి ఈ కంప్యూటరీకరణ విధానం ఎంతో తోడ్పడుతుంది.

## 12 అంశాలు

**1. సమాచార హక్కు చట్టం;  2. వేలములు; 3. ఎన్నికైన ప్రజాప్రతినిధుల వివరాలు; 4. ఉద్యోగుల వివరాలు; 5. సమావేశాలు, తీర్మానాలు; 6. కోర్టు కేసులు; 7. ఆడిట్; 8. గ్రీవెన్సెస్ రిడ్రెసల్; 9. పీరియాడికల్స్ (ఎం.ఐ.ఎస్. రిపోర్టులు); 10. ఇన్‌స్పెక్షన్స్ (తనిఖీలు); 11. వర్క్స్, స్కీములు; 12. పనులు, పథకాలు**

ఈ వెబ్‌సైట్ కోసం http://epanchayat-pris.ap.nic.in ద్వారా login అవ్వాలి. డెమో కోసం http://epanchayat-pris demo.ap.nic.in ద్వారా లాగిన్ అవ్వాలి. మొదటిసారిగా లాగిన్ అయ్యే వారు తమకు కేటాయించిన యూజర్ నేమ్, పాస్‌వర్డ్‌ను ఆయా సంస్థలు వారిపై అధికారుల నుండి పొందవచ్చు. సాధారణ పౌరులు ఈ సైట్‌లోని హోం పేజీలో గల 'MIS portal of e panchayat' పై క్లిక్ చేస్తే, రాష్ట్రంలో గల అన్ని పంచాయతీరాజ్ సంస్థలకు సంబంధించిన రాబడి వ్యయాలు, వేలముల రిపోర్టు, అనధికారుల వేకెన్సీ వివరాలు, సమాచార హక్కు చట్టం కింద అందిన అప్లికేషన్లు, సమాధానాలు, బేలెన్స్ వివరాలు, ఇంటిపన్ను వివరాలు, పన్నేతరములు మొదలైన వివరాలన్నీ అబ్‌స్ట్రాక్ట్ రూపంలో పొందవచ్చు. అంతేకాక పౌరుల జనన, మరణ రిజిస్ట్రేషన్ వివరాలు, ట్రేడ్ లైసెన్స్ వివరాలు, ఇంటి పన్ను తాలూకు వివరాలు, ప్రజాప్రతినిధులు, అధికారుల వివరాలు పొందవచ్చు.

మొదటిసారి ఈ వెబ్‌సైట్‌లోనికి లాగిన్ అయిన వెంటనే 'యూజర్ మేనేజ్‌మెంట్' ఐకాన్ పైన క్లిక్ చేసి 'ఛేంజ్ పాస్‌వర్డ్' అన్న ఆప్షన్‌పై క్లిక్ చేసి పైఅధికారి నుండి పొందిన పాస్‌వర్డ్‌ను సంస్థ అధిపతి మార్చుకొనవచ్చును. ఇలా చేసిన యెడల ఆయా సంస్థలకు సంబంధించిన వివరాలు ఆ సంస్థ అధిపతి మాత్రమే అప్‌లోడ్ చేయటానికి, మార్పులు చేయటానికి, ఫ్రీజ్ చేయటానికి వీలవుతుంది.

తర్వాత యూజర్ రిజిస్ట్రేషన్ అన్న ఐకాన్‌పై క్లిక్ చేసి సంస్థలో 12 అంశాలకు సంబంధించిన విషయాలు చూస్తున్న సిబ్బందికి ప్రత్యేకంగా వ్యక్తిగత యూజర్ అకౌంట్లను, పాస్‌వర్డ్‌లను ఏర్పాటు చేసుకోవచ్చు. ఇందువలన వారి వారి సబ్జెక్ట్‌ను ఎప్పటికప్పుడు సైట్‌లో అప్‌లోడ్ చేయవచ్చు. సంస్థ అధిపతి కూడా వ్యక్తిగతంగా ఒక యూజర్ అకౌంట్‌ను ఏర్పాటు చేసుకోవచ్చు. యూజర్ అకౌంట్లను ఏర్పాటు చేసుకొని లాగిన్






Sthanka_Marchcolo.indd 31 28/02/11 6:31 PM

అవడం ద్వారా 12 అంశాలకు సంబంధించి 1. క్రియేట్ 2. మోడిఫై 3. వ్యూ అన్న ఆప్షన్స్ ద్వారా అన్ని వివరాలనూ అప్‌లోడ్ చేయవచ్చు. అవసరమైన చోట మోడిఫై చేసుకొని 'వ్యూ' ఆప్షన్ ద్వారా చూడవచ్చు.

కానీ సంస్థ యూజర్‌నేమ్, పాస్‌వర్డ్ (మార్పు చేసుకున్న)తో ఆ సంస్థ అధిపతి 12 అంశాలకు సంబంధించి 1. వ్యూ 2. ఫ్రీజ్ ఆప్షన్స్ మాత్రమే పొందగలరు. అంటే దీని ఉద్దేశం సిబ్బంది అప్‌లోడ్ చేసినవన్నీ చూసి 'ఫ్రీజ్' చేసే అధికారం వీరికి మాత్రమే ఉంటుంది. అంతేగాక మాస్టర్ డేటాను క్రియేట్ చేసే ఆప్షన్ కూడా వీరికే ఉంటుంది.

పి.ఆర్.ఐ. మాస్టర్స్ అనే ఐకాన్ క్లిక్ చేసి ఆ సంస్థకు సంబంధించిన ప్రాథమిక వివరాలు అనగా ఆప్షన్ అంశాలు, నియోజవర్గ వివరాలు, ఆడిట్ ఆఫీసర్, ఇన్స్‌పెక్షన్ ఆఫీసరు వివరాలు, వర్కు కాంట్రాక్టర్ల వివరాలు, సమాచార హక్కు చట్టమునకు సంబంధించిన అధికారుల వివరాలు, సంబంధిత ఆఫీసులు, డి.డి.ఓ. వివరాలు, ఇన్‌స్పెక్షన్ ఆఫీసులు, వర్క్ ఎగ్జిక్యూషన్ ఆఫీసులు అనే10 అంశాలు ఒకే ఒక్కసారి నమోదు చెయ్యటం ద్వారా తదుపరి లావాదేవీల ను కొనసాగించటానికి పునాదిలా ఉంటుంది.

### *12 అంశాల వివరాలలోనికి వెళితే . . .*

**1. సిబ్బంది వివరాలు :** ఈ అంశంలో ఆయా సంస్థలలో పని చేస్తున్న సిబ్బందికి సంబంధించిన గుర్తింపు వివరాలు, జాయినింగ్ వివరాలన్నీ నమోదు చేయాలి.

**2. ఎన్నిక కాబడిన ప్రజాప్రతినిధులు వివరాలు :** ఈ అంశంలో ఎన్నికైన ప్రజాప్రతినిధుల పదవీకాలం, వ్యక్తిగత వివరాలు, ఓడిపోయిన వారి వివరాలు, పదవీకాలం ముగిసే సమయం, కాజువల్ వేకెన్సీ వివరాలు నమోదు చేయాలి.

**3. సమాచార హక్కుచట్టం :** ఈ అంశంలో పౌరసమాచార అధికారి, సహాయ పౌర సమాచార అధికారి, అప్పిలేట్ అథారిటీల వివరాలు, అందుకున్న దరఖాస్తుల వివరాలు, వాటికి ఇచ్చిన సమాధానాల వివరాలు నమోదు చేయాలి.

**4. వేలములు :** ఈ అంశంలో వేలములకు సంబంధించిన పూర్తివివరాలు, (బిడ్డర్‌తో సహా), బిడ్డర్ మార్పు వివరాలు, రికవరీలు నమోదు చేయాలి.

**5. మీటింగులు, తీర్మానాలు :** ఈ అంశంలో మీటింగు వివరాలు, అజెండా అంశాలు, మీటింగు హాజరు, మినిట్స్, అజెండా వర్క్స్, సమావేశం ముగింపు వివరాలు నమోదు చేయాలి.

**6. ఆడిట్స్ :** ఈ అంశంలో ఆడిట్ ఆఫీసరు వివరాలు, ఆడిట్‌పేరాలు, ఆడిట్ పేరా సమాధానాలు, సర్‌ఛార్జ్ సర్టిఫికేట్ వివరాలు, రికవరీ వివరాలు నమోదు చేయాలి.

**7. కోర్టుకేసులు :** ఈ అంశంతో కోర్టుకేసు వివరాలు, పిటీషనరు లేదా రెస్పాండెంట్ వివరాలు, కేసు ఏ దేశంలో ఉన్నది అన్న వివరాలు నమోదు చేయాలి.

**8. గ్రీవెన్స్ రిడ్రెసల్ :** ఈ అంశంలో సమస్యల పరిష్కారం కోసం అందిన దరఖాస్తు వివరాలు, ఇచ్చిన పరిష్కార వివరాలు నమోదు చేయాలి.




**9. డిసిప్లినరీ కేసులు :** ఈ అంశంలో కంప్లెయింట్ వివరాలు, అభియోగం మోపబడిన వ్యక్తి వివరాలు, ప్రాథమిక/రెగ్యులర్ ఎంక్వయిరీ ఆఫీసర్ వివరాలు, ప్రాథమిక ఎంక్వయిరీ వివరాలు, ఛార్జ్‌మెమో వివరాలు, ఛార్జెస్, వివరణలు, విచారణ వివరాలు, విచారణపై అభియోగం మోపబడిన ఆఫీసర్ వివరణ, షోకాజ్ నోటీసు, డిసిప్లినరీ ఆర్డర్స్ వివరాలు నమోదు చేయాలి.

**10. ఇన్స్‌పెక్షన్లు :** ఈ అంశంలో టార్గెట్లు, తనిఖీలు, తనిఖీ నోట్సు, రెక్టిఫికేషన్ నోట్సు, టార్గెట్ క్లోజర్ అనే వివరాలు నమోదు చేయాలి.

**11. వర్క్స్, స్కీములు :** ఈ అంశంలో అడ్మినిస్ట్రేటివ్ శాంక్షన్, టెక్నికల్ శాంక్షన్, పని కేటాయింపు వివరాలు, యం.బుక్. వివరాలు, పని ఖర్చు వివరాలు, తగ్గింపులు/రికవరీలు, రెమిటెన్స్ సబ్‌మిషన్ వివరాలు, వర్క్ ప్రోగ్రెస్ ఫొటోలు, డబ్బు రిలీజ్ వివరాలు నమోదు చేయాలి.

**12. పీరియాడికల్స్ (యం.ఐ.యస్.రిపోర్టులు) :** ఈ అంశాన్ని 'ఇ-పంచాయితీ - మేనేజ్‌మెంట్ ఇన్ఫర్మేషన్ సిస్టం' అంటారు. ఇ-పంచాయితీ హోంపేజీలో MIS portal of ఇ-పంచాయితీ పైన క్లిక్‌చేస్తే ఈ సైట్ ఓపెన్ అవుతుంది. ఇందులో 3 రకాల మాడ్యూల్స్ ఉంటాయి. 1. అన్ని పంచాయితీ రాజ్ సంస్థల కాంప్రహెన్సివ్ ఫైనాన్స్ మేనేజ్‌మెంట్ ఇన్ఫర్మేషన్ సిస్టం (2) అన్ని గ్రామ పంచాయితీల రెవెన్యూ పనుల మానిటరింగ్ సిస్టం (3) అన్ని పంచాయితీరాజ్ సంస్థల ప్రాజెక్టు స్టేటస్ మానిటరింగ్ సిస్టం.

అంతేగాక, మొదట్లో తెలిసి జేసిన విధంగా సాధారణ పౌరులు కూడా సంబంధిత వివరాలను ఈసైట్ ద్వారా పొందవచ్చు.

ఈ సైట్ యొక్క ముఖ్య లక్ష్యం పంచాయితీ రాజ్ సంస్థల రాబడులు, వ్యయాల ప్రగతిని, సమీక్షించడం, ఇ-పంచాయితీ ప్రాజెక్టు అమలు తీరు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ తగు సూచనలివ్వడం.

పైన తెలిపిన 12 అంశాలను సంబంధించి 'రిపోర్టు' లను ప్రింట్ తీసుకోవచ్చు.

రాష్ట్రంలోని అన్ని పంచాయితీరాజ్ సంస్థలు త్వరిత గతిన ఈ కంప్యూటరీకరణ ప్రక్రియను వినియోగించుకొని, తద్వారా సరళీకృత పరిపాలనతో ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందిస్తాయని ఆశిద్దాం.

*- బొల్లినేని శ్రీలక్ష్మి,*
*ఫ్యాకల్టీ మెంబర్, సిడిపిడిపి సెంటర్, అపార్డ్*



Sthanka_Marchcolo.indd 32 28/02/11 6:31 PM



# సుస్థిర వ్యవసాయానికి గుండె కాయ 'పొలంబడి'

**సుస్థిర వ్యవసాయం అంటే స్థానిక వనరులతో, శాస్త్రీయ విజ్ఞానాన్ని, స్థానిక జ్ఞానాన్ని జోడించి, సహజ వనరులను పెంపొందించే పర్యావరణ అనుకూలమైన పద్ధతుల ద్వారా, దిగుబడులు తగ్గకుండా చేసే వ్యవసాయం. ప్రకృతిలో జరిగే సహజ ప్రకియలను అర్ధం చేసుకోవడం ఈ వ్యవసాయంలో ముఖ్య సూత్రం.**

సుస్థిర వ్యవసాయ కార్యక్రమానికి 'పొలంబడి' గుండె వంటిది. రైతులు సంఘాలుగా ఏర్పడి వ్యవసాయ క్షేత్రాలను సందర్శించి, వ్యవసాయ క్షేత్రాలను సునిశితంగా పరిశీలించి, పంటలో జరుగుతున్న మార్పులను, పురుగులను, తెగుళ్లను, వాతావరణ పరిస్థితులను గమనించి సమావేశాలలో చర్చించి నిర్ణయాలు తెలుసుకొనే వేదిక పొలంబడి. చిన్న చిన్న ప్రయోగాలు చేయడం ద్వారా రైతులలో అంతర్గతంగా వున్న సృజనను వెలికి తీయడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం. పొలంబడి కార్యక్రమం వారానికి ఒకసారి జరుగుతుంది. వారానికి ఒక రైతు వ్యవసాయ క్షేత్రంలో పొలంబడి చెయ్యడం జరుగుతుంది. పొలంబడిలో రైతులు ''చేయడం ద్వారా నేర్చుకుంటారు''. 3-4 సస్యమిత్ర సంఘాలు కలిసి ఒక పొలంబడి చెయ్యడం జరుగుతుంది.

## సస్యమిత్ర సంఘం

ఒక గ్రామంలో ఒకే దగ్గర వ్యవసాయ క్షేత్రాలు వున్న 20-25 మంది రైతులు కలిసి సస్య మిత్ర సంఘంగా ఏర్పడతారు. ప్రతి సస్యమిత్ర సంఘంలో ఒక కన్వీనర్, ఒక కో-కన్వీనర్ వుంటారు. ఇందులో ఒకరు తప్పనిసరిగా మహిళ వుంటారు. ఇలాంటి 3-4 సస్యమిత్ర సంఘాలు కలిసి పొలంబడి నిర్వహించుకోవడం జరుగుతుంది.

## పొలంబడి లక్ష్యాలు

1. రైతులను శాస్త్రవేత్తలుగా చేయడం
2. ఆరోగ్యకరమైన పంటను పెంచటం
3. పంటలలో వచ్చే మార్పులను. పురుగులు, తెగుళ్లను తరుచుగా గమనించటం
4. అదిక దిగుబడులను సాధించటం

## పొలంబడిలో వివిధ అంశాలు

1. వ్యవసాయ పర్యావరణ విశ్లేషణ
2. ప్రయోగాలు
3. ప్రత్యేక అంశాలు
4. క్షేత్రదినోత్సవం

### వ్యవసాయ పర్యావరణ విశ్లేషణ

1. పొలంబడి కార్యక్రమానికి వ్యవసాయ పర్యావరణ విశ్లేషణ గుండె వంటిది. పొలంలో ఒక మూల నుండి ఇంకో మూలకు 20 మొక్కలను తీసుకొని అన్ని అంశాలను అంటే కొమ్మలు, పువ్వులు, శత్రు పురుగులు, మిత్ర పురుగులు, తెగుళ్ళు, కలుపు మొక్కలు గమనించాలి. అదేవిధంగా ఆ రోజు వాతావరణ పరిస్థితులు అంటే ఉష్ణోగ్రత, మబ్బులు పట్టి వున్నాయా వంటి విషయాలు గమనించాలి.

### పొలంబడిలో చేయవలసిన ప్రయోగాలు

పొలంబడిలో రైతుల సృజనను వెలికి తీయడానికి ప్రయోగాలు నిర్వహించాలి. ప్రయోగాలు రెండు రకాలు 1. దీర్ఘకాలిక ప్రయోగాలు 2. స్వల్పకాలిక ప్రయోగాలు

### మల్చింగ్

పొలంలో భాగాన్ని లేదా కొన్ని వరుసల మొక్కలను ఆకులు, ఇతరచెత్తతో కప్పి ఉంచాలి. మిగిలిన భాగాన్ని అట్లే ఉంచాలి. మల్చింగ్ చేసిన భాగం లేదా వరుసలకు తేడాను ప్రతి పొలంబడిలో గమనించాలి. అవి బాగా పెరుగుతాయి. అంతేకాక ఎక్కువ రోజులు ఆరకుండా ఉంటుంది. మల్చింగ్ చేసిన ఆకులు కుళ్ళి మంచి ఎరువు అందుతుంది.

దీన్ని ప్రతి గ్రామ/క్లస్టర్ కార్య కర్త తప్పనిసరిగా తన కమతంలో కనీసం కొంత భాగంలోగాని, కొన్ని వరుసలకు గాని పాటించాలి. ఇతర రైతుల కమతాల్లో అమలు చేయించాలి.

### వరి పెరుగుదలపై అజొల్ల ప్రభావం

రెండు ప్లాస్టిక్ డబ్బాలు తీసుకొని వాటిలోకి మూడు నుండి నలుగు సార్లు బాగా కడిగిన ఇసుకను సమానంగా పోయాలి. తరువాత నీటిని కూడా సమానంగా పోయాలి. రేకు డబ్బాలలో సమాన ఎత్తు ఉన్న వరి పిలకలను రెండు తీసుకొని ఒక్కొక్కదానిలో ఒక్కొక్కటి పెట్టాలి. ఇప్పుడు రెండు డబ్బాలలో ఒకదానిలో మాత్రమే అజొల్ల వెయాలి.

దీనిని తరువాత రెండు/మూడు పొలం బడులలో వరి ఆకుల రంగు, మొక్క ఎత్తు గమనించాలి. అజొల్ల వేసిన డబ్బాలో ఉన్న వరి మొక్క పెరుగుదల బాగా వుంటుంది. ఆకులు ఆకుపచ్చ రంగులో వుంటాయి. దీనిని బట్టి అజొల్ల వరిలో వేయటం వల్ల నత్రజని అందుతుంది.

ప్రతి గ్రామ/క్లస్టర్ కార్యకర్త పొలం బడిలో కషాయాల తయారీ గురించి రైతులకు చెప్పిటప్పుడు ఉదాహరణకు ఘనజీవామృతం తయారీ గురించి రైతులకు చెప్పేటప్పుడు దానికి కావలసిన పదార్థాలు కూడా కొద్ది మొత్తంలో తీసుకువచ్చి అందరి రైతులముందు పెట్టి, నలుగురైదుగురి మంది రైతులతో చిన్న గ్రూపులలో చెప్తూ తయారు చేయించాలి.



**ప్రత్యేక అంశాలు :** వ్యవసాయంలో వస్తున్న కొత్త అంశాలు, కొత్త సాంకేతిక విధానాలపై చర్చించడం ఉదా: శ్రీవరి, విత్తన బ్యాంకులు మొదలైనవి.

**క్షేత్ర దినోత్సవం :** పంట కోత రోజే గ్రామంలోని ఇతర రైతులను ఆహ్వానించి సీజన్‌లో అమలు చేసిన పద్ధతులను వివరించి, పంట కోత ప్రయోగాలూ నిర్వహించాలి.

### పొలంబడి నిర్వహణకు కావలిసిన వస్తువులు

1. బోర్డు, పెన్నులు, సుద్దముక్కలు
2. స్టాండ్స్, క్లిప్పులు
3. చార్ట్‌లు
4. పొలంబడి రిజిస్టర్
5. రసం పిల్చే పురుగులు కోసం చిన్న సీసాలు
6. పెద్ద పురుగుల కొరకు ప్లాస్టిక్ సిసాలు
7. కెమెరా
8. పురుగులను పట్టే వల
9. భూతద్దం
10. పురుగుల సేకరణ బాక్స్
11. పెన్సిల్స్, కత్తెర, రబ్బరు

### పొలంబడిలో కార్యకర్తల విధులు, బాధ్యతలు

1. పొలం బడిలో గ్రామ కార్యకర్తగాని, క్లస్టర్ కార్యకర్త గాని ఒక ఉపాధ్యాయుడుగా వ్యవహరించకూడదు.
2. ప్రతి వారం అన్ని సస్యమిత్ర సంఘాలలో పొలం బడి జరిగేటట్లు చూడడం.
3. పొలం బడిలో కనుగొన్న విషయాలు, తీసుకున్న నిర్ణయాలను నల్ల బల్లపై గ్రామ కూడలిలో అందరికీ కనబడేటట్లు రాయాలి.
4. పురుగుల జీవితచక్రాలు, తెగుళ్ల, పోషకలోపాలపై హీర్బేరియం తయారు చేయాలి.
5. పొలం బడి రిజిస్టర్‌లో పొలంబడి వివరాలు నమోదు చేయాలి.

- కిల్లి జయరాం
- పొట్లేళ్ల పెంచల్ కుమార్
- విశ్వశ్రీ

# కోరికలు మితం జీవితం వర్ణశోభితం

**కాలానుగుణంగా ప్రకృతి తన రూపు మార్చుకొంటూ ఉంటుంది. ఆకురాలు కాలంలో రాలిన ఆకులన్నీ ఫాల్గుణమాసంలో వసంతాగమనంతో మళ్ళీ చివురించి కొత్త శోభను పొందుతాయి. ప్రకృతికి కొత్త అందాల్ని తొడిగేది వసంతమే. ఈ వసంతం రాబోయే చైత్రుడి కోసం నిండు జవ్వనిలా తయారై ఎదురు చూస్తూ ఉంటుంది. అందువల్లనే ఈ కాలం అత్యంత రమణీయంగా, శోభాయమానంగా ఉంటుంది. వసంతం ఋతువుల రాణి. ఆహ్లాదభరితమయిన ప్రకృతి కోరికలు గుర్రాలై పరుగులు తీసే సమయంలో మనసును అదుపులో ఉంచుకోవాలనే శుభ సందేశంతో ఏర్పాటు చేసిన పుణ్య పర్వ దినమే హోళీ పండుగ. ఇది ఫాల్గుణ పౌర్ణమినాడు అందరూ ఆనందోత్సాహాలతో వర్ణాలు సముద్రంలా ఉప్పొంగే రీతిలో జరుపుకొనే ఒక దివ్య సంప్రదాయం.**

## అనాదిగా హోళీ

ప్రాచీన కాలంలో దీనినే వసంతోత్సవమని, మదనోత్సవమని, కాముని పున్నమి అని పిలుస్తారు. అదుపు తప్పే స్థితిలో సంయమనం పాటించాలన్నదే హోళీ పండుగ మనకి ఇచ్చే సందేశం. 'శ్రేయో భూయాత్ సకల జనానాం' అని గృహ్య సూత్రాలు చెప్తున్నాయి. కోరికలు మితంగా ఉండాలని దీని అర్థం.

అలాగే శ్రీకృష్ణుడూ భగవద్గీతలోని కర్మయోగంలో - *'జహి శత్రుం మహా బాహో॰ కామరూపం దురాసదం'* అని కామాన్ని జయించాలని సూచన చేశాడు.



మనలో మితిమీరి పేట్రేగే కాముడిని సంహరించిన తరువాత జీవితం వర్ణశోభితమవుతుంది. దానికి ప్రతీకగా రంగులు పులుముకొంటూ చేసుకొనే పర్వదినమే హోళీ.

ప్రాచీన కాలంలో ఈ రంగులకు మోదుగపూలను వాడేవారు. ఇవి చర్మానికి శోభను చేకూర్చేవి. మోదుగపూలను ఎండబెట్టి దానినుండి తయారు చేసిన రంగులు వాడేవారు. ఇది ఆరోగ్యానికి దోహదకారి మాత్రమే కాక, ఈ కాలంలో వచ్చే రోగాలకు దివ్యమయిన ఔషధంలా పనిచేస్తుంది. శ్రీకృష్ణుడు గోపికలతో ఈ రంగుల కేళిని ఆడటానికి ఆధారాలున్నాయి. వసంత ఋతువులో సరస్వతీదేవిని వసంత పంచమి నాడు పూజిస్తారు. అలాగే సస్యదేవత అయిన వసంతుణ్ణి, ప్రేమ దేవత అయిన కాముడిని, అనురాగదేవత అయిన రతిని పూజించడం ఈ పండుగ విశేషం.

మాఘం నుంచి చైత్రం వరకు ఉన్న ఈ కాలంలోనే పెళ్ళిళ్ళు ఎక్కువగా జరుగుతాయి. ఈ కాలం దాంపత్యానికి, అన్యోన్య అనురాగానికి అనుకూలమయిన కాలమని తెలిసిన పెద్దలు ఇదొక సంప్రదాయంగా ఏర్పాటు చేశారు.

## పౌరాణిక నేపథ్యం

శివుడు మన్మథుణ్ణి దహించిన రోజు ఫాల్గుణ పౌర్ణమి నాడే. అంటే హోళీ రోజే. కామదహనం జరిగిన తరువాత హోళీ రోజున రతీమన్మథుల ను పూజిస్తే సౌఖ్యాలు విరబూస్తాయని, నవదంపతులకు సత్సంతాన ప్రాప్తి కలుగుతుందని భవిష్యపురాణం చెప్తోంది.

హిరణ్యకశిపుడి సోదరి హోలిక అనే ఒక రాక్షసి ఉండేది. ఆమెను అగ్ని కూడా దహించ లేకపోయేవాడు. ప్రహ్లాదుణ్ణి చంపడం కోసం హోలిక తన ఒళ్ళో ప్రహ్లాదుని కూర్చోబెట్టుకొని అగ్ని ప్రవేశం చేస్తుంది. హరిభక్తి వల్ల ప్రహ్లాదుడు రక్షింపబడతాడు. హోలిక దహింపబడుతుంది.

## సామాజికంగా హోళీ

ఈ కాలానికే సరిగ్గా పంటలు చేతికి అంది వస్తాయి. ఆ ఆనందంలో ప్రజలు చేసే హాహాకారాలే హోళీగా పరిణమించిందని సామాజిక శాస్త్రవేత్తల అభిప్రాయం.

# రంగుల కేళి హోళీ

శిశువుల్ని చంపే హోలిక అనే రాక్షసిని చంపిన సందర్భంగా ఈ పండుగ జరుపుకొంటారనే ఒక కథ ప్రచారంలో ఉంది.

హోలిక అనే రాక్షసి రోజూ కొంతమంది పిల్లల్ని చంపుకుతింటూ సమాజాన్ని పట్టి పీడిస్తోంది. దానిని చంపాలంటే పరుష పదజాలంతో దూషించాలని ఒక యోగి జనులకు చెప్పాడు. ప్రజలు అలాగే చేశారనీ, అప్పుడు తల పగిలి చచ్చిన హోలికను దహనం చేసి రంగులు పులుముకొంటూ ప్రజలు ఆనందోత్సాహాలతో పండుగ చేసుకొన్నారనీ కథ ప్రచారంలో ఉంది.

## చారిత్రకంగా హోళీ

2300 ఏళ్ళనాటి ధులే వసంతియా శాసనం, రెండువేల ఏళ్ళనాటి గాథాసప్తశతి గ్రంథం హోళీ పండుగను ప్రస్తావించడమే కాదు, గొప్పగా వర్ణించాయి. నికోలకాంటి, అల్బెరూనీ మొదలయిన విదేశీ యాత్రికులు కూడా భారతదేశంలో జరిగే పండుగల గురించి చెప్తూ హోళీని విశేషంగా వివరించారు.

## హోళీ పరమార్థం

ప్రాకృతికమయిన పరిణామాలకు ప్రతీక హోళీ. అందరి మధ్య స్నేహాన్ని, వాత్సల్యాన్ని పెంపొందింపజేస్తుంది. మానవ సంబంధాలు కలకాలం పదిలంగా ఉండేవిధంగా హోళీ సహకరిస్తుంది. అశాశ్వతాలు, తుచ్ఛమయినవీ అయిన కోరికలను ఎవరికి వారే దహింప జేసుకోవాలని, అంతరంగాన్ని ఎల్లప్పుడూ పరిశుభ్రంగానూ, పరిమితులకు లోబడి ఉండేవిధంగానూ చూసుకోవాలని, తద్వారా మానసిక ఆనందాన్ని, ఆరోగ్యాన్ని సమకూర్చుకోవాలనీ సందేశాన్నిస్తోంది హోళీ పండుగ.

*- డా. యస్. ఏ. టి. రాజ్యలక్ష్మి, తెలుగు అకాడమి*



Sthanka_Marchcolo.indd 30 28/02/11 6:31 PM

# గొర్లే కొప్ప
# బసవన్న గుడే కోర్టు
# ప్రజలే న్యాయ మూర్తులు

**భారతదేశం గ్రామాల్లోనే నివసిస్తుందన్నారు గాంధీజీ. గ్రామాలు స్వయం పోషకం కావాలని ఆయన ఆశించారు. గ్రామపాలనా వ్యవహారాలన్నీ స్థానికుల వల్లనే జరిగినపుడు స్థానికపాలన అన్నమాట సార్థకమవుతుంది. స్థానికపాలనకు ప్రత్యక్ష సాక్ష్యంగా వున్న గ్రామం గొర్లే కొప్ప.**



కర్ణాటక రాష్ట్రం కొప్పల్ జిల్లాలోని చిన్న గ్రామం గొర్లే కొప్ప. కేవలం 500 వందల జనాభా వున్న గ్రామం. ఇక్కడ ప్రజలు ఉదయం పూట మాత్రమే, ప్రధానంగా గ్రామంలోని కట్టె బసవేశ్వర ఆలయం వద్ద కనిపిస్తారు. మధ్యాహ్నం నుండి సాయంకాలందాకా గ్రామవీధులన్నీ నిర్మానుష్యంగా వుంటాయి. గ్రామీణులందరూ తమ పొలాల పనుల్లో నిమగ్నులై వుంటారు. పాడి, పశుపోషణ వారి ప్రధాన జీవనాధారం.

గొర్లే కొప్ప జానపద కళారూపమైన 'కరడిమజలు' రాష్ట్రంలోనే పేరు గాంచింది. 'కరడి మజలు' మేళాలో కళాకారుడు 'కరడి' (తబలా) ని తన రెండు కాళ్ళ మధ్య వుంచుకొని వాయిస్తుంటాడు. అతనికి తోడుగా ఇద్దరు 'చే కాస్,' 'దిమ్' వ్రాయిస్తారు. ఈ కళా ప్రదర్శన, గత ముప్పదేళ్ళుగా, మైసూరు దసరా ఉత్సవాలు, హంపి ఉత్సవాల్లోనే కాక, కర్ణాటక రాష్ట్ర సాంస్కృతిక శాఖ వారు ముంబైలో కూడా ప్రదర్శింపచేశారు.

### పోలీస్‌స్టేషన్ చూడని గ్రామం!

ఊరన్న తర్వాత చిన్న చిన్న తగాదాలుంటాయి. ఆ తగాదాలన్నే విచారణ జరిపే కోర్టు గ్రామంలోని కట్టే బసవన్న ఆలయం!

కుటుంబ తగాదాలు, ఇతర వివాదాలు జరిగినపుడు బాధితుడు గ్రామ పంచాయితీ సభ్యునికి తెలియజేస్తాడు. మరుసటి రోజు సాయంత్రం, పంచాయితీ సభ్యులు, గ్రామ మునసబు, కక్షిదారులందరూ సమావేశమౌతారు. గొడవలతో ప్రత్యక్ష సంబంధం వున్న వారు తమ వాదాన్ని నివేదిస్తారు. పెద్దలు అందరి అభిప్రాయాలను విని తీర్పు చెబుతారు. ఆ తీర్పును ఇరు పక్షాలవారు శిరసావహిస్తారు. మా గ్రామ పంచాయితీ తీర్పు, హైకోర్టు, సుప్రీంకోర్టు కంటే మిన్న.




ఈ పంచాయితీకి ఎన్నికలుండవు. గ్రామ ప్రజలు సూచించిన వారు సభ్యులుగా వుంటారు. సాధారణ ఎన్నికలు జరిగేటపుడు పోటీలోవున్న అభ్యర్థులు ప్రజలకు తమ సేవలను వివరిస్తారు. గ్రామంలో పోస్టర్లు అతికించే వీలులేదు.

గ్రామమంతా ఒక కుటుంబంగా వుంటుంది. ప్రతి ఏటా డిసెంబరుతో జరిగే కట్టే బసవేశ్వరస్వామి జాతరలో సామూహిక వివాహాలు జరుపుతారు. గ్రామ ప్రజలు, వస్తు ధన రూపేణ చందాలు పోగు చేసి వివాహాలు నిర్వహిస్తారు.

రోజు గ్రామస్థులే తమ వీధులను శుభ్ర పరచుకొంటారు. చెత్త కుండీలలో వ్యర్థపదార్థాలను వేసి, తర్వాత ఆ చెత్తను ఎరువుగా వాడు కొంటారు.

గ్రామంలో జరిగే శుభకార్యాలలో పొరుగు పల్లెల వారు కూడా పాల్గొంటారు. పర్యావరణ పరి రక్షణ కోసం ప్రతి ఇంటి ముందూ చెట్లు పెంచుతారు. గ్రామంలో బడి ఉంది. పోలీస్ వారికి ఈ గ్రామం పట్ల ఎంతో ఆసక్తి. గ్రామాలన్నీ 'గొర్లకొప్ప' గా వుంటే ఎంత బాగుండునని వారి అభిప్రాయం. గాంధీజీ ఆశించిన గ్రామ రాజ్య వ్యవస్థకు, స్థానికపాలనకు ప్రత్యక్ష సాక్ష్యంగా వెలుగుతున్న గ్రామం గొర్లేకొప్ప!

**- జానమద్ది హనుమచ్ఛాస్త్రి,** కడప

# అపరిణిత శిశువులను ఎట్లా కాపాడాలి?



మన దేశంలో ప్రతి సంవత్సరం జన్మించే శిశువుల్లో సుమారు 8- 10 శాతం పిల్లలు నెలలు నిండకుండానే పుడుతున్నారు. ఇలా తొమ్మిది నెలలు నిండకుండానే పుట్టె పిల్లల్ని అపరిణిత శిశువులంటారు. సాధారణంగా తల్లి గర్భంలో పిండం 7 నెలలు పూర్తిగా అభివృద్ధి చెందినా జన్మించడానికి తయారుగా ఉండదు. కనుక 7వ నెలలో పుట్టిన బిడ్డ చనిపోయే అవకాశాలున్నాయి. ఎందుకంటే అపరిణిత శిశువును కాపాడడం, పెంచడం చాలా కష్టంతో కూడిన పని. అటువంటి శిశువు పుట్టక పూర్వమే చనిపోవచ్చు. కొన్ని సార్లు ప్రసవం కష్టమై బిడ్డలో అంగవైకల్యాలు ఏర్పడవచ్చు. కాని తగిన జాగ్రత్త, వైద్య సలహా తీసుకుంటే శిశువు బ్రతికే అవకాశాలున్నాయి.

సాధారణంగా ఈ అపరిణిత శిశువులు మొదటి కాన్పు పిల్లలై ఉండడం విశేషం. ఇలాంటి పిల్లల శరీర పరిమాణాలు, నెలలు నిండి పుట్టిన పిల్లల శరీర పరిణామాలకు భిన్నంగా ఉంటాయి. ఈ అపరిణిత శిశువుల్లో మరణాల సంఖ్య చాలా ఎక్కువ. అంతేకాక వారు త్వరగా అంటు వ్యాధులకు లోనవుతారు.

### ఈ అపరిణిత శిశువుల జననానికి ముఖ్య కారణాలు

### గర్భిణీ స్త్రీ

- దీర్ఘకాలిక జబ్బుతో బాధపడుతున్నప్పుడు,
- గర్భసంచి సరైన స్థానంలో లేనప్పుడు,
- ఎక్కువసార్లు గర్భధారణ,
- జన్యు సంబంధమైన అంగవైకల్యం ఏర్పడినప్పుడు,
- మధుమేహ వ్యాధితో బాధ పడుతున్నప్పుడు,
- ప్రసవ మార్గం సక్రమంగా లేనప్పుడు,
- గర్భంలో మాయ లేదా జటాయువుకు అంటు వ్యాధులున్నప్పుడు,
- వయస్సు ఎక్కువగా ఉన్నప్పుడు (35 సం..పైన),
- రుబెల్లా వంటి అంటువ్యాధులు సోకినప్పుడు,
- శరీరంలో గ్రంధుల సంతులనత లోపించినప్పుడు,
- గర్భంలో బిడ్డకు ఆక్సిజన్ సరఫరా సరిగ్గా లేనప్పుడు,
- గర్భంలో శిశువుకు రక్తంలో సంతులనత లోపించినప్పుడు.

### పుట్టిన శిశువును, అపరిణిత శిశువుగా నిర్ధారించడం ఎలా?

- శరీర పరిమాణం - పుట్టిన బిడ్డ బరువు 3కిలోల కన్నా తక్కువగా, పొడవు 50 సెంటీ మీటర్ల కన్నా తక్కువగా, తల చుట్టుకొలత 33 సెంటిమీటర్ల కన్నా తక్కువగా ఉంటుంది.
- గర్భస్థ దశ గడువు - గర్భస్థ లేదా పూర్వ జనన దశ తొమ్మిది క్యాలండర్ నెలల కన్నా తక్కువగా ఉంటుంది.
- తల్లి, శిశువు ఆహార పోషణ స్థాయి తక్కువగా ఉంటుంది.
- శిశువులో ఎముకలు గట్టిపడే సమయం ఎక్కువగా పడుతుంది.

అపరిణిత శిశువుల శరీర సౌష్టవాన్ని పరిశీలిస్తే వారి తల పరిమాణం మిగతా శరీరంతో పోలిస్తే చాల పెద్దదిగా ఉంటుంది. ముఖం, తల పరిమాణానికి తగినట్లుకాక, చిన్నగా ఉంటుంది. వారి చర్మం చాలా పలుచగా, ఎక్కువ పింక్ కలర్‌లో ఉంటుంది. తల వెంట్రుకలు ఊలువలె ఉండి విడదీయడానికి వీలులేకుండా ఉంటాయి.

- శరీరంలో చర్మం క్రింద ఉండే సబ్‌క్యుటేనియస్ ఫ్యాట్ చాలా తక్కువగా ఉంటుంది. బిడ్డలో ఉఛ్వాస, నిఛ్వాస విన్యాసాలు వేగంగా ఉంటాయి. బిడ్డ శరీర ఉష్ణోగ్రతను సక్రమంగా, క్రమబద్ధంగా చేసుకోలేదు. బిడ్డలో శారీరక, కండర నైపుణ్యాలు చాలా నిదానంగా జరుగుతాయి. అలాంటి బిడ్డలు చిన్న శబ్దానికి కూడా వెంటనే స్పందిస్తారు.

ఈ అపరిణిత శిశువులు బాల్యదశలో వేళ్ళు చీకడం, తొందరగా విసుగు చెందడం, హఠం చేయడం వంటి సమస్యలు చూపుతారు. వీరిలో బిడియం ఎక్కువగా కనిపిస్తుంది. అంతేకాక వయస్సు పెరిగే కొద్దీ అపరిణిత శిశువుల్లో ప్రవర్తనా సమస్యలు వచ్చే అవకాశాలు చాలా ఎక్కువ. పుట్టిన 5-6 నెలల వరకు అపరిణిత శిశువుల పెరుగుదల, సాధారణ పిల్లల పెరుగుదలతో పోలిస్తే తక్కువగా ఉంటుంది.

### అపరిణిత శిశువుల జననాన్ని అరికట్టడానికి తీసుకోవలసిన జాగ్రత్తలు

### గర్భిణీ స్త్రీ

- ఆరోగ్యాన్ని జాగ్రత్తగా చూసుకోవాలి.
- మానసిక ఆందోళనలకు లోనవకుండా చూడాలి.
- తరచూ వైద్యున్ని సంప్రదిస్తూ ఆరోగాన్ని కాపాడుకోవాలి.
- మంచి పోషకాహారాన్ని తీసుకోవాలి.
- ప్రమాదాలకు గురికాకుండా జాగ్రత్త వహించాలి.
- రక్త సంబంధీకుల మధ్య వివాహాన్ని అరికట్టాలి.

అపరిణిత శిశువు జన్మించిన వెంటనే అత్యధిక జాగ్రత్త వహించడం వలన బిడ్డ, తదుపరి జీవితంలో సాధారణ పిల్లల వలె సర్దుబాట్లు చేసుకోగలడు. నెలలు నిండకుండా పుట్టిన బిడ్డను వెంటనే ఇంక్యు బేటర్ అనే ప్రత్యేక పరికరంలో నెలలు నిండేంత వరకు ఉంచి వారి ఆరోగ్య, ఆహార, శ్వాస, శరీర ఉష్ణోగ్రత విషయంలో జాగ్రత్త వహించాలి. ఉదాహరణకు బిడ్డ 8వ నెలలో పుడ్తే, 9 క్యాలెండర్ నెలలు నిండే వరకు అంటే సుమారు 2 నెలలు ఇంక్యు బేటర్‌లోనే ఉంచాలి.

ఆహారాన్ని ట్యూబ్‌ల ద్వారా ఇవ్వాలి. ఇలాంటి ఇంక్యు బేటర్ సౌకర్యం గ్రామాల్లో ఉండదు కాబట్టి, అలాంటి సమయాల్లో బిడ్డను శుభ్రమైన, మందమైన నూలు వస్త్రాలలో బాగా చుట్టి బిడ్డ శరీర ఉష్ణోగ్రతను క్రమబద్దం చేసి, అంటు వ్యాధులు రాకుండా జాగ్రతవహిస్తూ, అపరిణిత శిశువులు పెరిగి పెద్దయిన తర్వాత, 'సాధారణంగా పుట్టిన పిల్లలకు ఏ విషయంలోను తీసిపోరు'' అని రుజువు చేయాల్సిన బాధ్యత మన అందరిమీద ఉంది.

**- డా॥ నస్రీన్ బాను,** సీనియర్ శాస్త్రవేత్త
**- కె. ఉషారాణి,** రీసెర్చ్ అసోసియేట్

# మహనీయుల చతురోక్తులు

– పోలాప్రగడ సత్యనారాయణమూర్తి

## అన్యోన్య దాంపత్యాలు

**శ్రీ తల్లావజ్ఝల శివశంకరస్వామిగారిని కదిపితే చాలు, ఓ సాహితీ సర్వస్వాన్ని చదివినంత విజ్ఞానం లభించేది. విషయం వచ్చినప్పుడు ఎంత గంభీరంగా చెప్పేవారో, మామూలుగా మాట్లాడేటప్పుడు అంత చమత్కారంగానూ, అంత తమాషాగానూ చెప్పేవారు. కబుర్లు వినడం కోసం ఆయన్ని సాహితీ సమితి సభ్యులు ఎవరో ఒకరు కదిపేవారు.**

ఓ మారు మునిమాణిక్యం నరసింహారావు గారు ఇలా కదిపారు. దగ్గరగా జేరి "అన్నగారూ! నాకు మా ఆవిడతో ఒక్క నిముషం పడదు. నిత్యం దెబ్బలాడుకుంటాం. నేనేనా? మన సాహితీ మిత్రులూ, తక్కినవాళ్ళు అందరూ అంతేనా?" అని అడిగారు.

"మూకుమ్మడిగా కాదు. ఒక్కొక్కరి గురించి అడగండి చెప్తాను" అన్నారు శివశంకరులు.

"ముందు చెళ్ళపిళ్ళ వెంకట శాస్త్రిగారి గురించి చెప్పండి. వారిది అన్యోన్య దాంపత్యమేనా?"

"ఆహా! అక్షరాలా. ఏమంటే, వెంకటశాస్త్రి గారు ఎప్పుడూ ఇంట్లో వుండరు. నానారాజ సందర్శనం అంటూ అన్ని రోజులూ దేశాలమ్మట తిరగడమే. ఇంక ఇంట్లో ఉండేదెప్పుడు? దెబ్బలాడుకునేదెప్పుడు? అందుకే వాళ్ళది అన్యోన్య దాంపత్యం."

"మరి గిడుగు రామ్మూర్తిగారిదో!"

"ఆయనదీను. ఆయనకి బ్రహ్మచెవుడు. ఆవిడ తిట్టే తిట్లు ఆయనకి వినిపించవు. అందువల్ల ఇద్దరి మధ్య కజ్జాల్లేవు."

"మరైతే జమ్మలమడక మాధవరామశర్మగారి సంగతీ?"

"ఆయనది కూడా ఆదర్శ దాంపత్యమే. ఏమంటారా? ఆయన సంస్కృతంలోగాని మాట్లాడరు. ఆవిడకి సంస్కృతం రాదు. భాషాభేదం కారణంగా ఇద్దర్లోనూ పొరపొచ్చాలు రావు. ఇంకా వినండి -కృష్ణశాస్త్రిగారు ఎప్పుడూ ఊహాలోకంలోనే వుంటారు. భార్యతో దెబ్బలాడడానికి ఆయన ఎప్పుడైనా వాస్తవ జీవితంలోకి వస్తేగా? ఇంక నేను - తీరా దెబ్బలాడడానికి సిద్ధం అయేటప్పటికి మా ఆవిడ చచ్చిపోయింది" అన్నారు.

"ఇంతకీ ఏతావాతా మీ అందరివీ అన్యోన్య దాంపత్యాలంటారు" అన్నారు. మునిమాణిక్యం.

"అక్షరాలా" అంటూ బోసినోటితో పకపకా నవ్వారు శివశంకరులు.

## ఉల్లిపాయ సన్యాసం!

**నేను భీమవరం కాలేజీలో పని చేస్తున్నాను. 1954లొ మా కాలేజీ అధ్యాపకులైన కె. బంగార్రాజుగారు ఆంధ్రయూనివర్సిటీ సెనేట్ మెంబరుగా నుంచుంటే ఆయనకి ఓటు వెయ్యమని శ్రీ జంధ్యాల పాపయ్య శాస్త్రిగారిని అడగడం కోసం గుంటూరు వెళ్ళాను.**

నేను ఉదయం ఏడు గంటలకి పాపయ్య శాస్త్రి గారింటికి వెళ్ళేటప్పటికి, హాల్లో శాస్త్రిగారితో పాటు శ్రీ జమ్మలమడక మాధవరామశర్మ గారు, శ్రీ వావిలాల సోమయాజులుగారు, శ్రీ జరుక్ శాస్త్రి వంటి అయిదారుగురు ప్రముఖులు కూర్చున్నారు.

వారి మధ్యలో అప్పుడే స్నానం చేసి కాషాయ బట్టలు కట్టుకుని వచ్చిన శ్రీ తల్లావఝుల శివశంకరస్వామి వారు బాసింపట్టు వేసుకుని కూర్చున్నారు. నేను శ్రీ స్వామివారిని చూడ్డం అదే ప్రథమం. గుణాఢ్యుడు నుంచి గుంటూరు గోంగూర వరకు సమస్త విషయాల మీదా సంభాషణ సాగుతోంది.

అప్పుడు లోపల్నుంచి పాపయ్యశాస్త్రి గారి అబ్బాయి, ఇప్పుడు లెక్చరర్‌గా పని చేస్తున్న శ్రీ బాపూజీ అనుకుంటాను, వచ్చి, హాల్లో కూచున్న మనుష్యుల్ని మనస్సులో లెక్క పెట్టుకుంటున్నారు.

"ఏవిటి, తలలు లెక్క పెడుతున్నావు?" అని అడిగారు స్వామివారు.

"తలలుకాదు నోర్లే" అన్నారు బాపూజీ.

"నోరా? నోరి ఎక్కడ వున్నాడు? రేపల్లెలో వున్నాడు" అంటూ నవ్వారు స్వామి.

నోరి నరసింహాశాస్త్రిగారు అనే అర్థంలో వెంటనే పాపయ్య శాస్త్రిగారు కూడా నవ్వి "టిఫిన్‌కి పెసరట్లు వెయ్యమన్నానులెండి. ఎన్ని వేయించాలో, ఎంతమంది వున్నామో లెక్క చూడ్డానికి వచ్చి వుంటాడు మా వాడు" అన్నారు.

శివశంకరులు 'బాబూ, ఇక్కడున్న వాళ్ళని రెండు పెట్టి గుణించు. దానికి నాలుగు కలుపు. మొత్తం పట్టుకొని వచ్చి తలో రెండూ వేసి మిగిలినవి నాకు పడెయ్యి" అన్నారు.

అలాగే అని నవ్వుకుని బాపూజీ వెళ్ళబోతుంటే "ఆ... ఇంతకీ పెసరట్లలో సంబారాలేవిటి?" అని అడిగారు స్వామి.

మాధవరామశర్మగారు "ఏముందీ, అల్లం, పచ్చిమిర్చీ, జీలకర్ర" అన్నారుమ్మడిగా.

"ఓహో! మీరంతా అయితాగ్నులుకదూ! ఉల్లిపాయ తినరు. నేను సన్యసించినవాణ్ణి - నాకేవిటి? ఇదో సన్యాసమా? జీలకర్ర సింగినాదం అని పదిమందీ నా సన్యాసాన్ని జీలకర్రతో ఎప్పుడో కలిపారు. ఇప్పుడు నాకు మళ్ళీ జీలకర్ర ఎందుకు? అందువల్ల నా మట్టుకి ఉల్లిపాయ పెసరట్టు పట్టుకురా నాయనా" అన్నారు స్వామి.

"మీరు సన్యాసులు - ఉల్లిపాయ తింటారా?" అన్నారెవరో.

"సన్యాసికి ఉల్లిపాయేమిటి ఉమ్మెత్తకాయేమిటి? సర్వం సమానం -అసలు నేను ఉల్లిపాయ తినే స్వేచ్ఛకోసమే సన్యసించింది - తెల్సా? అందరివీ ఉత్తిత్తి సన్యాసాలు. మనది ఉల్లిపాయ సన్యాసం" అని స్వామి అందర్నీ నవ్వించారు.

☆



Sthanka_BW March.indd 32 28/02/11 6:23 PM

# ప్రజా నిర్వహణలో పర్యావరణ పారిశుద్ధ్యం - ప్రతిబంధకాలు - పరిష్కారాలు

**"నా కల పండిందంటే ఏడు లక్షల గ్రామాల్లో, ప్రతీ గ్రామం చక్కగా జీవిస్తున్న రిపబ్లిక్ అవుతుంది. అందులో నిరక్షరాస్యులుండరు, నిరుద్యోగులుండరు, ప్రతీ వ్యక్తి పని చేస్తుంటాడు, పౌష్టికాహారం తీసుకుంటాడు, గాలి వెలుతురు వచ్చే ఇళ్లు ఉంటాయి. శరీరాన్ని కప్పుకోవటానికి తగినంత ఖాదీ ఉంటుంది. ఆరోగ్యానికి, పారిశుద్ధ్యానికి సంబంధించిన సూత్రాలు ఎలా పాటించాలో అందరికీ తెలిసి వుంటుంది. అటువంటి రాజ్యానికి అవసరాలు పెరుగుతుంటాయి. వాటిని తీర్చగలగాలి, లేకపోతే అది ఎదుగూ బొదుగూ లేకుండా మిగిలిపోతుంది."**

పై మాటల్ని గాంధీజీ 1938లో ప్రస్తావించారు. 72 ఏళ్ళ తర్వాత కూడా పై ఆశయాన్ని సాధించలేకపోయామని, కనీసం సంపూర్ణ పారిశుద్ధ్యాన్ని సాధించే దిశగా వేస్తున్న అడుగులు కూడా సజావుగా పడటం లేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

మెరుగైన, గౌరవప్రదమైన జీవితానికి పారిశుద్ధ్యాన్ని ప్రాతిపదికగా చెప్పుకోవచ్చును. పారిశుద్ధ్యం అనగానే అది వ్యక్తిగత విషయంగా భావించటం వల్ల, ప్రజలు, సంఘం, ప్రభుత్వం ఇవ్వాల్సినంత ప్రాముఖ్యత ఈ విషయానికి ఇవ్వకపోవటం వల్ల పారిశుద్ధ్యం అనేది అటు ప్రజలకు, ఇటు ప్రభుత్వానికి ఇవ్వాళ సవాలుగా మారింది. అందుకే పారిశుద్ధ్యాన్ని వ్యక్తిగత స్థాయి నుండి సామాజిక స్థాయికి మళ్ళించి, తద్వారా పర్యావరణ పారిశుద్ధ్య పరిరక్షణ దిశగా ప్రజలు అడుగుల్ని వేయించేందుకు పథకాలు రూపొందించటం జరిగింది.

ప్రజల భాగస్వామ్యం ద్వారా పర్యావరణ పారిశుద్ధ్యం అనేది సంపూర్ణ పారిశుద్ధ్య ఉద్యమ ప్రస్థానంలో నూతన ప్రయోగం. ఆ ప్రయోగం అమలులో అవరోధాలు, ప్రతిబంధకాలు, అందుబాటులో ఉన్న పరిష్కారాల్ని పరిశీలించటం మన ముందున్న కర్తవ్యం.

### పారిశుద్ధ్యం అంటే ఏమిటి ?

వ్యక్తిగత పరిశుభ్రతనే లేదా మురుగు కాల్వలు, రోడ్లు శుభ్రంగా ఉంచటాన్నే పారిశుద్ధ్యం అనే భావన చాలా కాలం నుండీ ఉంది. కానీ పారిశుద్ధ్యం అంటే వ్యక్తిగత వ్యర్థాల బహిరంగ విసర్జన, ఘన, ద్రవ పదార్థాలను సరైన పద్ధతిలో నిర్మూలించకపోవటం, పరిసరాల పరిశుభ్రత, మరుగుదొడ్ల వినియోగం, రక్షిత మంచి నీటి వాడకం మొదలైనవి ఉన్నాయి.

### పారిశుద్ధ్యం లోపిస్తే ఏమవుతుంది ?

సగటున ఒక్కొక్క గ్రామంలో రోజుకి 3 క్వింటాళ్ళ మలం వెలువడుతున్నట్లు అంచనా వేయబడింది. ఆ లెక్కన మన దేశంలోని 7 లక్షల గ్రామాలలో రోజుకు ఎన్ని క్వింటాళ్ల మలం వెలువడుతుందో, ఇది ఎంత వాతావరణ, జల భూ కాలుష్య కారకమవుతుందో ఊహించలేం కదా! ఒక గ్రాము మలంలో కోటి వైరస్‌లు, 10 లక్షల బ్యాక్టీరియాలు, పదివేల పరాన్నజీవులు, సిస్టులు, వంద పరాన్న జీవులు గుడ్లు ఉంటాయి. కలరా, అమీబియాసిస్, గ్యాస్ట్రో ఎంటిరైటిస్, డయేరియా, జాండిస్, మలేరియా, ఫైలేరియా, డెంగూ, చర్మ, కంటి వంటి రోగాలకు కారకాలవుతాయి. బహిర్భూమికి దూరంగా వెళ్ళటం కాలవ్యయం. అంతేకాక రాత్రిపూట ఎక్కువగా వెళ్లటం వల్ల విషక్రిమికీటకాల ప్రమాదం ఉంటుంది. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మాస్ కమ్యూనికేసన్ వారి 1996-97 నివేదిక ప్రకారం 51% గ్రామీణ ప్రజానీకం మరుగుదొడ్ల వాడకానికి సుముఖంగా లేనట్లు తెలిసింది.

### మరుగుదొడ్ల వాడకానికి ఎందుకు సుముఖంగా లేరు?

గ్రామీణ వాతావరణంలో వ్యవసాయ పని ఉండటం వల్ల, చాలామంది రైతులు తెల్లవారు జామునే ఇంటి నుండి బయలుదేరుతారు. పొలం పనికి వెళ్లేదారిలో, కాల్వగట్టునో, చెరువు ప్రక్కనో, పని పూర్తి చేసుకుంటారు. మహిళలు కూడా తెల్లవారు ఝామున లేదా రాత్రి పూట పనులన్నీ అయిపోయి నిద్రకుపక్రమించే ముందు బహిర్భూమికి వెళతారు. పిల్లలు, వృద్ధులు, వ్యాధిగ్రస్తులు, డ్రైనేజీ, మురికి కాల్వలలో, రోడ్ల ప్రక్కన బహిరంగ మల మూత్ర విసర్జనను తప్పుగా భావించకపోవటం అనేది ప్రధానమైన సమస్య.

### పారిశుద్ధ్య ఉద్యమం - ప్రయత్నాలు, ప్రయోగాలు

భారత ప్రభుత్వం 1948లో ఏర్పాటు చేసిన వాతావరణ ఆరోగ్య కమిటీ రానున్న 40 సం॥లలో 90 శాతం ప్రజానీకానికి నీరు, పారిశుధ్యాన్ని అందించడానికి చర్యలు తీసుకోవాలని చెప్పింది. 1954లో పారిశుద్ధ్య శాఖను పట్టణ శాఖ నుండి ప్రభుత్వ ఆరోగ్యశాఖలో విలీనం చేశారు. మొదటి పంచవర్ష ప్రణాళికలో 6 కోట్ల రూపాయలు కేటాయించారు. ప్రజల భాగస్వామ్యం లేనిదే పారిశుద్ధ్య కార్యక్రమం విజయం సాధించలేదని రెండవ పంచవర్ష ప్రణాళికా కాలానికే గుర్తించారు. అంతర్జాతీయ నీరు పారిశుద్ధ్యం దశాబ్దిలో భాగంగా 1981లో భారత ప్రభుత్వం పారిశుద్ధ్య కార్యక్రమాన్ని ప్రత్యేక దృష్టితో చూడాలని నిర్ణయించారు. 7వ ప్రణాళికాంతానికి 25 శాతం గ్రామీణ ప్రజానీకానికి పారిశుద్ధ్య సౌకర్యాలు కల్పించాలని భావించారు.

1986లో పట్టణాభివృద్ధి శాఖ నుండి పారిశుద్ధ్యాన్ని గ్రామీణాభివృద్ధి శాఖకు మార్చి "కేంద్ర గ్రామీణ పారిశుద్ధ్య కార్యక్రమాని"కి శ్రీకారం చుట్టారు. ఆ విధంగా గ్రామీణ పారిశుద్ధ్యం అనేది 20 సం॥ల పథకంలో భాగం అయ్యింది. యస్.టి., యస్.టి ప్రజలకు లక్ష మరుగుదొడ్లు, ఆసుపత్రులు, పాఠశాలలు, అంగన్‌వాడీలు, పంచాయితీ భవనాలకు మరో రెండున్నర లక్షల మరుగుదొడ్లు నిర్మించాలని లక్ష్యంగా

నిర్ణయించారు. కానీ 1993 దాకా ఇది కార్యరూపం దాల్చలేదు. 1998 నాటికి సాధించిన రేటు 20 శాతం మాత్రమే.

**7వ పంచవర్ష ప్రణాళికా నివేదిక ప్రకారం గ్రామీణ పారిశుద్ధ్య కార్యక్రమ వైఫల్యానికి ప్రధాన కారణాలు:** ప్రాథమిక ఆరోగ్య కార్యక్రమానికి అనుసంధానం చేయకపోవడం, నీటి లభ్యతా లోపం, నిరక్షరాస్యత, మహిళా సంక్షేమాన్ని నిర్లక్ష్యం చేయటంతో పాటు పర్యావరణ పారిశుద్ధ్యాన్ని పట్టించుకోకపోవడంగా గుర్తించారు.

1991 జనాభా లెక్కల ప్రకారం 9.5 శాతం గ్రామీణులు 63.9 శాతం పట్టణ వాసులకు మాత్రమే మరుగుదొడ్ల సౌకర్యం ఉంది.

## సంపూర్ణ పారిశుద్ధ్య ఉద్యమం

8,9,10 పంచవర్ష ప్రణాళికలను సమీక్షించి 1999లో సంపూర్ణ పారిశుద్ధ్య ఉద్యమాన్ని ప్రారంభించారు. ఇది సమగ్ర భావనతో కూడుకొని ప్రజలు పారిశుద్ధ్యాన్ని తమ అవసరంగా గుర్తించేలా చైతన్యపరచటం, గ్రామీణ ప్రజలలో మెరుగైన జీవన ప్రమాణాలను తీసుకురావడం, గ్రామీణ పాఠశాలలు, అంగన్‌వాడీలలో పారిశుద్ధ్య సౌకర్యాలను కల్పించి, పిల్లలో ఆరోగ్య విద్యను పెంచి, పారిశుద్ధ్య అలవాట్ల పట్ల అవగాహన పెంచటం, పారిశుద్ధ్య నిర్మాణాలను సరైన సాంకేతిక పద్ధతిలో, తక్కువ ఖర్చుతో ప్రోత్సహించటం, గ్రామీణ ప్రాంతాలలో పాకీ పని వారి ద్వారా మల మూత్ర విసర్జితాలను తీయించటాన్ని రూపుమాపి, పొడి మరుగు దొడ్లను నీటి సీల్ మరుగుదొడ్లగా మార్చటం మొదలైన లక్ష్యాలతో ఈ కార్యక్రమాన్ని రూపొందించారు.

## సంపూర్ణ పారిశుద్ధ్యం - వ్యూహాలు

పై లక్ష్యాల సాధనకై ప్రజలు చైతన్యవంతులై ఇళ్లు, స్కూళ్లు, అంగన్‌వాడీలలో పారిశుద్ధ్య సౌకర్యాల కోసం డిమాండ్ చేసేలా, కాలుష్యం లేని పర్యావరణాన్ని పెంచేలా చర్యలు తీసుకోవడం, "స్కూళ్లు - పారిశుద్ధ్యం" కార్యక్రమాలు చేపట్టడం, సమాచార, విద్య, ప్రసారమాధ్యమాల ద్వారా ప్రజల అవసరాలకు, కోరికలకు, ప్రాంతాలకు అనువైన ప్రచారం చేయించటం, ప్రజలు, ముఖ్యంగా మహిళలు ఈ కార్యక్రమంలో భాగస్వాములయ్యేందుకు చర్యలు తీసుకోవడంతో పాటు, నిర్మాణ పనివారు, పంచాయితీలో పనిచేసే నీటి సరఫరా సిబ్బంది, పారిశుద్ధ్య సిబ్బందికి, మహిళా సంఘ సభ్యులకు సామర్థ్యాల పెంపుదలకై శిక్షణా కార్యక్రమాల ఏర్పాట్లు మొదలైనవి ఈ కార్యక్రమ వ్యూహాలు.

## మన రాష్ట్రంలో సంపూర్ణ పారిశుద్ధ్య ఉద్యమం

ఆంధ్రప్రదేశ్‌లో సంపూర్ణ పారిశుద్ధ్య ఉద్యమంలో భాగంగా 65.21 లక్షల మరుగుదొడ్లను దారిద్ర్య రేఖకు దిగువ ఉన్న వారికి, 36.30 లక్షల మరుగుదొడ్లను దారిద్ర్య రేఖకు పైన ఉన్నవారికి, 1.75 లక్షల మరుగుదొడ్లను పాఠశాలలకు, 15,645 మరుగుదొడ్లను అంగన్‌వాడీలకు, 575 మరుగుదొడ్లను కమ్యూనిటీలకు మంజూరు చేశారు. ఇందుకై మొత్తం ప్రాజెక్టు విలువ 2465.41 కోట్ల రూపాయలకు గాను 783.42 కోట్లు కేంద్రప్రభుత్వం, 1489.99 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం భరించటానికి, 192 కోట్ల రూపాయల లబ్ధిదారుల విరాళంగా నిర్ణయించారు. అయితే 2008 జూన్ నాటికి 552.55 కోట్లు రూపాయలు ఖర్చు చేసి 37,70,442 మంది దారిద్ర్య రేఖకు దిగువ ఉన్న వారికి, 16,30,477 మంది దారిద్ర్య రేఖకు ఎగువ ఉన్న వారికి, 70,948 మరుగుదొడ్లు పాఠశాలలోనూ, 3,680 అంగన్‌వాడీలలోనూ మరుగుదొడ్లు నిర్మాణం పూర్తి చేసినట్లు నివేదికలలో చెప్పారు. నూరు శాతం పారిశుద్ధ్యాన్ని సాధించిన, బహిరంగ మలవిసర్జన లేని గ్రామాలు, మండలాలు, జిల్లాలకు "నిర్మల్ గ్రామ పురస్కారాలు" ప్రకటించారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున "శుభ్రం" అవార్డులను 2007 నుండి ప్రారంభించారు.

## సంపూర్ణ పారిశుద్ధ్య ఉద్యమంలో నూతన దృక్పథం - ప్రజానిర్వహణలో పర్యావరణ పారిశుద్ధ్యం

పారిశుద్ధ్య ఉద్యమాన్ని సంపూర్ణంగా విజయవంతం చేసే క్రమంలో అనుభవాల ఆధారంగా ఎన్నో మార్పులు చేసి ప్రజల భాగస్వామ్యాన్ని పెంచటం అనేది ప్రధానంగా తీసుకోవటం జరిగింది. ప్రధానమైన మార్పు ఏమంటే గతంలో ఈ పథకం అమలుకు రాష్ట్రాన్ని యూనిట్‌గా తీసుకోవటం జరిగితే, ప్రస్తుతం ఇది గ్రామాన్ని "అమలు చేసే యూనిట్"గా వికేంద్రీకరించటం జరిగింది. గతంలో లక్ష్యం మరుగుదొడ్ల నిర్మాణం మాత్రమే కాగా, ప్రస్తుతం బహిర్భూమిలో మలవిసర్జన అలవాట్లను రూపుమాపటం. అనగా వ్యక్తిగత ప్రవర్తనాశైలిలో మార్పు తేవడం ద్వారా గ్రామీణ ప్రజానీకంలో మెరుగైన జీవన ప్రమాణాల వైపు అడుగులు వేయించటం లక్ష్యం. వ్యక్తికి, సంఘానికి, వ్యక్తిగత అలవాట్లు, ప్రవర్తనా శైలి సంఘం, సమాజంపై చూపించే ప్రభావం, తద్వారా సమాజానికి పర్యావరణానికి సంభవించే పరిణామాలు మొదలైన అంశాలకు ఇప్పుడు ప్రాధాన్యత ఇవ్వబడింది. వ్యక్తిగత ప్రవర్తనా శైలి, అలవాట్లు మంచిగా ఉంటే అది సంఘాన్ని ఎలా ప్రభావితం చేస్తుందో, అంతిమంగా పర్యావరణానికి ఎలాంటి మేలు జరుగుతుందో వివరించే క్రమంలో వ్యక్తుల్ని పరిచయం చేసుకోవటం గ్రామంలో నడుస్తూ సభ్యుల్ని (ప్రజల్ని) నడకలో భాగస్వాముల్ని చేయటం, మురుగు కాల్వలు, పారిశుద్ధ్య ఏర్పాట్లను పరిశీలించటం, అతి ప్రధానంగా మల విసర్జన అలవాట్లను చర్చించటం, మల విసర్జన ప్రాంతాల్ని సందర్శించటం, మల విసర్జన రేఖా చిత్రాన్ని గీయటం ద్వారా గ్రామంలో ఎవరెవరు, ఎక్కడెక్కడ మల విసర్జన చేస్తున్నారో, రోజువారీగా ఎంత మలం విడుదలయ్యేదీ, ఆ మలం ద్వారా ఎలాంటి రోగాలు వ్యాప్తి చెందేదీ, అది వ్యక్తిగత వైద్యానికి అయ్యే ఖర్చు, శ్రమ, కాలవ్యయాన్ని అంతిమంగా ప్రభుత్వం ఆరోగ్యంపై చేసే ఖర్చు, తిరిగి ఈ పరిణామాలు దేశాభివృద్ధికి ఎలాంటి అవరోధంగా నిలున్తున్నదో వివరించటం ద్వారా ప్రజలలో గుణాత్మకమైన, ఆలోచనల వైపు ప్రేరేపించటం ఈ దృక్పథంలో వచ్చిన నూతన మార్పు. అలాగే ప్రజల ఆర్థిక స్థితిగతుల ఆధారంగా మరుగుదొడ్ల నిర్మాణం చేయించటం, పారిశుద్ధ్యాన్ని కాపాడడం ద్వారా పర్యావరణ పరిరక్షణ వైపుగా ప్రజల దృష్టిని మళ్లించటం ప్రధాన మార్పుగా చెప్పుకోవచ్చు. ఘన, ద్రవ వ్యర్థాలను సక్రమంగా నిర్మూలించటం, వీలైన వాటిని పునర్వినియోగ పద్ధతికి మార్చటం మొదలైన లక్ష్యాలతో కూడిన ఈ కార్యక్రమాన్ని నూతన దృక్పథంగా చెప్పుకోవచ్చు.

## అమలులో ఇబ్బందులు

ప్రజలని ప్రేరేపించటంలో ఆశించిన స్థాయిలో గ్రామ మోటివేటర్‌లను (ప్రేరక్) నియమించినా వారు గ్రామాలలో లక్ష్య సాధన దిశగా ప్రజల దగ్గరకు వెళ్లలేకపోయారు. లబ్ధిదారులు నిర్మించుకున్న మరుగుదొడ్లు నియమిత / నిర్ణీత సైజులో ఉన్నదీ లేనిదీ నిర్ధారించటంలో వైఫల్యం కొట్టొచ్చినట్టు కనబడింది. ట్రిగ్గరింగ్ లేదా మార్పు క్రమం అనే అభ్యాసాన్ని గ్రామాలలో చేపట్టటంలో ఈ ప్రేరక్‌లు ఆశించిన స్థాయిలో వ్యవహరించలేకపోయారు. గ్రామాలకు వెళ్లటం, గ్రామ పరిధి, జనాభా స్థాయి తదితర అంశాలపై అవగాహన పెంపొందించుకోవటంలోనూ, బహిర్భూమి గుర్తింపు, బహిర్భూమి రేఖా చిత్రం, మల అవశేషాల లెక్కింపు, విస్తృతి అంచనా, మలం ద్వారా దుష్పరిమాణాలు మొదలైన అంశాలకు ప్రజలకు వివరించటంలో ఈ ప్రేరక్‌లు సామాజిక కార్యకర్తలలాగా కాక, యాంత్రికంగా పని పూర్తి చేశారు. పారిశుద్ధ్య కమిటీల ఏర్పాటు, ప్రజాప్రతినిధుల, స్థానిక ప్రజల సమన్వయాన్ని సాధించలేకపోయారు. పారిశుద్ధ్య కమిటీల, పంచాయితీల మధ్య అవగాహన కుదిర్చి పారిశుద్ధ్య ప్రణాళికను రూపొందించటంలో ఆశించిన స్థాయిలో విజయం సాధించలేక పోయారు.

## ప్రజా నిర్వహణలో పర్యావరణ పారిశుద్ధ్యం పథకం విజయానికి సూచనలు

అమలు యంత్రాంగానికి పూర్తి స్థాయిలో అవగాహన పెంచాలి. ప్రత్యేకించి గతంలో మాదిరిగా మరుగుదొడ్ల నిర్మాణం ఒక్కటే లక్ష్యం కాకుండా, వాటిని వాడే విధంగా ప్రజల్ని చైతన్య పరచటం, ప్రేరేపించటం దిశగా చేస్తున్న ప్రయత్నాలు పూర్తిస్థాయిలో అమలు జరగాలంటే, పంచాయితీ రాజ్, ఇంజనీరింగ్, గ్రామీణాభివృద్ధి శాఖ, ఆరోగ్య శాఖ, శిశుసంక్షేమ శాఖలను సమన్వయపరచి వారి శిక్షణ ఇవ్వాలి. జిల్లా స్థాయిలో, డివిజన్ స్థాయిలో, మండల, గ్రామాల స్థాయిలోని శాఖల ఉద్యోగుల, ప్రజాప్రతినిధుల సమావేశాలు నెలకోసారి అయినా ఏర్పాటు చేసి ప్రగతి నివేదికలను పరిశీలించాలి. మండల, గ్రామ స్థాయిలో ప్రతివారం జరిగే సమావేశాలలో మండల స్థాయి అధికారులు తప్పనిసరిగా ఈ అంశాన్ని చర్చించాలి. మండల స్థాయి అధికారులు వారానికి ఒకసారి అయినా గ్రామాలను పర్యటించాలి. సంపూర్ణ పారిశుద్ధ్యాన్ని ప్రభుత్వం పథకంలాగా కాకుండా స్వచ్ఛంద ఉద్యమంలాగా ప్రజలు గుర్తించాలంటే ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు, సంఘసంస్కర్తలు స్వచ్ఛంద ఉద్యమకారులు ముందుకు వచ్చి కృషి చేయాలి. నిస్వార్థంగా పని చేయాలి. మిలీనియం అభివృద్ధి లక్ష్యాలలో సంపూర్ణ పారిశుద్ధ్యం, ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణల్ని సాధించటానికి కంకణం కట్టుకున్న దేశాలలో ఒకటైన భారత్, ప్రపంచ దేశాలలో ముందుండాలంటే పై ఆశయాల సాధనకు కృషి చేస్తానని ప్రతి భారతీయుడు ప్రతిన బూనాలి.

అంతిమంగా, గాంధీజీ చెప్పినట్లు ''వ్యక్తిగతమైన, గృహ సంబంధమైనా, ప్రజా సంబంధమైనా పారిశుద్ధ్యాన్ని ఖచ్చితంగా పాటిస్తే, ఆహారం విషయంలో, వ్యయం విషయంలో శ్రద్ధ వహిస్తే అనారోగ్యం గానీ, రోగం రావటం గానీ ఉండదు. సంపూర్ణంగా అంతశ్శుద్ధి, బాహ్యశుద్ధి ఉన్నప్పుడు జబ్బు రావటమనేది అసాధ్యం. గ్రామస్థులు ఈ విషయం అర్థం చేసుకుంటే వారికి డాక్టర్లు, హకీంలు, వైద్యుల అవసరం ఉండదు''.

పై ఆలోచనల దిశగా వేస్తున్న అడుగులు సక్రమంగా వేసినట్లయితే పారిశుద్ధ్యం - పర్యావరణ పరస్పరం రక్షించబడి, మిలీనియం లక్ష్యాలను భారత్ సాధించటానికి, ప్రపంచ దేశాల ముందు ఆత్మగౌరవంతో నిలబడడానికి ఆస్కారం కలుగుతుంది.

***- ఆలవాల గవర్రాజు,*** *ఫ్యాకల్టీ, ఇ.టి.సి., రాజేంద్రనగర్*

## ------: మాటరాని భాష :------

లేత పెదవులు చాక్లెట్ కాగితాలై రెపరెపలాడుతూంటే
పాలబుగ్గల్లో ఎన్ని నెలవంకలు?!
చిట్టి చేతులే కాగితప్పడవల తయారీ కర్మాగారాలు
బుల్లి కంప్యూటర్ మెదడులో ఎన్ని సందేహాల యారో గుర్తులో...
ఆటపాటల్లోంచి బాధామయ భవిష్యత్తును మసకమబ్బుల్లోంచి చూస్తూ
ఏమీ పట్టని దిక్కుల్లో మొండిదిగ్గజాలు
మొట్టికాయలు తొడపాశాలు అంకుశాలై బాధించే వేళ్ళ
కళ్ళలో రెండు జలపాతాలు..
పెద్దల బతుకుటద్దంలో చూస్తూ నవ్వితే నవ్వి
ఏడిస్తే ఏడ్చి సున్నితపు కొండల్ని చూపుల్లో దాచుకోవటం..
కోపం కోదండమై తిట్లను కురిపించినా
అసహనం వజ్రాయుధమై చెవులపై దాడి చేసినా
పెట్టని గుక్కకు ఒక్క క్షణంలోనే జాలిపడే నేత్రాలు
అతిథుల బలవంతపు కళాప్రదర్శన పామై కురుస్తున్నా కలిపించుకోవటం
పెద్దవాళ్ళ పంకంలో కూరుకుపోతూ
కేజీల్నించి పెట్లవరకూ
చదువుల కొలనులో గుదిబండ కట్టించుకొని
కొట్టుమిట్టాడటం..
మనం..
కళ్ళుండీ చూడలేం..
చెవులుండీ వినలేం..
మనసుండీ అర్థం చేసుకోలేం..
ఈ భాష అర్థం కావాలంటే
చిప్పిల్లిన మనసుతో వారి ప్రతిభాక్షరాల్ని చదవాలి..

***- అద్దంకి శ్రీనివాస్***

# ధృత రాష్ట్ర లోకంలో శ్రీలేఖ పోరాటం



దీపావళి రోజు దీపాల గురించేకాదు. గాయాల్ని గురించి తల్చుకోవడం చాలా అవసరం. గాయ పడకుండా గెలుపూ ఓటమీ రెండు సాధ్యంకాదు. గాయం పోరాటానికి గుర్తు. నాకెందుకో ఈ మహిళా దినోత్సవ సందర్భంలో శ్రీలేఖను గురించి చెప్పాలనిపిస్తోంది. శ్రీలేఖని "శావీ" అనే ఆంగ్ల పత్రికలో ఎవరో ఇంటర్వ్యూ చేస్తే, చదివి అలా గుర్తుంచుకున్నాను.

ఇంతకీ ఎవరా శ్రీలేఖ అంటారా...?

కేరళ పోలీసు శాఖలో మొదటి తరం మహిళా అధికారి శ్రీలేఖ. కేరళ అనగానే నూరుశాతం అక్షరాస్యతకి చిహ్నంగా మన గుండె పులకిస్తుంది.

నేరస్థుల పాలిట సింహ స్వప్నంలా అవినీతిని, అక్రమాల్నీ చీల్చి చెండాడినంత సులువుగా తన మీద అమలయిన వివక్షను జయించలేక పోయానని ఆమె స్వయంగా చెప్పుకుంది. చాలా మంది మహిళా అధికారులు విజయాల్ని గురించి చెప్పుకున్నంతగా వివక్ష విషయంలో నోరు మెదపలేరు. కాబట్టి నాకు అంతగా నచ్చి వుండాలి.

శ్రీలేఖ అనుభవాల్ని ఆమె మాటల్లోనే చెప్పడానికి ప్రయత్నిస్తాను.

### ఎందుకంత అంటరానితనం...?

"నా క్రింది అధికారి ఎవరైనా ఒక విజయం సాధించినపుడు ముక్తసరిగా, - మంచిది. బావుంది- అని వూరుకోవడం ఎందుకో ఇష్టం వుండదు. ప్రోత్సాహం ఇస్తూ, భుజం తట్టాలనిపిస్తుంది. అందులో వచ్చే ఆత్మ సంతృప్తి అందుకున్న వాళ్ళకే తెలుస్తుంది. నా పై అధికారినుంచీ నేను అదే ఆశిస్తాను. కేవలం ఆడదాన్నవడంవల్ల అది పోగొట్టుకోవడం. అన్యాయంగా అనిపిస్తుంది. కరచాలనం కోసం దాచిన చెయ్యి తప్పు చేసినట్టు ముడుచుకుపోవడం అనేది ఏ పీనల్ కోడుకీ అందని శిక్ష.....!. బహుశా చెయ్యి ముట్టుకోకుండా నమస్కరించడం వల్ల స్త్రీలను గౌరవిస్తున్నామని కొందరు అనుకోవచ్చు. మనం ఆశిస్తున్న విలువలు ఇవి కాదు." అంటుంది శ్రీలేఖ. ఇంకా చాలా విషయాలు సూటిగా చెప్పింది.

"ఒంటి మీద ఖాకీ యూనిఫారం తొడిగిన నాడే నేను ఆడదాన్నని మర్చిపోయాను. జండరు మర్చిపోవడమంటే నా ఆలోచనా పరిధి మరింతగా వికసించడమేనని మనసా వాచా నమ్మాను. అసలందుకే పోలీసు శాఖలో చేరాను. కానీ ఏం జరుగుతోంది? సాధారణ ఉద్యోగి నుంచి డైరెక్టరు జనరలు పోలీసు వరకూ అందరూ నన్ను హద్దుల్లో వుండమని చెప్పేవారే.

### "ఆడవాళ్ళు అంత శ్రమ తట్టుకోలేరా?"

1987లో ట్రైనింగు ప్రోగ్రాం మీద లాల్ బహదూరు అకాడమీలో వున్నప్పుడు హిమాలయాలు ఎక్కాల్సి వచ్చింది. ఆ ప్రాంతమంతా ఎగుడు దిగుళ్ళతో పట్టు చిక్కకుండా వుంది. సిబ్బందితో పాటు పాకుతూ కొండ ఎక్కుతున్నాను. అందరికీ సలహాలు సూచనలూ ఇస్తున్న కోర్సు డైరెక్టరు నన్ను మాత్రం దిగిపొమ్మని, అది చాలా ప్రమాదమని చెబుతూ "మీ ఆడవాళ్ళు అంత శ్రమ తట్టుకోలేరు" అన్నాడు. చాలా అవమానంగా అనిపించింది. కాదు ఎలాగైనా ఎక్కుతానని చెప్పి ఒప్పించాను. అందరూ నా వైపే చూస్తున్నారు. పని కంటే వాళ్ళ పరిశీలన వల్ల నాకు కాళ్ళు వణకడం మొదలయింది. పదిరోజులు జరిగిన ఆ క్యాంపులో విజయం సాధించాను గానీ నన్ను ఆదర్శంగా చెబుతూ "చూడండి బ్రదర్స్.. ఆమె మహిళ, సాధించింది. మీరు ఆ మాత్రం ఎక్కలేరా" అంటున్నప్పుడు అదే అవమానం వెంటాడింది.

### "ఆడదానికి సెల్యూట్ అక్కర్లేదా..?

1991 లో త్రిస్సూరు పోలీసు శాఖకు సూపరిండెంటుగా చేస్తున్నాను. ప్రతినెలా ఆఖరి శుక్రవారం పెరేడు తర్వాత సలహాలు, హెచ్చరికలు ఇవ్వాల్సిన బాధ్యత వుంటుంది. టీం లో చాలా మందికి జుట్టు పెరిగిపోయి, మాసిన గడ్డాలతో చాలా నిర్లక్ష్యంగా వున్నట్లు అనిపించింది. క్రాఫింగు, షేవింగు చేసుకోని వాళ్ళంతా గ్రౌండ్సునుంచి వెళ్లిపొమ్మని

అంటూ "ఫాలౌట్" అని అరిచాను. ఏమాత్రం సిగ్గు పడకుండా అందరూ వెళ్ళి పోయారు. బ్రేక్ ఫాస్టు దగ్గర కూడా నాకు సారీ చెప్పడానికి ఎవరూ ప్రయత్నించలేదు. డి.ఐ.జి, నుంచి ఫోను మాత్రం వచ్చింది.

"పెరేడ్సు దగ్గర హెయిర్ కటింగు ప్రస్తావన ఎందుకు తెచ్చారు? మీ ఉద్దేశ్యం ప్రకారం వాళ్లందరూ బోడి గుండ్లతో రావాలనా? అనవసర విషయాల్లో జోక్యం చేసుకోకండి?" అని ఎగిరాడు. అప్పటివరకూ వున్న క్రమశిక్షణ కూడా ఇక నా హయాంలో ఎవరూ పాటించరని తెల్సి ఆశ్చర్యపోయాను.

ఇంకా పరాకాష్ట ఏమిటంటే, అసలు నేను వస్తున్నట్టు తెలిసి ఒక ఆడదానికి సెల్యూట్ చెయ్యడం ఇష్టంలేని అక్కడి సి.ఐ.బదిలీ చెయించుకుని హడావిడిగా వెళ్లిపోయాడట!

## "రాత్రిపూట ఫోన్లకి ఆన్సరు చెయ్యకూడదా?"

త్రివేండ్రంలో వుండగా ఓ రాత్రి నాలుగ్గంటల పాటు కరెంటు లేదు. కరెంటాఫీసుకి ప్రయత్నించి విసుగేసి కనెక్షను కోసం కజహకుట్టం పోలీసు స్టేషనుకు ఫోను చేసి ఎస్సై వున్నాడా? అని అడిగాను. అతగాడు హటాత్తుగా గొంతు మార్చి చవకగా మాట్లాడం మొదలు పెట్టాడు.

"ఎవరితో మాట్లాడుతున్నావో అర్థమవుతోందా?" అని అరిచాను.

"తెలుసు అర్ధరాత్రి ఆడదానితో ఇంకేం మాటలుంటాయి" అని జవాబు చెప్పాడు. అతని ప్రవర్తన గురించి రిపోర్టు చేసినా ఫలితం లేకపోయింది.

"ఆయన మంచి వాడేనండీ. ఆ రోజు తాగి వుంటాడు." అని ఒకరిద్దరు సమర్థించాలని చూశారు. ఇంకోసారి మతి పోయింది.

## ఎన్నని రికార్డు చెయ్యమంటారు...?

చర్తాలా టౌనులో లిక్కరు షాపులు మూయించడానికి గూండాలతో కంటే అలపూజ పరిధిలోని తోటి అధికారితో ఎక్కువ యుద్ధం చెయ్యాల్సి వచ్చింది. నేను రైడ్సుకి బయల్దేరేలోపు అతను వర్తమానం ఇచ్చేసి వాళ్ళని షాపులు మూయించేస్తూ వుండేవాడు... ఒకసారి నన్ను చెవులతో వినలేని భాషలో తిట్టాడు. నేను కిందకు ఈడ్చి కొట్టాను. అప్పుడు తావివరం అనే సాయంకాలం పత్రికలో నన్ను గురించి నానా కూతలు రాసి మా బంధువులందరికీ పోస్టు చేశాడు. ఇదంతా నేను పై అధికారికి రిపోర్టు చేశాను. అప్పుడు ఆయన ఒక టేపు రికార్డు చేతికి ఇచ్చి లూజు టాక్సు ఎవరకు మాట్లాడినా రికార్డు చెయ్యమన్నాడు. అంటే ఆధారం లేకుండా నా మాట ఎవరూ నమ్మరని అర్థమయింది. యునిఫాం జేబులో టేపు రికార్డు వేసుకుని ఎవరు ఏం వాగినా ఈడ్చి దవడ వాయగొట్టడానికి బదులు రికార్డవుతోందా లేదా అని ఎదురు చూడ్డం చాలా అసహ్యమనిపించేది.

## స్త్రీ గా పుట్టడం ఒక అంగవైకల్యమా..?

త్రిస్సూరు నుంచి డిస్ట్రిక్టు క్రైం రికార్డు బ్యూరో లోకి నన్ను ఎస్పైగా వేశారు. అది ప్రమోషను అయిన పోస్టు కాక క్రియేటు చేసిన పోస్టు అవడం నా అధికారాన్ని తగ్గించడానికేనని తెలుసుకున్నాను. అప్పుడు నేను మూడు నెల్ల పాటు డెలివరీ లీవు తీసుకుని ప్రసవమైన తర్వాత




వచ్చాను. నాకు యూనిఫారం బావులేదని పై అధికారి అనధికార సలహా ఇచ్చాడట. అంతకు ముందు పొట్టతో వున్నప్పుడూ అదే మాట అన్నారు. నా యూనిఫారం మీ అందరికీ బావుండాల్సిన అవసరమేమిటనే నా ప్రశ్నే ఎవరికీ అర్థం కాలేదు.

ఈ విషయాలు ఎవరికి ఫిర్యాదు చెయ్యాలి? నాకోసమే రూల్సు సృష్టిస్తున్న వాళ్ళకా? నా ఫిర్యాదులు బుట్టదాఖలు చేస్తున్న వాళ్ళకా?

నా సర్వీసునీ, క్రెడెట్‌నీ ఆడదాన్ననే కారణం చేత పక్క పెడుతున్న వాళ్ళకా?

స్త్రీగా పుట్టడం ఒక అంగవైకల్యం అయినట్టు... నన్ను మోడలుగా చూపించి నా డిపార్టుమెంటు వాళ్ళు యువకులకి ధైర్యం చెబుతుంటే... అదేదో తెలీని బాధ..."

కరాటే వల్ల, పదవుల వల్ల, అంతరిక్షంలోకి అలా ఎగిరి రావడం వల్ల ఆడవాళ్ళకు అనేక శక్తులొస్తాయని మనం నమ్మేస్తాం. అందుకు కోచింగులు కూడా తీసుకుంటున్నాం. ప్రపంచం సమర్థులైన ఆడవాళ్ళలో కిటకిట్లాడుతోంది. కానీ సమస్యలు తీరడం లేదే!

సమాజం భావ శూన్యతతో తుప్పు పట్టేసిందా...? అభద్రతా భావంతో పిల్లిమొగ్గలు వేస్తోందా...? ఒక పురుషుడు చేసే పని అతని కంటే సమర్ధవంతంగా చేస్తూ కూడా అది గుర్తింపునకి రావాలంటే స్త్రీలు అదనంగా ఎంత కష్ట పడాలి...? ఇది దృక్పధానికి సంబంధించిన సమస్య కదా...?

సరే, నేను మాట్లాడుతున్నది 1987 విషయం కదా అని మీరు అడగవచ్చు... మొదటివరసలో పోరాడుతున్న సిపాయికి తగిలినన్ని గాయాలు తర్వాత తరాల వారికి తగలవని మీతో బాటు నేనూ ఆశ పెట్టుకోనూ వచ్చు... కానీ ఇవాళ కూడా మన వేదన ఇంకా వివక్ష మీదే ఎందుకనివుంది? ఇప్పుడు కూడా ఈ సమస్య మేధావులకీ, మర్యాదస్తులకి పాత చింతకాయ పచ్చడిలా ఎలా కనిపిస్తోంది...? ఇది అలోచించాల్సిన విషయం కాదంటారా?

**- కొండేపూడి నిర్మల**

కన్సల్టెంట్, సి.డబ్ల్యు.ఎస్. అపార్డ్

# ప్రజలవల్ల, ప్రజల చేత ప్రజల కోసం

**గ్రామ సభంటే కేవలం ప్రజా ప్రతినిధులుకు అనుకూలంగా ప్రతిపాదనల పైన ప్రజలతో సంతకాలు సేకరించే కార్యక్రమం కాదు. గ్రామసభంటే ప్రజల జీవితాలను మార్చేటువంటి నిర్ణయాలను తీసుకునే రాజ్యాంగ బద్ధమైన 'రాజకీయ సభ', ప్రజలందరి అభిప్రాయాలకు విలువనిచ్చే విధాన నిర్ణాయక సభ. జన జీవితాన్ని ప్రభావం చేసే 'జనసభ'. ఇటువంటి సభలు చేసిన తీర్మానాలవల్ల, వాటిని అమలు చేయడం మూలంగా దేశంలో అనేక గ్రామ పంచాయితీలలో మౌలికమైన మార్పులు వచ్చాయి. ఇటువంటి మౌలికమైన మార్పు వచ్చిన గ్రామ పంచాయితీలలో హర్యానా రాష్ట్రంలోని పానిపట్టుజిల్లా సమలఖ పంచాయితీ సమితిలో గల 'బిలాస్ పూర్' గ్రామపంచాయితీ ఒకటి.**

బిలాస్‌పూర్ గ్రామ పంచాయితీలో కూడా వేల సంవత్సరాలుగా (సింధు నది నాగరికత కాలంనుండి) కొనసాగుతున్న అలవాటు 'బహిర్భూమి' 2006 వరకు కొనసాగింది. 2006 సంవత్సరంలో 'గ్రామ సభ తీసుకున్న నిర్ణయం వల్ల, వేల సంవత్సరాలుగా ప్రజల ఆరోగ్యంపైన, స్త్రీల ఆత్మగౌరవం పైన చూపిస్తున్న చెడు ప్రభావానికి కళ్ళెం వేయడమైంది. హర్యానా రాష్ట్ర పంచాయితీరాజ్ చట్టం-1994, అన్ని రాష్ట్రాల్లో గానే హర్యానాలో కూడా పంచాయితీరాజ్ వ్యవస్థకు 'గ్రామసభ' 'హృదయం' వంటిది.



ఇటువంటి గ్రామసభను బిలాస్‌పూర్ గ్రామ ప్రజలకు స్ఫూర్తి ప్రదాతగానే కాకుండా, ప్రజలవల్ల, ప్రజలచేత, ప్రజలకోసం పనిచేసే సంస్థగా తయారు చేశారు. అందువల్ల ఈ రోజు ఆ గ్రామ పంచాయితీ మహాత్మాగాంధీ కలలు కన్న 'గ్రామ స్వరాజ్యానికి' నిలువెత్తు నిదర్శనంగా తయారైంది.

బిలాస్‌పూర్ గ్రామ పంచాయితీ మొత్తం జనాభా 1176 మంది. మొత్తం ఓటర్లు 704, ఇందులో మహిళలు 310. మొత్తం జనాభాలో 22% వెనుకబడిన తరగతులు కాగా, 14.8% దళితులు. మొత్తం గ్రామజనాభాలో 92% మంది అక్షరాస్యులు, గ్రామంలోని ప్రజలకు ప్రధాన జీవనాధారం వ్యవసాయం, పశుపాలన. అన్ని గ్రామాలలోలాగానే ఈ గ్రామంలో కూడ అనేక సమస్యలతో జనం ఇబ్బంది పడేవారు. అటువంటి వాటిలో అపరిశుభ్ర వాతావరణం ఒకటి.

### గ్రామ పంచాయితీ తలరాత మార్చిన సర్పంచ్‌ల శిక్షణ

2006 హర్యానా స్థానిక సంస్థల ఎన్నికల్లో బిలాస్‌పూర్ సర్పంచ్‌గా సూరత్‌సింగ్ రెండవసారి ఎన్నికయ్యాడు. ఇతడు డిగ్రీదాక చదువుకున్న వ్యక్తి.

అందరిలాగే ఇతడు కూడా సర్పంచ్‌ల శిక్షణకు హాజరయ్యాడు. ఆ శిక్షణలో నేర్చుకున్న విషయాలను స్పష్టంగా అర్థంచేసుకొని, తిరిగి ఊరికివచ్చి గ్రామ సభ ముందు చర్చకు పెట్టాడు. ఆ రకంగా శిక్షణ కార్యక్రమంలో నేర్చుకున్న విషయాలలో అన్నింటికన్న ఎక్కువగా గ్రామస్థులను ఆకర్షించింది 'పారిశుద్ధ్యం- పరిశుభ్రత'. ఆనాటి వరకు చిన్న చిన్నదారులు, రోడ్లు, వూరి చుట్టూ వున్న ఖాళీస్థలంలో బహిర్భూమికి వెళ్ళడం, కొంతమంది ధనికులు ఇళ్ళలో మలవిసర్జన చేసి క్రింది కులాల వాళ్ళతో బకెట్‌లలో భయట పడవేసే విధానం వుండేది. ఇటువంటి వ్యవస్థను 100% పరిశుభ్రంగా వుంచాలనే ఉద్దేశ్యంతో వ్యక్తిగత, సమూహ స్థాయిలో చర్యలు చేపట్టాలని గ్రామసభ నిర్ణయించింది.

వ్యక్తిగత స్థాయిలో చేతులు, కాళ్ల వేళ్లగోళ్లను కత్తిరించడం, ఇంటిలోపల, బయట శుభ్రపర్చడం, వ్యక్తిగత మరుగుదొడ్లను నిర్మించడం వంటివి. సమూహ స్థాయిలో చెత్తా చెదారాలను తొలగించడం, త్రాగునీటి కొళాయిలు వున్న చోట నీరు నిల్వ కాని లేక బురదగాని లేకుండ చేయడం, సామూహిక మరుగు దొడ్లు నిర్మించడం, పర్యావరణ పరిరక్షణకు చెట్లు నాటడంతో పాటు వ్యక్తిగత ఆరోగ్యానికి సంబంధించి ప్రచార కార్యక్రమం నిర్వహించడం, సంపూర్ణ పారిశుద్ధ్య క్రమాన్ని పూర్తి స్థాయిలో ఉపయోగించుకోవడంవల్ల అతి తక్కువ కాలంలోనే 100% గ్రామప్రజల బహిర్భూమి అలవాటును పూర్తిగా నిర్మూలన అవటమే కాకుండా, ప్రజల ఆరోగ్యం మెరుగు పడింది.

## గ్రామ సభ - గ్రామీణాభివృద్ధి - 2

ఫలితంగా గ్రామపంచాయితీకి 'నిర్మల్' పురస్కారం అందింది. అంతేకాకుండా, నెదర్లాండు యువరాజు విలియం ఛాంబర్ పర్యటించడంతో బిలాస్‌పూర్ జాతీయ, అంతర్జాతీయ వార్తలకు కేంద్రబిందువైంది. ఇటువంటి మార్పు ఎలా సాధ్యమైంది?

### జన సమీకరణకు ఎనిమిది అంశాల కార్యక్రమం

బహిరంగ ప్రదేశాలలో మలవిసర్జన నిరోధానికిగాను గ్రామసభ ఎనిమిది అంశాల కార్యక్రమాన్ని రూపొందించింది.

1. గ్రామం లోపల, బయట బహిరంగ మలవిసర్జనను పూర్తిగా నిలిపివేయడం.
2. వృధాగా వీధులలో, రోడ్లపైన ప్రవహిస్తున్న నీటి నిర్వహణకుగాను చిన్నచిన్న గుంతలు తవ్వడం, (Soak-Pits).
3. ఇళ్ళల్లో మంచినీళ్ళ కొరకు పరిశుభ్రమైన ఏర్పాట్లు చేసుకోవడం.
4. చెత్తా చెదారాన్ని ఇష్టం వచ్చినట్లుగా వీధుల్లో వేయకుండా చెత్తకుండీల్లోనే వేయాలి.
5. అంగన్‌వాడీ, పాఠశాలలో మలమూత్ర విసర్జనకు బాలలకు, బాలికలకు ప్రత్యేక సదుపాయాలు ఏర్పాటు చేయాలి.
6. పిల్లలకు క్రమబద్ధంగా వేలి గోళ్ళను కత్తరించాలి.



Sthanka_BW March.indd 29 28/02/11 6:23 PM

7. గ్రామంలోగాని, పాఠశాలల్లోగాని, నీటినిల్వ కేంద్రాల దగ్గర, కొళాయిల దగ్గరగాని వ్యర్థనీటి నిల్వలు లేకుండా చేయడం.
8. పరిశుభ్రమైన త్రాగునీటిని గ్రామస్తులకు అందించడం.

ఈ ఎనిమిది అంశాలపై ప్రజలలో చైతన్యం తెచ్చి, ఆచరణ సాధ్యమైన విధంగా జన సమీకరణకు అనేక పద్ధతులు అవలంబించారు.

**జనసమీకరణ పద్ధతులు**

గ్రామంలో అనేక కుటుంబాలకు ఇళ్ళలో మరుగుదొడ్లను నిర్మించుకొని, వాడుకోగలిగిన ఆర్థిక స్థోమత వుంది. అయితే ఇక్కడ వున్న సమస్య పూర్తిగా కేవలం డబ్బుతో మాత్రమే ముడిపడిలేదు. ఇది ముఖ్యంగా ప్రజల ఆలోచన, అలవాట్లు, నమ్మకాలతో ముడిపడిన అంశం. అందుకని వారిని కేవలం చైతన్యవంతులను చేయడం ద్వారా మాత్రమే వాటి మార్చగలరు. బలవంతంగా వత్తిడి తెచ్చి, రుద్దడంవల్ల సాధ్యంకాదు. అందుకని బిలాస్‌పూర్ గ్రామ ప్రజలు అనేక పద్ధతులు అవలంబించారు.

*1. ప్రత్యేక గ్రామ సభలు:* బిలాస్‌పూర్ గ్రామ పంచాయితీలోని ప్రజలను పారిశుద్ధ్యంపై చైతన్యవంతులను చేసేందుకు అనేక సార్లు ప్రత్యేక గ్రామ సభలు నిర్వహించారు. ఇందులో అత్యధికులు స్త్రీలు, యువకులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ ప్రత్యేక గ్రామ సభలల్లోనే పారిశుధ్యంపై ఉద్యమాన్ని ఉధృతం చేసేందుకు కమిటీలను ఏర్పాటు చేసేందుకు కూడా తీర్మానాలు చేశారు. ఈ సభలలో గ్రామ సర్పంచ్, ప్రభుత్వాధికారులు ఇచ్చిన ఉపన్యాసాలు గ్రామస్థులను చైతన్యవంతులను చేయడంవల్ల కొంతమంది వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణానికి ముందుకు వచ్చారు.

*2. స్వీయచైతన్యం :* ఒక ప్రక్క గ్రామ పంచాయతీ పరిధిలో పారిశుధ్యంపై చర్చ జరుగుతుండగా, ఒక రోజు గ్రామ సర్పంచ్ ఆధ్వర్యంలో గ్రామంలోని కొంతమందిని బహిరంగంగా మల విసర్జన చేసే ప్రాంతాలకు తీసువెళ్ళి అక్కడ ఎంత దుర్గంధం, అపరిశుభ్రత వుందో స్వయంగా చూపించి, వివరించారు. దీనితో గ్రామ ప్రజలకు ఒక ప్రక్క కనువిప్పు కలగగా, మరొక ప్రక్క పారిశుద్ధ్య కార్యక్రమంపై మరింత చైతన్యం పెరిగి ఆచరణకు పూనుకున్నారు.

**జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ చొరవ**

గ్రామంలో పారిశుధ్యానికి సంబంధించి మరుగుదొడ్లను నిర్మించుకోవాలని జరుగుతున్న ప్రచారానికి, కార్యాచరణకు స్పందించని వారిని చైతన్యవంతులను చేసేందుకుగాను గ్రామసర్పంచ్ జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారులను ఆహ్వానించారు. సర్పంచ్ ఆహ్వానానికి స్పందిస్తూ, గ్రామీణాభివృద్ధి అధికారులు పారిశుద్ధ్య ఆవశ్యకతను గ్రామస్థులకు ఉదాహరణలతో వివరించారు.

గ్రామం చుట్టూ బహిర్భూమికి వెళ్ళడం వల్ల వాటిపై వాలిన ఈగలు, దోమలు తినే తిండిపైన, కట్టుకునే బట్టలపైన, మన చుట్టు వుండే పరిసరాలపై వాలడం, తిరగడం వల్ల అనేక రోగాలు వస్తాయని, గ్రామంలో వ్యర్థనీరు, పదార్థాలు, చెత్తా చెదారం ఎక్కడంటే అక్కడ వేయడం వల్ల కూడా భయంకరమైన రోగాలు వస్తాయని చెప్పడం వల్ల కూడా కొంతమంది ఉత్తేజితులయ్యారు.

**యువజన సంఘాలను భాగస్వాములను చేయడం**

గ్రామంలోని యువకులను పరిశుభ్రమైన వాతావరణం గ్రామంలో వుండే విధంగా ఒప్పించడమే కాకుండా, యువకుల ద్వారా వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించుకొని, ఉపయోగించుకోవడంలో గ్రామ సర్పంచ్ కుమారుడు కూడా పాల్గొన్నాడు.

**మహిళా సంఘాల భూమిక**

గ్రామంలోని మహిళలను తమ ఇళ్ళల్లో మరుగుదొడ్లు నిర్మించుకునేందుకు ఒప్పించడంలో మహిళా సంఘాలు కీలకమైన పాత్ర నిర్వహించాయి. మహిళలు మహిళలను ఒప్పించడమే కాకుండా సాంప్రదాయ బద్ధంగా భారత సమాజంలో స్త్రీలు తమ ఇళ్ళను శుభ్రంగా వుంచుకొని ఇతరులకు ఆదర్శంగా నిలవడం, ఒక ఇంటిలో మరుగుదొడ్డిని నిర్మించడంవల్ల, ఇతర కుటుబాలలోని స్త్రీలు చూడడంవల్ల వారి ఇంటిలో కూడా మరుగుదొడ్ల నిర్మాణానికి అంగీకరించడంతోపాటు, ఇంటి బయట పరిసరాలను శుభ్రంగా వుంచుకోవడం అవసరమన్న విషయాన్ని అవగాహన చేసుకోవడానికి ఉపయోగపడింది.

*పాఠశాల ఉపాధ్యాయులను, విద్యార్థులను భాగస్వాములను చేయడం:* బిలాస్ పూర్ గ్రామ పంచాయితీ పరిధిలో పారిశుద్ధ్య కార్యక్రమం విజయవంతమవ్వడంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు చాలా కీలక పాత్ర పోషించారు. పాఠశాల పరిధిలో వున్న మరుగుదొడ్లు సక్రమంగా శుభ్రంచేయించి వాడుకోవాలని, తల్లిదండ్రుల కమిటీలను ఏర్పాటు చేయాలని, చదువుకునేందుకు అనుకూలమైన వాతావరణాన్ని సృష్టించాలని పాఠశాలల్లో తీర్మానం చేయించారు.

గ్రామంలో 'స్వచ్ఛతను కాపాడండి రోగాలను నిర్మూలించండి' అంటూ నినాదాలు చేయిస్తూ విద్యార్థులతో ఊరేగింపులు చేయించారు. విద్యార్థుల్లో పారిశుద్ధ్యంపై వచ్చిన చైతన్యం ఫలితంగా ఇంటిలో మరుగుదొడ్డి నిర్మించాలని తల్లిదండ్రులపై వారు ఒత్తిడి తెచ్చారు.

**గోడలపై బొమ్మలు వేయించడం, నినాదాలు రాయించడం**

గ్రామస్తుల సంపూర్ణ పారిశుధ్యంపై పరిజ్ఞానం పెంపొందించేందుకు గాను ఇళ్ళ గోడలపై వివిధ రకాలైన బొమ్మలు వేయించారు. అదే విధంగా నినాదాలు రాయించారు. ఇటువంటివి గ్రామస్తులనే కాకుండా, బయటి వారు వెళ్ళినా కూడా వెంటనే ఆకర్షిస్తాయి. ఈ పని చేయడంలో బిలాస్‌పూర్ పూర్తిగా విజయవంతమైంది.

**పారిశుధ్యానికి చెందిన వార్తలను ప్రచారం చేయడం**

బిలాస్‌పూర్ గ్రామ ప్రజలను పారిశుద్ధ్యంపై చైతన్యవంతులను చేసేందుకు అవలంబించిన మరొక ఎత్తుగడ దిన పత్రికల్లో పారిశుధ్యానికి సంబంధించి వచ్చే వార్తలను కత్తిరించి గ్రామపంచాయితీ, పాఠశాలలు, అంగన్‌వాడీలు ఇతర బహిరంగ ప్రదేశాలలో అతికించడంతోపాటు, చదువు రాని వారికి చదివి వినిపించారు.

పై రకాలన్నీ పద్ధతులతోపాటు సబ్సిడీ ధరకు వ్యక్తిగత మరుగుదొడ్లు, సామూహిక మరుగుదొడ్లు నిర్మాణం చేయడం, ఉపయోగించని వారిపై జరిమానా వేయడం, గ్రామంలోని బహిరంగ ప్రదేశాలను సుందరంగా తీర్చిదిద్దడం ఫలితంగా, ఈనాడు బిలాస్‌పూర్ గ్రామపంచాయితీ సంపూర్ణమైన పారిశుద్ధ్య గ్రామంగా పేరు సంపాదించుకుంది. ఈ విధంగా ఈ గ్రామ ప్రజలు ప్రస్తుతం 'గ్రామాన్ని శుభ్రంగా ఉంచు-ఆరోగ్యంగా జీవించు' అనే నినాదంతో బ్రతుకుతున్నారు.

*- డా॥ ఇ. వెంకటేష్,*
*అసోసియేట్ ప్రొఫెసర్, ఎన్ఐఆర్‌డి*



Sthanka_BW March.indd 30 28/02/11 6:23 PM

# విద్యాహక్కు చట్టం 2009 - పాఠశాల అభివృద్ధి ప్రణాళికా రూపకల్పన పంచాయితీరాజ్ సంస్థల పాత్ర



**పార్లమెంటు ఏర్పాటు చేసిన ఈ విద్యాహక్కు చట్టం 86వ రాజ్యాంగ సవరణ ద్వారా ఆర్టికల్ 21(A) గా రూపొందించబడింది.**

**2005లో బిల్లుగాను, 26 ఆగస్ట్ 2009 న భారత రాష్ట్రపతి ఆమోదంతో చట్టంగాను మారింది. ఈ చట్టాన్ని ఉచిత నిర్బంధ విద్యకు బాలల హక్కుచట్టం, ఆగస్ట్ 2009 గా పిలువవచ్చు. ఇది 6 నుంచి 14 సంవత్సరాలలోపు బాలలందరికీ ఉచిత నిర్బంధ విద్యను అందించేందుకు ఉద్దేశించిన చట్టం.**

భారతదేశంలో ఏప్రిల్ 1, 2010 నుండి ఈ చట్టం అమలులోకి వచ్చింది. జమ్మూ కాశ్మీర్ మినహాయించి ఇది భారతదేశమంతటికీ వర్తిస్తుంది.

బాలలకు 1. జీవించే హక్కు 2. సంరక్షణ హక్కు 3. అభివృద్ధి చెందే హక్కు 4. భాగస్వామ్యపు హక్కు లాంటి వాటిని ఈ చట్టం వరాలుగా ప్రసాదించింది.

6 నుంచి 14 సంవత్సరాలలోపు బాలలకు ఉచిత నిర్బంధ విద్య అందించడం, బడిబయట పిల్లలు బడిలో చేరి చదువుకునేలా చేయటం, శిక్షలు, దండనలకు అతీతంగా ఆహ్లాదకరమైన వాతావరణంలో పాఠశాల విద్యను బాలలు అందుకునేలా చేయటానికి ఈ చట్టాన్ని తెచ్చారు. వయసుకి తగిన తరగతిలో చేరే అవకాశం, పుట్టిన తేదీ ధృవపత్రం, ప్రవేశ పరీక్షలు లేకుండా అడ్మిషన్ పొందే వెసులుబాటును కల్పిస్తూ, కోరినపుడు టి.సి. ని పొంది వేరే పాఠశాలలో చేరే సౌకర్యాన్ని కూడా ఈ చట్టం బాలలకు ఇస్తోంది.

### పాఠశాల అభివృద్ధి ప్రణాళిక

విద్యాహక్కు చట్టంలోని 4 వ అధ్యాయం సెక్షన్ 21 సబ్‌సెక్షన్ (1) పాఠశాల యాజమాన్య కమిటీ ఎలా ఏర్పడాలో సూచిస్తుంది.

ఇదే అధ్యాయంలో సెక్షన్ 22 సబ్‌సెక్షన్ (1) పాఠశాల అభివృద్ధి ప్రణాళికను, పాఠశాల యాజమాన్య కమిటీ పాత్రను, సలహాలు, సూచనలను అందించే అంశాలను ప్రస్తావిస్తుంది.

అంతేకాక రూల్‌నెం. 20 లో పాఠశాల అభివృద్ధి ప్రణాళికను ఏ విధంగా రూపొందించుకోవాలి? అనే అంశానికి వివరణ లభిస్తుంది.

ఈ వివరణలో భాగంగానే ప్రతీ పాఠశాలలో కూడా పాఠశాల అభివృద్ధి ప్రణాళికను రూపొందించుకోవటం కోసం ప్రతి సంవత్సరం నవంబర్ నెలలో గ్రామ సభను నిర్వహించాలి.

*గ్రామసభలో సభ్యులుగా ఉండాల్సిన వారు*

- పాఠశాలలో చేరి చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు
- పంచాయితీ రాజ్ సంస్థల స్థానిక ప్రతినిధులు
- మహిళా సమాఖ్యలు
- విద్యారంగంలో పనిచేసే పాఠశాల సమీపంలోగల స్వచ్ఛంద సంస్థలు

*పాఠశాల అభివృద్ధి ప్రణాళికలోని అంశాలు*

- తరగతుల వారీగా బడిలో చేరి చదువుతున్న విద్యార్థుల వివరాలు
- అదనంగా అవసరమైన ఉపాధ్యాయుల వివరాలు సబ్జక్టుల వారీగా
- పాఠశాలకు కావలసిన భౌతిక వనరులు
- పాఠశాల పారిశుధ్యం, సంరక్షణ, ఆరోగ్యం, త్రాగునీరు, వంట వసతులు,
- పాఠశాలకు అవసరమైన ఆర్థిక వనరులు
- విద్యార్థులకు అవసరమైన ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫారం, పౌష్టికాహారం మొదలైనవి.

### పాఠశాల అభివృద్ధి ప్రణాళిక - పంచాయితీరాజ్ సంస్థల పాత్ర

పంచాయితీరాజ్ సంస్థల స్థానిక ప్రతినిధులు పాఠశాల కార్యకలాపాలపట్ల పరిపాలనా సంబంధమైన అంశాలపట్ల సమీక్షించవలసి ఉందని, అభివృద్ధి ప్రణాళికలోని అంశాలను అమలు జరిగేలా చూసే బాధ్యతను, చేపట్టాల్సిందని ఈ విద్యాహక్కు చట్టం రూల్ నెం. 20లో తెలుపుతోంది.

పంచాయితీరాజ్ సంస్థలు అంటే జిల్లా పరిషత్‌లు, మండల పరిషత్‌లు, గ్రామ పంచాయితీలు. ఈ సంస్థలు పాఠశాల అభివృద్ధి ప్రణాళికను తయారు చేయటంలోనూ, దీనిని అమలు జరిగేలా చేయటంలోనూ ప్రముఖ పాత్రను పోషించవలసి ఉందని ఈ చట్టం సూచిస్తోంది. దీనికిగాను ఈ క్రింది అంశాలపై దృష్టి సారించవలసి ఉన్నది.

- ఈ పంచాయితీరాజ్ సంస్థలకు పాఠశాల అభివృద్ధి ప్రణాళికలో పొందుపరిచిన అంశాలను అమలు జరిగేలా చేయటానికి సమీక్షించే అధికారాన్ని చట్టం ప్రసాదించింది.
- పాఠశాల అభివృద్ధి ప్రణాళికను గ్రామసర్పంచ్ లేదా ఉపసర్పంచ్ పాఠశాల యాజమాన్య కమిటీ ఛైర్మన్ హోదాలో సంతకం చేసి ప్రభుత్వం లేదా స్థానిక సంస్థల ప్రతినిధికి సమర్పించవలసి ఉన్నది.
- పాఠశాలకు అవసరమైన ఉపాధ్యాయుల వివరాలు ప్రభుత్వానికి తెలియజేయటం.
- పాఠశాలకు కావలసిన నిధుల కొరత ఉన్నప్పుడు, అదనంగా నిధుల సేకరణ అవసరమైనప్పుడు ఆ నిధులను ప్రత్యక్షంగా, లేదా పరోక్షంగా సమకూర్చవలసి ఉన్నది.
- విద్యార్థులకు గుణాత్మక విద్య అందేలా ప్రణాళికల రూపకల్పన.

*- వి. నాగపద్మిని, ఎస్‌జిటి, ఎంపిపి పాఠశాల, కొర్లమ్మ కుంట, పెదపాడు*



Sthanka_BW March.indd 31 28/02/11 6:23 PM

# ఆదర్శ గ్రామ పంచాయితీకి ఈ లక్షణాలుండాలి



బల్వంతరాయ్ మెహతా కమిటీ సిఫారసుల ప్రకారం, 1959 సంవత్సరంలో సమితి, గ్రామ స్థాయిలలో మూడంచల పంచాయితీ రాజ్ వ్యవస్థను ప్రవేశపెట్టిన రాష్ట్రాలలో మొదటిది రాజస్థాన్‌కాగా, ఆంధ్రప్రదేశ్ రెండవ స్థానం ఆక్రమించింది. రాజస్థాన్ రాష్ట్రంలో 1959 అక్టోబరు 2న అప్పటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ పంచాయితీ రాజ్ వ్యవస్థను ప్రారంభించగా, మన రాష్ట్రంలో 1959 నవంబరు 11న మహబూబ్‌నగర్ జిల్లాలోని షాద్‌నగర్‌లో ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ పంచాయితీ రాజ్ వ్యవస్థకు అంకురార్పణ చేశారు.

ఆనాటి నుండి నేటి వరకూ మన రాష్ట్రంలో పంచాయితీ రాజ్ సంస్థలు గ్రామీణ ప్రజల జీవన ప్రమాణాలలో మార్పులలో మార్పు తీసుకొనిరావటానికి తమ వంతు ప్రయత్నం చేస్తున్నాయి. నేడు రాష్ట్రంలో మొత్తం 21,807 గ్రామ పంచాయితీలు, 1097 మండల ప్రజా పరిషత్తులు, 22 జిల్లా ప్రజా పరిషత్తులు ఉన్నాయి. 73వ రాజ్యాంగ సవరణ ఫలితంగా పంచాయితీరాజ్ సంస్థలకు ప్రాతినిధ్యం వహించే ప్రజాప్రతినిధుల సంఖ్య కూడా నేడు గణనీయంగా పెరిగింది. సుమారు 2.60 లక్షల మంది ప్రజా ప్రతినిధులతో దేశంలోనే అత్యధికంగా ప్రజాప్రతినిధులు కలిగిన రాష్ట్రాలలో, ఉత్తర ప్రదేశ్ తరువాత స్థానంలో మన రాష్ట్రం నిల్చి ఉంది. మన రాష్ట్రంలో గ్రామీణ ప్రాంతాలలో సగటున ప్రతీ 60 కుటుంబాలకి ఒక ప్రజా ప్రతినిధి ఉన్నారంటే నమ్మగలరా? కానీ ఇది నిజం.

గ్రామీణ ప్రజల జీవన ప్రమాణాలు పెంచటానికి ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నప్పటికీ, నేటికీ గ్రామీణ ప్రాంతాలలో ప్రజలకు సరైన విద్య, వైద్యం, ఆరోగ్యం, త్రాగునీరు, పారిశుద్ధ్యం, గృహవసతి, పౌష్టికాహారం అందుబాటులో లేకపోవటం వల్ల ప్రజల జీవన ప్రమాణాలు నానాటికీ దిగజారుతున్నాయి.

రాజ్యాంగ బద్ధమైన ప్రజాస్వామ్య వ్యవస్థ గ్రామస్థాయిలో ఉన్నప్పటికీ, నేటికీ సుమారు 30% ప్రజలు దారిద్ర్య రేఖకు దిగువనే నివశించటం ఒక వాస్తవం. గ్రామీణ ప్రజల వికాసం కోసం సుమారు 250 కేంద్ర ప్రభుత్వ పథకాలు మరెన్నో రాష్ట్ర ప్రభుత్వ పథకాలు, అమలు అవుతున్నప్పటికీ, ఈ పథకాల సమాచారం కనీసం పంచాయితీ రాజ్ సంస్థలకు తెలియక పోవటం వల్ల అవకాశాలను వినియోగించుకోలేకపోతున్నాయి.

ఇటువంటి పరిస్థితుల మధ్య కూడా పరిపాలనలో నూతన ఒరవడుల ద్వారా గ్రామీణ ప్రజల జీవన ప్రమాణాలలో మెరుగుదల తీసుకొనిరావటానికి పలు గ్రామ పంచాయితీలు నిర్మాణాత్మకంగా పనిచేస్తున్నాయి. ఇటువంటి పంచాయితీలలో వరంగల్ జిల్లా గంగదేవి పల్లి, కరీంనగర్ జిల్లా రామచంద్రాపూర్, తూర్పు గోదావరి జిల్లా జేగురుపాడు, కర్నూలు జిల్లా పాండురంగాపురం, మహబూబ్‌నగర్ జిల్లా హాజీపల్లి, ఖమ్మం జిల్లా మేడేపల్లి వంటి పంచాయితీలు ప్రజలకు మౌలిక వసతుల కల్పనా రంగం, జీవన ప్రమాణాల పెంపుదల రంగంలో విశేషమైన కృషి చేస్తున్నాయి.

ఈ కృషికి ప్రపంచ వ్యాప్తంగా మంచి గుర్తింపు కూడా వచ్చింది. గూగుల్ సంస్థ ఈ పంచాయితీలకు ఉత్తమ ప్రతిభా పురస్కారాలు కూడా అందచేసింది. ఇవి కేవలం ఒక ఉదాహరణ మాత్రమే. ఐతే రాష్ట్రం మొత్తం మీద చూసినట్లయితే, ఈ సంఖ్య 100 కు మించదు. మన రాష్ట్రంలో మొత్తం 21807 గ్రామ పంచాయితీలు ఉంటే, వాటిలో ఉత్తమ ప్రతిభ కనబరుస్తున్న పంచాయితీలు కేవలం 100ల సంఖ్యలోనే ఉండటం ఆశ్చర్యకరమైన అంశం.

రాష్ట్రంలోని మేజర్ పంచాయితీలను మినహాయిస్తే రాష్ట్రం మొత్తం మీద అన్ని పంచాయితీలకు ఇంచు మించు ఒకే రకమైన నిధులు అందుతున్నప్పటికీ, ఈ అవకాశాలను అందిపుచ్చుకొని స్థానిక ప్రజలను కూడా అభివృద్ధిలో భాగస్వాములను చేస్తూ ప్రగతి పథంలో సాగటం కేవలం కొద్ది పంచాయితీలకే సాధ్యమవుతోంది.

ఆదర్శ పంచాయితీలుగా రూపాంతరం చెందటానికి ఈ గ్రామ పంచాయితీలకు ఉమ్మడి లక్షణాలు ఏమున్నాయనే దాని మీద అపార్డు కమీషనరు శ్రీ కె. చంద్రమౌళి, ఐ.ఏ.ఎస్. ఆధ్వర్యాన అపార్డులో ప్రజాప్రతినిధులతో, జిల్లా రిసోర్సు పర్సన్‌లతో, ఫ్యాకల్టీ సభ్యులతో జరిగిన మేధో మధనంలో పలు ఆసక్తికమైన అంశాలను గుర్తించటం జరిగింది. ఈ ఉత్తమ గ్రామ పంచాయితీలలోని ప్రజలలో వచ్చిన మార్పుకు గల పలు కారణాలను విశ్లేషించగా, ఈ దిగువ సూచించిన లక్షణాలు ప్రధాన పాత్ర పోషించినట్లు అర్థం అవుతోంది.

### ఉత్తమ గ్రామ పంచాయితీలలో ఉన్న లక్షణాలు

**1. ఐకమత్యం 2.భాగస్వామ్యం 3. అభివృద్ధి తృష్ణ 4. నాయకత్వం 5. నిస్వార్థసేవ 6. పారదర్శకత 7.ప్రణాళిక 8. సహజవనరులపై అవగాహన 9. లక్ష్యం. 10. సమావేశాల నిర్వహణ 11. నిర్వహణా సామర్థ్యం 12.శిక్షణ 13. అక్షరాస్యత 14. సమన్వయం.**

**1. ఐకమత్యం :** కుల మతాలకు అతీతంగా, రాజకీయాలకు సంబంధం

లేకుండా గ్రామ ప్రజలందరూ ఒకే కుటుంబంలా కలిసిమెలసి ఉండటం. గ్రామంలో వివిధ రాజకీయ పార్టీల ప్రభావం ఉన్నప్పటికీ, ఈ ప్రమేయం కేవలం ఎన్నికల వరకే పరిమితమయ్యి, ఎన్నికల తరువాత గ్రామ అభివృద్ధికి సమిష్టిగా పాటుపడటం అనేది ఈ గ్రామ పంచాయితీలలో కొట్టొచ్చినట్లు కన్పిస్తుంది.

**2. భాగస్వామ్యం :** గ్రామ అభివృద్ధిలో గ్రామంలోని అన్ని వర్గాలను ముఖ్యంగా బలహీన వర్గాలు, ఎస్.సి., ఎస్.టి.లు, మహిళలు మొదలైన వారినందరినీ భాగస్వాములను చేయటం. ఏదేని ప్రభుత్వ పథకం అమలు చేయాలంటే, ఆ పథకం నుండి లబ్ది పొందే భాగస్వాములందరినీ ఒక తాటిపైకి తెచ్చి అభివృద్ధిలో ముందుకు సాగటం.

**3. అభివృద్ధి తృష్ణ :** తన కుటుంబం వరకే అభివృద్ధి చెందితే చాలు అనే సంకుచిత స్వభావంతో కాకుండా, తమ గ్రామం కూడా తమ కుటుంబంలా అభివృద్ధి చెందాలనే తృష్ణ స్థానిక నాయకులలో, ప్రజలలో బలీయంగా ఉండటం. ప్రజలలో ఇటువంటి లక్షణాలను కలుగచేయటానికి కూడా ఈ గ్రామ పంచాయితీలు విశేషమైన కృషి చేస్తున్నాయి.

**4. నాయకత్వం :** గ్రామంలో బలమైన స్థానిక నాయకత్వం ఉండటం ఈ గ్రామాల ప్రత్యేకత. ఐతే ఈ నాయకత్వం అనేది ప్రజలు అంగీకరించటం ద్వారా వచ్చినది కావటంతో ఎటువంటి పొరపొచ్చాలు లేకుండా, రాగ ద్వేషాలకు అతీతంగా ప్రజలకు స్థానిక నాయకులు సేవలు అందచేయగల్గుతున్నారు. నాయకుల విశ్వసనీయతపై ప్రజలకు అపారమైన నమ్మకం ఉండటంతో, నిర్ణయీకరణ సులభమయ్యి గ్రామం అభివృద్ధి చెందటానికి దోహదపడుతోంది.

**5. నిస్వార్ధసేవ :** స్థానిక నాయకత్వం లాభాపేక్ష లేకుండా ప్రజలకు సేవ చేయటానికి ముందుకు రావటం ఒక విశేషమైన లక్షణం. నాయకులు పూర్తి స్థాయిలో తమ విలువైన సమయాన్ని గ్రామాభివృద్ధికై వెచ్చించగల్గటం ఈ గ్రామ పంచాయితీలలో స్పష్టంగా గోచరిస్తుంది.

**6. పారదర్శకత (జవాబుదారీతనం) :** గ్రామ పంచాయితీ జరిపే ఆర్థిక లావాదేవీల్లో, ఇతర కార్యకలాపాల్లో ఎటువంటి దాపరికం లేకుండా సమాచారాన్ని ఎప్పటికప్పుడు ప్రజలకు తెలియపర్చటం ఈ గ్రామ పంచాయితీలలో మనం గమనించవచ్చు. ప్రజా ధనాన్ని వెచ్చించేటప్పుడు ప్రతి ఒకపైసా సద్వినియోగమయ్యేలా పూర్తి జవాబుదారీతనంతో వ్యవహరించటం కూడా గ్రామాల అభివృద్ధికి దోహదం చేస్తున్నాయి.

**7. ప్రణాళిక :** గ్రామ సమగ్ర అభివృద్ధికి ఏం చెయ్యాలి, ఎలా చెయ్యాలి, ఎవరి సహకారంతో చెయ్యవచ్చు, ఎంత సమయంలో చెయ్యవచ్చు, నిధులు ఎక్కడి నుంచి సేకరించుకోవచ్చు. ఉన్న అవసరాలలో ఏది ప్రాధాన్యమైనది, ఏ పనిచేపడితే ఎవరికి ఎక్కువ లబ్ది కలుగుతుంది అన్న అంశాలన్నీ పరిగణనలోకి తీసుకొని అభివృద్ధికి ప్రణాళికాబద్ధమైన విధానాన్ని పాటిస్తుండటం ఈ గ్రామాల లక్షణం.

**8. సహజవనరులపై అవగాహన :** గ్రామంలో అందుబాటులో ఉన్న సహజవనరులైన నీరు, భూమి, చెట్లు మొదలైన వాటి పట్ల సమగ్రమైన అవగహన ఉండి ఈ పరిమిత వనరుల సద్వినియోగానికి, సుస్థిరమైన పద్ధతులను పాటించటం మరొక ముఖ్యమైన అంశం.

**9. లక్ష్యం:** గ్రామాన్ని భవిషత్తులో ఏవిధంగా అభివృద్ధి పరచాలన్న ఒక దార్శనిక దృక్పథం స్థానిక నాయకత్వంలో ఉండటం, రాబోయే 10 -15 సంవత్సరాలలో వివిధ రంగాలలో గ్రామాన్ని ఏ విధంగా అభివృద్ధి పరచాలన్న విషయంపై స్పష్టత ఉండటం, పెరుగుతున్న జనాభా అవసరాల దృష్ట్యా అవసరమయ్యే మౌలిక వసతులు, సామాజిక సేవల విస్తరణ వంటి అంశాలపై ఒక స్పష్టమైన లక్ష్యంతో పనిచేయటం ప్రధానంగా గోచరిస్తుంది.

**10. సమావేశాల నిర్వహణ :** గ్రామ పంచాయితీ సమావేశాలు, గ్రామ సభలను క్రమం తప్పకు,డా నిర్వహించటం, గ్రామ సభ నిర్ణయాలలోని సాధ్యా సాధ్యాలను గ్రామ పంచాయితీలో చర్చించి అభివృద్ధికి బాటలు వేయటం మనం గమనించవచ్చు. చాలా పంచాయితీలలో కేవలం కాగితాలమీదనే జరిగే సమావేశాలు, ఈ పంచాయితీలలో వాస్తవంగా జరగటం, అదీ ఒక సారి కాకుండా పదే పదే క్రమం తప్పకుండా జరగటం అభినందనీయం, అనుసణీయం.

**11. నిర్వహణా సామర్థ్యం :** ప్రభుత్వ నిధులను వినియోగించి ప్రజలకు సక్రమంగా సేవలు అందచేయటంలో గ్రామ పంచాయితీ గల నిర్వహణా సామర్థ్యం ప్రజల మన్ననలను చూరగొనటానికి తోడ్పడుతోంది.

**12. శిక్షణ :** గ్రామ పంచాయితీ సభ్యులు తమ విషయ పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవటానికి అన్ని ప్రభుత్వ శిక్షణా కార్యక్రమాలకు హాజరవుతూ, నూతన పద్ధతులు / పరిజ్ఞానం ఏదైనా అందుబాటులోకి వచ్చినప్పుడు ప్రజలకు కూడా ఆయా విషయాలపై శిక్షణను అందచేయటానికి చర్యలు తీసుకుంటుండటం ఈ గ్రామ పంచాయితీలలో కన్పిస్తుంది. విజ్ఞానవంతమైన సమాజమే అభివృద్ధిలో ముందడుగువేస్తుందని ధృఢంగా విశ్వసిస్తూ, ప్రజలను విజ్ఞానవంతులను చేయటానికి ఈ పంచాయితీలు నిరంతరం పాటుపడుతున్నాయి.

**13. అక్షరాస్యత :** గ్రామీణాభివృద్ధికి అవరోధం కలిగించే అంశాలలో నిరక్షరాస్యత ప్రధానమైనది. ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడాలంటే అందరూ అక్షరాస్యులు కావాలన్న సత్సంకల్పంతో ఈ గ్రామ పంచాయితీలు 100 శాతం అక్షరాస్యత సాధించాయి. అక్షరాస్యత విలువ తెల్సుకున్న ప్రజలు తమ పిల్లలను కూడా విద్యావంతులను చెయ్యటానికి అహరహం శ్రమిస్తూ బాలల బంగారు భవిష్యత్తుకు బాటలు వేస్తున్నారు.

**14. సమన్వయం :** పైన పేర్కొన్న ఎన్ని లక్షణాలున్నప్పటికీ, గ్రామంలో జరిగే పలు అభివృద్ధి కార్యక్రమాలు సజావుగా నిర్వహించబడేలా చూడటం, గ్రామాభివృద్ధి కోసం ప్రజలతోనూ, ప్రభుత్వాధికారులతోనూ, రాజకీయ నాయకులతోనూ సమన్వయంతో పనిచేయటం ఈ గ్రామ పంచాయితీలలో చూడవచ్చు.

**- డా॥ శివశంకరప్రసాద్**

# గట్టివాడనిపించుకున్న లాల్‌బహదూర్ శాస్త్రి

**వారణాసి (కాశీ)కి ఏడు మైళ్ళ దూరంలో గల మొగల్ సరాయ్‌లో శారదాప్రసాద్, రాందులారీ దేవి దంపతులకు అక్టోబర్ 2, 1904లో లాల్ బహదూర్ జన్మించారు. ఆయన తండ్రి ఒక పాఠశాల ఉపాధ్యాయుడు. లాల్ బహదూర్‌కి ఏడాదిన్నర వయస్సులోనే శారదా ప్రసాద్ గతించాడు. తల్లి రాందులారీ పోషణలో తన మతామహుల ఇంట్లో ఆయన పెరగాల్సిన అవసరం ఏర్పడింది. చిన్నతనంలో ఆయన పడిన కష్టాలు ఎక్కువే. గంగా నదిని పడవలో దాటడానికి డబ్బులు లేకపోతే, ఒక చేత పుస్తకాలు పట్టుకుని మరో చెత్తో ఈదుకుంటూ బడికెళ్ళి చదువుకున్నాడు. ఆనాటి నుండీ ఆయనకు ఆత్మాభిమానం పెట్టనికోటగా నిలిచింది.**



1921లో మోహన్‌దాస్ కరమ్‌చంద్ గాంధీ పిలుపునందుకుని ఆయన సహాయనిరాకరణ ఉద్యమంలో ప్రముఖపాత్ర పోషించారు. బెనారస్ విద్యా పీఠ్‌లో చేరి వేదాంత శాస్త్రం అభిమాన విషయంగా తీసుకుని 1926లో ప్రథమ శ్రేణిలో పాసై శాస్త్రి డిగ్రీ సంపాదించారు. ఆనాటి ఆ 'శాస్త్రి' డిగ్రీనే ఆయన పేరులో కలిసింది. వెరసి ఆయన పేరు తర్వాత రోజుల్లో లాల్ బహదూర్ శాస్త్రి అయింది.

కాశీ విద్యాపీఠ్ గురించి ఇక్కడ కొద్దిగా చెప్పుకోవాలి. దానిని జాతీయ దృక్పథంతో శ్రీ శివప్రసాద గుప్త అనే దేశ భక్తుడు స్థాపించారు. అక్కడ విద్యాభ్యాసం చెయ్యడం వల్ల శాస్త్రి గారికి ఉగ్గుపాలతోనే జాతీయ దృక్పథం, రాజకీయాలలో ఆసక్తి ఏర్పడ్డాయి. 22 సంవత్సరాల వయస్సులోనే లాల్‌బహదూర్ రాజకీయాలే వృత్తిగా, దేశ సేవే పరమార్థంగా జీవితంలోకి అడుగు పెట్టారు. వివాహానంతరం ఆయన అలహాబాద్‌లో స్థిర పడి ఒక వంక కుటుంబ పోషణ చేసుకుంటూ స్వాతంత్ర్య ఉద్యమాలలో ప్రధానపాత్ర నిర్వహిస్తూ వచ్చారు. అందు మూలంగా దాదాపు ఎనిమిది సంవత్సరాలు జైలు జీవితం గడపాల్సొచ్చింది. తొలుత లాలా లజపతిరాయ్ వల్ల ఉత్తేజితులైనా, అనంతర కాలంలో శాస్త్రికి జవహర్‌లాల్ నెహ్రూతో సనిహితత్వం ఏర్పడింది. ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని అలహాబాద్ బోర్డులో అనేక పదవులు ఆయన నిర్వర్తిస్తూ వచ్చారు. ఆ క్రమంలోనే జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యదర్శిగా పనిచేశారు. అనంతరం 1935లో యు.పి. కాంగ్రెస్ కమిటీ కార్యదర్శిగా ఎన్నికయ్యారు.

నెహ్రూ గారికి, లాల్ బహదూర్ గారికి ప్రజాస్వామ్యమన్నా, మతాతీత ప్రవృత్తి అన్నా అచంచలమైన విశ్వాసమున్నది. చీటికి మాటికీ చికాకు పడే వ్యక్తిత్వం కాదు శాస్త్రి గారిది. వారి సహనం తరిగిపోనిది. ఎవరెస్టు శిఖరంలా నిరంతరం పెరిగే అంతటి వారు ఆనాటి రాజకీయ వేత్తలు. మూర్తీ భవించిన వినయ సంపన్నులు లాల్ బహదూర్.

పురుషోత్తమ దాస్ టాండన్ శాస్త్రిజీ గురించి ఇలా చెప్పారు "ఆయన వినయం వెనుక వజ్రంలాంటి నిశ్చిత సంకల్పం ఉన్నది" అని.

ఇంకా చెప్పాలంటే, మృదు మధుర స్వభావం శత్రువునయినా మిత్రుడిని చేసేది. క్లిష్ట సమస్యలను పరిష్కరించడంలో ఆయన గొప్ప నేర్పరి. బహుశా అందువల్లనే జవహర్‌లాల్ తర్వాత ప్రధానమంత్రి ఎవరా అంటూ నేల నాలుగు చెరగులా గగ్గోలు బయల్దేరింది - నెహ్రూ తన వారసుడు మరెవ్వరో కారు లాల్ బహదూర్ అని నిర్ణయించుకున్నాడన్న విషయం తెలియక. పదవుల కోసం లాల్ బహదూర్ ఏనాడూ పాకులాడ లేదు. పదవులే ఆయనను ఎప్పుడూ వెదుక్కుంటూ వచ్చాయి.

ఒకసారి భువనేశ్వర్‌లో జవహర్‌లాల్ నెహ్రూని శాస్త్రిగారు "నేను ఏమి పని చెయ్యాలి?" అని ప్రశ్నించారు.

అందుకు నెహ్రూ "నా పని చూస్తూ ఉండు" అన్నారు.

లేకపోతే నూరు కోట్లకు సమీపిస్తున్న జనాభా గల ప్రజాస్వామ్యం గల దేశానికి లాల్ బహదూర్ శాస్త్రి ప్రధాని కాగలిగేవారా! ఆయన శక్తియుక్తుల పట్ల నెహ్రూకి ఎంతో నమ్మకం ఉంది. ఆ నమ్మకమే లాల్ బహదూర్‌ని భారత ద్వితీయ ప్రధానిగా చేసింది.

1937లో ఉత్తరప్రదేశ్ శాసనసభకు మొదటిసారిగా ఎన్నికయ్యారు. 1946లో జరిగిన ఎన్నికల్లో రెండవసారి ఎన్నికై 1947లో ఆ రాష్ట్ర హోంమంత్రి పదవి దక్కించుకున్నారు శాస్త్రీజీ. రాను రాను లాల్ బహదూర్ ఉన్నత గుణ సంపత్తి వల్ల ఆయన రాష్ట్ర రాజకీయాల నుంచి కేంద్ర రాజకీయాలకు ప్రమోట్ అయ్యారని చెప్పాలి.

1951లో శాస్త్రి గార్ని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ అఖిల భారత కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి హోదాలో నియమించారు. అప్పుడే ఆయన జీవితం పెద్ద మలుపు తిరిగిందని చెప్పవచ్చు. 1952లో జరగబోయే సాధారణ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను నిర్ణయించే బాధ్యతను నెహ్రూ శాస్త్రి గారి భుజస్కందాల మీద పెట్టారు. ఆ బాధ్యత లాల్ బహదూర్ శాస్త్రిని భారతీయ స్థాయి రాజకీయ నాయకుడుగా నిలదొక్కుకునేలా చేసింది.

1952లోనే శాస్త్రి గారు రాజ్యసభకు ఎన్నికై కేంద్ర రైల్వే, రహదారుల శాఖ మంత్రిగా నియమితులయ్యారు. నీతి నియమాలకు బద్ధుడై నిలబడే శాస్త్రిజీ 1956 ఆర్సలూర్ రైలు దుస్సంఘటనకు మనస్తాపం చెంది మంత్రి పదవిని తృణప్రాయంగా భావించి రాజీనామా చేశారు. అక్కడితో ఆయన రాజకీయ జీవితం ముగిసిపోలేదు.

ఆనాటి భారత ప్రభుత్వానికి ఆయన సేవలు అవసరం అని భావించింది నాయకత్వం. 1961 మార్చికి ముందు కేంద్ర పరిశ్రమల శాఖ మంత్రిగా నియమితులయ్యారు. అనంతరం మార్చిలోగా గోవింద వల్లభ్ పంత్ మృతితో ఆ స్థానంలో కేంద్రమంత్రిగా ఉన్న లాల్



Sthanka_BW March.indd 27 28/02/11 6:23 PM

బహదూర్ హోంమంత్రిగా నియమితులయ్యారు. మళ్లీ తమిళ రాజకీయ వేత్త కామరాజ్ నాడార్ ప్రణాళిక పుణ్యమా అంటూ 1963లో ఆయన తిరిగి తన పదవికి రాజీనామా చేయవలసి వచ్చింది. అప్పుడే జవహర్‌లాల్ తీవ్ర అస్వస్థతకు గురికావడంతో తిరిగి శాస్త్రీజీ పోర్టుపోలియో లేని మంత్రిగా చేరాల్సివచ్చింది.

1964లో జాతిరత్నం జవహర్‌లాల్ మరణించారు. కాంగ్రెస్ అధిష్ఠానం శాస్త్రిగార్ని ప్రధానిగా ప్రకటించింది. పదవంటే పట్టుపానుపుకాదన్నది శాస్త్రి గారి ఆలోచన. అందుకే ఆయన ప్రధానమంత్రిగా అనేకమైన కఠిన సమస్యలను నీతి నిజాయితీలతో కడు సమర్థవంతంగా పరిష్కరించారు. కాశ్మీర్‌లో హజ్రత్‌బల్ సమస్య, అస్సాంభాషా సమస్య, ఆహారధాన్యాల కొరత సమస్య, షేక్ అబ్దుల్లా తిరుగుబాటు చర్యలను ఆయన ఎంతో నేర్పుతో సమయాస్ఫూర్తితో ఎదుర్కోవలసి వచ్చింది. ఈ నాటి ప్రబుద్ధులైన క్షుద్ర రాజకీయ నాయకుల వలె గాక, శాస్త్రీజీ మహాత్మాగాంధీ, నెహ్రూ, వల్లభాయ్ పటేల్ వంటి గొప్ప నాయకులకు దీటుగా సమర్ధుడుగా పాలించి ఆ కోవకు చెందిన నాయకుడై నిలిచారంటే అది అతిశయోక్తి కానేకాదు.




లాల్‌బహదూర్ శాస్త్రి శరీరం బరువు 112 పౌనులైతే, ఐదు అడుగుల రెండు అంగుళాల చిన్న పొట్టి శరీరం ఆయనది. శాస్త్రి ప్రజారంజకుడైన ప్రధాని అనడానికి ఎన్నో ఉదాహరణలు మనం చెప్పుకోవచ్చు. కాంగ్రెస్ సంస్థలో పరిపాలనా వ్యవస్థలో వారు సాధించిన విజయాలు లెక్కకుమించే అగుపిస్తాయి. ఉదాహరణకు అస్సాంలో భాషా విద్వేషపు అల్లర్లను 'శాస్త్రి పథకం' పేరుతో అక్కడికి వెళ్లి వాటిని ఆయన సర్దుమణిగేటట్లు చేయగలిగారు.

మన ఉత్తరాన హిమాలయ రాజ్యమైన నేపాల్ వెళ్లి భారత్ నేపాల్ మైత్రిని పటిష్టం చేశారు శాస్త్రి గారు. ఇదే మాదిరిగా అవినీతి నిర్మూలనకు గాను లాల్ బహదూర్ సంతానం కమిటీని నియమించి పలు క్రియాశీలక చర్యలు తీసుకున్నారు. అప్పట్లో కల్లోల కాశ్మీర్‌లో ప్రభుత్వం మార్పునకు కృషి చేశారు.

జీవితాంతం కాంగ్రెస్ సంస్థ కోసం పెద్దల ఆదేశం మేరకు అదెటువంటి గొప్ప పదవైనా తృణప్రాణంగా త్యజించిన మహోన్నతుడు. నెహ్రూ లాగా ఆయన జీవితాంతం రాత్రి పొద్దు పోయే వరకు పని చేసి, తిరిగి తెల్లవారు జామునే లేచి మేల్కొని రొటీన్ కార్యక్రమాల్లో మునిగిపోయేవారు.

శాస్త్రీజీ సర్దార్ వల్లభాయ్ పటేల్‌గారి వలె ధృఢ చిత్తంతో సమస్యల్ని అధిగమించగల చతురులు. ఇండియాలో ఉంటూ విడిపోయి పాకిస్థాన్ ప్రత్యేక దేశంగా అవతరించి భారత్ మీదే రెండు పర్యాయాలు దాడి చేసింది. ఆనాటి ప్రధాని లాల్ బహదూరే! తాను దేనికీ భీతిల్లక, అపూర్వమైన ధైర్య సాహసాలతో ఆ రెండు దాడులను ఆయన తిప్పి కొట్టేటట్లుగా చేయగలిగారు.

రష్యా మధ్యవర్తిత్వంలో, అప్పటి పాకిస్థాన్ అధ్యక్షుడు అయూబ్‌ఖాన్ - శాస్త్రీజీల మధ్య తాష్కెంట్‌లో శాంతి ఒప్పందం జరిగిన నాడు రాత్రే ఆయన హఠాత్తుగా గుండె నొప్పితో చనిపోవడం శోచనీయమయింది. ఆయన మరణం భారతీయుల పాలిట అశనిపాతమయింది. కనీసం సొంత ఇల్లయినా సమకూర్చుకోలేని ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రిగారు.

ఈ సందర్భంగా శాస్త్రిగారు తన మాతృదేశ ప్రజలకిచ్చిన సందేశాల్ని మనం విస్మరించలేము.

***అవి ఈ నాలుగు అంశాలు:***

1. నిలువ చేయడం కొంతమందికి లాభమైతే, అశేష జనానికి హానికరం. కోట్లాది ప్రజలకు అసౌకర్యం కలిగించే కన్నా ఉదాత్తంగా మరణించడం మేలు.

2. ఎక్కువ పండించాలి, తక్కువ తినాలి అన్నది, మన ఆశయం కావాలి.

3. వ్యాపారస్థులు తమంతట తాము ఐచ్ఛికంగానే వస్తువుల ధరలను అదుపులో పెట్టుకోవాలి. యుద్ధకాలంలో దాన్ని కఠినంగా పాటించాలి. ధరలను అదుపులో ఉంచడానికి ప్రభుత్వ ఉత్తరువులు వెలువడే పరిస్థితులు కల్పించడం మంచి పద్ధతి కాదు.

4. మన దేశంలో మత రహితమైన ప్రజాస్వామ్యాన్ని స్థాపించుకున్నాం. పాకిస్థాన్ అలాంటి దేశం కాదు. అది మత ప్రధానమైన దేశం. దాని చర్యలు మనకు ఆదర్శం కారాదు.

లాల్‌బహదూర్ గురించి ఎంత చెప్పుకున్నా కొంచెం మిగిలి ఉంటూనే ఉంటుంది. కేంద్ర మంత్రి వర్గంలో అప్పట్లో అతిరథ మహారథులే. అందరూ సచివులూ. మొరార్జీదేశాయ్, బాబూ జగ్‌జీవన్‌రామ్, గుల్జారీలాల్ నందా వీరి తర్వాత హోంమంత్రి స్థానం శాస్త్రీజీది. ఆయన చాలా ఉదార హృదయుడనడానికి ఇంకో చిన్న ఉదాహరణ ఇక్కడ చెప్పుకోవాలి. ఈ సారి కృష్ణమాచారిని కేంద్ర క్యాబినెట్‌లో తీసుకుంటే, తన కన్నా పై స్థానం ఇమ్మని ప్రధానిని కోరిన సంస్కార హృదయులు ఆయన.

కొసమెరుపు ఏమిటంటే, తాష్కెంట్ హీరో, ఇండియన్ లింకన్ అనే రెండు బిరుదులు మన భారత రిపబ్లిక్ రెండో ప్రధానియైన శాస్త్రి గారికి ఉన్నవి. ఆయన నినాదం జైజవాన్, జైకిసాన్, జైభారత్ అనేవి.

లాల్ బహదూర్ పుట్టింది, గిట్టిందీ కూడా మంగళవారం రోజే! గాంధీ గారు అక్టోబర్ 2న పుట్టారు శాస్త్రి గారూ అదే తారీకుని పుట్టడం విశేషం. చనిపోయిన తిథి కూడా ఒక్కటే! అది పంచమి.

***- డా॥ మంతెన సూర్యనారాయణరాజు***



Sthanka_BW March.indd 28 28/02/11 6:23 PM

అధికారంలో ఉన్న వారు కొన్ని నియమ నిబంధనల్ని పాటిస్తే తప్ప, వారి పరిపాలనా చక్రం సజావుగా ముందుకు సాగదు. దేశాన్ని పాలించే రాజు న్యాయమార్గంలో పయనించాలని వేదం బోధిస్తోంది.

**"స్వస్తి ప్రజాభ్యః పరిపాలయంతాం**
**న్యాయేన మార్గేణ మహి మహీశాః"** అని స్వస్తి మంత్రం...

'న్యాయమార్గంలో భూమిని పరిపాలించే రాజులకు మంచి జరుగుగాక!' ఇక్కడ ప్రజల్ని పరిపాలించే రాజు న్యాయమార్గ వర్తనుడు కావాలని వేదం నొక్కి మరీ చెప్తోంది. రాజు ఉచితానుచితజ్ఞుడై ఉండాలి. మంచిని చెప్పినవాడి మాటల్ని శిరసావహించాలి. రాజుకు హితవు పల్కిన వాడే నిజమైన మిత్రుడు. ఆ హితాన్ని విన్నవాడే నిజమైన రాజు. ఈ విషయాన్నే మహాకవి భారవి తన కిరాతార్జునీయ గ్రంథంలో ఈ విధంగా పేర్కొన్నాడు.

**'సకిం సఖాసాధున శాస్తి యో-ధిపమ్**
**హితాన్నయః సంశృణుతే సకిం ప్రభుః**
**సదానుకూలేషు హి కుర్వతే రతిః**
**నృసేష్యమాత్యేషుచ సర్వ సంపదః'**

అంతేకాదు రాజు సజ్జనులైన మంత్రివర్గాన్ని నియమించాలని రాజు - మంత్రుల మధ్య అన్యోన్యత ఉన్నప్పుడే సర్వసంపదలు సిద్ధించి కాలేదు.

# లోకాః సమస్తాః సుఖినోభవంతు




లోకకళ్యాణం జరుగుతుందని ఉద్బోధించాడు. అలాగే రాజు సేవకుల్ని నియమించేటప్పుడు ఎంతో జాగ్రత్తగా ఉండాలని, దేశభక్తి కలిగి, మోసం చేయని వారినే నియమించాలని చెప్పాడు. రాజు మనసుకు బాధకలుగుతుంది కదా అని హితాన్ని చెప్పడం మానుకుంటే అది లోక క్షామానికి దారి తీస్తుందని హెచ్చరించాడు.

రాజుకు సంపదలు పోయినా, అధికారం చేజారిపోయినా మంచి నడవడికతో ఉన్నప్పుడే అతడు సేవకుల చేత సన్మానింపబడతాడని భోజప్రబంధం వివరిస్తోంది.

''రాజా సంపత్తి హీనోకపి సేవ్యః సేవ్య గుణాశ్రయః'' దండన విధించేటప్పుడు రాజు ఆశ్రిత పక్షపాతం చూడరాదు. శత్రువర్గంలోనైనా మాన్యుడైన వ్యక్తి రాజుకు పూజనీయుడు కావాలి. రోగగ్రస్తుడైన రోగికి దివ్యమైన ఔషధం వలె మిత్రవర్గంలో ఉన్న చెడ్డ వాడైనప్పటికీ, రాజు చేత త్యజించబడాలి. 'పాము కరిచిన వేలు' వలె అంటాడు కాళిదాసు రఘువంశంలో. అంతే కాదు ధర్మం ఆచరించకపోతే ఏదో కీడు కలుగుతుందన్న భయంతో ఆచరించకూడదు. ధర్మాచరణ రాజు ప్రథమ కర్తవ్యం. రాజు తన సంపదల ననుసరించి ప్రజాక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని దానం చెయ్యాలి. దానగుణం లేని రాజు కీర్తివంతుడు కాలేడు.

భోజరాజు అత్యంత పరాక్రమమంతుడైనప్పటికీ, దానగుణం లేని కారణంగా అతని ముఖాన్ని చూడడాని ఇష్టపడలేదు గోవిందుడు అనే పేరు గల పండితుడు. ఎందుకంటే ప్రజల చేత ఆకర్షింపబడే వాడు దాత మాత్రమే. ధనవంతుడు కాదు. ధనవంతుడు కాకపోయినా, కలిగిన దాంట్లోంచి దానం చేసేవాడి దగ్గరకే ప్రజలు వెళ్తారు. దాన గుణం లేకుండా ధనాన్ని కూడబెట్టిన వాడి ముఖాన్ని సైతం చూడడానికి ఇష్టపడరు.

**"ప్రైయిః ప్రజానాందాతైవ న ద్రవిణేశ్వరః**
**అయచ్ఛ కాంక్షితే లోకైః వారిదోనతు వారిధిః"**

లోకానికి మేలు కలిగించే నీటిని దానం చేస్తుంది కాబట్టే అందరూ మేఘాన్నే ఇష్టపడతారు. అపార జలరాశి ఉన్నప్పటికీ, ఇచ్చే గుణం లేదు కాబట్టి సముద్రాన్ని ఇష్టపడరు. అధికారంలో ఉన్న రాజు ప్రజలను కులాన్ని బట్టికాక, కళను బట్టి ఆదరించాలి. ఎందరో దేవతలున్నప్పటికీ కళలు కల్గిన చంద్రుణ్ణే శివుడు శిరస్సుపై ధరించాడు కదా!

ధర్మం, దానం రాజుకు రెండు నేత్రాలై రాజ్యాన్ని నడిపించాలి. న్యాయం, చట్టం బాహువులై ప్రజలకు రక్షణ కల్పించాలి. మనసు నిశ్చలంగా ఉండాలి. ఎట్టి పరిస్థితుల్లోనూ ధైర్యాన్ని కోల్పోకూడదు. అన్ని విధాలుగా ప్రజలకు మార్గదర్శిగా ఉండాలి. నిత్యం ప్రజా శ్రేయస్సుకై ఆలోచించాలి. రాజుకు తన కుటుంబం ఒకటి, సామ్రాజ్యం వేరొకటి కాకూడదు. ప్రజలందరినీ తన కన్నబిడ్డలుగా భావించాలి. ఈ విషయాన్నే కాళిదాసు రఘువంశంలో దిలీపు మహారాజును వర్ణిస్తూ-

**"ప్రజానాం వినయాదానాత్ రక్షణాత్ భరణాదపి**
**సపితా పితరః తాసాం కేవలం జన్మ హేతవః"** అంటే -

దిలీపుడు ప్రజలకు వినయాన్ని నేర్పడంలోనూ, రక్షించడంలోనూ, పోషించడంలోనూ తండ్రిగా బాధ్యతల్ని నిర్వర్తిస్తుంటే, ప్రజలకు గల వారి వారి తండ్రులు కేవలం వారి జన్మకు కారణమాత్రులయ్యారట!

రాచరిక వ్యవస్థ పోయి ప్రజలే పాలకులైన నేటి సమాజంలో కూడా ప్రజా ప్రతినిధులే పాలనా చక్రాన్ని నడిపిస్తున్నారు. కాబట్టి మన పూర్వీకులు చెప్పిన ఇటువంటి మంచి విషయాన్ని పాటిస్తే సక్రమ పరిపాలన ద్వారా వ్యక్తి శ్రేయస్సుకు, తద్వారా లోక శ్రేయస్సు పొందవచ్చు.

**- డా॥ అద్దంకి శ్రీనివాస్**

# పంచాయితీరాజ్ ఉద్యోగుల కరదీపిక విడుదల



ఆంధ్రప్రదేశ్ పంచాయితీరాజ్ ఉద్యోగుల సంక్షేమ సంఘం రూపొందించిన పంచాయితీరాజ్ ఉద్యోగుల కరదీపికను రాష్ట్ర పంచాయితీ రాజ్ గ్రామీణ నీటి సరఫరామాత్యులు శ్రీ కె. జానారెడ్డి ఇటీవల విడుదల చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పంచాయితీ రాజ్ సంస్థలలో పనిచేసే ప్రతీ ఉద్యోగికి మార్గదర్శిగా ఉపయోగపడుతుందని అన్నారు. పంచాయితీరాజ్ సంస్థలలో కీలక బాధ్యతలు నిర్వర్తించే జిల్లాపరిషత్తు సిఇఒ, జిల్లా పంచాయితీ అధికారి మొదలు గ్రామ పంచాయితీ స్థాయిలో పనిచేసే సెక్రటరీ స్థాయి అధికారుల విధులు, బాధ్యతలు, పంచాయితీరాజ్ వ్యవస్థ చరిత్ర, పంచాయితీరాజ్ సర్వీసు నిబంధనలు, క్రొత్త అకౌంటింగ్ విధానం, తదితర వివరాలతో ఈ కరదీపికను ఆసక్తికరంగా తీర్చిదిద్దిన పంచాయితీరాజ్ సర్వీస్ అసోసియేషన్‌ను గౌరవ మంత్రివర్యులు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎం.ఎల్.సి. శ్రీ బి. మోహన్‌రెడ్డి కూడా పాల్గొన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రెసిడెంట్ టి. ఎం.బి బుచ్చిరాజు, జనరల్ సెక్రటరీ బి.శరత్‌చంద్ర, ట్రెజరర్ రవికుమార్, కె.విద్యారాణి, కె. ఏ. విజయలక్ష్మి, ఎం. సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# స్థానిక పాలన మాస పత్రికకు, అపార్డ్ వెబ్ సైట్‌కు అవార్డులు




పబ్లిక్ రిలేషన్స్ సొసైటీ ఆఫ్ ఇండియా, హైదరాబాద్ ఛాప్టర్ అఖిల భారత స్థాయిలో ఫిబ్రవరి నెలలో నిర్వహించిన ఉత్తమ హౌస్ జర్నల్స్, వెబ్‌సైట్‌ల పోటీలో 'అపార్డ్' ప్రచురిస్తున్న స్థానిక పాలన మాస పత్రిక, అపార్డ్ వెబ్‌సైట్ బహుమతులు గెల్చుకున్నాయి. ఉత్తమ హౌస్ జర్నల్ విభాగంలో స్థానిక పాలన మాస పత్రిక స్పెషల్ జ్యూరీ అవార్డును గెల్చుకోగా, అపార్డ్ వెబ్‌సైట్ ఉత్తమ వెబ్‌సైట్‌ల విభాగంలో తృతీయ స్థానాన్ని కైవశం చేసుకొంది.

పబ్లిక్ రిలేషన్స్ సొసైటీ ఆఫ్ ఇండియా హైదరాబాద్ ఛాప్టర్ తన 11వ పబ్లిక్ రిలేషన్స్ కాన్ఫరెన్స్ సందర్భంగా అఖిలభారత స్థాయిలో కార్పోరేట్ ఫిల్ములు, వీడియో ఫిల్ములు, వెబ్‌సైట్లు, హౌస్ జర్నల్స్‌కు సంబంధించి పోటీలను నిర్వహించింది. ఈ పోటీల్లో వివిధ ప్రభుత్వ శాఖలు, ప్రభుత్వ రంగ సంస్థలు, వ్యాపార, వాణిజ్య సంస్థలు, ఎన్.ఎం.డి.సి., వైజాగ్ స్టీల్ ప్లాంట్, ల్యాంకో ఇన్‌ఫ్రాటెక్ వంటి కార్పోరేట్ సంస్థలు పాల్గొన్నాయి. ఈ పోటీలకు అపార్డ్ హౌస్ జర్నల్, వెబ్‌సైట్ తరపున పోటీకి దరఖాస్తులు పంపగా, రెండు విభాగాల్లోను బహుమతులు దక్కించుకోవటం విశేషం.

ఫిబ్రవరి 13న హైదరాబాద్‌లోని గ్రీన్ పార్క్‌లో జరిగిన 11వ పబ్లిక్ రిలేషన్స్ కాన్ఫరెన్సులో ఈ అవార్డులను కేంద్ర ప్రభుత్వ ఇన్ఫర్మేషన్, బ్రాడ్ కాస్టింగ్ విభాగం అడిషనల్ డైరెక్టర్ జనరల్ శ్రీ మూర్తి ప్రదానం చేశారు. వివిధ కేటగిరిలలో ఉత్తమ ప్రతిభ కనబర్చి, అవార్డులు సాధించిన సంస్థలకు ప్రశంసా పత్రాలు, మెమెంటోలు బహూకరించారు. అపార్డు తరపున డా. కృష్ణ మోహన్ రావు, డిప్యూటీ డైరెక్టర్, రీసెర్చ్ & ట్రైనింగ్ విభాగం, డా. శివశంకర్ ప్రసాద్, సెంటర్ హెడ్, మీడియా & పబ్లికేషన్సు ఈ అవార్డులను స్వీకరించారు. ఈ అవార్డులు రావటానికి సహకరించిన సిబ్బంది అందరినీ కమీషనరు శ్రీ చంద్రవౌళి, ఐ.ఏ.ఎస్. అభినందించారు.

**భూమిపై మూడింట రెండువంతుల భాగం నీరు ఆక్రమించుకుని ఉంటుంది. మనిషి శరీరంలో కూడా 75 శాతం నీరే ఉంటుంది. ఈ రెండు ముఖ్యమైన విషయాలను బట్టి, భూమ్మీద జీవం ఉండటానికి కారణం నీరేనని స్పష్టమవుతోంది.**

మనిషి శరీరంలో ఏ విధంగా అయితే నీరు సరఫరా అవుతూ ఉంటుందో, భూమిపై కూడా అదే విధంగా సరఫరా అవుతుంది. పోషకాలను ఒక చోట నుంచి మరొక చోటికి చేరవేయటం, పోషకాలను, ఆర్గానిక్ పదార్థాలకు బలాన్ని చేకూర్చడం, వ్యర్థపదార్థాలను బయటకు పంపడం వంటి ముఖ్యమైన జీవక్రియలన్నీ నీరే చేస్తుంది. అంతేకాక, మానవ శరీరంలోని ద్రవాలను, కణజలాలను, కణాలను, లింపులను, రక్తాన్ని, గ్రంధుల స్రావాలను నీరే క్రమబద్ధీకరిస్తుంది.

మనిషి శరీరంలో ఎంత నీరు ఉంటుందో తెలుసుకుంటే ఆశ్చర్యం కలగకమానదు. వయోజనుల్లో ఒక్కొక్కరి శరీరంలో 42 లీటర్ల వరకు నీరు ఉంటుంది. ఇందులో నుంచి కేవలం 2.7 లీటర్ల నీటిని కనుక శరీరం ఏదో రూపేణా కోల్పోతే, శరీరం డీహైడ్రేషన్‌కు గురై ఎండిపోయినట్లవుతుంది. అసౌకర్యం, నిస్సత్తువ, నరాల బలహీనత, కళ్లు తిరగటం, తలనొప్పి వంటి అనేక సమస్యలు తలెత్తుతాయి. ఇవన్నీ కలిసి ఏదో ఒక తీవ్రమైన వ్యాధిగా రూపాంతరం చెందుతాయి.

# జలధారలే జీవజాలానికి ప్ర

మనం త్రాగేనీరు కణాల విధులకు అత్యవసరం కాబట్టి, మనం రోజూ తీసుకునే నీటి పరిమాణం ఏ మాత్రం తగ్గినా, శరీరం తరచూ డీహైడ్రేషన్‌కు గురై, చివరకు వ్యాధి వరకు దారితీస్తుంది.

### నీటిచరిత్ర

అనాదిగా నీటిని భక్తికి, స్వచ్ఛతకు సంకేతంగా వాడుతూ వచ్చారు. ప్రాచీన గ్రీకుదేశం వంటి కొన్ని సంస్కృతుల్లో, దేవతలు నీటిలోనే నివశిస్తారని నమ్మేవారు. ఆ దేవతలను పూజించేవారు. స్వచ్ఛమైన మంచినీరు దొరికే ప్రాంతాలకు సమీపంలోనే నగరాలకు నగరాలు వెలిశాయి. బావుల చుట్టూ సమావేశమయ్యేవారు. పియాజాల మధ్యలో ఫౌంటెన్లు వెలిశాయి.

**మార్చి 22న ప్రపంచ నీటి దినం**

నీటిలో ఉండే సుగుణాలను ఆధారంగా చేసుకుని సాంప్రదాయక, ఆధునిక వైద్యం వివిధ చికిత్సలకు ప్రాణప్రతిష్ట చేసింది. హైడ్రో థెరపీ వీటిలో ఒకటి. హైడ్రో అనేది గ్రీకు పదం. వేడి నీళ్ల స్నానం, చన్నీళ్ల స్నానం ఎంత మేలు చేస్తాయో మనకు తెలుసు.

అనేక శతాబ్దాలుగా, వ్యాధులను నయం చేసే నీటి ఊటలను మనిషి ప్రపంచ వ్యాప్తంగా వాడుతూనే ఉన్నాడు. బెల్జియంలోని ఆర్డెన్స్‌లో ఉన్న ప్రసిద్ధ స్పాల గురించి అనేక మందికి తెలుసు. 14వ శతాబ్దం నుంచి ఈ చల్లటి నీటి ఊటలు వివిధ వ్యాధులను తగ్గిస్తాయనే నమ్మకం ప్రాచుర్యంలోకి వచ్చింది.

ఇట్లాంటివి అనేక ప్రపంచవ్యాప్తంగా ఉన్నాయి. కాలిఫోర్నియాలోని హాట్‌స్పాలు కూడా ప్రసిద్ధి చెందాయి.

### ప్రస్తుత పరిస్థితి

అయితే, గతానికి భిన్నంగా, జీవధార అయిన నీటిపట్ల మన సాంకేతిక సమాజం ఉదాశీనతతో వ్యవహరిస్తోంది. మనకు వారసత్వంగా వచ్చిన నదులు, సముద్రాలలో నీటిని యదేచ్ఛగా, విచ్చలవిడిగా వాడేయటం, పాడుచేయటం జరుగుతున్నది.

కాలుష్య కారణంగా సముద్రజీవులు తగ్గిపోవటం, నదుల్లో ఆకుపచ్చని ఆల్గే కనిపించటం, నీటి తటాకాల వద్ద తీవ్రమైన దుర్గంధం రావటం ప్రస్తుత నీటి పరిస్థితికి అద్దం పడుతున్నాయి.

మనం రోజూ తాగుతున్న నీరు స్వచ్ఛమైనది కాదు. ఇందులో భయంకరమైన వాణిజ్య రసాయనాలు 200 వరకూ ఉన్నాయని అంచనా. ఇది వెంటనే మరణానికి దారితీయకపోయినా తాగటానికి మాత్రం పనికిరాదు. ఉదాహరణకు ఆస్ట్రేలియాలోని నీటిలో ప్రతి ఏటా 50 రకాల రసాయనాలు 60,000 టన్నుల వరకు చేరుతున్నాయట.

ఈ రకరకాల రసాయనాల వల్ల హృద్రోగం, రక్తనాణాలు గట్టిపడటం, రక్తహీనత, అధిక రక్తపోటు, అలెర్జీలు, కేన్సర్లు, జుట్టు, చర్మంపై దుష్ప్రభావం వంటి అనేక సమస్యలు తలెత్తుతాయి.

నీటి చుట్టూ అల్లుకున్న ఇట్లాంటి సమస్యల పట్ల దృష్టి సారించి, కార్యాచరణకు పూనుకునేందుకే మార్చి 22న ప్రతి ఏటా ప్రపంచ నీటి దినాన్ని 1993 నుంచి నిర్వహిస్తున్నారు.

### ప్రపంచ నీటి దినం - మార్చి 22

1992లో ఐక్యరాజ్యసమితిలోని పర్యావరణం - అభివృద్ధి సంస్థ జరిపిన సమావేశంలో నీటిపై ఒక అంతర్జాతీయ దినాన్ని నిర్వహించాలని సిఫార్సు చేశారు. 1993, మార్చి 22ని మొదటి ప్రపంచనీటి దినంగా ప్రకటిస్తూ, ఐకరాజ్యసమితి స్పందించింది. అప్పటినుంచి ప్రతిఏటా మార్చి 22న ప్రపంచ నీటి దినంగా, ప్రతిసారీ ఒక్కొక్క అంశం (థీమ్)పై దృష్టి సాధిస్తున్నారు.

"మన నీటి వనరులపై శ్రద్ధ తీసుకోవటం ప్రతి ఒక్కరి బాధ్యత" అనే అంశాన్ని 1994లో ప్రపంచ నీటిదినం థీమ్‌గా నిర్ణయించారు.

1995లో 'మహిళలు - నీరు' అనే అంశాన్ని నిర్ణయించారు. 1996లో "దప్పిక గొన్న నగరాలకు నీరు" అనే అంశంపై ప్రపంచ నీటి దినాన్ని నిర్వహించారు. ప్రపంచవ్యాప్తంగా నగరాలు ఎదుర్కొంటున్న నీటి సంక్షోభం నానాటికీ తీవ్రమవుతూ, నగరాల సామాజిక, ఆర్థిక అభివృద్ధికి విఘాతంగా మారిన అంశంపై అవగాహనా కార్యక్రమాలు నిర్వహించారు.

1997లో "ప్రపంచంలోని నీరు సరిపడా ఉందా?" అనే అంశాన్ని థీమ్‌గా తీసుకున్నారు. అన్ని ప్రాణులకు, జీవులకు, మనుషులకు నీరు అత్యంత ప్రాథమిక అవసరం. నీటి వనరులపై ఒత్తిడి తీవ్రమవుతోందని, నీటికోసం పోరాటాలు జరుగుతున్నాయని ఈ ప్రపంచ నీటిదినం పేర్కొంది.

"కంటికి కనపడని వనరులు - భూగర్భ జలాలు" అనే అంశాన్ని 1998లో థీమ్‌గా తీసుకున్నారు.

1998లో చైనా, బంగ్లాదేశ్, భారతదేశాల్లో పెద్దఎత్తున వరదలు వచ్చి, ప్రధాన నదులు పొంగిపొర్లాయి. వేలాదిమంది మరణాలకు, భారీ ఆస్తినష్టానికి ఇవి కారణమయ్యాయి. ప్రపంచం మొత్తంలోని

# ే ప్రాణధారలు

జనాభాలో దాదాపు సగం జనాభా ఈ మూడు దేశాల్లో నివశిస్తున్నారు.

ఇంత భారీ ఎత్తున వరదలు రావడానికి భారీ వర్షాలేకాక, నదీతీరాల్లో మనుషులు చేసే కార్యకలాపాలు కూడా ప్రధాన కారణం. అందువల్లనే 1999లో ప్రపంచ నీటి దినం థీమ్‌గా "ప్రతి ఒక్కరూ ప్రవాహం చివర నివశించే వారే" అనే అంశాన్ని తీసుకున్నారు.

"21వ శతాబ్దానికి నీరు" అనే థీమ్‌ని 2000లో జరిగిన ప్రపంచ నీటి దినపు అంశంగా నిర్ణయించారు. నీటి లభ్యత, నాణ్యత రానురాను క్షీణిస్తున్నాయి. సమీప భవిష్యత్తులో ఇప్పటి పరిస్థితులు ఇంకా దిగజారవని అనుకున్నా, ప్రపంచంలో అత్యధిక భాగం నీటి సంబంధిత సంక్షోభంలో కూరుకునిపోతుంది. ఈ పరిస్థితిని ఇంకా క్షీణింపచేసేలా ప్రపంచ జనాభా వేగంగా పెరుగుతోంది. ఇప్పటికే నీటి సరఫరా చాలీ చాలకుండా ఉన్న ప్రాంతాల్లో జనాభా పెరుగుదల ఎక్కువగా ఉంది. 2000లో ప్రపంచనీటి దినం సందర్భంగా జరిగిన కార్యక్రమాల్లో ఈ అంశాలపై దృష్టి సారించారు.

2001లో "ఆరోగ్యానికి నీరు" అనే అంశాన్ని థీమ్‌గా నిర్ణయించారు. ఆరోగ్యాన్ని కాపాడుకోవాలంటే పరిశుభ్రమైన మంచినీరు తాగటం అవసరమని, ఇందుకు గట్టి కృషి చేయాలని ఈ సందర్భంగా ప్రపంచ















దేశాలు భావించాయి.

"అభివృద్ధికి నీరు" అనే అంశంపై 2002లో ప్రపంచ నీటి దినాన్ని నిర్వహించటం జరిగింది. ప్రపంచంలోని అనేక ప్రాంతాల్లో నీటి వనరులు క్షీణిస్తున్నాయని, నీటి వనరులపై సమీకృత ప్రణాళికలు రూపొందించి, నిర్వహించాలని ఈ సందర్భంగా ప్రపంచ దేశాలు నిర్ణయించాయి.

2003లో "భవిష్యత్తు కోసం నీరు" అనే అంశాన్ని ప్రపంచ నీటి దినపు థీమ్‌గా నిర్ణయించారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న తాజా నీటి నాణ్యతను, పరిమాణాన్ని కాపాడి, భవిష్యత్తు తరాలకు అందించవలసి ఉందని పేర్కొన్నారు. సురక్షితమైన త్రాగునీరు, కనీస పారిశుధ్యం కరువై నివశిస్తున్న ప్రజల సంఖ్యను 2015 నాటికి సగానికి తగ్గించాలన్న మిలీనియం అభివృద్ధి లక్ష్యాన్ని సాధించాలంటే ఇది అవసరమని ప్రపంచ దేశాలు అభిప్రాయపడ్డాయి.

2004 సంవత్సరపు ప్రపంచనీటి దినం సందర్భంగా "నీరు - వైపరీత్యాలు" అనే అంశాన్ని థీమ్‌గా నిర్ణయించారు. వాతావరణం, నీటి వనరులు సామాజిక ఆర్థికాభివృద్ధిపై, మానవాళి క్షేమంపై



భయంకరమైన ప్రభావాన్ని కూడా చూపగలవు. ప్రపంచ వాతావరణ సంస్థ ప్రకారం, తుపాను, పెను తుపానులు, వరదలు, సునామీలు, కరువు కాటకాలు వంటి వాతావరణ సంబంధ వైపరీత్యాలు మొత్తం వైపరీత్యాల్లో 75 శాతం వరకు ఉంటాయి. మనుషుల ప్రాణాలకు, ఆస్తి పాస్తులకు ఇవి తీవ్ర నష్టం చేయగలవు. ఈ వైపరీత్యాలను పసిగడ్తూ, సమయానుకూల హెచ్చరికలు చేయటం వల్ల ఆయా సంఘటనలు ప్రజలపై, ఆర్థిక వ్యవస్థపై ఎక్కువ దుష్ప్రభావం చూపకుండా చేయటానికి వీలవుతుంది.

2005లో "నీరు - సంస్కృతి" అనే అంశాన్ని ప్రపంచ నీటి దినపు థీమ్‌గా నిర్ణయించారు. ప్రపంచ వ్యాప్తంగా నీటికి సంబంధించి అనేక ఆచార, వ్యవహారాలు ఉన్నాయి. అనేక మతాల్లో పవిత్ర జలం అనే భావన ఉంది. వివిధ క్రతువుల్లో ఆచార వ్యవహారాల్లో దీన్ని వాడుతుంటారు.

పెరుగుతున్న "నీటి కొరత" సమస్యను 2007 సంవత్సరంలోని ప్రపంచ నీటి దినానికి థీమ్‌గా నిర్ణయించారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న నీటి కొరతను ఈ థీమ్ మరింత వెలుగులోకి తెచ్చింది. ఉన్న నీటిని









సమర్థవంతంగా, సమానంగా, సుస్థిరంగా నిర్వహించటం అవసరమనే సందేశాన్ని ఇచ్చింది ఈ థీమ్.

2008లో నీరు - పారిశుధ్యం అనే అంశాన్ని థీమ్‌గా తీసుకున్నారు. భూమిపై ఉన్న జనాభాలో ప్రతి ముగ్గురిలో ఒకరి కంటే ఎక్కువ ఈ పారిశుధ్య సంక్షోభం బారిన పడి బాధపడుతున్నారు. ప్రతి 20 సెకన్లకు ఒక బిడ్డ పారిశుధ్య లోపాల వల్ల తలెత్తే సమస్యతో ప్రపంచంలో ఎక్కడో ఒక చోట మరణిస్తోంది.

2009లో ప్రపంచ నీటి దినం థీమ్‌గా "పంచుకున్న నీరు - పంచుకున్న అవకాశాలు" అనే అంశాన్ని నిర్ణయించారు. నీటికి సంబంధించి సరిహద్దుల సమీపంలో తలెత్తే సమస్యలపై దృష్టి సారించారు. దేశాల మధ్య పరస్పర గౌరవాన్ని, అవగాహనను, నమ్మకాన్ని పెంచేవిధంగా, శాంతి, భద్రత, సుస్థిర ఆర్థికాభివృద్ధిలకు దారితీసే విధంగా సరిహద్దుల్లో నీటి నిర్వహణ ఉండాలి.

2010లో ప్రపంచనీటి దినాన్ని "నీటి నాణ్యత" అనే థీమ్‌కి అంకితం చేశారు. నీటి నిర్వహణలో రాశి ఎంత ముఖ్యమో, వాసి కూడా అంతే ముఖ్యం. నీటి నిర్వహణలో తలెత్తే నీటి నాణ్యతా సంబంధమైన







సమస్యలు, సవాళ్లపై ఈ సారి దృష్టి సారించారు.

ప్రస్తుత సంవత్సరంలో, అంటే 2011 సంవత్సరానికి ప్రపంచనీటి దినపు థీమ్‌గా "నగరాలకు నీరు" అనే అంశాన్ని నిర్ణయించారు. ప్రపంచంలోని అత్యధిక ప్రజానీకం నగరాల్లోనే నివశిస్తున్నారు. 330 కోట్లమంది ప్రజలు నగరాల్లో నివశిస్తున్నారని అంచనా వేశారు. ఇందులో 38 శాతం పెరుగుదల విస్తరిస్తున్న మురికి వాడల వల్లనే జరిగింది. నగరాల్లోని మౌలిక సదుపాయాలకు మించిన రీతిలో నగరాల జనాభా పెరుగుతోంది.

వేగంగా పెరుగుతున్న నగర జనాభా, పారిశ్రామికీకరణ, వాతావరణ మార్పు తెచ్చే అస్థిరతలు, ఘర్షణలు, ప్రకృతి వైపరీత్యాలు నగరాల నీటి వనరులపై కనబరిచే ప్రభావంపై ప్రపంచ దేశాలు దృష్టి సారించనున్నాయి. తద్వారా అయినా, నగరాల్లో మంచినీటి సమస్య, నీటి కాలుష్య సమస్య, పారిశుధ్య సమస్య కొంతమటుకైనా పరిష్కారం అవుతాయని, నగరాల ప్రజలకు ఊరట లభిస్తుందని ఆశిద్దాం.

- రాధాకృష్ణ





# మహిళల రాజకీయ సాధికారతలో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్

**1992 సంవత్సరం 73 రాజ్యాంగ సవరణల ద్వారా స్థానిక సంస్థలలో మహిళలకు 33% రాజకీయ పదవులలో రిజర్వేషన్లు కల్పించడం ద్వారా రాజకీయ రంగంలో మహిళా సాధికారతా సాధనకు తొలి అడుగు పడింది. తద్వారా భారతదేశంలో మహిళా ప్రజా ప్రతినిధుల సంఖ్య గణనీయంగా పెరిగింది.**

*గ్రామ పంచాయితీల విషయానికి వస్తే . . .*

భారతదేశంలో 2000 సంవత్సరానికి 24,55,036 గ్రామపంచాయితీ సభ్యులకు గానూ 7,72,677 స్థానాలు అంటే 31.47 శాతం మహిళల వశమయ్యాయి. 2006 సంవత్సరానికి 20,65,885 స్థానాలకు గాను 8,38,242 అనగా 40.58% శాతానికి పెరిగింది. మన ఆంధ్రప్రదేశ్‌లో 68,736 స్థానాలు మహిళల వశమయ్యాయి.

*మండల ప్రజా పరిషత్‌ల విషయానికి వస్తే...*

భారతదేశంలో 2000 సంవత్సరం నాటికి స్థానాలకు గానూ 38412 (29.48%), 2006 నాటికి 1,09,324 స్థానాలకు గాను వీరి సంఖ్య 47,455 (43.41%)కు చేరింది. మన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 4919 మంది మహిళా ప్రజా ప్రతినిధులు మండల ప్రజాపరిషత్ ప్రాదేశిక సభ్యులుగా ఉన్నారు.



*జిల్లా ప్రజా పరిషత్ విషయానికి వస్తే...*

2000 సంవత్సరానికి భారతదేశంలో 12,838 స్థానాలకు గాను 4088 (31.84%) మహిళల వశమయ్యాయి. అది 2006 నాటికి 11,708 స్థానాలకు 4,923 (42.05%)కు చేరింది. ఆంధ్రప్రదేశ్‌లో 364 మంది మహిళా ప్రతినిధులు జిల్లా ప్రజాపరిషత్ ప్రాదేశిక సభ్యులుగా ఉన్నారు.

ఈ క్రమంలో మహిళలలో రాజకీయ సాధికారతను సాధించాలనే లక్ష్యంతో 'ద ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్, న్యూఢిల్లీ' వారు ప్రతి సంవత్సరం ఏప్రిల్ 23,24 తేదీలను మహిళా రాజకీయ సాధికారతా దినోత్సవాలుగా ప్రకటించి, 1995 నుండి నేటి వరకూ వేడుకలను నిర్వహిస్తున్నారు. ఒక్కో సంవత్సరం ఒక్కో అంశానికి ప్రాధాన్యతనిస్తూ, ఆ రంగంలో గణనీయమైన కృషి చేసిన మహిళా ప్రజా ప్రతినిధులకు జాతీయ స్థాయిలో అవార్డులను ప్రధానం చేయడం జరుగుతుంది. 1995 నుండి 2010 వరకు ఈ క్రింది అంశాలను పరిగణనలోనికి తీసుకోవడం జరిగింది.

| సం॥రం | ప్రాధాన్యత- అంశం |
|---|---|
| 1995 | మహిళల రాజకీయ సాధికారికత |
| 1996 | పంచాయితీలు -మహిళలు - ఆరోగ్యం |
| 1997 | మహిళలు -ప్రాథమిక విద్య |
| 1998 | పంచాయితీలు - మహిళలు - పేదరిక నిర్మూలన |
| 1999 | పంచాయితీలు మహిళలు - కుటుంబ సంక్షేమం |
| 2000 | మహిళలు - గ్రామ సభలు |
| 2001 | పంచాయితీలు - మహిళలు - ఆర్థిక సాధికారికత |
| 2002 | పంచాయితీలు - మహిళలు - ఆహార భద్రత |
| 2004 | మహిళా రాజకీయ సాధికారికత |
| 2005 | పంచాయితీలు పిల్లల హక్కులు - జనన ధృవీకరణ ద్వారా ప్రాథమిక గుర్తింపు పత్రం |
| 2006 | పంచాయితీలు - నీరు - పారిశుద్ధ్యం |
| 2007 | హెచ్ ఐ వి ఎయిడ్స్‌పై మహిళలు, పంచాయితీల పాత్ర |



Sthanka_Marchcolo.indd 26 28/02/11 6:31 PM

**ది నేషనల్ ఇన్‌స్టిట్యూట్ సోషల్ సైన్సెస్, న్యూఢిల్లీ వారు ప్రతి సం॥రం ఒక్కో అంశాన్ని పరిగణన లోనికి తీసుకుంటూ ఆ అంశంపై కృషి చేసిన మహిళా ప్రతినిధులను గుర్తించి వారిని సత్కరించడం జరుగుతుంది. ఇలా సత్కరించబడిన వారిలో కొందరి జాబితా.**

| క్ర.సం. | సంవత్సరం | అవార్డు గ్రహీతలు | సాధికారికత |
|---|---|---|---|
| 1 | 1999 | గుండియా బాయ్ అహిల్ వార్ అధ్యక్షురాలు<br>ఫిప్రా గ్రామ పంచాయితీ, తికంఘర్, మధ్యప్రదేశ్ | కులాలకు వ్యతిరేకంగా పోరాటం చేయడం.<br>జిల్లా ప్రధాన కార్యాలయంలో జెండా ఎగురవేయడం |
| 2 | 1999 | పాతిమాబీ సర్పంచ్<br>కాల్వ గ్రామ పంచాయితీ, కర్నూలు జిల్లా, ఆంధ్రప్రదేశ్ | పేదరిక నిర్మూలనకు కృషి, బాలికలకు విద్య<br>స్వయం సహాయక సంఘాల ఏర్పాటు |
| 3 | 1999 | సుధాపాటిల్, సర్పంచ్<br>చంగాగ్రామం, ఆనంద్, గుజరాత్ | గుడ్డితనం కలిగిన సర్పంచ్. బాలికల విద్యకై పోరాటం, మహిళా అభివృద్ధికి కృషి, పారిశుధ్యం పరిశుభ్రతపై శ్రద్ధ వహించడం. |
| 4 | 2000 | నాతో బేగం, సర్పంచ్, ఎన్‌ఫీల్డ్ గ్రామ పంచాయితీ<br>డెహ్రాడూన్, ఉత్తరాఖండ్ | బాలికల విద్యకు కృషి & సాంఘిక సంస్కరణలకు కృషి. |
| 5 | 2000 | అశ్వద్ధామ రెడ్డి, సర్పంచ్, చంద్రపుర గ్రామ పంచాయతీ<br>బెంగుళూరు, కర్ణాటక | వితంతు వివాహాలు, అటవీకరణకు కృషి |
| 6 | 2001 | ఊర్మిళా యాదవ్, సర్పంచ్, కోసిలి గ్రామ పంచాయతీ<br>రివారి, హర్యానా. | ఆల్కహాలుకు వ్యతిరేకం. జిల్లాలో ఉత్తమ సర్పంచ్,<br>అరుదుగా కన్పించే రాజకీయ నాయకత్వ లక్షణాలు |
| 7 | 2001 | సురమంజరి, సర్పంచ్<br>కాట్పాడి తాలూకా, వేలూరు, తమిళనాడు | ప్రజా ఆరోగ్యం, ప్రాథమిక, సెకండరీ విద్య.<br>స్వయం ఉపాధి, పనుల అమలులో గణనీయ అభివృద్ధి |
| 8 | 2002 | గిరిజా కుమారి, సర్పంచ్<br>వెల్లానంద్ గ్రామ పంచాయితీ, కేరళ | గ్రామ సభలను క్రమం తప్పక నిర్వహించడం,<br>రికార్డుల కంప్యూటరీకరణ |
| 9 | 2002 | నాంధీ భాంధారి, సర్పంచ్<br>గలాయ్ గ్రామ పంచాయితీ, ఉత్తరాఖండ్ | సొంత ఇంటిని హైస్కూలు కోసం విరాళంగా ఇవ్వడం<br>కొత్తగా పెళ్ళైన జంటలతో మొక్కలు నాటించడం |
| 10 | 2003 | గీతా రాథోర్, సర్పంచ్, జమోనియా తలాబ్<br>గ్రామ పంచాయితీ, మధ్యప్రదేశ్ | మహిళలకు విద్యకై తీర్మానం |
| 11 | 2004 | బేబీ బాలకృష్ణన్, సర్పంచ్ మధాకాయ్<br>గ్రామ పంచాయితీ, కేరళ | సిటిజన్స్ చార్టర్ తయారు చేసిన తొలి గ్రామ పంచాయితీ,<br>మహిళా విద్య, వాటర్‌షెడ్ తద్వారా పంచాయితీ<br>అభివృద్ధికి కృషి |
| 12 | 2004 | ఏక్తా జైస్‌వాల్ సర్పంచ్, అమ్లాహా<br>గ్రామ పంచాయితీ, మధ్యప్రదేశ్ | షెడ్యూల్ తెగల వారికి అనేక విధాలుగా ఉపయోగపడే కమ్యూనిటీ హాలు, టాయిలెట్స్, రోడ్ల నిర్మాణం, శుభ్రమైన నీరు అందించడం, పంచాయితీలో 70% ఆడవారిలో అక్షరాస్యత, ఆరోగ్యం 100% కంప్యూటరీకరణ ద్వారా మొట్టమొదటి హై - టెక్ సర్పంచ్ |
| 13 | 2004 | నిర్మలాదేవి సాహు<br>సర్పంచ్, అమ్లీదిహ్ గ్రామ పంచాయితీ,<br>చత్తీస్ గడ్ | స్త్రీ పురుషుల సమానత్వంకోసం కులాలకు వ్యతిరేకంగా కృషి<br>అభివృద్ధి కులాల పేదలను అందేలా కృషి,<br>బాలికా విద్యకు కృషి |
| 14 | 2005 | మైనాదేవి, సర్పంచ్ ధూల్ కోట్,<br>డెహ్రాడూన్, ఉత్తరాంచల్ | బాల్య వివాహాలకు వ్యతిరేకంగా పోరాటం,<br>వివాదాల పరిష్కారానికి కృషి,<br>14 సం॥రాల పిల్లలందరు బడిలోకి. |
| 15 | 2005 | సుబైదా మహమ్మద్ మెంబర్,<br>వతనాపల్లి గ్రామ పంచాయితీ, కేరళ | 500 కుటుంబాలకు పారిశుధ్య<br>సౌకర్యాల కల్పన, 300 కుటుంబాలకు ఇండ్ల స్థలాల పంపిణీ<br>బాలికా విద్య, పేదరిక నిర్మూలన |
| 16 | 2005 | విజయాబాయ్ పాటిల్, సర్పంచ్<br>సర్పంచ్, వడ్‌గాయోన్ గ్రామ పంచాయితీ<br>జల్‌గాయన్, మహారాష్ట్ర | బాల్య వివాహాలు, ఆల్కహాలుకు వ్యతిరేకంగా<br>కృషి, నీటి పరిరక్షణకు కృషి వితంతు వివాహాలు,<br>బాల్య వివాహాలు, వరకట్నానికి వ్యతిరేకంగా<br>అవగాహన కల్పించటం. |



Sthanka_Marchcolo.indd 27 28/02/11 6:31 PM

| | | | |
|---|---|---|---|
| 17 | 2007 | పరంజిత్ కౌర్, సర్పంచ్, కోట్లి గ్రామం, పంజాబ్ | 1. సెక్స్ వర్కర్లకు అవగాహనా శిబిరాలు నిర్వహించడం ద్వారా వేశ్యా వృత్తిని తగ్గించడం,<br>2. ఆడ శిశువులు జన్మించినపుడు వేడుకలు జరపటం<br>3. మహిళలకుఉపాధి కల్పనకై కృషి<br>4. వరకట్నం, ఆల్కహాలు నిర్మూలనకు బాలికా విద్యకై తోడ్పాటు<br>5. డ్రైనేజ్ వ్యవస్థ ఏర్పాటు, టాయిలెట్ల నిర్మాణానికి కృషి<br>6. ఇళ్ల నిర్మాణానికి కృషి. |
| 18 | 2007 | వి.ఆర్.సుకన్య రాజారత్నం సర్పంచ్, వెల్లిమలై పట్నం, కోయంబత్తూరు, | వర్షాకాలంలో పారిశుద్ధ్యం మెరుగుదలకు ప్రత్యేక ఏర్పాట్లు తమిళనాడు ప్రాథమిక, సెకండరీ విద్యకై కృషి పేద విద్యార్థులు బడిలో కొనసాగేందుకు ఆర్థిక తోడ్పాటు నీటి పరిరక్షణ ద్వారా వ్యవసాయానికి, త్రాగడానికి సరిపడా నీరు అందించడం. |
| 19 | 2008 | దుల్లా రత్నం (మరణానంతరం) మెంబర్, శృంగ వృక్షం గ్రామ పంచాయితీ, తూర్పుగోదావరి, ఆంధ్రప్రదేశ్ | అసాధారణ వ్యక్తిత్వం, వడ్డీ వ్యాపారుల కబంధ హస్తాల నుండి ముఖ్యంగా మహిళలను విడిపించడం సామాజిక న్యాయానికి, సమనత్వానికి ఈమె చేసిన కృషి అమోఘం. నిజమైన ప్రజాస్వామిక నాయకురాలు. |
| 20 | 2009 | కిరణ్‌కుమారి, సర్పంచ్ రఘాయ్ పంచాయితీ, బీహార్ | 21 స్వయం సహాయక బృందాల ఏర్పాటు<br>జననీ సురక్షాయోజన, వితంతు వివాహాలు,<br>వరకట్నానికి వ్యతిరేకంగా అవగాహన కల్పించడం.<br>'న్యాయ పంచాయితీ'ల ద్వారా గ్రామంలో వివాదాల పరిష్కారం. |
| 21 | 2009 | రుక్మిణీ సుబ్రహ్మణ్యం సర్పంచ్, పూథాది గ్రామ పంచాయితీ కేరళ | బాల్య వివాహాలకు, మత్తు పానీయాలకు, అస్పృశ్యతకు, వ్యతిరేకంగా పోరాటం సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా ఆదిమ వాసీలలో సాధికారితకు కృషి పారిశుధ్యం అమలులో అద్వితీయ ప్రతిభ చూపడం |
| 22 | 2009 | మంజు శర్మ, సర్పంచ్, కుత్బుల్లాపూర్ ఉత్తరప్రదేశ్ | వ్యక్తిగత, పబ్లిక్ టాయిలెట్ల నిర్మాణంలో ప్రతిభ ప్రాథమిక, సెకండరీ విద్యను అందరికీ అందేలా చూడడం. |

| | |
|---|---|
| 2008 | మహిళా పంచాయితీలు - బాలల హక్కులు |
| 2009 | వాతావరణ మార్పులు-మహిళా పంచాయితీలు |
| 2010 | మహిళలపై హింసకు ముగింపు - పంచాయితీల పాత్ర |

సత్కారాలు అందుకున్న వారి జాబితాను పరిశీలిస్తే కేవలం ఆంధ్రప్రదేశ్ నుండి ఇద్దరు మహిళలు మాత్రమే పురస్కారాన్ని



అందుకున్నారు. ఒకరు పాతిమాబీ 1999 సంవత్సరానికి. రెండవ వారు. 2008 సంవత్సరానికి గానూ దూలా రత్నం. వారికి ఇవే మన కృతజ్ఞతాభివందనాలు. మన ఆలోచనా ధోరణిలో మార్పు రావాలి. మనము ఆ దిశగా ప్రయాణం చేయాలి. అందుకు మనకు మనం ప్రశ్నించుకోవలసింది ఏమిటంటే...

మనం ఈ సత్కారాన్ని అందుకోలేమా? ఒక్కసారి మనల్ని ప్రశ్నించుకుంటే జనించే సమాధానం 'కృషితో నాస్తి దుర్భిక్షం'. అందుకు కావలసిన దల్లా ధృఢమైన సంకల్పం, నిస్వార్థ ప్రజా సేవ, నిర్విరామ కృషి.

నేటి నుండి కావాలి మన స్వప్నం, రేపటి సత్కారం. అందుకై మన పరిధిలో ప్రజలందరికీ సురక్షిత త్రాగునీటి సరఫరా, అందరికీ విద్య, ఆరోగ్యం, పర్యావరణ పారిశుధ్యం, ఉపాధి అవకాశాల కల్పన, దురాచారాలకు వ్యతిరేకంగా పోరాటం, అన్ని రంగాలలో మహిళా సాధికారికతకు కృషి, ప్రభుత్వ పథకాలు అర్హులను చేరేలా చూడడం. ఇలా కృషి చేస్తే ఆదర్శ మహిళా ప్రజాప్రతినిధి మీరే కావచ్చు. అబల కాదు సబల అని నిరూపించవచ్చు.

మహిళా రాజకీయ సాధికారత దిశలో పయనిస్తున్న మహిళా ప్రజా ప్రతినిధులందరికీ 'అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలతో'...

*- వి. మాధురి, జూనియర్ ఫ్యాకల్టీ, అపార్డ్*

Printed & Published by: K. Chandra Mouli, Commissioner, on behalf of Andhra Pradesh Academy of Rural Development, Printed at Caxton Offset Pvt. Ltd., 11-5-416/3, Red Hills, Hyderabad-4. A.P. Published at Andhra Pradesh Academy of Rural Development, Rajendranagar, Hyderabad-30, Rangareddi. **Editor : K. Chandra Mouli**



Sthanka_Marchcolo.indd 28 28/02/11 6:31 PM

# జలధారలే మనకు ప్రాణధారలు



మార్చి 22న అంతర్జాతీయ నీటి దినోత్సవం

Sthanika Palana RNI No. APTEL / 2009/27888

